

# తెలంగాణలో
## కొత్త విహార స్థలాలు

డా॥ ద్యావనపల్లి సత్యనారాయణ











TELANGANA RESOURCE CENTRE
తెలంగాణ రిసోర్స్ సెంటర్
హైదరాబాద్

# తెలంగాణలో
## కొత్త విహార స్థలాలు

డా॥ ద్యావనపల్లి సత్యనారాయణ

TELANGANA
RESOURCE CENTRE
"**CHANDRAM**" 490, St.No. 11, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644 Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com website : www.trchyd.com

# తెలంగాణలో కొత్త విహార స్థలాలు

## New Tourist Places in Telangana

*by* ***Dyaavanapalli Satyanarayana***

*First Edition : 27 September, 2014 (World Tourism Day)*

*Copies : 1000*

*© Dyaavanapalli Sumedha*

*Price :* ***Rs. 100/-***

*Published by :*
***M. Vedakumar****, Chairman*
*Telangana Resource Centre, Hyderabad.*



*For Copies :*
**Telangana Resource Centre**
*"Chandram" 490, Street No. 11,*
*Himayatnagar, Hyderabad-500029.*
email: trchyd@gmail.com
*Mobile : 9030626288*
***website : www.trchyd.org***

Disha Book House ● Sahachara Book Mark ● Navodaya Book House ● Prajashakthi ● Vishaalandhra

*Photos :* Dr. Dyaavanapalli Satyanarayana

*Book & Cover Design : M. Vedakumar*

*Layout :* **Charita Impressions**, Azamabad Industrial Area, Hyderabad - 500 020.
*Printed at :*
DECCAN PRESS Azamabad, Hyderabad. Ph.+91-040-27678411
e-mail : deccan.press@yahoo.com

డా. ద్యావనపల్లి సత్యనారాయణ

# మనకు తెలియని మన తెలంగాణ పర్యాటక స్థలాలని చూసే దారిని చూపించిన ద్యావనపల్లి

మన తెలంగాణ గురించి మనకు తెలియదా అని ఉడుక్కునే వారినీ భుజాలు తడుముకునేలా చేస్తుందీ పుస్తకం. పోరాటాల గడ్డగా పేరొందిన తెలంగాణ, చారిత్రక, వారసత్వ, పర్యాటక ప్రాధాన్య కట్టడాలకు, ప్రాంతాలకూ పురిటి గడ్డ. వాటికి తోడు ప్రకృతి ఆరబోసిన అందాలెన్నో పర్యాటక, విహార స్థలాలుగా తెలంగాణలో అడుగడుగునా ఉన్నాయి. కారణాలు ఏవైతేనేం... అలాంటివెన్నో వెలుగులోకి రాకుండా పోయాయి. ప్రాచుర్యం చెందకుండా పోయాయి. అలాంటి కట్టడం, ప్రాంతం... ప్రతీ దానికీ ఒక కథ ఉంటుంది. కొందరికే తెలిసిన గాథ కూడా ఉంటుంది. అలాంటి కథలు, గాథలతో సహా ఆయా ప్రాంతాలు ఎక్కడెక్కడ ఉన్నాయి, అక్కడికి ఎలా చేరుకోవాలో తెలియజెప్పే టూరిస్ట్ గైడ్‌లా ఈ పుస్తకం రూపుదిద్దుకుంది. అదే సమయంలో అచ్చమైన తెలంగాణవాదాన్ని కూడా తన అక్షరాల్లో ప్రతిబింబించింది.

లక్షలాది ఏళ్ళ క్రితమే దక్కన్‌లో శిలలు 'జీవం' పోసుకున్నాయి. ఆ కారణంగానే అత్యంత ప్రాచీన శిలాసంపద ఉన్న ప్రాంతంగా దక్కన్ పేరొందింది. అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ లాంటివి అటవీ అందాలకు పేరొందాయి. శాతవాహనులు, కాకతీయులు, కుతుబ్‌షాహీలు... ఇలా ఎన్నో రాజరికాలు.. అలనాటి చరిత్రకు శిథిల దాఖలాలు. ఇలాంటి కట్టడాలు అనేకం అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు అవిభక్త రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురయ్యాయి. ప్రభుత్వపరంగా వాటికి గుర్తింపు రాకుండా పోయింది. ప్రజల్లోనూ వాటికి ప్రాచుర్యం రాకుండా పోయింది. ఎన్నో గుట్టలు, మరెన్నో జలపాతాలు, ఎన్నో లోయలు, మరెన్నో సజీవ సంస్కృతులు... అవన్నీ కలగలసినదే తెలంగాణ పర్యాటకం.

ఈ పుస్తకానికి తెలంగాణ రిసోర్స్‌సెంటర్ (టి.ఆర్.సి) అక్షరరూపం ఇవ్వడం వెనుక కూడా పెద్ద కారణమే ఉంది. గత మూడు సంవత్సరాలుగా టి.ఆర్.సి. వారానికి

ఒక అంశం చొప్పున తెలంగాణ సమస్యలు, సంస్కృతి, అభివృద్ధి, విజ్ఞానం తదితర ఎన్నో విషయాల మీద ఆయా రంగాలకు చెందిన నిపుణులు, అధికారులు, ఉద్యమకారులు, సంఘసేవకులు, మీడియా ప్రతినిధులు, రాజకీయ నాయకులు మొదలైనవారిని ఎందరినో ఆహ్వానించి 'చర్చ' నిర్వహిస్తోంది. వారు వెలిబుచ్చిన అభిప్రాయాలను మీడియా ద్వారా, దక్కన్ ల్యాండ్ పత్రిక ద్వారా సామాన్య మానవుని దగ్గరకు కూడా తీసుకెళ్ళే ప్రయత్నం చేస్తుండడమే కాకుండా మన భవిష్యత్ తరాల కోసం వీడియో ఆర్కైవ్స్‌ను కూడా భద్రపరచడం జరుగుతున్నది. ఇదే క్రమంలో విషయ నిపుణులు రాసిన ఆయా విశిష్టమైన రచనలను కూడా నెగడు, మనిషి సంకలనాలుగా, ప్రత్యేక పుస్తకాలుగా టి.ఆర్.సి. ప్రచురిస్తుంది. ఈ కోవలోనే ఇప్పుడు మరొక విశిష్ట రచన 'తెలంగాణలో కొత్త విహార స్థలాలు' అనే పుస్తకాన్ని ప్రచురిస్తున్నది.

ఈ పుస్తక రచయిత డా॥ ద్యావనపల్లి సత్యనారాయణగారు తెలంగాణ మొత్తం తిరిగి, విషయ సేకరణ చేసి విశిష్టమైన పర్యావరణ, చారిత్రక పర్యాటక స్థలాలను కొన్నింటిని ఈ పుస్తకంలో అందిస్తున్నారు. ఇప్పటివరకు తెలంగాణలో వెనుకంజలో ఉన్న పర్యాటక రంగానికి ఈ అమూల్య రచన ఇతోధికంగా దోహదం చేయాలనే సత్సంకల్పంతో టి.ఆర్.సి. ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా ఈ పుస్తకాన్ని ప్రచురిస్తున్నది. పర్యాటకం అంశంలో ప్రజలకు మార్గదర్శనం చేసేలా ఈ పుస్తకం రూపుదిద్దుకుంది.

తెలంగాణలో పర్యాటకం ఊపందుకోవాలంటే పాఠశాల విద్య స్థాయి నుంచి ప్రాచుర్యం కల్పించడం ప్రారంభించాలి. ఆయా ప్రాంతాల సందర్శనకు ఇష్టపడే ప్రభుత్వ ఉద్యోగులను, సమాజంలోని ఇతర వర్గాలనూ ప్రోత్సహించాలి. ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి. ఇవన్నీ కూడా పర్యావరణాన్ని, ప్రజాప్రయోజనాలను పణంగా పెట్టకుండానే జరగాలి. దర్శనీయ పర్యాటక ప్రాంతాలపై వెలువడిన ఈ పుస్తకాన్ని ప్రభుత్వం, పర్యాటకులు, పరిశోధకులు, ప్రజలు ఆదరిస్తారని ఆశిస్తూ...

తేది : 27-09-2014

వేదకుమార్.యం.
టి.ఆర్.సి., హైదరాబాద్

TELANGANA RESOURCE CENTRE
*"Chandram" 490, Street No. 11, Himayatnagar, Hyderabad-500029.*
email: vedakumar52@gmail.com *Mobile : 9030626288*

డా. ద్యావనపల్లి సత్యనారాయణ

# తెలంగాణా పర్యాటకం... ఒక లివింగ్ హిస్టరీ

నేను పెద్దవాడినైన తరువాత దేశంలో ఉన్న పేదవాళ్ళను ఉద్ధరించడానికి ఏదైనా చేయాలని చిన్నప్పుడు అనుకునేవాడ్ని. కాని ఏం చేయాలో తెలిసేది కాదు. నేను చదువుకున్నది చరిత్ర, సాహిత్యం. వీటిని ఈ తరం ప్రజలు పెద్దగా ఖాతరు చేయరు. అయినా నాకు తెలిసిన సబ్జెక్టులు అవే. వాటితోనే సమాజ సంక్షేమానికి ఉపయోగపడే పని ఏదో ఒకటి చేయాలని మదనపడి, ఆలోచించి ఆలోచించి 2010లో నేను కనుగొన్న కాన్సెప్ట్ 'లివింగ్ హిస్టరీ'. అంటే... గతంలో వైభవ ప్రాభవాలను అనుభవించి కారణాంతరాల వల్ల కాల గమనంలో తెరమరుగై మన కాలం వరకూ నామావశిష్టంగానైనా కొనసాగిన పర్యావరణ, చారిత్రక స్థలాలు తమ అందంతో పాటు మనలో ఆసక్తినీ రేకెత్తించడం. అలాంటి స్థలాలు, మారుమూల ప్రాంతాల గురించి ఆరా తీసి దుర్గమ అడవుల్లోనే ఉంటాయి కాబట్టి వాటిని సందర్శించడం కూడా ఒక అడ్వెంచర్ టూరిజం. వాటి ప్రాకృతిక, చారిత్రక సౌందర్యాలను గురించి వర్ణించడానికి సాహిత్యం, చారిత్రక పరిజ్ఞానం అవసరమవుతాయి. కాబట్టి ఈ రెండూ తెలిసిన నేను లివింగ్ హిస్టారికల్, పర్యావరణ స్థలాలను అన్వేషించి, సందర్శించి సామాన్య ప్రజల వద్దకు చేరే మాధ్యమాలు పత్రికల్లో ప్రచురించి తద్వారా మధ్య తరగతి, ధనిక కుటుంబీకులకు ఆనందం, వారి పర్యటనల ద్వారా ఈ కొత్త పర్యాటక ప్రాంతాల్లో ఉండే పేద, గిరిజన ప్రజలకు ఆదాయం చేకూరాలని ఆశిస్తున్నాను. 5

ఈ నేపథ్యంలో 2012లో నేను ప్రచురించిన 'తెలంగాణలో కొత్త పర్యాటక స్థలాలు' పుస్తకాన్ని పూర్వపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2013లో జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవం (27.09.2013) నాడు ఉత్తమ పర్యాటక గ్రంథంగా గౌరవించి నాకు బహుమానాన్ని అందజేసింది. అందుకు న్యాయ నిర్ణేతలకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు. కరీంనగర్ జిల్లాలో రామగిరి ఖిల్లా దర్శనీయ కోణంలో అత్యద్భుతమైన

స్థలం. అందుకే దాని పర్యాటక ప్రాధాన్యం మీద వ్యాసం రాసి 2012లోని శ్రీరామ నవమి సందర్భంగా ఈనాడు దినపత్రికలో ప్రచురించడమే కాకుండా అదే సంవత్సరంలో రామగిరి ఖిల్లా పైన శ్రావణ మాసంలో జరిగే ఉత్సవాల సందర్భంగా కూడా 'రామగిరి ఖిల్లా – యాత్ర చరిత్ర' అనే చిన్న పుస్తకాన్ని ముద్రించి సందర్శకులకు వేయి ప్రతులను ఉచితంగా అందజేశాను. అలాగే రాచకొండ చారిత్రక సాంస్కృతిక ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ కొంత మంది మిత్రులు, నేను కలిసి ఒక చిన్న పుస్తకాన్ని ముద్రించాము. ఇలాంటి వ్యాసాలను పర్యాటక శాఖ, సాంస్కృతిక శాఖ, దేవాదాయ శాఖ, పురావస్తు శాఖల్లో పని చేస్తున్న ప్రముఖ అధికారులు చదివి నన్ను అభినందించడమే కాకుండా 2014–15 సంవత్సరానికి గాను ఈ రామగిరి ఖిల్లా, రాచకొండల పర్యాటకాభివృద్ధికై ఐదేసి కోట్ల రూపాయలు కేటాయించారు. వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు.

నాలుగు దశాబ్దాల క్రితం ఐక్యరాజ్య సమితి అధికారిగా గున్నార్ మిర్దాల్ భారతదేశాన్ని సందర్శించి తిరిగి వెళ్ళేటప్పుడు పత్రికా ముఖంగా ఈ దేశాన్ని 'మూర్ఖుల స్వర్గధామం'గా వర్ణించాడు. పర్యావరణ వనరులు, చారిత్రక వైభవం పరంగా భారతదేశం స్వర్గధామం, కాని భారతీయులు వాటిని కాపాడుకోవడం లేదని ఆయన విమర్శించారు. తెలంగాణను కూడా మహాకవి దాశరథి కృష్ణమాచార్యగారు 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అన్నారు. అంటే తెలంగాణలో చాలా వనరులున్నాయని వారి భావం. అలాగే చారిత్రక వారసత్వ అంశాల్లోనూ తెలంగాణ ఘనత వహించింది. ఎటొచ్చీ ఇప్పటివరకు వాటిని మనం వెలికి తీయలేదు. ఈ కారణంగానే నేను నా శక్తి మేరకు పర్యావరణ, చారిత్రక పర్యాటక స్థలాలను వీలైనంతగా వెలికి తీసే ప్రయత్నం చేశాను. అలాంటి కొన్ని స్థలాలను పర్యాటకులు, పరిశోధకులు, పాఠకులు... మొత్తంగా ప్రజల ముందు పెడుతున్నాను. ఈ పర్యాటక స్థలాలను గురించి చదివి, వాటిని సందర్శించి ప్రజలు వాటి ప్రాకృతిక, చారిత్రక సాంస్కృతిక సౌందర్యాలను చూసి, అవి తమ పూర్వీకుల వారసత్వ స్థలాలని తమలో ఆత్మ విశ్వాసం పెంచుకుంటారని, ఆనందిస్తారని, పర్యాటక స్థలాల చుట్టు పక్కలున్న పేద ప్రజలేమో వీటిని అభివృద్ధి చేయడం ఫలితంగా ఆర్థిక ప్రయోజనం పొందాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ నా ఆకాంక్షలు నెరవేరితే మన పర్యావరణ, చారిత్రక స్థలాల విధ్వంసం ఇక మీదటనైనా ఆగిపోయి వాటిని, వాటి సౌందర్యాన్ని మన వారసులకు అందించవచ్చు. అప్పుడు మనం గున్నార్ మిర్దాల్ అభిప్రాయపడ్డట్లుగా మూర్ఖులం కాము, విజ్ఞులం అవుతాము. ఇది చారిత్రక అవసరం కూడా.

ఈ పుస్తకంలో అచ్చు వేసిన అన్ని వ్యాసాలనూ ముందుగా ప్రముఖ దిన, మాస పత్రికల్లో అచ్చు వేసి ఆయా పర్యాటక స్థలాల వివరాలను సామాన్య ప్రజలకు చేర్చే ప్రయత్నం చేశాను. ఇంకా మూడు వ్యాసాలు నమస్తే తెలంగాణ దినపత్రిక ప్రచురణలో ఉన్నాయి. ఒక వ్యాసం వెల్చాల కొండలరావుగారి పుస్తకంలో రానుంది. వాటిని కూడా కలిపి సుమారు ముప్పై పర్యాటక స్థలాలను గురించి వివరించే సుమారు 20 వ్యాసాలను ఈ పుస్తకంలో ప్రచురించడం జరిగింది.

మొదటి వ్యాసంలో... తెలంగాణలోని ప్రధాన పర్యాటక స్థలాలను... ప్రత్యేకించి వేసవి సెలవుల్లో చల్లగా ఉండే సుమారు ఎనభై ప్రదేశాలను ఎనిమిది మార్గాల (రూట్స్) ద్వారా ఎలా చూడవచ్చో వివరించాను. 'నల్లమలలో చల్లని స్థలాలు' అనే వ్యాసంలో ఆ అడవుల్లో ఉండే జలపాతాలు, గుహలు, వ్యూ పాయింట్స్ గురించి రాశాను. 'తెలంగాణలో కొత్త పర్యాటక స్థలాలు' పుస్తకంలో ఈ నల్లమలల్లోని అనేక స్థలాల గురించి క్లుప్తంగా ఇంగ్లీషులో రాశాను. కాబట్టి తెలుగు పాఠకుల కోసం ఈ పుస్తకంలో నల్లమల స్థలాల గురించి వివరాత్మకంగా రాయవలసి వచ్చింది. ఇక ఇదే నల్లమలల్లో ఉన్న శైవ ప్రాధాన్య స్థలాలను క్రీ.శ.1280 ప్రాంతంలో పాల్కురికి సోమనాథుడు సందర్శించి రాసిన 'మల్లికార్జున పండితారాధ్య చరిత్ర'లోని 'పర్వత ప్రకరణం' ఆధారంగా నేను మళ్ళీ ఆయా స్థలాలను తిరిగి చూసి ఇప్పుడు ప్రజలు మరిచిపోయిన సుమారు 20 స్థలాలను గురించి రాశాను. వాటిని ప్రభుత్వం కొంత ఖర్చుతో 'పాల్కురికి సోమన పర్యాటక ప్రాజెక్ట్' అనే పేరుతో వెలుగులోకి తీసుకొస్తే అది దేశంలోనే ఒక చారిత్రాత్మక పర్యాటక ప్రాజెక్ట్ కాగలదు.

ఈ పుస్తకంలో ప్రచురించిన పర్యాటక స్థలాల్లో సుమారుగా అన్నీ కొత్తవే. మొదటిసారిగా పర్యాటక కోణంలో చూడబడినవే. రామప్ప గురించిన వ్యాసంలో కూడా దాని చారిత్రక సౌందర్యానికి సంబంధించిన అనేక కొత్త విషయాలు చెప్పాను. భద్రాచలం రామదాసు అరుదైన చిత్రపటాన్ని అందిస్తూ ఆయన 360 సంవత్సరాల కింద వేయించిన శిలాశాసనం విశేషాలను సామాన్య పాఠకులకు అర్థమయ్యే లిపిలో అందించాను. రుద్రమదేవి గురించి తెలుసు కాని ఆమె చెక్కించుకున్న ఆమె శిల్పాలను ఎవరూ చూడలేదు కాబట్టి ఆ శిల్పాల ఫోటోలు ప్రచురిస్తూ ఆ శిల్పాలు ఎక్కడున్నాయి, వాటిని ఎలా గుర్తించి చూడాలి అనే విషయాలను ఒక వ్యాసంలో వివరించాను.

కళా ప్రదర్శనలు, హస్తకళలు కూడా పర్యాటకంలో భాగం కాబట్టి మొదటి సారిగా ఈ పుస్తకంలో గొందెళి అనే అంతరించిపోతున్న ప్రదర్శన గురించి, ప్రమాదం అంచున ఉన్న తెలంగాణ గిరిజన హస్తకళల గురించి ఒక్కో వ్యాసంలో రాశాను.

ఇక చివరిగా తెలంగాణ పర్యాటక రంగం అభివృద్ధి ప్రణాళిక ఎలా ఉంటే తెలంగాణ ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందో వివరించాను. ఈ వ్యాసం కూడా పర్యాటక రంగ ప్రముఖులు, ప్రముఖ అధికారుల దృష్టికి ఆకర్షించి వారి ప్రశంసలను పొందింది. వారందరికీ కృతజ్ఞతలు.

నా కృషిని తెలంగాణ ప్రజలు ఆదరిస్తారని, ఆయా స్థలాలను సందర్శించి ఆనందిస్తారని, ప్రభుత్వం ఆయా స్థలాలని అభివృద్ధిపరుస్తుందని, తద్వారా మారుమూల పర్యాటక ప్రదేశాల్లోని పేద ప్రజలు ప్రయోజనం పొందుతారని ఆశిస్తున్నాను.

నా ఈ కృషిలో... ఆయా స్థలాల్లో నా వెంట వచ్చి స్థానిక విశేషాలను వివరించిన స్థానికులకు, అప్పుడప్పుడు నాతో పాటు వచ్చిన మిత్రులకు, అక్కడక్కడా ఆశ్రయమిచ్చిన స్థానికులకు, ఇప్పుడు నన్ను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ సలహాదారు శ్రీ కె.వి.రమణగారికి, అడగగానే అతి తక్కువ సమయంలో పుస్తకాన్ని అచ్చువేసిన టి.ఆర్.సి. వేదకుమార్ గారికి, ఈ వ్యాసాలను ప్రచురించిన పత్రికలకు, షితాబ్‌ఖాన్ మహల్ ఫోటోలు ఇచ్చిన కందుకూరు రమేశ్‌బాబు గారికి, చివరి క్షణంలో ఇ-మెయిల్స్ ద్వారా సహకరించిన దేవెందర్ త్రిపాఠి గారికి, పుస్తకాన్ని ముద్రించిన చరిత ఇంప్రెషన్స్ ప్రెస్ వారికి, లేఅవుట్ చేసిన భాగ్యలక్ష్మికి, డిటిపి చేసిన మధుకు, ఇంకా ఎన్నో సందర్భాల్లో ఎన్నో విధాలుగా తోడ్పాటునందించిన ఎందరో మహానుభావులకు, సద్విమర్శకులకు అందరికీ నా మనఃపూర్వక కృతజ్ఞతలు.

అంకితం : ***తల్లీ, తండ్రీ తానే ఐ నా పిల్లల చదువులు, బాగోగులను చూసుకుంటూ నాకు ఇలా తెలంగాణలోని విహార స్థలాలను సందర్శించేందుకు వెసులుబాటు కల్పిస్తున్న నా శ్రీమతి సుమేధకు...***


***– డా॥ ద్యావనపల్లి సత్యనారాయణ***

హైదరాబాద్
27 సెప్టెంబర్ 2014
(ప్రపంచ పర్యాటక దినోత్సవం)

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | తెలంగాణ విహారస్థలాలు | 11 |
| 2. | తెలంగాణా గ్రీన్ వ్యాలీలో 'గాడి'ద జలపాతం | 28 |
| 3. | కనకాయి జలపాత సమూహం | 33 |
| 4. | రామాయణ కాలపు జలపాతాలు | 40 |
| 5. | చంద్రశిలా శోభిత చంద్రవెల్లి గుళ్ళు | 46 |
| 6. | షితాబ్ ఖాన్ మహల్ | 49 |
| 7. | రామప్ప వాస్తు శిల్పాలు, పరివార దేవాలయాలు | 54 |
| 8. | రుద్రమదేవి శిల్పాలు | 71 |
| 9. | రామదాసు శిలాశాసనం, చిత్రలేఖనం | 76 |
| 10. | మన ప్రాచీన రాజధాని ఇంద్రపాలనగరం | 79 |
| 11. | మరో యాదగిరి... మత్స్యగిరి | 82 |
| 12. | మరో తిరుమల... తిరుమలనాథ కొండ | 89 |
| 13. | అలనాటి అతిపెద్ద గణపతి | 96 |
| 14. | నల్లమలలో చల్లని పర్యటనలు | 100 |
| 15. | పాల్కురికి పేర్కొన్న పర్యాటక స్థలాలు | 109 |
| 16. | వృక్ష క్షేత్రం మరికల్ మర్రి | 126 |
| 17. | తెలంగాణా ఎత్తిపోతల జలపాతం | 131 |
| 18. | గిరిజన మ్యూజియం | 133 |
| 19. | తెలంగాణా ప్రాచీన శివాలయాలు | 137 |
| 20. | గొందెలి: అంతరించిపోతున్న అరుదైన జానపద కళ | 147 |
| 21. | తెలంగాణ గిరిజన కళలు | 151 |
| 22. | తెలంగాణ పర్యాటకం అభివృద్ధి ప్రణాళిక | 159 |




TELANGANA
Route Map
N
Ruyyadi
Adilabad
Asifabad
Kaghaznagar
ADILABAD
Bhainsa
Nirmal
Bellampalle
Mancherial
CHHATTISGARH
MAHARASHTRA
Jagtial
Bodhan
Nizamabad
NIZAMABAD
Karimnagar
Pamunuru
ODISHA
Kamareddy
KARIMNAGAR
Siddipet
Warangal
MEDAK
Sangareddi
Jangaon
Yellandu
Bhadrachalam
Zahirabad
WARANGAL
Kothagudem
Hyderabad
Bhuvangiri
KHAMMAM
Tandur
RANGAREDDY
Choutuppal
Suryapet
Khammam
Rangareddy
Farooqnagar
Kodad
Jaggayyapet
Nalgonda
Narayanpet
Devarakonda
Yanam
(PUDUCHERRY)
NALGONDA
KARNATAKA
Mahbubnagar
Macherla
Sriramnagar
MAHBUBNAGAR
Vallur
Kurnool
Map not to Scale
ANDHRA
PRADESH
Copyright © 2014 www.mapsofindia.com
(Updated on 2nd June 2014)
7
222
16
202
9
221
LEGEND
National Highway
Major Road
Railway
District Boundary
State Boundary



డా. ద్యావనపల్లి సత్యనారాయణ

1

# తెలంగాణ విహారస్థలాలు

స్థూలంగా చెప్పాలంటే పర్యాటకం రెండు రకాలు... వారసత్వ కట్టడాలు (హెరిటేజ్ టూరిజం), పర్యావరణ పర్యాటకం (ఎకో టూరిజం). ఈ రెండు రకాల పర్యాటక స్థలాలు తెలంగాణలో పుష్కలంగా ఉన్నాయి. యావత్ తెలుగుదేశాన్ని పాలించిన రాజవంశాలన్నింటికీ తెలంగాణే పుట్టినిల్లు కావడంతో వారు కట్టించిన కోట గోడలు, దేవాలయాలు తెలంగాణలోనే ఎక్కువగా ఉన్నాయి. తెలంగాణ భౌగోళికంగానూ పీఠభూమి కావడంతో గుట్టలు, లోయలు, వాటి మధ్య పారే నదీ నదాలు, వాగులు వంకలతో తద్వారా ఏర్పాటైన చెరువులతో, పచ్చని అడవులతో పర్యావరణ పర్యాటకానికి కూడా అనువుగా ఉంది. ఒక్క సముద్రతీర పర్యాటకం (బీచ్ టూరిజం) తప్ప అన్ని రకాల పర్యాటక స్థలాలు తెలంగాణలో ఉన్నాయి. తెలంగాణలో సముద్రం లేదని తెలంగాణ రాజులు, ప్రత్యేకించి కాకతీయులు పెద్ద పెద్ద చెరువులను నిర్మించి వాటికి 'సముద్రాలు' అనే పేర్లు పెట్టారు.

ఈ విధంగా అన్ని రకాల పర్యాటక విశేషాలకు ఆలవాలమైన తెలంగాణలోని ఆయా స్థలాలకు పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు వెళ్ళేలా ప్రోత్సహిస్తే, వారి ద్వారా వచ్చే ఆదాయంతో పర్యాటక స్థలాలలోని స్థానికులు ఆత్మ విశ్వాసంతో ఆర్థికంగానూ ఎదుగుతారు.

సమాచార సాంకేతిక (ఐ.టి.) పరిశ్రమ తరువాత ఆర్థికాభివృద్ధికి దోహదపడే పరిశ్రమ పర్యాటక రంగానిదే కాబట్టి, తెలంగాణ పర్యాటక స్థలాల్ని పరిచయం చేసుకొని, దర్శించి, తెలంగాణ ప్రజలు తమ వారసత్వ సంపదవల్ల సగర్వం పెంచుకోవాలని, వాటిని అభివృద్ధి చేసుకునే దిశగా అడుగులు వేయాలన్నదే ఈ వ్యాసం ఆకాంక్ష. కాగా, ఎండా కాలంలో కావలసినవి నీడ, నీళ్ళు, కాబట్టి వాటిని ఇచ్చే అడవులు, నదుల ప్రాంతాల్లోని పర్యావరణ, పర్యాటక స్థలాలను సంక్షిప్తంగా ఇక్కడ ప్రస్తావించడమైంది.


## హైదరాబాద్ – కుంటల మార్గంలో...

హైదరాబాద్ నుంచి తూప్రాన్, రామాయంపేటల మీదుగా 110 కిలోమీటర్లు ప్రయాణించి మెదక్ చేరుకోవచ్చు. మెదక్‌లో వందేళ్ళ కిందట (1914లో) పోస్నేట్ అనే క్రైస్తవ సన్యాసి కట్టించిన 173 అడుగుల ఎత్తైన చర్చి ఉంది. ఇది ప్రపంచంలోనే రెండవ అతి పెద్దది (వాటికన్ చర్చి తరువాత). ఇందులో ఒకేసారి 5000 మంది ప్రార్థనలు చేయవచ్చు. బయటినుండి వచ్చే వెలుతురును ప్రతిఫలింపజేస్తూ చర్చి లోపలున్న జీసస్ తదితర పెయింటింగ్స్ రంగులతో మెరిసిపోతూ మనల్ని మురిపిస్తాయి. ఈ చర్చి ఎదురుగా కిలోమీటరు దూరంలోనే మెదక్ దుర్గం కోట గోడలు కన్పిస్తాయి. పర్యాటకులు ఎక్కి ఆనందించవలసినవి అవి.

అలాగే, మెదక్‌కు కొన్ని కిలోమీటర్ల దూరంలోనే మంజీరా నది ఏడు పాయలుగా చీలి పారుతుంది. వాటి మధ్య అమ్మవారి దేవాలయం కొండగుహలో ఉంది. ఈ ఏడుపాయల్లో స్నానం చేసి ఆలయం చుట్టూ గుహలో ప్రదక్షిణ చేయడం మరిచిపోలేని అనుభూతి. ఆలయానికి ఎదురుగా ఫర్లాంగు దూరంలో కట్టిన చెక్‌డ్యామ్ పైనుంచి దూకే నీళ్ళు చిన్న జలపాతంలాగా దర్శనమిస్తాయి. వాటిలో చెంగు చెంగున ఎదురెక్కుతున్న వేలాది చేపలు మనకు నయనానందాన్ని కలిగిస్తాయి.



మెదక్ నుంచి పది కిలోమీటర్ల దూరంలోనే 1922లో కట్టిన పోచారం ప్రాజెక్టు ఉంది. దీనిమీది నుంచి దూకే చిన్న జలపాతం లాంటి మత్తడి నీళ్ళలో కేరింతలు కొడుతూ స్నానం చేయవచ్చు. అప్పుడే నిజాం కట్టించిన గెస్ట్‌హౌజ్‌ను, పెట్టించిన బోటు సౌకర్యాన్ని పునరుద్ధరించాల్సి ఉంది. పర్యాటకులకు ప్రాజెక్టు నీటి మధ్యలో ఉన్న ద్వీపం (ఐలాండ్) వరకు తీసుకెళ్ళి పక్షుల దర్శనం చేయించే బాధ్యత ప్రభుత్వం పైనే ఉంది. ఈ ప్రాజెక్ట్ నీళ్ళు పక్కనే ఉన్న వన్య ప్రాణుల ఉద్యానవనం (వైల్డ్ లైఫ్ పార్క్)లోకి కూడా చొరబడతాయి. ఈ ఉద్యానవనంలో సొంత వాహనంలో వెళ్ళి, అందులో



పోచారం ప్రాజెక్టు



సంతాయిపేట

స్వేచ్ఛగా తిరిగే లేళ్ళు, ఎనుములు (నీల్‌గాయ్), ఎలుగుబంట్లు, అడవి పందులు తదితర జంతువులను ప్రత్యక్షంగా చూడటం చాలా థ్రిల్లింగ్ అనుభూతినిస్తుంది.

పోచారం నుంచి గోపాల్‌పేట్ మీదుగా సుమారు 20 కిలోమీటర్లు ప్రయాణించి నిజాంసాగర్ ప్రాజెక్ట్ అంచున ఉన్న 'త్రిలింగ రామేశ్వరాలయాన్ని' దర్శించవచ్చు. దీన్ని సుమారు 1100 సంవత్సరాల కిందట వేములవాడ చాళుక్య రాజులు కట్టించినట్లు, వారి రాజలాంఛనమైన 'విజృంభించే సింహ శిల్పం' నిదర్శనంగా కనిపిస్తుంది. ఇక్కడికి మరో 20 కిలోమీటర్ల దూరంలో ఎల్లారెడ్డి ఉంటుంది. అక్కడా చారిత్రక గుళ్ళున్నాయి. అక్కడ్నుంచి కొన్ని కిలోమీటర్ల దూరంలో నిజాంసాగర్ డ్యాం ఉంది. డ్యామ్ కట్టమీద నడుస్తూ నిండుగా ఉన్న ఆ నీటి సౌందర్యాన్ని చూడవచ్చు. డ్యామ్ చివరన కన్పించే ఆనాటి రెండంతస్థుల గోల్ బంగ్లాను, స్విమ్మింగ్ పూల్‌ను చూడవచ్చు. డ్యాం ప్రారంభంలో ఉన్న గెస్ట్‌హౌజ్ నుంచి మర బోట్లలో అల్లంత దూరంలోని విద్యుత్ ప్లాంట్‌వరకు విహారం చేయవచ్చు. డ్యాం కింద వర్షాకాలంలో నురగలు కక్కుతూ దూకే నీటి సౌందర్యాన్ని చూసితీరాలి. డ్యాం కింద సహజంగా ఏర్పడిన విశాలమైన 'నదీ ద్వీపం' (రివర్ ఐలాండ్) మీద 1920ల్లో నిజాం రాజు ఏర్పాటు చేసినట్లు గార్డెన్స్, పండ్ల తోటలను ఏర్పాటు చేస్తే మైసూర్ కృష్ణరాజసాగర్ డ్యాంను నిజాంసాగర్ డ్యాం తలదన్నుతుంది. నిజాంసాగర్ డ్యాం నుంచి ముందుకెళ్ళి చారిత్రక బోధన్‌లో దేవల్‌మసీదు, రాకాసిపేట గుళ్ళు కోటలను చూడవచ్చు.

కామారెడ్డికి దగ్గర్లో ఉన్న తాడ్వాయి మాత గుడి చూసి, అక్కడ్నుంచి సుమారు 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించి సంతాయిపేట శివారులో పారుతున్న భీమేశ్వర వాగు మధ్యలో కట్టిన వేయేళ్లనాటి భీమేశ్వర క్షేత్రాన్ని, దాని మీదుగా కట్టిన చెక్ డ్యాం పైనుంచి దుంకుతున్న నీటి సౌందర్యాన్ని, సాయం సంధ్యా సమయంలో డ్యాం నీళ్ళలో పొద్దు గుంకుతున్న సూర్యబింబం ప్రతిరూప సౌందర్యాన్ని చూస్తే గాని 'జీవితం తరించదు' అన్పిస్తుంది.

కామారెడ్డి నుంచి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రసిద్ధమైన ఇస్సన్నపల్లి వీరభద్రాలయాన్ని దర్శించుకొని తూంపల్లి – చిమన్‌పల్లి మీదుగా అందమైన అడవులు, లోయలు, వాగు వంకల గుండా ప్రయాణించి హుస్సేన్‌నగర్ సమీపంలో







గుట్టల మధ్యలో నెలకొన్న లొంక రామలింగేశ్వరాలయాన్ని చూసి తీరాల్సిందే. ఇక్కడి ప్రకృతి కాశ్మీర్‌ను తలపిస్తుంది.


ఆదిలాబాద్‌లోకి ప్రవేశించగానే మనల్ని పలకరించేది సోన్‌పేట. చిన్నదైనా చిత్రమైన కోట అది. దానికి 10 కిలోమీటర్ల దూరంలోనే నిర్మల్ కోటగోడలు, బురుజులు కన్పిస్తాయి. నిర్మల్ నుంచి భైంసా రూట్‌లో 12 కిలోమీటర్లు ప్రయాణించి దిలావర్‌పూర్ మీదుగా 'కదిలె' చేరుకోవచ్చు. ఇక్కడ చుట్టూ గుమిగూడిన గుట్టల మధ్య లోయలో ఊరుతున్న ఏరు గట్టున చారిత్రక పాపన్న గుడి ఉంది. అందులో శివలింగం కదులుతుంది... దాని కింద ఉబికే ఊటల ధాటికి. ఇక్కడున్న సప్తగుండాలు 'సంతానానిచ్చే నీటిని కలిగి ఉన్నాయని' భక్తులు విశ్వసిస్తారు.



జలజలా పారుతున్న ఏరు మధ్యలో ఏపుగా పెరిగిన చెట్ల సౌందర్యాన్ని చూస్తూ ఏరులోనే ట్రెక్కింగ్ చేయడం ఎంతో థ్రిల్లింగ్ అనుభూతినిస్తుంది. ఇక్కడి 18 చెట్ల మహావృక్షం కూడా మనలో ఆసక్తిని రేకెత్తిస్తుంది.




దిలావర్‌పూర్ నుంచి భైంసా మీదుగా వెళితే గోదావరి ఒడ్డున నెలకొన్న బాసర జ్ఞాన సరస్వతీ క్షేత్రాన్ని చేరుకోవచ్చు. చాలామంది ఇక్కడ తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తారు. గోదావరిలో బోటు విహారం చేయవచ్చు. సమీప




ప్రాంతాల్లో ఉన్న శిథిల బౌద్ధ, జైన స్థూపాలను ఆసక్తి గలవారు దర్శించవచ్చు.

నిర్మల్ నుంచి ఉత్తరంగా సుమారు 20 కిలోమీటర్లు ప్రయాణిస్తే నేరేడిగొండ వస్తుంది. ఇక్కడ 20 కిలోమీటర్ల వ్యాసార్థంలో 5 జలపాతాలున్నాయి. నేరేడిగొండ టోల్‌గేట్ రావడానికి ముందు కుడి వైపున రోడ్ పక్కనే ఒక చిన్న జలపాతముంది. నేరేడిగొండ నుండి ఎడమ వైపుఅ 10 కిలోమీటర్ల దూరంలో పొచ్చెర జలపాతముంది. దానికింద స్నానం చేయవచ్చు. ముప్పైవేల సంవత్సరాల ముందు కూడా ప్రజలు ఇక్కడ నివాసం ఏర్పరచుకున్నారని తెలిపే వారి ఆయుధాలు, పనిముట్లు ఇక్కడ దొరికాయి. పొచ్చెరకు మరికొంచెం దూరంలో ఘన్‌పూర్ గ్రామ పరిధిలో బుంగనాల అనే మరో జలపాతముంది. నేరేడిగొండకు కుడివైపున సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఇప్పటివరకు రాష్ట్రంలోనే పెద్దదిగా పేరుమోసిన కుంటల జలపాతముంది. మూడు దఫాలుగా దూకే దాని సౌందర్యం ఎంతటిదో దానికి సమాంతరంగా సాగుతున్న గుట్టల మధ్య లోయ సౌందర్యం ఎంతటిదో దానికి సమాంతరంగా సాగుతున్న గుట్టల మధ్య లోయ సౌందర్యమూ అంతటిదే. ఇక్కడున్న 8 దశాబ్దాల నాటి గెస్ట్‌హౌజ్ ప్రాంతంలో ఇప్పుడు కొత్త గెస్ట్‌హౌజ్‌లు కట్టారు. నేరేడిగొండ దాటి కొన్ని కిలోమీటర్లు ప్రయాణించగానే రోడ్‌కు ఎడమవైపున కోరటికల్ అనే మరో చిన్న జలపాతం కన్పిస్తుంది. నేరేడిగొండ నుంచి ఇచ్చోడ వైపు సాగి కొంచెం ముందు నుంచే కుడివైపుకు సుమారు 15 కిలోమీటర్లు ప్రయాణిస్తే సరిచెల్మ






చేరుకోవచ్చు. ఇక్కడ అడవుల మధ్యనున్న చెరువు మధ్యలో హిందూ, బౌద్ధ దేవాలయాలు, శిల్పాలు, శాసనాలు అనేకం ఉన్నాయి. ప్రకృతి సౌందర్యానికి, చారిత్రక ప్రాధాన్యానికి వెలవు ఈ సిరిచెల్మ.

## హైదరాబాద్ - కాళేశ్వరం మార్గంలో...

హైదరాబాద్ నుంచి కరీంనగర్ మార్గంలో 70 కిలోమీటర్లు ప్రయాణించగా వచ్చే కుకునూరుపల్లి నుండి కుడివైపుకు తిరిగి 5 కిలోమీటర్లు ప్రయాణిస్తే అనంతసాగర్ అనే గ్రామాన్ని చేరుకోవచ్చు. తెలంగాణలోనే ఎక్కువ సరస్వతీ ఆలయాలున్నాయనడానికి ఈ గ్రామ సరస్వతీ దేవాలయం ఒక నిదర్శనం. ఈ ఆలయం సమీపంలో రెండు నీటిదొనలున్నాయి. ఒకటి రాగిదొన, రెండవది పాలదొన. రాగిదొనలో నీళ్ళు ఎర్రగా ఉంటాయి. పాలదొనలోని నీళ్ళు తెల్లగా ఉంటాయి. ఈ దొనలు ఆరెండ కాలాల్లో కూడా ఎండిపోక పోవడం ఇక్కడి ప్రత్యేకత.

కుకునూరుపల్లి నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిద్ధిపేటలో కోటి లింగేశ్వరాలయం ఉంది. ఇక్కడొక డ్యాం ఉంది. ఆలయంలో పెద్దలు ఆధ్యాత్మికంగా ఆనందిస్తే... పిల్లలేమో బోటింగ్ చేసి ఆనందించవచ్చు.

సిద్ధిపేట నుంచి కరీంనగర్, పెద్దపల్లి మీదుగా 140 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే మంథని చేరుకోవచ్చు. మంథని తెలంగాణలో అనాదిగా బ్రాహ్మణ పండితులకు, వైదిక సంస్కృతికి కేంద్రంగా భాసిల్లుతూ వస్తున్నది. ఇక్కడ ఎన్నో చారిత్రక ఆలయాలున్నాయి. గోదావరి తీరాన ఉన్న శిథిల స్థితిలో ఉన్న గౌతమేశ్వర త్రికూటాలయం వాస్తు శిల్ప సౌందర్యాన్ని ఆస్వాదించవచ్చు. ఇక్కడ తూర్పు నుంచి ఉత్తరం వైపుకు, మళ్ళీ తూర్పు వైపుకు తిరుగుతూ హొయలు పోతున్న గోదావరి సౌందర్యం చూసి తీరవలసిందే.





నేలకొండపల్లి స్థూపం

మంథని నుంచి గోదావరి దాటి ఆదిలాబాద్ జిల్లాలోకి ప్రవేశిస్తే మనకు మొదట కన్పించేది శివ్వారం. ఈ గ్రామంలో ఆటో తీసుకొని లేదా ఎవరినైనా తోడు తీసుకుని ఆ ఊరి పొలిమేరలో ఉన్న ఎర్రచెరువు మీదుగా, పచ్చని కొండల పక్క నుంచి 'లంజమడుగు' చేరుకోవచ్చు. లంజమడుగు ముఖ్యంగా మూడు అంశాలకు ప్రసిద్ధి. ఒకటి: ఇది రాష్ట్రంలోనే అరుదైన అందమైన మొసళ్ళ పెంపక కేంద్రం. రెండు: ఇక్కడి ప్రదేశం తెలంగాణలో పారే గోదావరి నదీ సౌందర్యానికి పరాకాష్ట. అది ఇక్కడ మూడు కిలోమీటర్ల దూరంలో అనేక మలుపులు తిరుగుతూ అడ్డువచ్చిన అడవులు-గుట్టలను చీల్చుకొని పారుతూ అందమైన పెద్ద మడుగును ఏర్పరచింది. మూడు: తెలంగాణలో గుహలో తొలిచి నిర్మించిన ఆలయాలు ఇక్కడ మాత్రమే ఉన్నాయి.

లంజమడుగు ప్రాంతం కేరళలోని సముద్ర పర్యాటక స్థలాలను తలదన్నేలా ఉంటుంది. విశాలమైన ఈ మడుగు సముద్రాన్ని లేదా బ్యాక్ వాటర్‌ను పోలి ఉండగా దాని తీరపు ఇసుక తిన్నెలు బీచ్‌లను మరిపిస్తాయి. మడుగు ఎడమ తీరం చెక్కినట్లున్న ఎత్తైన కొండలు, లోయలు, పచ్చని ఎత్తైన అడవులతో ఎనలేని ఆనందాన్నిస్తుంది. వీటన్నింటి ఆనందాన్ని ఈ మడుగులో స్థానిక జాలర్ల నాటు బోట్లలోగాని, అటవీ శాఖ మర బోటులోగాని విహరిస్తూ ఆస్వాదించవచ్చు. మనం విహరించే బోట్ల కింద, పక్కల మొసళ్ళూ విహరిస్తుంటాయి. మడుగు ఒడ్డు ఒకచోట మూడు వందల అడుగుల ఎత్తు నిటారుగా ఉంటుంది. దాని అంచునే స్థానికులు 'లంజగుళ్ళు' అని పిలుస్తున్న రెండు గుహాలయాల సముదాయాలున్నాయి. అవి తమ నీడలను కింద ఉన్న గోదావరి నీళ్ళల్లో ప్రతిబింబిస్తూ అందంలో అజంతా గుహలను తలదన్నుతాయి. వీటికి ఎడమ వైపున ఫర్లాంగు దూరంలో మరో గుహాలయాల సముదాయముంది. వాటి పేరు కోమటి గుళ్ళు. గోమతేశ్వరుడు అనే జైనమత దేవుని భక్తులై కోమట్లు అని పిలువబడిన వారిలో సుమారు ఎనిమిదవ శతాబ్దం ప్రాంతంలో ప్రబలిన వేశ్యాలోలత్వం (లంజతనం) కారణంగా వారు కట్టించిన గుళ్ళను 'లంజగుళ్ళు' అని, 'కోమటిగుళ్ళు' అని పిలుస్తున్నారు. ఈ చరిత్ర తెలియని స్థానికులు వేశ్యాతనం చేసిన రాణి కథను కూడా విన్పిస్తుంటారు.

మంథని నుంచి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాళేశ్వరం వరకు పచ్చని కొండలు, కోనల గుండా సాగే ప్రయాణమే ఆహ్లాదకరమైన అనుభూతిని మిగులుస్తుంది. కాళేశ్వరం గోదావరి-ప్రాణహిత నదుల సంగమ ప్రదేశంలో ఉన్న త్రిలింగ క్షేత్రం. ఇక్కడి ప్రధానాలయంలో ఒకే పానపట్టంపై ముక్తేశ్వర, కాళేశ్వర

పేరున రెండు శివలింగాలు ఉన్నాయి. ముక్తేశ్వర లింగం మీద పోసిన అభిషేక జలం దాని మధ్యలో ఉన్న రంధ్రం గుండా గోదావరి–ప్రాణహిత నదుల్లోకి పారి ఈ క్షేత్రాన్ని త్రివేణి సంగమ క్షేత్రం చేస్తుంది. ఈ క్షేత్రం ఇంకా ఎన్నో ప్రాచీన ఆలయాలు, వాస్తు శిల్ప సౌందర్యాలతో అలరారుతోంది. ఇక్కడి గోదావరి అందాలు వర్ణించలేనివి, ఆస్వాదించదగినవి.


## హైదరాబాద్ – మల్లూరు మార్గంలో...

హైదరాబాద్ నుంచి వరంగల్ మీదుగా ఏటూరునాగారం, మల్లూరు ప్రయాణించే రూటులో సుమారు 80 కిలోమీటర్లు దాటాక ఆలేరు నుంచి ఎడమ వైపున వచ్చే కొలనుపాకలో అద్భుతమైన వాస్తు శిల్పాలతో ఒప్పారుతున్న చారిత్రక జైన దేవాలయాలను, సోమేశ్వరాలయం తదితర హిందూ దేవాలయాలను కళాపిపాసులు చూసి తీరవలసిందే.

ఆలేరుకు 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామప్ప దేవాలయాలు తెలంగాణాలో హిందూ వాస్తు శిల్ప సౌందర్యాలకు పరాకాష్టగా నిలుస్తాయి. వాటిని చూసి సమీపంలోనే ఉన్న విశాలమైన రామప్ప చెరువులో బోటు విహారం చేయవచ్చు.



రామప్పకు కుడివైపున ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నవరం చెరువు కొండలు, అడవుల్లో చిక్కుకుని చాలా అందంగా కన్పిస్తుంది. నీళ్ళ మధ్య ద్వీపాలలాగా ఏర్పడిన ఆ పచ్చని కొండలు నాలుగింటి మీదికి ఊగే తాళ్ళ వంతెనలు ఏర్పాటు



కటాక్షపురం






చేశారు. వాటి మీద నడుస్తూ ఒక ద్వీపానికి చేరుకొని అక్కడున్న పర్యాటక శాఖ రెస్టారెంట్‌లో భోజనం చేసి, వీలైతే అక్కడే ఉన్న కాటేజీల్లో (వసతి గృహాల్లో) ఒక రోజు బసచేయవచ్చు. అడవులు, నీళ్ళ మీదుగా వచ్చే చల్లగాలులను ఆస్వాదిస్తూ అక్కడ గడపడం ఒక మరిచిపోలేని మధురానుభూతిని మిగులుస్తుంది. చెరువులో స్నానం చేయవచ్చు. బోట్లలో విహరించవచ్చు.

లక్నవరానికి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏటూరునాగారం నుండి అందమైన అటవీ మార్గంలో మంగపేట మీదుగా మరో 20 కిలోమీటర్లు ప్రయాణించి మల్లూరు చేరుకోవచ్చు. చల్లని గోదావరి నదీ తీరాన పచ్చని కొండకోనల మధ్య వెలసిన నరసింహస్వామి ఆలయం ఆధ్యాత్మిక ఆనందానికి, ప్రకృతి సౌందర్యానికి నెలవు. స్వామి పొట్టలో వేలుపెడితే అది రక్తపు వాసన రావడం ఇక్కడి ప్రత్యేకత. పురాతన కాలంలో ఒక గిరిజనుడు చూడక స్వామి



పొట్టలో గునపం దింపాడట. అందుకే రక్తం ఇంకా కారుతూనే ఉందంటారు. చిన్నదైనా ఇక్కడి చింతామణి జలపాతం చూడదగింది. దాని కింద స్నానం చేయవచ్చు.

## హైదరాబాద్ - పాపికొండలు మార్గంలో...

హైదరాబాద్ నుంచి భద్రాచలం వెళ్ళే దారిలో సూర్యాపేటకు ముందు పిల్లలమర్రి వస్తుంది. ఈ గ్రామం 800 ఏళ్ళ కిందట కాకతీయుల సామంతులైన రేచర్ల రాజులకు రాజధాని. కాబట్టి, ఇక్కడ కోట గోడలుండేవి. ఇప్పుడు అవి లేవు. కాని, వాటి మధ్య ఆ రాజ వంశీకులు కట్టించిన ఎరకేశ్వర, నామేశ్వర దేవాలయ సమూహాలున్నాయి. ఇందులో ప్రధాన దేవాలయ స్థంభాలకు, వాటిమీద దూలాలకు చెక్కిన నల్లరాతి శిల్పాలు, అతి సుందరమైన అంతరాళం, మంటపం మధ్యనున్న రెండు శిలా దూలాలపై చిత్రించిన రామ-రావణ యుద్ధం, క్షీరసాగర మథనం చిత్రాలు (పెయింటింగ్స్) తెలంగాణలో ఆ తరహావి అవి రెండే ఇప్పటి వరకు నిలిచి ఉన్నవి. ఇదే గ్రామంలో చాలా ఎత్తైన పీఠం మీద పైన పేర్కొన్న కాలపు దేవాలయం మరొకటుంది.

భద్రాచలం ఆధ్యాత్మిక క్షేత్రమే కాకుండా సహజ సౌందర్యానికి నిలయమైన ప్రాంతం కూడా. ఉత్తరం నుండి వస్తున్న గోదావరి ఇక్కడ భద్రగిరి రామాలయం చుట్టూ తిరిగి మళ్ళీ తూర్పు దిశకు ప్రవహిస్తుంది. ఇక్కడ నదీ స్నానం చేసి దేవుడి దర్శనం చేసుకోవచ్చు. భద్రగిరికి ఉత్తరంగా 5 కిలోమీటర్ల దూరంలో వచ్చే మోతెగడ్డ గ్రామ సమీపంలో గోదావరి నది మధ్యలో ఉన్న ఒక ద్వీపకొండపైన వీరభద్ర స్వామి క్షేత్రముంది. నీటి మధ్య కొండక్షేత్రంపై నిల్చుని చుట్టూ ఉన్న పరిసరాల సౌందర్యాన్ని చూసి పరవశించిపోవచ్చు. భద్రాద్రికి ఆవల 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇరివెండి గ్రామంలో రుక్మిణీ సత్యభామ సహిత వేణుగోపాలస్వామి ఆలయముంది. దీన్ని చూసే రామదాసు భద్రాచలంలో సీతారామాలయాన్ని కట్టించాడంటారు.

భద్రాచలానికి ఉత్తరంగా 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న సీతారాముల పర్ణశాల, అక్కడి నదుల సంగమం చూడదగిన ఐతిహాసిక, పర్యావరణ శోభిత పర్యాటక స్థలాలు.






భద్రాచలానికి తూర్పువైపు 40 కిలోమీటర్లు ప్రయాణించి కుకునూర్ – పేరంటాలపల్లి నుంచి గోదావరిలో బోట్లపైన పాపికొండల మధ్య సాగే విహారమూ మరో పేర్గాంచిన పర్యటనే.

## హైదరాబాద్ - నాగార్జునసాగర్ మార్గంలో...

ఈ మార్గంలో హైదరాబాద్ నుండి 50 కిలోమీటర్ల దూరంలో వచ్చే రాచకొండ గుట్టల సముదాయం సాహస పర్యటనలకు, వారసత్వ పర్యటనలకు (హెరిటేజ్ టూరిజం) అనువైనది. 14, 15 శతాబ్దాల్లో రాచకొండ పద్మనాయక రాజులకు రాజధానిగా కీర్తి గడించడం గమనార్హం.



రాచకొండ

సుమారు అర్ధ శతాబ్దం కింద కట్టిన అద్భుత మానవ నిర్మాణం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్. ఇది124 మీటర్ల ఎత్తుతో ప్రపంచంలో అత్యంత ఎత్తైన రాతి డ్యామ్‌గా ఖ్యాతి గడించింది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలో వెలికి తీసిన చారిత్రక అవశేషాలు... ప్రత్యేకించి బౌద్ధ అవశేషాలు, విశేషాలను ప్రాజెక్ట్ నీళ్ళ మధ్యలో ఉన్న నాగార్జున కొండపై ఏర్పాటుచేసిన మ్యూజియంలో భద్రపరిచారు. ఇక్కడికి సాగర్ నీటిలో బోటులో 9 కిలోమీటర్లు ప్రయాణించడం అరుదైన అనుభూతినిస్తుంది. సాగర్ డ్యామ్ కూడా చూశాక పైలాన్–హిల్ కాలనీ పరిసరాల్లో 279 ఎకరాల్లో బుద్ధుడు ప్రవచించిన 'అష్టాంగమార్గ' స్ఫూర్తితో నిర్మించిన కట్టడాలు, పార్క్‌లు చూడదగినవి. సాగర్ కిందుగా 11 కిలోమీటర్ల దూరంలో 70 అడుగుల ఎత్తు నుంచి దూకుతున్న ఎత్తిపోతల జలపాతం ఉంది. దీని సౌందర్యం విధిగా చూడదగింది. ఇది గుంటూరు జిల్లా పరిధిలోకి వస్తుంది. నాగార్జునసాగర్‌లో పర్యాటకులకు కావలసిన సకల సౌకర్యాలున్నాయి.

## హైదరాబాద్ – నల్లమల మార్గంలో...

రాష్ట్రంలోనే అత్యంత విశాలమైనవి నల్లమల అడవులు. అందుకే దేశంలోనే పెద్దదైన 'పులుల సంరక్షణా కేంద్రం' సుమారు నాలుగు దశాబ్దాల కిందట ఇక్కడ ఏర్పాటైంది. నల్లమలలోనే రాష్ట్రంలో అత్యంత ప్రాచీనమైన శ్రీశైలం క్షేత్రం ఉంది. ఆ క్షేత్రం ఉత్తరద్వార క్షేత్రమైన ఉమామహేశ్వరంతో తెలంగాణలో (మహబూబ్‌నగర్ జిల్లాలో) నల్లమల అడవులు ప్రారంభమవుతాయి. సర్పాకారంగా కమ్ముకున్న పచ్చని కొండల కంఠ స్థానంలో సహజంగా ఏర్పడిన గుహల్లో పైనుండి పడుతున్న నీటి ధారల కింద ప్రతిష్ఠితమైన స్వయంభు శివలింగం తేజస్సు చూడదగింది.

ఉమామహేశ్వరానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న మన్ననూరులో చీతల్ రెస్టారెంట్‌లో భోజనం చేసి, అందులోని వనమాలి కాటేజీల్లో విశ్రాంతి తీసుకొని, అక్కడున్న చెంచుక్ష్మి ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ సెంటర్ అనే మ్యూజియంలను సందర్శించవచ్చు. మన్ననూరుకు 16 కిలోమీటర్ల దూరంలో గుండం సందర్శించదగ్గది. రోడ్ మీదే ఉన్న ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వారికి టికెట్ రుసుము చెల్లించి వారి వాచ్‌మన్ సహాయంతో సమీపంలో ఉండే 'గుండం' వరకు వెళ్ళి నట్టడివిలో వన్యజీవులు, పక్షుల స్వేచ్ఛా విహారాలను వీక్షించవచ్చు.








'గుండం'కు ఫర్లాంగు దూరంలో కిందివైపు లొద్ది ఉంది. దానిలోతు సుమారు వేయి అడుగులు. దాని అడుగున విశాలమైన గుండం ఉంది. సుమారు వంద అడుగుల ఎత్తు నుంచి ఒక జలపాతం దూకగా ఏర్పడిందది. ఆ జలపాతపు నీటిని ఇప్పుడు స్థానికులు వ్యవసాయం కొరకని చెరువులోకి మళ్ళించుకున్నారు. అయినా వర్షాకాలంలో పారిన వరద నీటికి నిండిన ఈ గుండం ఎండాకాలం కూడా ఎండిపోదు. పైగా ఎండా కాలంలో దీని దగ్గర ఎక్కువ ఆనందించే వాతావరణం ఉంటుంది. అయితే, ఎండాకాలం తర్వాత వచ్చే ఏకాదశి పండుగకి ఇక్కడ చెంచు గిరిజనుల ఆధ్వర్యంలో జాతర జరుగుతుంది. గుండానికి రెండు వైపులా ఉన్న సహజమైన గుహల్లో విష్ణుకుండుల కాలపు (1600 సంవత్సరాల కిందటి) శివాలయాలున్నాయి. వాటి మధ్య ఎత్తైన చెట్ల మధ్యనున్న గుండంలో కేరింతలు కొడుతూ ఈత కొట్టడం, ఆ కేరింతల ప్రతిధ్వనులు కొండల మధ్య వింతగా విన్పించడం... ఇవన్నీ స్వయంగా ఆస్వాదించదగిన అనుభూతులు.

లొద్ది నుంచి 8 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే నిజాం కాలం నాటి ఫరహాబాద్ గేట్ వస్తుంది. అక్కడి నుంచి ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారు తమ జీపులో టైగర్ సఫారీకి తీసుకువెళతారు... నల్లమల పీఠభూమి చివరన గల ఒక కొండ అంచువరకు. ఆ అంచు కిందుగా భూమి ఉపరితలానికి సుమారు ఒక కిలోమీటరు ఎత్తులో ఉంటుంది. అంత ఎత్తులో ఉన్న మన మీదికి రయ్యిమని వీస్తున్న చల్ల గాలుల అనుభూతులను






ఆస్వాదిస్తూ, పచ్చని అడవుల మధ్య అక్కడక్కడా చెలిమలలాగా కనిపిస్తున్న పెద్ద చెరువులను చూస్తూ, పక్కనే నిజాం కట్టించుకున్న శిథిల భవనాలను ఆసక్తిగా వీక్షిస్తూ అక్కడ అలాగే ఉండిపోవాలనిపిస్తుంది. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వారి జీపులో ప్రయాణిస్తున్నప్పుడు మనకు మార్గం మధ్యలో అక్కడక్కడ జింకలు, అడవి పందులు, ఎలుగుబంట్లు, పులులు మొదలైన వన్య జంతువులూ కన్పించవచ్చు. ఫరహాబాద్ గెస్ట్‌హౌజ్ నుంచి రాంపూర్ చౌరస్తా మీదుగా 18 కిలోమటర్లు అడవిలో ప్రయాణించి సలేశ్వరం చేరుకోవచ్చు. ఇక్కడి కుండ వంటి లోయలోకి 170 అడుగుల ఎత్తు నుంచి దూకే సన్నని జలపాతం, విష్ణుకుండుల నాటి (వేయిన్నర సంవత్సరాల) చారిత్రక కట్టడాలు అత్యంత మనోహరాలు. ఇక్కడ చైత్ర పౌర్ణమికి చెంచుల ఆధ్వర్యంలో వారం పాటు జాతర జరుగుతుంది.

ఫరహాబాద్ నుంచి వటవర్లపల్లి మీదుగా సుమారు 15 కిలోమీటర్లు ప్రయాణిస్తే మల్లెం తీర్థం అనే జలపాతాన్ని చేరుకోవచ్చు. సుమారు మూడు వందల మెట్లు దిగాక కనిపించే ఈ జలపాతం వంద అడుగుల ఎత్తు నుంచి దూకుతూ ఏడాది పొడవునా పర్యాటకులను అలరిస్తూనే ఉంటుంది. వటవర్లపల్లి నుండి రాచమోళ్ళబావి మీదుగా సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక లోయ కుడివైపు 'అక్కమహాదేవి గుహలు' అని ఒక బోర్డు కనిపిస్తుంది. అటువైపు చుట్టూ ఆవరించుకున్న పచ్చని

అడవులు–కొండల మార్గంలో ట్రెక్కింగ్ చేసి కృష్ణానది ఒడ్డున గల విశాలమైన గుహ సముదాయం చేరుకోవచ్చు. సహజంగా ఏర్పడిన రెండు స్తంభాల మీద విశాలమైన రాతి సల్ప అమరి దాని కింద మూడువైపులా వందేసి మూరల పొడవైన గుహలు ఏర్పడ్డాయి. పడమటి వైపు గుహ చివరన స్వయంభు లింగం పీఠం మీద ఉంది. ఆ లింగాన్నే 12వ శతాబ్దంలో అక్క మహాదేవి అనే భక్తురాలు పూజించి, శివున్ని ప్రత్యక్షం చేసుకొని అతనిలో ఐక్యమైందని తెలిపే శిల్పం శ్రీశైలం ప్రాకారగోడపై ఉంది. అక్క మహాదేవి గుహలకు గతంలో ఇక్కడ యోగసిద్ధి పొందిన నరసింహ ఋషిని ఏటా కార్తీక పౌర్ణమికి కర్ణాటక భక్తులు పల్లకిలో కృష్ణానది మీదుగా మోసుకొచ్చి జాతర జరుపుతారు. అక్క మహాదేవి గుహ ప్రాంగణంలో శిలా తోరణం కింద శ్రీశైలం ప్రాజెక్టు నీటి అందాలను చూస్తూ వేల మంది సేదతీరవచ్చు. ఇక్కడి నుంచి శ్రీశైలంలోని పాతాళగంగ వరకు 22 కిలోమీటర్ల దూరం పర్యాటక శాఖ నడుపుతున్న బోట్లలో కూడా ప్రయాణించవచ్చు. సాహసికులు స్థానిక జాలర్ల పుట్టిలో 6 కిలోమీటర్లు ప్రయాణించి కదళవనంలో ఉన్న ఒక గుహలో చారిత్రక పూర్వయుగం నాటి చిత్రలేఖనాలు చూడవచ్చు. పరిసరాల్లోని దత్తాత్రేయ మఠాన్నీ దర్శించవచ్చు.



## హైదరాబాద్ – అనంతగిరి మార్గంలో...

హైదరాబాద్ రాజధానిగా పాలించిన ముస్లిం రాజుల పర్యావరణ స్పృహ నుండి క్రీ.శ.1564లో పుట్టిన హుస్సేన్‌సాగర్‌లో బోటులో విహరిస్తూ చేసే డిన్నర్, బుద్ధ దర్శనం చక్కటి అనుభూతులు. ఆనాటి కుతుబ్షాహీ రాజుల రాజధాని గోల్కొండ కోటపైకి నీటిని అందించిన దుర్గం చెరువులో బోట్లలో విహరిస్తూ చేపలు పట్టడం, చేప కూరతోనూ భోంచేయడం అదృష్టవశాత్తు ఇప్పటికీ సాధ్యమే. గోల్కొండ కోట, కుతుబ్‌షాహి టూంబ్స్, పైగా టూంబ్స్, చార్మినార్, మక్కా మసీదు, చౌమహల్లా ప్యాలెస్, ఫలక్‌నుమా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియం, నిజాం మ్యూజియం మొదలైన చారిత్రక కట్టడాలను, జూపార్క్, ఎన్టీర్ పార్క్, లుంబినీ పార్క్, కె.బి.ఆర్. పార్క్, వనస్థలి మొదలైన పర్యావరణ పర్యాటక స్థలాలనూ హైదరాబాద్‌లో చూడవచ్చు. రామోజీ ఫిల్మ్ సిటీ, జలవిహార్, ప్రగతి రిసార్ట్స్ వంటి ప్రైవేట్ పర్యాటక స్థలాలు కూడా హైదరాబాద్‌లో అనేకం ఉన్నాయి.

హైదరాబాద్ నుంచి సుమారు 70 కిలోమీటర్ల దూరంలో అనంతగిరి కొండలున్నాయి. అందంలో విశాఖ జిల్లాలోని అనంతగిరి కొండలతో పోటీపడే






కొండలివి. ఈ అడవుల మధ్య నిజాం కాలంలోనే క్షయ వ్యాధి నివారణ కేంద్రం ఏర్పాటై ఇప్పటికీ పనిచేస్తుంది. ఇక్కడి వాతావరణంలోనే క్షయ వ్యాధిని నయం చేయగల మహత్తు ఉందని ఆనాడే గుర్తించారు. ఈ కేంద్రం ముందర విశాలమైన, లోతైన లోయ ఉంది. సాహసికులు అక్కడికి ట్రెక్కింగ్ చేస్తే వారికి అడవుల మధ్య అందమైన చెరువు కన్పిస్తుంది. సాహసించనివారు ఈ కేంద్రానికి వెనుక వైపునున్న దేవాలయాన్ని దర్శించుకుని దాని కిందుగా జంటగా ఉన్న కోనేరులోని మంచి నీటిని, మరోవైపు మురికి నీటిని చూసి, వెనుదిరిగి వచ్చి పర్యాటక శాఖవారు ఏర్పాటుచేసిన వ్యాలీ వ్యూ రెస్టారెంట్‌లో షడ్రసోపేతమైన భోజనం చేయవచ్చు. వీలు చేసుకునేవారు అక్కడే ఉన్న ఏ.సి. గదుల్లో ఒకరోజు ఉండిపోవచ్చు.

అనంతగిరి సమీపంలో ఉన్న మన్నెగూడ నుండి 10 కిలోమీటర్ల దూరంలో పూడూరు గ్రామ పడమటి దిక్కున అడవుల్లో ప్రసన్న ధామగుండం చాలా ఆహ్లాదకరమైన స్థలం. కాబట్టి ఇక్కడి గుట్టల్లో గుహలు తవ్వుకుని పది పన్నెండు వందల ఏళ్ళ కింద జైనులు, విశాలమైన గుండంలో విలాసవంతమైన మంటపం కట్టుకుని నాలుగైదు వందల ఏళ్ళ కింద కుతుబ్‌షాహీలు ఆనందించారు. ఇక్కడి ఏరులు, వాటి ఒడ్డులపైన ఏపుగా పెరిగిన వట వృక్షాలు, వాటి మధ్యనున్న వందల ఏళ్ళనాటి మందిరాలు చక్కని దృశ్య కావ్యంలా కనిపిస్తాయి.



ఈ విధంగా అరకు, హార్స్‌లీ హిల్స్‌లను తలదన్నే చల్లని పర్యాటక కేంద్రాలు మన చుట్టు పక్కలే తెలంగాణ ప్రాంతంలోనే ఉన్నాయి.

– నమస్తే తెలంగాణ ఆదివారం అనుబంధం
*26-05-2013*





2

# తెలంగాణా గ్రీన్ వ్యాలీలో 'గాడి'ద జలపాతం

అలసట కలగకుండానే, ఏ ప్రయత్నమూ చేయకుండానే ఎంతో అద్భుతమైన దృశ్యం కనిపించినా మనకు అంత ఆనందం అనిపించదు. అదే దాని అందాన్ని మనం వెతికి పట్టుకునే ప్రయత్నం కొంత చేసి సఫలీకృతమైనప్పుడు కలిగే ఆనందం ఒక మధుర స్మృతి అవుతుంది. మనకు గ్రీన్ వ్యాలీలోని 'గాడి'ద గుండాన్ని చేరుకుని చూసినప్పుడు మిగులుతుంది ఈ మధుర స్మృతి. అంటే గాడిద గుండం దర్శనం మనకు ప్రకృతితో మమేకమయ్యే అవకాశాన్నిచ్చి అదొక మధుర స్మృతిగా మిగిలేందుకు దోహదం చేస్తుంది.



గోదావరి నదికి అవతలి జిల్లా అదిలాబాద్, ఇవతలి కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో రాష్ట్రంలోనే అందమైన అడవులున్నాయి. నిజానికి గోదావరి లోయలో





ఉన్న ఈ అడవులను తెలంగాణా గ్రీన్ వ్యాలీ (హరిత లోయ) అనాలి. ఈ గ్రీన్ వ్యాలీ అందం అదిలాబాద్ జిల్లాలో మరీ ఎక్కువ. అలాంటి అరుదైన, అందమైన అడవుల్లో మరింత అందమైన, అత్యంత ఎత్తైన జలపాతం ఉందని ఆ ప్రాంతంలోని వారికి కూడా తెలియకపోవడం దురదృష్టకరం. అది తెలుసుకుందామిప్పుడు.

## గ్రీన్ వ్యాలీలో ట్రెక్కింగ్

హైదరాబాద్ నుండి నిర్మల్, నేరేడిగొండ, తర్నం లేదా దేవల్‌నాయక్ తండాల మీదుగా ప్రయాణిస్తే 250 కిలోమీటర్ల దూరంలోఉంటుంది ఈ గాడిద గుండం జలపాతం. దీన్ని చేరడానికి పచ్చని అడవులు, గుట్టలు, లోయల్లో మూడు కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. వర్షాకాలంలో కడెంనది ఒక్కోసారి వరద ఎక్కువై దాటనివ్వదు. అలాంటప్పుడు దేవల్‌నాయక్‌తండాలో ఒక గ్రామస్థుని తీసుకుని ఈ జలపాతం దగ్గరికి వెళ్ళాలి. ఐతే ఇక్కడికి నిర్మల్, ఇచ్చోడ, సిరిచెల్మ, పట్టణం, గుండిబాగ్‌ల మీదుగా వాహనంలో కూడా రావచ్చు.



ఈ ప్రాంతంలో మరాఠీలు, లంబాడీలు, గోండులు, ఆంధ్‌లు, ముస్లింలు మాత్రమే కాకుండా గిరిజనేతరులు కూడా ఉన్నారు. అంటే ఈ ప్రాంతంలో విభిన్న జాతుల సమ్మేళనాన్ని, వైవిధ్య సంస్కృతులను... భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడవచ్చు. కొందరు ఈ జలపాతాన్ని ముక్కిడి గుండం అని పిలిస్తే, మరి కొందరు గాడిద జలపాతం అంటారు. నిజానికి స్థానిక ప్రజలు ఈ జలపాతానికి మొక్కుతారు. అందుకే దీనికి 'మొక్కుడు గుండం' అని, ఇది 'గాడి'లో నుంచి దుంకుతుంది కాబట్టి 'గాడి'ద గుండం అని పేర్లు వచ్చాయి.

పర్యాటకులు ఈ ప్రాంతీయులు సాగు చేసుకుంటున్న పంట పొలాల మధ్య నుండి నడిచిపోవాల్సి ఉంటుంది. మన చుట్టూ ఎత్తు పల్లాల్లో గుట్టలు, చెట్ల మధ్య అటవీ ప్రదేశాన్ని చదును చేసుకుంటూ వివిధ రకాల మెట్ట పంటలను సాగు

చేసుకుంటున్న వ్యవసాయదారులు కనిపిస్తారు. వారి శ్రమ సౌందర్యమే కాకుండా పచ్చని లోయల్లోని నల్లని నేలల్లో పరుచుకున్న పచ్చని పైరుల సోయగాలను కూడా చూడొచ్చు.

అక్కడక్కడా గుట్టబోర్లు, ఎత్తైన గుట్టలు, అడవులు, లోతైన లోయలు, ఇరుకైన దారి, ఎడ్లబళ్ళ చక్రాల గాడులు, పచ్చని చెట్ల మధ్య ఏర్పడిన చిన్న చిన్న కుంటలు, వాటి నీటిని తాగడానికి వచ్చిన జంతువుల కాళ్ళ డెక్కల గుర్తులు, జల జలా పారుతూ మనకు అడ్డంగా వచ్చే ఏరులు, పచ్చిక బయళ్ళు మేస్తున్న పశువులు, వాటిని కాపలా కాసే గోండులు, ఆంధ్‌లు, అటవీ మార్గంలో ఎలుగుబంట్లు, అడవి పందులు ఎదురవుతాయేమోనన్న భయం, వీటిల్లో ప్రతి ఒక్కటీ మన మనోఫలకంపై ముద్రించుకు పోయే మధుర స్మృతులను మిగుల్చుతాయి.

## ఎత్తైన, లోతైన జలపాతం

గాడిదగుండం జలపాతం పరిసరాలూ మనల్ని పరవశానికి గురిచేస్తాయి. చుట్టూ గిరిగీసినట్లుండే ఎత్తైన పచ్చని కొండల మధ్య వంపు తిరిగిన విల్లులా ఒక వాగు ప్రవహిస్తుంది. అదీ ఒక ఇరుకైన గాడిలో. ఎత్తైన చిక్కని చెట్ల మధ్యలో ఉన్న గుండిబాగ్ అనే అంధ్‌లగూడెం సరిహద్దుల్లో పచ్చని చెట్ల మధ్య నుండి తెల్లని వాగు వడివడిగా ప్రవహిస్తుండటం చూసి పరవశించిపోతాం. అంత కంటే ఎక్కువగా పరవశింపచేసే దృశ్యం అల్లంత దూరంలోనే కనిపిస్తుంది. అదే అసలైన అందమైన





జలపాతం. అలాగని దాని అందం అంత సులభంగా కనిపించదు. ముందు వినిపిస్తుంది... 200 అడుగుల ఎత్తు నుండి దూకే జలపాత శబ్దం. ఇది మన రాష్ట్రంలోనే ఎతైన జలపాతాల్లో ఒకటి.

ఈ జలపాతం ఒక ఇరుకైన గాడిలో నుండి కొండల మధ్య సహజంగా ఏర్పడిన ఒక నిటారైన రంధ్రంలోకి దూకుతుంటుంది. నిజానికి ఈ రంధ్రం ఈ జలపాతం దూకుడు తాకిడికే ఏర్పడింది. ఆ రంధ్రం ఎత్తు/లోతు సుమారు 100 అడుగుల పైమాటే. అంటే ఈ జలపాతం ఎత్తులో సగం భాగం అన్నమాట. జలపాతం ఈ రంధ్రంలో దూకిన తరువాత మనకు కనిపించకుండా మాయమవుతుంది. తూర్పు వైపు నుండి పడమర వైపు దూకుతున్న జలపాతం ఆ రంధ్రాన్ని చీల్చుకుని ఉత్తర వాయువ్యం వైపు బయటకు వెళ్ళి మళ్ళీ గుట్ట అడ్డు రావడంతో మలుపు తీసుకుంటుంది. అదొక అందమైన ఆసక్తికరమైన దృశ్యం. ఇక్కడే మనకు తెలియని మరో ఆసక్తికరమైన దృశ్యం కనిపిస్తుంది. అదేమిటంటే, కొందరు స్థానిక వేటగాళ్ళు పావురాలను పట్టుకోవడం.

## సుందరమైన లోయ



గాడిదగుండం జలపాతం ప్రాంత దృశ్యం కాశ్మీర్ లోయను మరిపిస్తుంది. ఈ జలపాతం చుట్టూ 500 అడుగుల ఎతైన కొనదేలిన కొండల వరుసలు పచ్చని చెట్లతో కళకళలాడుతూ ముసురుకున్నాయి. ఈ కొండల మధ్య తూర్పు సగభాగం ఎత్తైన పీఠభూమి, పశ్చిమ సగభాగం ఏటవాలు లోయ ఎంతో అందంగా కనిపిస్తుంది. పీఠభూమిని ఈశాన్యం కొండల మధ్యనున్న సన్నని చీలిక నుండి, దక్షిణపు కొండల పైనున్న గుండిబాగ్ ఏటవాళ్ళ నుండి చేరుకోవాలి. లోయనైతే పశ్చిమపు కొండలు (మాదారం) దిగి చేరుకోవాలి. వర్షాలు ఉధృతంగా లేనప్పుడు కడెం నది మనల్ని దాటనిస్తుంది. అప్పుడు ఈ లోయలోని తర్నం, దేవల్‌నాయక్ తండా పొలిమేరల నుండి కాలినడకన చేరుకోవచ్చు. ఇలా వచ్చినప్పుడు జలపాతం కింద ఉన్న లోయలోకి చేరుకుంటాం. జలపాతం ఎత్తు, అందాన్ని సంపూర్ణంగా చూసి ఆనందించవచ్చు. పీఠభూమిపై నుండి వస్తే దాని ఎత్తు సగమే కనిపిస్తుంది. 500 అడుగుల ఎత్తున్న పచ్చని కొండల మధ్య ప్రవహిస్తూ, 200ల అడుగుల ఎత్తు నుండి తూర్పు నుండి పశ్చిమం వైపు దూకుతూ, 100 అడుగుల ఎతైన నల్లని రాళ్ల మధ్య కనుమరగయిన తెల్లని జలపాతం మళ్ళీ ఉత్తర వాయువ్యంలో కొండ అడ్డు రావడంతో వంపు తిరిగి పశ్చిమం మీదుగా నైరుతి వైపు అర్ధచంద్రాకారంలో నీలిమేఘాలను ప్రతిఫలిస్తూ





ఒయ్యారంగా సోయగాలు పోతూ ప్రవహించే దృశ్యాన్ని ప్రతి ఒక్కరూ చూసి తరించాల్సిందే.

మాదారం నుంచి గాని, తర్నం, దేవల్ నాయక్ తండా మీద నుంచి గానీ వచ్చేవారు జలపాతం కిందుగా పారే వాగు ప్రవాహం వెంట లోయలో సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం పచ్చని చెట్ల మీద చేస్తూ పక్షుల కిలకిల రావాలను వింటూ నడక సాగించడం మన జీవితంలో మరిచిపోలేని మధురానుభూతిని మిగులుస్తుంది. ఇక్కడ రోప్‌వే నిర్మిస్తే ఇదొక అద్భుతమైన ఎకో టూరిజం ప్రాజెక్ట్ కాగలదు. జాతీయ రహదారి నెం. 44కు దగ్గరగా ఉండటం వల్ల పర్యాటకులతో కిటకిటలాడే అవకాశమూ ఉంది.

– సూర్య దినపత్రిక
*2-10-2012*

డా. ద్యావనపల్లి సత్యనారాయణ

3

# కనకాయి జలపాత సమూహం

ఆదిలాబాద్ జిల్లాలో రెండు కొండల వరుసలు పశ్చిమం నుంచి తూర్పుకు సమాంతరంగా సాగుతాయి. పై కొండల వరుస (ఉత్తరపుది) పేరు సత్మల కొండలు కాగా కింది కొండల వరుస (దక్షిణపుది) పేరు నిర్మల కొండలు. రెండు వరుసల మధ్య లోయ(వ్యాలీ)లో గోదావరికి ఉపనది అయిన కడెం నది పారుతుంది. సత్మల కొండల్లో సుమారు పదివాగులు పుట్టి కడెం నదిలో కలుస్తాయి. అయితే పారేటప్పుడు కొండల మీద నుంచి దుంకుతూ వస్తాయి కాబట్టి అవన్నీ... అంటే ప్రతి ఒక్క వాగూ ఏదో ఒకచోట మనకు జలపాతమై దర్శనమిస్తుంది. అలా కడెం నది చుట్టూ పది జలపాతాలను చూడవచ్చు. అలాంటి వాటిలో రెండు జలపాతాల పేర్లు కనకాయి జలపాతం, గొలుసుల జలపాతం. ఇవి బజార్ హత్నూర్ మండలంలో ఉన్నాయి. హైదరాబాద్ నుంచి నిర్మల్, ఇచ్చోడ మీదుగా మొత్తం 250 కి.మీ.లు ప్రయాణించి బల్నాపూర్, గిర్నూర్‌ల మధ్య ఉన్న ఈ జలపాతాలను చేరుకోవచ్చు.





గొలుసుల (సోనాల) జలపాతం


## అందమైన ప్రయాణం

ఆదిలాబాద్ జిల్లాలో ప్రవేంశించిందే తడవుగా మన ప్రయాణం సుందర దృశ్యాల మధ్య సాగుతుంది. నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల సరిహద్దుగా ఉన్న గోదావరి నదిపైన కట్టిన శ్రీరామ్‌సాగర్ డ్యామ్ మనకు ఎడమ వైపున అల్లంతదూరంలో కనిపిస్తుంది. ఆ దృశ్యం తెరమరుగు కాకముందే కుడివైపున చిన్నదైనప్పటికీ చిత్రమైన సోన్‌కోట కనిపిస్తుంది. కొన్ని కిలోమీటర్లు ముందుకు సాగగానే ఇంతకుముందు నిర్మల్‌కోట గోడలు దర్శనమిచ్చేవి. ఈ మధ్య పాత జాతీయ రహదారి నంబర్ 7ను 4 లైన్ల రహదారి నంబర్ 44గా విస్తరించడంతో అవి మనకు కన్పించడం లేదు. కాని, వాటిని చూడలేదే అన్న లోటును మరి కొన్ని కిలోమీటర్లు సాగిన తర్వాత కనిపించే బాల్కొండ కోట తీరుస్తుంది.

## జలపాతాల హోరు

ఇచ్చోడ నుంచి బజార్‌హత్నూర్ వెళ్తున్నప్పుడు మధ్యలో కడెం నది కనిపిస్తుంది. అక్కడే మన వాహనాన్ని ఆపి ఆ చిన్న నది వెంట తూర్పు వైపుకి ఒక ఫర్లాంగు దూరం నడవగానే శ్రావ్యమైన జలపాతపు సంగీతం వినిపిస్తుంది. గబ గబా ముందుకి పరుగెత్తి కిందకి చూస్తే మన కళ్లముందు ఓ అందమైన జలపాతం ఆవిష్కృతమవుతుంది. అదే కనకాయి జలపాతం. దక్షిణంగా ఉన్న గ్రామం సోనాల నుంచి వచ్చే వాగు కడెం నదిలో కలిసిన చోట ఈ జలపాతం ఏర్పడింది. సుమారు 70 అడుగుల వెడల్పుతో 40 అడుగుల ఎత్తు నుండి నురగలు కక్కుతూ దూకుతుంది. దూకి రెండు ఇరుకైన గట్లు, చెట్ల మధ్య లోయలో ప్రశాంతంగా పారుతుంది. ఆ దృశ్యం నల్లతోక (జలపాతపు కింది ప్రవాహం) ఉన్న తెల్ల గాలిపటం (నురగలు కక్కుతూ దూకుతున్న జలపాతం) లాగా కనిపిస్తుంది. స్థానిక ప్రజలు ఈ జలపాతాన్ని కనకాయి గుండంగా పిలుస్తూ పూజిస్తారనడానికి నిదర్శనంగా మనకు జలపాతపు అంచునే పూజాసామగ్రితో అలంకరించబడిన విగ్రహపు రాళ్లు కనిపిస్తాయి.

కనకాయి జలపాతానికి తూర్పువైపు మరో ఫర్లాంగు దూరం నడిచిన తరువాత మరో జలపాతం వస్తుంది. పేరు గొలుసుల జలపాతం. ఇది గొలుసు ఆకారంలోనే ఉంటుంది. దక్షిణాన సాకేరి గ్రామం నుంచి వస్తున్న వాగు కడెం కదిలో కలిసే చోట ఈ జలపాతం ఏర్పడింది. పచ్చని చెట్ల మధ్యన నల్లని రాతినేలపై నుంచి తెల్లని నురగలతో గొలుసులు గొలుసులుగా దూకే ఈ జలపాతం అందం చూపరులకు నయనానందకరం.



కనకాయి జలపాతం



## సాహసులకు సవాల్ చీకటి గుండం

ఇది ఆరంభం మాత్రమే. గొలుసుల జలపాతం తరువాత మరో అతి పెద్ద జలపాతం ఉంటుందట. పేరు చీకటిగుండం. చీకట్లో ఏమీ కనబడనట్లే ఈ జలపాతం కూడా కనబడదట. ఇందుకు రెండు కారణాలున్నాయి. ఒకటి, అది చాలా చిక్కగా, ఎత్తుగా పెరిగిన దట్టమైన అడవుల మధ్య ఉండడం. దీనివల్ల అది దూకుతున్న శబ్దం ఆ దట్టమైన అడవుల్లో రెండు మూడు దిక్కుల్లో ప్రతిధ్వనించి అసలు ఏ దిక్కునుంచి ఆ జలపాతం ప్రవహిస్తున్నదో మనం తేల్చుకోలేకపోతాం. ఇక రెండవ కారణం, మనం దానిపై నుంచి వెళ్తాం కాబట్టి మన ముందు దిశలో ఎంత దూరంలో కిందికి దూకి జలపాతంగా మారుతుందో తెలియదు. పైగా అది దట్టమైన గుట్టల మధ్య ఏర్పడిన ఒక ఇరుకైన లోతైన లోయలోకి ఆకస్మికంగా నిటారుగా దూకుతుందట. అతి కష్టం మీద ఆ స్థలానికి మనం చేరుకున్నా కూడా ఆ లోయ గురుత్వాకర్షణ శక్తికి గురై మనం అందులో పడిపోతామట. అయినా కొందరు ఔత్సాహికులు గతంలో ఎప్పుడో నడుములకు చెట్లకు తాళ్లు కట్టుకుని, ఈ చీకటి జలపాతం వరకు చేరుకుని దాని లోతును కొలిచే ప్రయత్నం చేసి విఫలమయ్యారట. కారణం, వారు ఏడు మంచాల నులకతాడు కొసకు రాయి కట్టి ఆ లోయలో వేసినా దాని అడుగు అందలేదట.

ఈ వ్యాసకర్త కూడా ఈ జలపాతాన్ని కనుక్కునే ప్రయత్నం చేశారు. ఆయనకి కూడా ఆ దట్టమైన అడవుల్లో మూడు నాలుగు దిక్కుల్లో జలపాతాల హోరు విన్పించింది. కాని చిక్కని చెట్ల మధ్య ఎంత పరికించి చూసినా జలపాతం కన్పించలేదు. వీడియో రికార్డు చేస్తే అందులో ప్రశాంతంగా పారుతున్న ప్రవాహం జలపాతపు హోరుతో రికార్డయింది. అంటే సమీప పరిసరాల్లో ఎక్కడో అత్యంత ఎత్తు నుంచి దుముకుతున్న జలపాతమున్నట్లే కదా!

ఏమైనా, అంత అందమైన జలపాతాన్ని చూడలేకపోయామే అన్న బాధను ఆ పరిసరాల సౌందర్యం ఇట్టే తీసేస్తుంది. వంద మీటర్ల ఎత్తైన గట్లు, చెట్ల మధ్య నుంచి మనకు అకస్మాత్తుగా మడ అడవుల దృశ్యం కనిపిస్తుంది. నీళ్లలో తేలాడే మడ అడవులు సముద్ర తీర ప్రాంతాల్లోనే ఉంటాయి. అట్లాగే ఉన్న ఇక్కడి మడ అడవుల మధ్య బోటు షికారు చేయడానికి కూడా అవకాశముందంటే ఆలోచించండి మరి.

## వనదేవత ఇతిహాసం



ఇక్కడి జలపాతాల సమూహానికి 'కనకాయి గుండాలు' అని పేరు రావడానికి కారణం ఇక్కడి వనదేవత 'కనకాయి' లేదా కనకదుర్గ కావడం. కనకాయి అంటే (కనక+అయి) బంగారు లోహదేవత అని అర్థం. కనకాయి జలపాతం కూడా సోనాల



*చీకటి గుండం*



కనకాయి జలపాతం: కుడివైపున కనకాయి దేవతను గమనించవచ్చు

అనే గ్రామ పొలిమేరల నుంచి దూకుతున్నది. సోనాల అంటే కూడ బంగారు ప్రదేశం అని అర్థం. మరి ఈ ప్రాంతంలో బంగారం దొరుకుతుందా? దొరుకుతుందనే నమ్మకంతోనే ఈ రోజు వరకూ నిధుల తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో బంగారు దేవత (కనకాయి) గుడిని కూడా కూలగొట్టారు. దానివల్ల ఇప్పుడు కనకాయి గుడి ప్రాంతంలో కేవలం రెండు శిల్పాలు, శిథిల దేవాలయ అరుగు తప్ప మరేమీ మిగల లేదు.

నిజానికి కనకాయి బంగారు లోహ దేవత కాదు. బంగారం కనిపెట్టబడిన తరువాత దక్షిణ భారతదేశంలో ప్రత్యేకించి తెలంగాణలో కనిపెట్టబడిన ఇనుము లోహదేవత. ఇనుము కనిపెట్టిన తరువాత వ్యవసాయం అభివృద్ధిలో పెనుమార్పులు చోటు చేసుకుని ప్రజలు ఆర్థికంగా అన్ని రకాలుగా ఎదిగారు కాబట్టి, ఇనుమును బంగారంతో సమానంగా గౌరవించేవారు. ఆ క్రమంలోనే ఇనుప లోహదేవతకు కనకాయి అని పేరు పెట్టారు. ఇదంతా మూడువేల సంవత్సరాలకు పూర్వమే జరిగింది. కనకాయి జలపాతం ప్రాంత మంతా ఆనాటి ఇనుప లోహ పరిశ్రమ ఆనవాళ్లతో అలరారుతుంది. ఈ ప్రాంతంలో ఇనుము కనిపెట్టిన తరువాతనే ఈ ప్రాంత రాజు మహిషాసురుణ్ణి మర్దించడం జరిగింది. కాబట్టి ఇనుపదేవత (కనకాయి) కాస్తా కనకదుర్గగా, మహిషాసుర మర్దినిగా రూపాంతరం చెందింది. మహిషాసురుని భారీ విగ్రహానికి సంబంధించిన శిథిల శిల్ప ముక్కలను ఈ రోజు కూడా భైంసా(మహిషా)లో చూడొచ్చు.

క్రీ.పూ. 3వ శతాబ్దంలో అశోకుడు ఈ మహిష మండలానికి బౌద్ధమత ప్రచార నిమిత్తమై తన కొడుకు మహేంద్రుని పంపించాడు. ఆ మత అహింసా సిద్ధాంత ప్రభావం వల్లనేమో ఇక్కడ కనకాయి దేవత శాకాహారి. ఆమెకున్న స్థానిక భక్తులందరూ శాకాహార వ్రత నియమాన్ని పాటిస్తారు. ఈ మధ్య ఈ దేవతకు మేకను బలి ఇచ్చిన కటికవాడు ఒకడు ఇక్కడి కనకాయి గుండంలో పడి చనిపోయాడట. అయితే ఆ గుండం మాత్రం లోతైన రెండు గట్ల మధ్య ప్రశాంతంగా అందంగా ఉంది.

కనకాయి ఆలయం ముందు (ఉత్తరాన) ఒక శిల్ప స్తంభ ఖండిక ఉంది. దానికి నాలుగు దిక్కులా శిల్పాలు చెక్కి ఉన్నాయి. ప్రధాన శిల్పం కృష్ణుడు కంసుని వధిస్తున్నట్లు చెక్కబడింది. ఆ తరహా పేరొందిన శిల్పాలు మహారాష్ట్రలోని పౌని-పౌనార్ (ప్రవరపుర)లో ఉన్నాయి. వాటిని ప్రవరపుర రాజధానిగా దక్కనును పరిపాలించిన వాకాటక రాజులు చెక్కించారు. కనకాయి ప్రాంతం వారి రాజ్యంలో భాగమే కాబట్టి ఇది కూడా ఆనాడు (క్రీ.శ.500) రాజపోషణకు నోచుకున్నదన్నమాట. అయితే ఇక్కడ వేల ఏళ్లనాటి ఇటుక ముక్కలతో పాటు $9^{1/2}$x7x2 అంగుళాల కొలతలు గల ఇటుకలు కూడా కన్పిస్తున్నాయి. కాబట్టి ఈ ప్రాంతంలో కాకతీయుల కాలంలో (క్రీ.శ.13వ శతాబ్దం) కూడా కట్టడాలు నిర్మితమయ్యాయని అర్థమవుతుంది.



## జలదుర్గం

కనకాయి దేవత స్థలం నుండి ప్రధానమైన కోటగోడ ప్రారంభమవుతుంది. ఆలయానికి నైరుతిలో కోటగోడ మొదటి ప్రాకారం ఉంది. ఆ ప్రాకార ప్రధాన ద్వారం ముందే కనకాయి జలపాతం ఉంది. దాని ప్రవాహం ఈ కోటగోడను కాలక్రమంలో కోసుకుంటూ వెళ్తున్నది. అయితే ద్వారం ముందు నుండి పశ్చిమ దిశగా ప్రస్తుత రోడ్ వైపు ఉన్న ఫర్లాంగు పొడవైన రాతి నిర్మిత రాజమార్గం మాత్రం ఈ నాటికీ చెక్కుచెదరకుండా ఉంది. ఈ రహదారి, ప్రాకారం పరిసరాలలో మనకు ఒకనాటి పట్టణపు ఇళ్ళ పునాదులు, నీటి వసతులు (గుండాలు), ఇటుక ముక్కలు, రోళ్లు తదితర ఆనవాళ్లు కనిపిస్తాయి. వీటి మధ్య నుండి కనకాయి గుండం వైపు వెళ్తున్నపుడు ఆ గుండం ఒడ్డున చారిత్రక పూర్వయుగం నాటి మానవుల ఆయుధాల పరిశ్రమ తాలూకు ఆనవాళ్లు కూడా కనిపించాయి. ఇలాంటి ఆయుధాలు ముప్పై, నలభై ఏళ్ల నాటివని వాటిని సమీపంలోని పొచ్చెర, గణపూర్ జలపాతాల పరిసరాల్లో సేకరించిన ప్రముఖ చరిత్రకారుడు ఠాకూర్ రాజారాం సింగ్ అభిప్రాయపడ్డారు. 2008లో ఈ సైట్‌ను సందర్శించిన వి.వి.కృష్ణశాస్త్రి, కె.జితేంద్రబాబు, కల్వకుంట్ల కవిత ప్రభృతులకు నవీన శిలాయుగపు పనిముట్లు కనిపించాయట.



వడివడిగా వంకలు తిరుగుతూ పరుగిడుతున్న కడెం నది

ఈ ప్రాంతంలో అనాది జాతి ప్రజలైన అంధ్ (ఆంధ్) తెగవారున్నారు. ఈ వ్యాసకర్తకు తోడుగా వచ్చింది కూడా అంధ్ జాతి యువకుడు వాగ్మారి రాజు, అతని మిత్రులు గౌరు సందీప్, జడల నరేశ్‌లు. వాగ్మారి అంటే 'పులిని చంపిన' అని అర్థం. తొలి తెలుగు రాజులు ఆంధ్ర శాతవాహనుల పుట్టుక కథలో కూడా 'పులి' ప్రస్తావన వస్తుంది. అంధ్ సంస్కృతీ కరణమే ఆంధ్ర. కాబట్టి ఇక్కడ కనిపిస్తున్న జలదుర్గం ఆంధ్రుల మొదటి స్థావరాల్లో ఒకటై ఉంటుంది. ఇక్కడి జలదుర్గం చాలా అందంగా ఉంది. వ్యూహాత్మకంగానూ ఉంది. దాని చుట్టూ పటిష్టమైన ఎత్తైన కోటగోడ, దాని చుట్టూ కడెం నది రెండు పాయలుగా చీలి పశ్చిమం నుంచి తూర్పువైపు పారి మళ్ళీ ఒకటిగా కలిసిపోతుంది. కోట, నీటి మధ్య ఎత్తైన ప్రదేశంలో రాజస్థానం, ఆంఫి థియేటర్, అంతఃపురం, ప్రధానోద్యోగులు, సైనికుల స్థావరాలున్నట్లు ఆనవాళు కన్పిస్తున్నాయి. అయితే ఈ ప్రాంతమంతా ఇప్పుడు అడవి ముదిరిపోయి రాజకాంతి తగ్గి ప్రకృతి శోభ పరిఢవిల్లుతోంది.

ఈ స్థలాన్ని ప్రభుత్వం అతి కొద్ది ఖర్చుతో పర్యాటకులకు అందుబాటులోకి తేవచ్చు. ఈ ప్రాంత భూములు కూడా ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నాయి కాబట్టి జలదుర్గం పరిసరాల్లో ప్రాథమిక తవ్వకాలు చేపట్టి చక్కటి పార్కులను పెంచితే పర్యాటకులకు పరమానందాన్ని పంచినట్లు అవుతుంది.

*– ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం*
*30-09-2012*

# 4

# రామాయణ కాలపు జలపాతాలు

పర్యాటకంలో అన్ని వర్గాల వారికీ అమితానందాన్నిచ్చేవి జలపాతాలు. కాని అవి మన రాష్ట్రంలో తక్కువగా ఉండి పర్యాటకంలో జలపాతాల లోటు ఉంది అనుకుంటున్నాం. కాని బాగా తెలుసుకుంటే ఒక్క కరీంనగర్ జిల్లాలోనే... అదీ ఒక్క మండలంలోనే మూడు జలపాతాలున్నాయని తెలిసి ఆశ్చర్యానికి గురై ఆనందించేందుకు బయలుదేరుతాం.




మనం దర్శించి హర్షించే జలపాతాలు గౌరీ గుండం జలపాతం, దాని పరిసర గుండాలైన సీతమ్మ కొల్లుగుంట, పులిగుండం మరియు రాముని గుండాలు. ఇవన్నీ రామగుండం పరిసర ప్రాంతాల్లో ఉన్నాయి. వీటన్నిటికీ రామాయణ కాలపు నేపథ్యగాథలు ఉన్నాయి. మొదటి మూడు గుండాలు హైదరాబాద్‌కు కరీంనగర్, పెద్దపల్లి, సబ్బితం మీదుగా ప్రయాణిస్తే 200 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. వాటిల్లో ప్రధానమైన గౌరీ గుండం సులువుగా చేరుకొని ఆనందించడానికి అనువుగా ఉంది. ఇక రాముని గుండాల హైదరాబాదు నుండి పెద్దపల్లి, రామగుండం బి-పవర్‌హౌజ్ గడ్డ మీదుగా ప్రయాణిస్తే 210 కిలోమీటర్ల దూరంలో ఉంది.

## గమ్మత్తైన గౌరీ గుండం

సబ్బితం నుండి గట్టుసింగారం వైపు కచ్చారోడ్ మీద ప్రయాణిస్తున్నప్పుడు మనకు అడ్డంగా దక్షిణం నుంచి ఉత్తరం వైపుకు కొనసాగుతున్న కొండల వరుస పచ్చని అడవులతో కళకళలాడుతూ కనిపించి కనువిందు చేస్తుంది. మనం కొండలకు దగ్గరవుతున్నకొద్దీ ఆ పచ్చని కొండల మధ్యనున్న ఒకే ఒక నల్లని లోయ మన దృష్టిని ఆకర్షిస్తుంది. ఆ నల్లని లోయ మీద దృష్టి నిలువగానే కొండలపై నుండి ఆ లోయలోకి దుంకుతూ కనిపించే తెల్లని జలపాతం మన ఉల్లమును జల్లనిపిస్తుంది.

ఆ సుందర దృశ్యానికి తోడు ఆ జలపాతపు హోరు మన ఉత్సాహాన్ని ఉరకలు పెట్టిస్తుంది. ఇక ఆగితేనా! మనలో ఒకర్ని విడిచి ఒకరు ఉరుకులు పరుగుల మీద ఆ జలపాతాన్ని చిటికెలో చేరుకుంటాం. సుమారు 150 అడుగుల ఎత్తున కొండల వరుస శిఖరాగ్ర మధ్య భాగం నుండి... అంటే సుమారు 70 అడుగుల ఎత్తు నుండి పశ్చిమాభిముఖంగా 'సుయ్' మని సూటిగా నింగి నుండి నేలకు దుంకుతున్న సుందర దృశ్యం ఈ జలపాతం సొంతం. నయనానందకరం దాని పరిసరం. వీనుల విందు దాని పొందు. కరచరణ స్ఫురితం దాని చరితం. స్వరపేటిక ప్రేరితం దాని పాటవం. కవి కలానికి ఇంపు దాని సొంపు. దాని సోయగాన్ని చూసి, దాని నడక సవ్వడిని విని, దాని కింద తడిసి ముద్దయితే మనం ఈ జలపాతాన్ని చూస్తే తప్ప ఆనందానికి నిర్వచనం లేదనడం అతిశయోక్తి కాదు. ఎందుకంటే, అలాంటి ఆనందానికి పాత్రులమయి చెప్పే మాటలివి.



గౌరీ గుండం

జలపాతపు తెల్లదనమే దాని కింద ఏర్పడిన గుండంలో కూడా కనబడడం, పైగా ఆ గుండం ఎనిమిది అడుగుల కన్నా ఎక్కువ లోతు లేకపోవడంతో ముందుగా మనం అందులోకి దిగి స్నానాలు చేయొచ్చు. ఈతకొట్టచ్చు. కేరింతలతో క్రమక్రమంగా ముందుకి వెళ్లి జలపాతపు ధార కిందికి చేరొచ్చు. మన తల, వీపులపై నురగలు గక్కుతూ గమ్మత్తుగా దుంకుతున్న జలధారల స్పర్శానుభూతికి పరవశులమవ్వచ్చు. చిన్నపిల్లలమై మరింత స్వరం పెంచి కేరింతలు కొట్టొచ్చు. ఐదు నిమిషాల తర్వాత అకస్మాత్తు జలపాతపు ప్రవాహం పెరుగొచ్చు. మొదట భయపడొచ్చు. బయటికి పరుగెత్తుకు రావాలనుకుంటుండగానే మరో వింత జరగొచ్చు. మళ్ళీ అకస్మాత్తుగా జలపాతం తడవలు తడవలుగా చల్లగా ఓసారి, వెచ్చగా ఓసారి పడటం

ప్రారంభమవ్వొచ్చు. అది గమ్మత్తైన వింత అనుభూతిని ఇవ్వసాగడంతో ఏమైతే అదవుతుందని అలా ఆనందిస్తూ దాని కిందే ఉండిపోవచ్చు. 'ఇలా జలపాతం కింద ఉంటే అరగంటలో అద్భుతమైన నీటి మసాజ్ అయ్యి చర్మ రోగాలన్నీ మాయమౌతాయి' అని కితాబివ్వొచ్చు. నిజానికి సబ్బితం గ్రామస్థులు చెప్పినట్లే... మన కేరింతల శబ్దాల ప్రతిధ్వనులు చుట్టూ ఉన్న గుట్టల్లో ప్రకంపనలు పుట్టించి వాటిల్లో నిక్షిప్తమైన వెచ్చని నీటిని బయటికి లాగుతాయని అర్థమవుతుంది.

## పరిసరాల పరవశం


ఈ జలపాతపు కుడివైపు ఉత్తరాన ఉన్న గుండుకు గౌరీ విగ్రహం చెక్కించబడి ఉండడంతో ఆ దేవత పేరు మీదనే ఈ జలపాతానికి గౌరీ గుండం అనే పేరొచ్చింది. దాని పక్కనే వినాయక విగ్రహముంది. ఈ మొత్తం శిల్ప సముదాయం సప్తమాతృకలకు సంబంధించింది అయ్యుంటుంది. జలపాతానికి ఎడమవైపు దక్షిణాన 15 అడుగుల ఎత్తున గుట్టలోపలికి నిలువెత్తు గుహను తొలిచి, మూడు స్తంభాలపై ఆలయ పైకప్పు ఉన్నట్లు తీర్చిదిద్ది ఆలయం లోపల ఈశాన్యం మూలలో త్రిమూర్తుల రేఖా చిత్రాలను, మధ్యలో శివలింగాన్ని చెక్కారు. స్తంభాలు అజంతా స్తంభాలను పోలి ఉన్నాయి. కాబట్టి, ఈ ఆలయ చరిత్ర సుమారుగా వేయిన్నర సంవత్సరాలనాటిదని చెప్పవచ్చు. ఆలయం ముందు వాయువ్యంలో జలపాతం తుంపర్లలో తడుస్తున్న బండకు పద్మాసన స్థితిలో కూర్చున్న జైన తీర్థంకర విగ్రహం, దానికి కుడివైపున నాగబంధం, నెమలి, సూర్యచంద్రుల శిల్పాలు చెక్కి ఉన్నాయి. ఈ ఆలయ సముదాయ శిల్పాలను స్థానికులు గొల్లభామలు అంటున్నారు. జలపాతపు కొండపైన శిథిలమైన 'బయ్యన్నగుడి' అనే జైన దేవాలయం ఉంది. ఈ జైన వాస్తు శిల్ప సాంప్రదాయం రాష్ట్రకూట రాజుల కాలానిది (క్రీ.శ.8-10 శతాబ్దాలది) అయ్యుంటుంది.

బయ్యన్నగుడికి అల్లంత దూరంలో 'మామిడికుంట' అనే చెరువుంది. దాని పరిసరంలో సుమారు రెండు వందల ఎకరాల భూమి ఉంది. దాన్నంతటినీ సాగు చేయవచ్చు. కాబట్టి ఈ మధ్య కాలంలో ఉపాధి హామీ పథకం కింద గ్రామస్థులకు కూలీలిచ్చి కొన్ని ఎకరాల భూమిని సేద్యయోగ్యం చేయించారు. ఫలితంగా ప్రస్తుతం సుమారు 20 ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తున్నారు కూడా. అక్కడికి వెళ్ళేందుకు కూడా కొండ మీదకి ఏటవాలును బట్టి రైతులు, పశువులు వెళ్ళే మార్గం కూడా ఏర్పరచుకున్నారు. కొండపైన ఇలా వందల ఎకరాల సమతలం ఉండడం, మిగతా ప్రపంచంతో మాత్రం ఏమాత్రం సంబంధం లేకుండా ఉండడం. ఇవన్నీ చూస్తే

'ఆకాశంలో ఐలాండ్'ను చూస్తున్నట్లుంటుంది.

ఇక ఓపికున్నవారు ఈ జలపాతానికి దక్షిణాన కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న 'సీతమ్మ కొల్లుగుంట' అనే గుండాన్ని, ఉత్తరాన ఒక కిలోమీటరు దూరంలో ఉన్న 'పులిగుండం' అనే గుండాన్ని కూడా చూడవచ్చు. వాటి ప్రాకృతిక సౌందర్యాన్ని చూసి వాటి వద్దకు నడిచిన శ్రమను మరచిపోతాం.

## రాముని గుండాలు


రాముని గుండాల జలపాతం

రామగుండం పట్టణానికి ఆ పేరు రావడానికి కారణం ఆ పట్టణంలో ఉన్న గుట్టపైనున్న 'రామగుండం' అనే చెరువు. కొన్ని కిలోమీటర్ల పొడవుతో దక్షిణం వైపు నుంచి ఉత్తరం వైపు కొనసాగుతున్న కొండ వరుస మధ్యలో ఈ చెరువు ఉంది. వర్షాలు ఎక్కువైనప్పుడు చెరువు నిండి పొంగే ప్రవాహం ఉత్తరం వైపుకు లోయ మార్గంలో ప్రవహిస్తూ ఒక కొండ కొన మెట్ల మీద నుంచి దుంకుతూ మూడు నాలుగు దఫాలుగా చిన్న చిన్న జలపాతాల్లాగా దర్శనమిస్తుంది. ఈ జలపాతాల కింద రెండు నుంచి నాలుగు గజాల వ్యాసంతో అందమైన గుండాలేర్పడ్డాయి. ఇవే 'రామగుండాలు'. ఈ గుండాల్లో నిలబడి జలపాతాల కింద జలకాలాడడం మధురానుభూతినిస్తుంది. గుండాల ఒడ్డు మీద కూర్చుని గుండంలోకి కాళ్ళు జారవిడిచి ఆ నీళ్ళల్లో 'చలక్ చలక్' మని కొట్టడం... నడవడం... ఒకరిపై ఒకరు నీళ్ళు జల్లుకోవడం... ఈ చిలిపి చిన్నారి పనులన్నీ పెద్దలకు కూడా ఇక్కడ సాధ్యమే. గుండాల్లో నుంచి పారుతున్న నీళ్ళన్నీ ఇరుకైన రాతి లోయలో నుంచి తూర్పు వైపున కుంటలోకి చేరుతాయి. రెండు గుట్టల పాదాల మధ్య ఆ కుంట చాలా అందంగా కనిపిస్తుంది. ఆ అందాన్ని మరింత ఆస్వాదించాలంటే ఆ కుంటలో

చిన్న చిన్న బోట్లు ఏర్పాటు చేయాలి. కొండ పైనున్న గుండంలో కూడా ఈ ఏర్పాటు చేయవచ్చు. ప్రస్తుతానికైతే కొండ పైనున్న ఈ గుండంపై వరకు ఒక కిలోమీటరు దూరం వరకు ట్రెక్కింగ్ చేసి ఆనందించవచ్చు.

## పరిసరాల వైశిష్ట్యం

రాముని గుండాల వైపు వెళ్తున్నప్పుడు గుట్ట కింద తూర్పుకు అభిముఖంగా ఉన్న ఒక వీరగల్ విగ్రహముంది. స్థానిక ప్రజల సంరక్షణ కోసం శత్రు సైన్యాలతో యుద్ధం చేసి వీరమరణం పొందినవారి త్యాగాన్ని స్మరించుకోవడం కోసం మూడు నాలుగు వందల సంవత్సరాల క్రితం వరకు ఇలాంటి వీరగల్ విగ్రహాలను ప్రతిష్టించేవారు – సాధారణంగా యుద్ధం జరిగిన ప్రదేశంలోనే. ఈ విగ్రహానికి ఇప్పుడేమో భక్తులు జాజుపూసి దాన్ని హనుమంతుడుగా పేర్కొంటున్నారు. ఈ వీరగల్ విగ్రహం దాటి కొంచెం దూరం ముందుకు వెళ్ళగానే ఆరు అడుగుల ఎత్తైన ఏకశిలా వినాయక విగ్రహముంది. అది ఈ మధ్యనే వర్షాల వరదల్లో గుట్టపై నుండి కిందికి దొర్లి పడిందట. ఆ విగ్రహ శైలీ విశేషాలను బట్టి అది కనీసం వేయి సంవత్సరాలకు ముందటిదని అర్థమవుతుంది. వినాయక విగ్రహంలాగే కొండ మీద వేంకటేశ్వర విగ్రహం కూడా బయటపడిందట. అక్కడికి వినాయక విగ్రహం దాటి కొండ ఎక్కి వెళ్ళాలి. ఆ విగ్రహానికి ఆలయం కట్టించి ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం వారు ముందుకొచ్చారట. కాని స్థానిక





రాముని గుండాల పరిసరాలు

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ వారు ఆ పనిని తామే చేస్తామని ముందుకొచ్చి మూడు కోట్ల రూపాయలతో ప్రస్తుతం కొండపైకి రోడ్లు వేయిస్తున్నారు. కొండ శిఖరాగ్ర భాగాన ఒక అందమైన శిలా మండపం ఉంది. దీన్ని గౌరీ మంటపం అంటున్నారు. ఇది రోడ్ మీద ప్రయాణించే ప్రయాణికులకు కూడా కనిపిస్తుంది. ఈ రాముని గుండాల రాతి గుట్టలు చాలా ప్రత్యేకమైనవి, అరుదైన అందంతో అలరారుతున్నవి. చాలా భాగం వరకు చెట్లు లేకుండా ముడి ఇనుప గుట్టల్లాగా కన్పిస్తాయి. వీటిల్లో అక్కడక్కడా గుహలేర్పడ్డాయి. వాటిలో విగ్రహాలను పెట్టి వాటి చుట్టూ చిన్న చిన్న దేవాలయాలు కట్టారు.

మొదట ఈ ప్రాంతం నాగజాతి వారిదేమో – అందుకే నాగశిల్పాలు అరడజనుకు పైగా వివిధ రూపాల్లో ఉన్నాయి. తరువాత ఇక్కడికి రాముడు వచ్చిన నిదర్శనంగా ఇక్కడి గుండాల్లో రాముడు సీత ఆనందించారనడానికి నిదర్శనంగా ఇక్కడ రాముడు–సీత ఆలింగన శిల్పాలు అరఫీటు ఎత్తుతో కన్పిస్తాయి. రామాలయం పక్కన రామానుజస్వామి విగ్రహముంది. ఈ ఆలయాలకు ముందు శైవ తదితర శిల్పాలు, దేవాలయాలున్నాయి. వీటిల్లో ఎక్కువ శాతం కళ్యాణి చాళుక్యుల కాలంలో (క్రీ.శ.10–11 శతాబ్దాలు) కట్టినట్లు వాస్తు విశేషాలనుబట్టి తెలుస్తుంది.

ఇలా చారిత్రక ప్రాకృతిక సౌందర్యాలకు అలవాలమైన ఈ గౌరీగుండం, రాముని గుండాల జలపాతాలు ప్రకృతీ ప్రియులను అలరిస్తాయనడంలో అనుమానం లేదు.

*– సూర్య దినపత్రిక*
*28–08–2012*

5

# చంద్రశిలా శోభిత చంద్రవెల్లి గుళ్ళు

తెలంగాణా వాస్తుశిల్ప కళలకు కాణాచి కాకతీయ దేవాలయాలైతే వాటికి మచ్చుతునక రామప్ప దేవాలయం. దాన్ని చాలా మంది చూసుంటారు. శిల్పకళా రామణీయకతలో దానితో పోటిపడే దేవాలయాలు కూడా మన రాష్ట్రంలోనే ఉన్నాయి. ఇవి కరీంనగర్ జిల్లా మంథనికి సమీపంలో ఉన్న కమ్మంపల్లి గ్రామ శివారులో ఉ న్నాయి. స్థానికులు వీటిని చంద్రవెల్లి గుళ్ళు (సందరెల్ళి గుళ్ళు) అంటారు. ఆ గుళ్ళలో దొరికిన శాసనంలో కూడా చంద్రవెల్లి పేర్కొనబడింది. సమీపం నుండి మానేరు నది పారుతూ కంబం వంటి ఒక నిటారైన పెద్ద శిల వద్ద మలుపు తీసుకొని మరో 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోదావరి నదిలో కలుస్తుంది. ఈ కంబం ప్రాంతంలో ఉన్న ఊరికే కమ్మంపల్లి అనే పేరొచ్చింది.





విశ్వేశ్వరాలయ మంటపం






ఇక్కడ రెండు దేవాలయాలున్నాయి. వాటి మధ్య దూరం సుమారు 150 మీటర్లుంటుంది. ఈ ఖాళీ స్థలంలో గోదుమ వర్ణపు మంచి రాయి ఉంది. దాన్ని వెలికి తీసి ఆ రాతితో ఈ దేవాలయాలను కట్టారు. కట్టించింది – విశ్వేశ్వర శివాచార్యులు. ఈయన క్రీ.శ.1199 నుండి 1262 మధ్య తెలుగు దేశాన్ని పాలించిన ఓరుగల్లు కాకతీయ రాజు గణపతిదేవునికి గురువు. రోడ్ పక్కనున్న ప్రధాన దేవాలయంలోని మూల విరాట్ పేరు విశ్వేశ్వర స్వామి అని శాసనంలో పేర్కొనబడింది.

ఈ విశ్వేశ్వరాలయం త్రికూటాలయం. అంటే ఒకే విశాలమైన మంటపానికి మూడు వైపులా మూడు ఆలయాలుండడం. ప్రధాన ఆలయం ప్రధాన ద్వారం తూర్పువైపు ఉంది. ఫర్లాంగు దూరంలోనే ఉన్న మానేరు నదిలో భక్తులు, తపోధనులు, బ్రాహ్మణులు అధిక సంఖ్యలో స్నానం చేసి వచ్చి స్వామివారిని అర్చించేవారని, స్వామివారి అంగరంగ భోగాలతోపాటు అలాంటివారి సౌకర్యాల కల్పనకు కూడా విశ్వేశ్వరాచార్యులు దానాలు చేశారని శాసనంలోనే ఉంది.

ఇక్కడి రెండు ఆలయాల గోడలు, పట్టీలు, స్తంభాలు, కప్పులు, ద్వారాలు, ద్వారాలపై కమ్మీలు మొదలుకొని ప్రతి శిల ప్రతి అంగుళం వెన్నపూసలు మలచబడ్డట్లే అనేక రూపలావణ్యాలతో మలచబడ్డాయి. ఆయా శిల్పాల సౌందర్యం చూపరులకు ఒక జీవితకాలపు నేత్ర పర్వాన్ని మిగులుస్తుంది. స్తంభాల కింది భాగంలో చెక్కిన




నాట్యకత్తెల శిల్పాలు, పై భాగాల్లో శిల్పించిన హంసలు, చిలుకలు, కీర్తిముఖాలు, ఆలయ ద్వారాలపై చెక్కిన త్రిమూర్తులు తదితర శిల్పఖండాలు రామప్ప శిల్పాలను సైతం సౌందర్యంలో తక్కువ చేస్తాయి.



ఇంతటి అందమైన, శిల్పకళా శోభితమైన ఆలయాలను ఇప్పుడు మనం దశాబ్దకాలం పాటు కొన్ని కోట్లు ఖర్చు పెట్టి కృషి చేసినా కట్టలేము కాబట్టి శిథిలావస్థలో ఉన్న వాటిని కొంచెం ఖర్చుతో పునరుద్ధరించుకుంటే మన అద్భుత కళా వారసత్వాన్ని కాపాడుకున్నవాళ్ళమవుతాం.

**ఇలా వెళ్ళాలి:**

చంద్రవెల్లి గుళ్ళు హైదరాబాద్‌కు సుమారు 250 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఎటు నుంచి వెళ్ళేవారైనా ముందు మంథని చేరుకుని, అక్కడి నుంచి సుమారు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గుళ్ళకు సొంత వాహనాల్లోగాని, బస్సులు, ఆటోల్లో గాని వెళ్ళవచ్చు. రైలు సౌకర్యం ఈ గుళ్ళకు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దపల్లి / రామగుండం వరకు ఉంది. సమీపంలోని మంథనిలో తిండి, వసతి సౌకర్యాలు లభిస్తాయి. మంథని కూడా చారిత్రక ఆలయాలకు, సమీప గోదావరిలో జరిపే కర్మకాండలకు ప్రసిద్ధి.

*– నమస్తే తెలంగాణ ఆదివారం అనుబంధం*
*(ప్రచురణలో ఉంది)*

## 6

డా. ద్యావనపల్లి సత్యనారాయణ

# షితాబ్ ఖాన్ మహల్




కాకతీయ కట్టడాల పర్యటన గాని, ప్రత్యేకించి వరంగల్ కోట పర్యటన గాని ఆ కోట మధ్యలోనే ఉన్న ఖుష్ మహల్‌ను దర్శిస్తేగాని పూర్తికాదు.

ఇది వరంగల్ కాకతీయుల కోట మధ్యలో ఉన్న కాకతీయ తోరణాలకు దగ్గరనే ఉంది. ఆ తోరణాల మధ్య దొరికిన స్వయంభు దేవాలయ శిథిల శిల్పాలను సైతం ప్రస్తుతం ఈ ఖుష్ మహల్‌లోనే భద్రపరిచారు. పర్యాటకులు వాటిని చూసి ఆశ్చర్య చకితులవుతుంటారు. లోతైన ఆలోచనల్లోకి వెళుతూ ఉంటారు.

ఖుష్‌మహల్ మరో పేరు 'షితాబ్ ఖాన్ సౌధం'. షితాబ్ ఖాన్ అనే వరంగల్ రాష్ట్రపు రాజు క్రీ.శ.1500 ప్రాంతంలో ఆ సౌధాన్ని కట్టించాడు. ఆయన అసలు పేరు సీతాపతి. ఆయన క్రీ.శ. 1504 జనవరి 21 నాడు వేయించిన శిలా శాసనం వరంగల్ కోటలోని దక్షిణ తోరణం దగ్గర దొరికింది. ఆయన మంత్రి ఎనుములూరి పెద్దన పోషణలో చరిగొండ ధర్మన్న అనే కవి 'చిత్రభారతం' అన్న అద్భుతమైన కావ్యం రాశాడు. సమకాలిక ముస్లిం చరిత్రకారుల రచనల్లో కూడా షితాబ్ ఖాన్ ప్రస్తావించబడ్డాడు.

సీతాపతి బోయ కులానికి చెందినవాడు. బోయ కులం అంటే 'భోగం కులం' అని కొందరు, 'భోజ కులం' అని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు. 'భోజ' అనేది గ్రామాధికారుల కులం. ఏదేమైనా సీతాపతే షితాబ్ ఖాన్ అయ్యాడు.

సీతాపతి తండ్రీ, అతడి తాతలు విలువిద్యలో, మల్లయుద్ధంలో నిష్ణాతులు. షితాబ్ ఖాన్ ఆ విద్యలను నేర్చుకొని క్రీ.శ.14వ శతాబ్ది చివరి దశాబ్దాల్లో ఓరుగల్లు (తెలంగాణ) రాజ్యాన్ని పాలిస్తున్న బహమనీ సుల్తానుల సైన్యంలో సైనికుడిగా చేరాడు. ఆయన తన యుద్ధవిద్యలతో వారిని మెప్పించి, ముస్లిం మతంలోకి మారి తన పేరును సీతాపతి నుండి షితాబ్ ఖాన్‌గా మార్చుకొన్నాడు. ఇలా వారి అభిమానాన్ని



షితాబ్‌ఖాన్ కట్టించిన ఖుష్ మహల్ లోపలి దృశ్యం

చూరగొని, ఓరుగల్లు దుర్గాధిపతిగా, తెలంగాణ రాష్ట్ర గవర్నరుగా ఎదిగాడు. అడ్డువచ్చిన రాజాద్రి (రాచకొండ, నల్గొండ జిల్లా) రాజులనూ జయించాడు.

తన సార్వభౌములైన ముస్లిం రాజులను సంతృప్తి పరచడం కోసం షితాబ్ ఖాన్ వరంగల్ కోటలోనే రాజ దర్బార్ కట్టించాడు. వరంగల్ కోట కొన్ని శతాబ్దాల కాలం తెలుగు వారి రాజధాని కాబట్టి ప్రజల మనోభావాలను సంతృప్తి పరచడం కోసం కూడా ఆ కోటలోనే ఈ రాజదర్బార్ కట్టడానికి ఒక ప్రధాన కారణమయ్యుంటుంది. అది తెలంగాణలోను, యావత్ తెలుగుదేశంలోనూ కట్టిన మొట్ట మొదటి ప్రజా భవనం. అందులో ప్రజలు, ప్రముఖులు షితాబ్ ఖాన్‌ను కలిసేవారు.

ప్రజలకు అందుబాటులో ఉన్న భవనంలోనే తన నివాసం కూడా ఉండాలని షితాబ్‌ఖాన్ ఆ మహల్‌లోనే రాజ గృహాలను, రాణీ వాసాలను ఏర్పాటు చేశాడు. మనం ఆ సౌధంలోకి ప్రవేశించగానే ఎడమ పక్క, కుడి పక్క, పైన కనిపించే గదులు అవే! మొత్తంగా ఈ సౌధం నిర్మాణం ఇంగ్లీష్ అక్షరం 'టీ' (క్యాపిటల్/పెద్ద అక్షరం) ఆకారంలో ఉంటుంది. నిలువు గీత అనేది పొడవైన దర్బారును సూచిస్తుంది. అడ్డ గీత రాజు, రాణి, మంత్రుల/అధికారుల నివాస గదులను సూచిస్తుంది. వీటిని దాటాకే దర్బారులోకి ప్రవేశిస్తాం. ఇంత అందమైన దర్బారు, ఇప్పటికీ నిలిచి ఉన్నది తెలుగుదేశంలో ఇదొక్కటే. 

ఈ దర్బారు పొడవు సుమారు 90 అడుగులుండగా, వెడల్పు-ఎత్తులు వరుసగా 45, 30 అడుగులుంటాయి. దర్బారు పైకప్పును కొనదేలిన ఆర్చిలు మోస్తున్నట్లుగా ఉన్నాయి. ఆర్చిల మధ్యన కర్ర దూలాలున్నాయి. నిజానికి పైకప్పును మోస్తున్నది ఈ దూలాలే. పెద్ద పెద్ద పరిమాణాల్లో కనిపిస్తున్న ఈ ఆర్చిలు కేవలం అందాన్ని అతిశయింపజేయడానికే. ఆర్చీల ముందు దర్వాజా లాంటి ఆర్చి, దాని పైన అందమైన అల్లికలతో కూడిన కిటికీలు దర్బార్ శోభను మరింత పెంచాయి.

దర్బారులోకి ప్రవేశించే ప్రాంగణం (ఎలివేషన్) మరింత అందమైంది. నిజానికిది రెండంతస్తుల్లో ఉంది. ఇందులోని రెండు వరుసల్లో ఉన్న స్తంభాలు మూడు పొడవాటి హాల్‌లను ఏర్పరుస్తున్నాయి. ఈ కింద, పైనున్న గదులు రాచ కుటుంబీకులకు చల్లని, స్వచ్ఛమైన గాలిని ఆస్వాదించేందుకు వీలుగా నిర్మించబడ్డాయి. దర్బారు హాలు మధ్యలో అందమైన నీటి కుండం ఉంది. దీన్ని అప్పుడు 'ఫౌంటేన్'గా వాడేవారు. ఇది ఆనాడు రాచవర్గ ప్రజలకు ఎంత ఆనందాన్ని, ఆహ్లాదాన్ని ఇచ్చేదో! కాబట్టే, ఈ మహల్‌కు 'ఖుష్ మహల్' అని పేరొచ్చింది. ఖుష్ అంటే సంతోషం కదా!




ఖుష్‌మహల్ ప్రాంగణంలో



ఈ మహల్ గోడలు చాలా వెడల్పుండి బలిష్టమైనవి. అవి సుమారు 77 డిగ్రీల వాలుతో ఉండి వేలాడుతున్నట్లుగా కన్పిస్తాయి. కాబట్టి, ఈ ఖుష్ మహల్ మాతృకైన మహల్‌ను 'హిందోళ మహల్' అంటారు. అంటే, 'ఊగే సౌధం' అని అర్థం. దీనిని మధ్యప్రదేశ్, గుజరాత్‌లలోని మాళ్వా ప్రాంతపు రాజధాని మాండులో హుషాంగ్ అనే రాజు క్రీ.శ.1425లో కట్టించాడు. దాని కంటే కొంచెం చిన్నది ఈ 'ఖుష్ మహల్'. కానీ, 'హిందోళ మహల్'లో లేని నీటికుండం ఖుష్ మహల్ మధ్యలో ఉంది. ఇది ఖుష్ మహల్ అదనపు ఆకర్షణ.


చారిత్రాత్మకంగా ఈ సౌధానికి మరో విశేషమూ, అందమూ ఉంది. తురక సైన్యాలు కూల్చిన, ధ్వంసం చేసిన వందలాది హిందూ దేవాలయాలను, విగ్రహాలను సీతాపతి ముస్లిం మతంలోకి మారి మరీ పునరుద్ధరించడంలోనే ఆసక్తికరమైన అందం కనిపిస్తుంది. కాకతీయులు కాలగర్భంలో కలిసిన రెండు వందల సంవత్సరాల తర్వాత కూడా ప్రజల్లో వారికున్న గౌరవాన్ని చూసి, వారు కట్టించిన దేవాలయ శిల్పాల సౌందర్యాలను చూసి ముగ్ధుడైన సీతాపతి ఖాన్ అంతే అందమైన, ఆసక్తికరమైన ఖుష్ మహల్‌ను కట్టించడంలో ఆశ్చర్యం లేదు.

షితాబ్ ఖాన్ 1515 ప్రాంతంలో ఒరిస్సాలోని కళింగ గజపతి రాజులకు విధేయుడిగా ఉన్నందుకు తెలంగాణలో తనపై దండెత్తిన మరో తెలుగువాడు శ్రీ కృష్ణ దేవరాయల సైన్యాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. తన విలువిద్యతో మొదట రాయల సైన్యాన్ని చిత్తు చేశాడు కూడా. చివరలో గుంటూరు జిల్లా పొన్నూరు ప్రాంతంలో

రాయలతో జరిగిన యుద్ధంలో ఓడిపోయాడు. కానీ, ఆయన ప్రజలకు ప్రత్యేకించి కళా పిపాసకులకు ఇచ్చిన కానుక మాత్రం కాల గమనాన్ని తట్టుకొని నేటికీ ఆలరిస్తూనే ఉంది. అదే మన ఖుష్ మహల్.

*– నమస్తే తెలంగాణ ఆదివారం అనుబంధం*

*28–04–2013*




ఖుష్ మహల్ ప్రాంగణం

7

# రామప్ప వాస్తు శిల్పాలు, పరివార దేవాలయాలు

తెలుగు దేశాన్ని పరిపాలించిన అతి గొప్ప రాజవంశం ఓరుగల్లు కాకతీయులదైతే, వారు కట్టించిన అతి గొప్ప దేవాలయం నేటికీ నిలిచి ఉన్నది రామప్ప. తెలంగాణలో ఉన్న రెండున్నర వేల ప్రాచీన దేవాలయాల్లో ఇది తలమానికమైనది. వాస్తు శిల్పాలకు మాత్రమే కాకుండా పేరిణి, కోలాటం వంటి శాస్త్రీయ, జానపద నృత్యాలకు కూడా చిరునామా రామప్ప. ఇక్కడి పాడి పంటల వృద్ధికి ఆధారభూతమైన రామప్ప చెరువు ఈ దేవాలయ ప్రాశస్త్యాన్ని మరింత నొక్కి వక్కాణిస్తుంది.



రామప్ప దేవాలయాల సమూహం, చెరువు వరంగల్ జిల్లాలోని వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో ఉంది. ఈ ప్రాంతం $18.17^0$ ఉత్తర అక్షాంశం, $70.56^0$ తూర్పు రేఖాంశం పైన నెలకొని ఉంది. ఇది వరంగల్ జిల్లా కేంద్రానికి ఉత్తరాన, గోదావరి నదికి దక్షిణాన ఎటు నుంచి చూసినా 60 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఈ ప్రాంతం చుట్టూ తూర్పు ఆగ్నేయం మొదలుకొని దక్షిణం, పడమర మీదుగా వాయువ్యం వైపు అర్ధ చంద్రాకారంలో వంపు తిరిగిన కొండల వరుసలున్నాయి. ఆ కొండల మధ్యలో ఉన్న విశాలమైన లోయలో మోరంచవాగు పారుతున్నది. దానికి అడ్డంగా రామప్ప గుడికి దక్షిణాన కొండల మధ్య తూర్పు-పశ్చిమాలుగా కట్ట నిర్మించడంతో విశాలమైన రామప్ప చెరువు ఏర్పడింది. దాని నీటి వైశాల్యం సుమారు 13 చదరపు కిలో మీటర్లు. ఈ చెరువు కింద రామప్ప ఆలయాలకు అన్ని పక్కలా ఉన్న పంట పొలాలు పర్యాటకులకు కనువిందును కలిగించే విధంగా ఉన్నాయి. ఈ పరిసరాల మధ్య సుమారు పది గుడులున్నాయి. కాబట్టి ఈ ప్రాంతాన్ని 'గుళ్ళ రామప్ప' అంటారు.

## రామప్ప నేపథ్యం

రామప్ప కట్టడాలు వరంగల్లుకు సుమారు అరవై ఐదు కిలో మీటర్ల దూరంలో పాలంపేట గ్రామంలో ఉన్నాయి. రామప్ప అనేది ఈ దేవాలయాలను కట్టించిన శిల్పి పేరని కొందరు భావిస్తే, కాదు ప్రధానాలయంలోని దేవుడి పేరు రామలింగేశ్వరుడు కాబట్టి ఈ దేవాలయానికి రామప్ప అనే పేరు వచ్చిందని మరి కొందరు అంటారు. రాముడు వైష్ణవ మత సంబంధితుడు కాగా, లింగం లేదా శివుడు శైవ మత సంబంధితుడు. ఈ రెండు మతాలను కలిపి రామలింగేశ్వర ఆలయాలను కట్టించడం అనేది విష్ణుకుండుల కాలం (క్రీ.శ.5వ శతాబ్దం) నుండి వస్తున్న ఆచారం. కాకతీయులు విష్ణుకుండి మాధవవర్మను తమ మూల పురుషుడిగా చెప్పుకున్నారు కాబట్టి, ఇప్పటికీ రామప్ప ఆలయ అంతరాళంలో విష్ణుకుండుల సాంప్రదాయ శిల్పమైన సప్తమాతృకల (హారీతి) శిల్పం కన్పిస్తుంది కాబట్టి, ఈ దేవాలయ మూలాలు విష్ణుకుండుల కాలం నుండే ఉన్నాయని చెప్పవచ్చు.

పాలంపేట, ములుగు ప్రాంతాల్లో కొన్నిచోట్ల మధ్య పాత రాతి యుగం (లక్ష సంవత్సరాల కిందిది) మొదలుకొని అంతిమ పాత రాతి యుగం, మధ్య రాతి యుగం కొత్త రాతి యుగం, రాకాసి గుళ్ళ యుగాల నాటి మానవుల స్థావరాలు, ఆయుధాలు, పనిముట్లు కూడా లభించాయి కాబట్టి, ఇక్కడ అనేక వేల సంవత్సరాల క్రితం నుంచే మానవ జీవనం వర్ధిల్లుతూ వస్తుందని చెప్పాలి. ఈ వేల సంవత్సరాల చరిత్రకు రామలక్ష్మణుల చరిత్రతో కూడా సంబంధం ఉంది. క్రీ.పూ. 5077 సంవత్సరంలో వారు ఇక్కడి అడవుల్లో సంచారని[1], ఆ క్రమంలో వారు నీటి కొరకై భూగర్భంలోకి శక్తివంతమైన బాణాలు వేసి రెండు వాగులను సృష్టించారని, అవి వారి పేర్ల మీద రామప్ప, లక్నవరం చెరువులుగా స్థిరపడ్డాయని[2] శాస్త్రీయ, జానపద పరిశోధనల సారాంశంగా తెలుస్తుంది. ఈ రెండు చెరువులు పరస్పరం ఎనిమిది కిలో మీటర్ల దూరంలోనే ఉండటం గమనార్హం.

ములుగు ప్రాంతంలో దొరికిన ప్రాచీన మానవుల పనిముట్ల ప్రాచీనత ఆధారంగా, 'ములుగు' పద ప్రాచీనత ఆధారంగా కొందరు చరిత్రకారులు శాసనాలలో "అశ్మక రాజ్యంతో కలిపి పేర్కొనబడిన 'ములక రాజ్యం' ఈ ప్రాంతమే"నని వాదించారు. ఈ రెండు రాజ్యాలు సుమారు రెండున్నర వేల సంవత్సరాల కిందటి నుండి మనుగడలో ఉన్నాయి. శాతవాహన సామ్రాజ్యంలో ప్రాంతీయ రాష్ట్రాలుగా కొనసాగాయి. శాతవాహన సామ్రాజ్యం కూడా రెండు వేల ఏళ్ళ నాటిది. ఆ తరువాత రామప్ప ప్రాంతం విష్ణుకుండులు, చాళుక్యులు, కాకతీయుల పరిపాలనల్లో

కొనసాగింది. ఈ విధంగా ములుగు, రామప్ప ప్రాంతాలకు వేల సంవత్సరాల వైభవ చారిత్రక నేపథ్యం కూడా ఉంది.

## 1213 మార్చి 31 నాటి కట్టడాలు

రామప్పలోని ప్రధాన దేవాలయ ఆవరణలో ఉన్న సుదీర్ఘ శిలాశాసనంలో రామప్ప ఆలయ దేవతలైన శ్రీ రుద్రేశ్వర స్వామికి, కాటేశ్వర, కామేశ్వర స్వాములకు శాలివాహన శకం 1135 (వ సంవత్సరం) శ్రీముఖ నామ సంవత్సరం, చైత్ర మాసం, శుక్లపక్షం, అష్టమి తిథి, పుష్యమి నక్షత్రం ఆదివారం నాడు ఈ ఆలయాల నిర్మాత రేచర్ల రుద్రయ్య తన రాజ్యంలోని కొన్ని గ్రామాలను శాశ్వత ధర్మముగా దానం ఇచ్చినట్లు తెలుగు-కన్నడ లిపిలో రాసి ఉంది. శాసనంలో పేర్కొన్న తేదీ క్రీ.శ. 1213 మార్చి 31 అవుతుంది[3]. అప్పటికే అన్ని ఆలయాల నిర్మాణం పూర్తయింది.

రేచర్ల వంశీయులు కాకతీయుల సామంతులలో ముఖ్యమైనవారు. ఈ రెడ్ల వంశంలో ఆరవ తరానికి చెందిన రుద్ర చమూపతి అతి గొప్ప వీరుడు. గొప్ప కళాపోషకుడు. ప్రజా సంక్షేమ పక్షపాతియైన ఆర్థికవేత్త. కాకతీయ రాజుల్లో అతిగొప్ప రాజు గణపతి దేవుడిని రాజు కాక మునుపు మహారాష్ట్ర యాదవ రాజు జైతుగి చెర నుండి విడిపించి, ఓరుగల్లు సింహాసనంపై నిలిపి "కాకతీయ సామ్రాజ్య స్థాపనాచార్య" అనే బిరుదు పొందాడు. ఈయన వరంగల్లు జిల్లా తూర్పు ప్రాంతాలను పరిపాలించాడు. రామప్పలో తన పేరు మీద ప్రధాన దేవాలయం రుద్రేశ్వరాలయాన్ని కట్టించాడు. ఇందుకు నిదర్శనంగా ఈ ఆలయ అంతరాళపు ద్వారబంధం ఉత్తర భాగంలో "రేచర్ల రుద్రుని దంపతుల" శిల్పం చూడవచ్చు. ఇతడే తన తల్లిదండ్రులు కాటయ, కామాంబల పేరు మీద ప్రధానాలయానికి ఉత్తర దక్షిణ దిశలలో కాటేశ్వర, కామేశ్వర ఆలయాలను కట్టించాడు[4]. కామేశ్వర ఆలయం ఎడమ పక్కనున్న నరసింహాలయాన్ని[5] ప్రస్తుతం పాకశాల అంటున్నారు. ప్రధానాలయానికి ఎదురుగా ఉన్న నంది మండపంలోని నంది కాకతీయ శిల్పశైలికే తలమానికమైంది.


ప్రధానాలయం నుంచి దక్షిణంగా రామప్ప చెరువు వైపు వెళ్తున్నప్పుడు రోడ్డుకు ఎడమ పక్కనున్న పంట పొలాల్లో రెండు దేవాలయాలు శిధిలమవుతున్నాయి. చెరువు గట్టు పైకి ఎక్కగానే మరో రెండు (జంట) దేవాలయాలు శిథిలావస్థలో కన్పిస్తాయి. గట్టు పైన ఒక ఫర్లాంగు దూరం తూర్పు వైపు నడిచి చెరువు కొసను చేరుకోగానే మరో దేవాలయ శిల్పాలు జీర్ణావస్థలో కన్పిస్తాయి. వీటికి తూర్పునున్న వరహాల గుట్ట పైన ఒక శిథిలమైన కోట ఉంది. దాని మధ్య భాగాన్ని స్థానికులు కల్లము

అంటున్నారు. కల్లముపైనున్న కలశము వంటి శిల్పాన్ని కుంచము అంటున్నారు. పూర్వం బ్రహ్మారెడ్డి అనే రైతు తన జొన్న చేనులో పండిన వరహాలను (బంగారు నాణాలను) ప్రజలకు ఈ కల్లములోని కుంచముతో కొలిచి పంచాడనే ఒక జానపద జ్ఞాపకం విన్పిస్తున్నది[6]. నిజ చరిత్ర ఏమిటో తెలియదు. రామప్ప ప్రధానాలయం వెనుక పడమర వైపున ఫర్లాంగు దూరంలో మరో చిన్నదైనా అందమైన దేవాలయమున్నది. అది కూడా శిథిలమవుతున్నది. దానికి తూర్పున మరో దేవాలయ శిథిలాలున్నాయి. ఇలా ఇంకెన్ని దేవాలయాలు కాల గర్భంలో కలిసిపోయాయో తెలియదు. ఈ దేవాలయాల పేర్లేంటి? వీటిని ఎవరు, ఎప్పుడు, ఎందుకు, ఎలా కట్టించారు? అనే విషయాలు చరిత్రకు అందని విషయాలు. శిథిలమవుతున్న ఈ రామప్ప-చెరువు గట్టు ఆలయాల వాస్తు-శిల్ప వైభవాన్ని నెమరు వేసుకుంటే హృదయం చెరువవుతుంది.

## వాస్తు-శిల్పాల వైభవం

కాకతీయుల ఆలయాల్లో త్రికూటాలయాలు పేరెన్నికగన్నవి. ఐతే రామప్ప దేవాలయం మాత్రం త్రికూటాలయం కాదు. కాని మూడు ప్రవేశ ద్వారాలున్న ఆలయం. ఆలయం తూర్పుకు అభిముఖంగా ఉండగా ఉత్తర, దక్షిణ దిశల్లో కూడా ప్రవేశ ద్వారాలున్నాయి. ఇదొక ప్రత్యేకత. ప్రధాన ఆలయంలోకి ఎదరుగా ఉన్న నంది మండపం నుండి, కాటేశ్వర ఆలయం నుండి, కామేశ్వర ఆలయం నుండి





ప్రవేశించవచ్చు. ప్రధానాలయంలోకి ప్రవేశించి విశాలమైన రంగ మండపంలోకి చేరుకుంటాం. రంగ మంటపంలో జరిగే నాట్యం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను కూర్చుని తిలకించేందుకు మంటపం మూడు పక్కలా అరుగు గద్దెలున్నాయి. ఇది కూడా కాకతీయ వాస్తు ప్రత్యేకత.

రామప్ప ఆలయం ఆరున్నర అడుగుల ఎత్తైన పీఠంపై నిర్మించబడింది. ఆలయం చుట్టూ పది అడుగుల వెడల్పైన ప్రదక్షిణ పథం ఉంది. ఈ ప్రదక్షిణ పథంలో ఆలయం చుట్టూ తిరుగుతూ రామప్ప ఆలయ గోడలపైనున్న శిల్పకళా చాతుర్యాన్ని వీక్షించవచ్చు.

రామప్ప ఆలయంలో ముఖ్యంగా మూడు రకాల శిల్పాలు కన్పిస్తాయి. ఒకటి, దేవతా మూర్తుల శిల్పాలు; రెండు, ఊత శిల్పాలు; మూడు, జానపద శిల్పాలు. మొదటి రెండు తరగతులకు చెందిన శిల్పాలు నల్లరాతితో చేసినవి కాగా, మూడవ తరగతికి చెందిన శిల్పాలు స్థానికంగా లభించే ఎర్ర రాతితో చేసినవి. దేవతా మూర్తుల శిల్పాలు దేవాలయ అంతర్భాగాల్లో ఉండగా, ఊత శిల్పాలు దేవాలయం చుట్టూ గోడలు, స్తంభాల పైనున్న చూరును ఎత్తి పట్టుకున్నట్లుగా ఉన్నాయి. ఇలాంటివి ఆలయ మూడు ప్రవేశ ద్వారాలకు రెండు వైపులా రెండేసి... అలా ద్వారానికి నాలుగు చొప్పున మొత్తం పన్నెండు నిలువెత్తు శిల్పాలున్నాయి. నృత్య భంగిమల్లో ఉన్న ఈ స్త్రీ శిల్పాలను మదనికలు, సాలభంజికలు, నర్తకీమణులు తదితర పేర్లతో పిలుస్తున్నారు. కాకతీయ శిల్ప రీతికే ఇవి తలమానికాలు. ఈ మదనికల వలెనే ఆలయం చుట్టూ 28 గజ–కేసరి (ఏనుగుపై సింహాలు) శిల్పాలున్నాయి. ఇక ఆలయం చుట్టూ గోడలపై వరుసలు వరుసలుగా ఏనుగులు, వివిధ మత శాఖలు, శృంగారం, వివిధ వృత్తి పనులు, నాట్యం తదితర అంశాలను వ్యక్తపరిచే జానపద శిల్పాలున్నాయి. ఆలయం లోపలి స్తంభాలకు కూడా ఇలాంటి శిల్పాలు చెక్కారు.

నిలువెత్తు ఏకశిలా ఏనుగు విగ్రహాలు కొన్ని ప్రవేశ ద్వారాల్లో కన్పిస్తాయి. లేచి పరుగెత్తడానికి సిద్ధంగా ఉందనేట్లు చెక్కిన నంది మండపంలోని ఏకశిలా నంది విగ్రహం కాకతీయ శైలికి ప్రతీకగా వెలుగొందుతుంది. అలాగే గర్భగృహంలోని నాలుగు అడుగుల ఎత్తైన శివలింగం కూడా కాకతీయ శైలి ప్రత్యేకతను చాటి చెప్తుంది. రంగ మండపం నైరుతి స్తంభానికి చెక్కిన రతీ మన్మధులు, పాల సముద్ర మథనం, వాయువ్య స్తంభానికి చెక్కిన గోపికలు–కృష్ణుల మధుర భక్తి శిల్పాలు నాలుగు అంగుళాల ఎత్తులోనే ఎంత అందాన్ని, నైపుణ్యతను వ్యక్తపరుస్తాయో చూస్తేనే అర్థమవుతుంది. నైరుతి, ఈశాన్య స్తంభాల శిల్పాల మధ్య సూది మాత్రమే దూరేటంత సన్నని రంధ్రాలను తొలవడం శిల్పి నైపుణ్యానికి గీటురాయి. అలాగే అంతరాళ ద్వారపు దక్షిణం వైపున

తాకితే సప్తస్వరాలు పలికే శిలా వృక్షాన్ని శిల్పించడం శిల్పి అనన్య సామాన్య ప్రతిభకు తార్కాణం. అయితే ఈ శిల్పం మీదనే ఒక సన్యాసి అంగాన్ని చూషణ చేస్తున్న శిష్యుని శిల్పాన్ని చెక్కడంలో శిల్పి ఆంతర్యమేమిటో అంతుబట్టదు.

## పేరిణి నృత్య శిల్పాలు

ఇటీవలి కాలం వరకు ఆంధ్రప్రదేశ్ నాట్యంగా పేరొందింది కూచిపూడి నాట్యం. అయితే దాని చరిత్రని ఎంత శోధించినా నాలుగైదు వందల సంవత్సరాల కంటే వెనుకకు పోవడం లేదు అని ప్రముఖ పరిశోధకుడు ఆరుద్ర తేల్చి చెప్పారు[7]. ఇక క్రీ.శ.1213 కంటే ముందే మనుగడలో ఉన్న పేరిణి నృత్యం గురించైతే మనకు కనీసం తెలియను కూడా తెలియకపోవడం మరీ విచారకరం. పేరిణి నృత్యం ఒక జానపద లేదా దేశి నృత్యమని చెప్తూ, దాన్ని ఒక ప్రత్యేక ప్రకరణంలో వివరించాడు జాయప సేనాని – తన 'నృత్తరత్నావళి'లో. ఈయన గణపతిదేవ చక్రవర్తికి బావమరిది మాత్రమే కాకుండా ఆయన గజ సాహిణి (గజ సైన్యాధిపతి) కూడా.



క్రీ.శ. 1200ల ప్రాంతంలో రాజకీయ, మత రంగాల్లో విపరీతమైన మార్పులు చోటు చేసుకున్నాయి. కాకతీయ రాజ్యాన్ని మహారాష్ట్ర యాదవ రాజులు ఓడించి రాకుమారుడు గణపతిదేవుని బందీ చేశారు. కర్ణాటకలో ప్రజ్వరిల్లిన వీరశైవ మతం ఇతర మతాల హింసను కూడా ప్రోత్సహించింది. వీరశైవ మత ప్రభావం వల్లనే కాకతీయులు జైనమతం నుండి శైవానికి మారి తెలుగు దేశమంతటా శైవాలయాలు కట్టించారు. ఈ రాజకీయ, మత మార్పులు దేశభక్తిని, దైవభక్తిని వీర రసంతో మేళవించి పెంపొందాయి. ఫలితంగా, పౌరుల్లో... ముఖ్యంగా యువకులను ఉత్తేజితులను చేయడానికి 'ప్రేరణ' అనే ఒక కొత్త నృత్య రీతి పురుడు పోసుకుంది. ఇది అప్పటికే ఆచరణలో ఉన్న కొన్ని ఆటవిక, జానపద నృత్యరీతులను వీరరస ప్రధానంగా తీర్చిదిద్దగా ఏర్పడింది. శివుడు నటరాజుగా ప్రతిపాదించిన నాట్యరీతిగా ప్రచారంలోకి వచ్చింది.

'ప్రేరణ' అనే పదం రూపాంతరం చెంది పేరిణి అయ్యింది. పేరిణి శిల్పాలు రంగమంటపం ఆగ్నేయ స్తంభానికి, ఉత్తర దూలానికి, పైకప్పుకు, ఆలయ అంతరాళ ద్వారానికి ఇరువైపులా చెక్కబడి ఉన్నాయి. స్తంభాలు-చూరుల మధ్య చెక్కిన మదనికల (ఊత) శిల్పాలలో కూడా కొన్ని పేరిణి శివతాండవ శిల్పాలే.



రంగ మంటపం ఆగ్నేయ స్తంభానికి చెక్కిన ఒక పేరిణి నృత్య శిల్పంలో 'శివప్రియ' నాట్య భంగిమ కన్పిస్తుంది. ఈ శిల్పంలో ముగ్గురు స్త్రీలు నాలుగు కాళ్ళతో నాట్యం చేస్తున్నట్లుగా శిల్పించబడ్డారు. మధ్యలో ఉన్న స్త్రీ కుడి కాలు తనకు కుడి వైపునున్న స్త్రీకి ఎడమ కాలు కాగా, ఎడమ వైపున్న స్త్రీకి తన ఎడమ కాలు ఆమె కుడి కాలు అయినట్లుగా శిల్పించబడింది. ఈ శిల్పంలో ఒకే స్త్రీ వీర రసంతో వేగంగా నాట్యం చేస్తుండగా ప్రేక్షకులకు మూడు రూపాలుగా కన్పిస్తుందన్న భావాన్ని వ్యక్తపరిచాడేమో శిల్పి.

రంగ మంటపం ఉత్తర దూలానికి గజాసురుని భక్తికి వశుడై అతని పొట్టలో బంధించబడిన శివుడు ఎనిమిది చేతులతో నాట్యం చేస్తున్న నటరాజుగా శిల్పించబడ్డాడు. ఈ శిల్పంలో కన్పించే కటి వస్త్రం, భుజ కిరీటాలను పేరిణి నృత్య ఆహార్యంలో వాడుతారు. రంగ మండపం కప్పుకు కూడా పది చేతులతో నర్తిస్తున్న నటరాజ శిల్పం అత్యద్భుతంగా చెక్కబడింది.

అంతరాళ ద్వారానికి రెండు వైపులా రెండు దీర్ఘ చతురస్రాకార శిల్ప పలకలు ఉన్నాయి. వీటికి మృదంగాన్ని వాయిస్తున్న, వాయిద్యానికి అనుగుణంగా నాట్యం చేస్తున్న స్త్రీ-పురుషుల శిల్పాలు చెక్కబడ్డాయి. ఇవి పేరిణి శివతాండవానికి చెందిన

వివిధ భంగిమలను ప్రతిఫలిస్తున్నాయి.

రంగ మంటపానికి మరో పేరు నాట్య మంటపం. ఈ మంటపం మధ్యలో గుండ్రని ఏకశిలా వేదిక ఉంది. ఈ వేదికపైన దేశంలో పేరొందిన నాట్యకత్తెలు, గణికలు నృత్యం చేసేవారు. వారికి ఆనాడు సమాజంలో చాలా గౌరవం ఉండేది. కాకతీయ సామ్రాజ్యం చివరి చక్రవర్తి రెండవ ప్రతాపరుద్రుని భార్యల్లో ఒకామె పేరు మాచల్దేవి. ఆమె తెలుగు దేశమంతటా ప్రఖ్యాతి గాంచిన నాట్య కళాకారిణి. సకల కళా వల్లభురాలు. ఆమె ఇక్కడి రంగ మంటపంలో నాట్యం చేసి ఉంటుందని చెప్పడంలో అతిశయోక్తి ఏమీ లేదు.

మదనిక శిల్పాలు పన్నెండూ పన్నెండు పేరిణీ నృత్య భంగిమలను తెలిపేవే అని వాదించేవారు కూడా కొందరున్నారు. వాటిల్లో ఒక స్త్రీ శిల్పం ఆటవిక నృత్య రీతిని తెల్పేదిగా ఉంటే, మరొకటి శాస్త్రీయ నృత్య భంగమలో ఉంది. ఒక శిల్పం గణిక ఆహార్యంతో రాజ సభలో నాట్యం చేస్తున్నట్లుగా చెక్కబడగా, మరొకటి నాగిని నాట్యం చేస్తున్నట్లుగా చెక్కబడింది. ఇటీవలి కాలం వరకు కూడా తెలంగాణలో పెళ్ళి మేళాలలో బాజా భజంత్రీలు, సన్నాయిల మోతలకు అనుగుణంగా ప్రత్యేకంగా భూమిపై పాములా దొర్లుతూ నాట్యం చేసే సాంప్రదాయం కొనసాగడాన్ని బట్టి నాట్య నాగిని శిల్ప ప్రాశస్త్యాన్ని అర్థం చేసుకోవచ్చు. 

ఈ శిల్పాలన్నింటికీ చిన్న లంగా (మినీ స్కర్ట్) వంటి కటి వస్త్రం ఉండడాన్ని గమనించవచ్చు – ఒక నాగిని శిల్పానికి తప్ప. ఇలాంటి వస్త్రాన్నే పేరిణి నృత్య ఆహార్యంగా వాడుతారు. ఒక నర్తకి శిల్పానికి 'ఎత్తు మడమల చెప్పులు' (హై హీల్స్) ఉండడం ఆసక్తిని రేకత్తిస్తుంది. ఒక నర్తకి కటి వస్త్రాన్ని ఒక వానరుడు లాగగా ఆమె మర్మాంగం బయటపడుతున్నట్లు ఒక శిల్పం చెక్కబడింది. నాగ నాట్యకారిణి పూర్తిగా నగ్నంగా అత్యంత నునుపుగా ఉంది. దాని అందానికి ముగ్ధుడైన ఒక నిజాం ప్రభుత్వ అధికారి సుమారు వందేళ్ళ కిందట ఈ శిల్పాన్ని తన ఇంట్లో పెట్టుకున్నాడట. పీడ కలలు రావడంతో మళ్ళీ ఇక్కడికి తెచ్చి పెట్టాడట. ఈ శిల్పం ఇప్పటికీ ఎంతో మంది కవులు, గాయకులు, కళాకారులను అలరిస్తూనే ఉంది. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సినారె గారి దృష్టినీ ఆకర్షించి ఆయన చేత 'నాగినివో భోగినివో, నాట్యకళా విలాసినివో' అనే సినిమా పాటను రాయించడం ఈ శిల్ప ఘన చారిత్రకాంశాలలో ఒకటి మాత్రమే.

ఎక్కడో విదేశంలో ఉన్న నటరాజ రామకృష్ణ ఇక్కడికి వచ్చి, పైన పేర్కొన్న నృత్య శిల్పాలతో పాటు రామప్ప గుడిలోని మరెన్నో శిల్పాలను పరిశీలించి,

పరిశోధించి, వాటిని 'నృత్తరత్నావళి'లోని పేరిణి నృత్య భంగిమలతో పోల్చి చూసి ఏడు వందల ఏళ్ళనాటి పేరిణి నృత్యాన్ని పునరుద్ధరించగలిగాడు. దానికి ప్రభుత్వ గుర్తింపు తేగలిగాడు[8]. ఇదంతటికీ రామప్ప శిల్పాలు ఆధారభూతాలు కావడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణం.

## జానపద శిల్పాలు

జానపద శిల్పాలు అంటే సామాన్య ప్రజల జీవన విధానాన్ని తెలిపే శిల్పాలని, అంతగా శిల్ప శాస్త్రం తెలియని సామాన్య శిల్పులు చెక్కిన శిల్పాలు అని రెండు అర్థాలున్నాయి. ఇవి రామప్ప ఆలయం చుట్టూ గోడలపైన ఉన్నాయి. ఆలయం చుట్టూ ఒక వరుసలో ఏనుగులు శిల్పించబడగా, వాటి పైన వరుసలో వజ్ర బంధాలు చెక్కబడ్డాయి. ఈ రెండు వరుసల మధ్యనున్న వరుసలో వివిధ మతాలకు చెందిన శిల్పాలు, వేట దృశ్యాలు, ఇతర జీవన విధాన దృశ్యాలు చెక్కబడ్డాయి. ఆలయం పడమటి వైపు గోడకు చెక్కిన నాలుగు శిల్పాల్లో మొదటి దానిలో స్త్రీ-పురుషుడు ప్రేమించుకోవడం, రెండవ దానిలో పురుషుడు శృంగారానికి ఉద్యుక్తుడవడం, మూడవదానిలో స్త్రీ ఉద్యుక్తురాలవడం, నాల్గవదానిలో ఇద్దరూ సంగమించడం శిల్పించబడ్డాయి.





జానపద నృత్యాల్లో తెలంగాణలో అత్యంత ప్రధానమైనదీ, ప్రాచీనమైనదీ కోలాటం. ఈ కోలాట దృశ్యాలు అత్యంత మనోహరంగా రామప్ప దేవాలయ గోడలకు చిత్రించబడ్డాయి. రంగమంటపపు నైరుతి స్తంభానికి కూడా ఈ కోలాట దృశ్యాలు చెక్కి ఉన్నాయి. మార్చి నెలలో వచ్చే కాముని పౌర్ణమికి మూడు వెన్నెల రాత్రుల్లో తెలంగాణలో జాజిరి పాటలతో కోలాటం ఆడి పౌర్ణమి నాడు కామ దహనం చేయడం ఆచారంగా వస్తున్న విషయం ఇక్కడ గమనార్హం.

## పాడి పంటల ప్రాధాన్యత

కాకతీయ రాజులు స్థానికులు కాబట్టి స్థానిక ప్రజల సంక్షేమం కోసం ఎన్నో నిర్మాణాలు చేపట్టారు. వాటిల్లో తలమానికమైనవి వారు తవ్వించిన చెరువులు. వారి కాలంలో తవ్వించిన వేల కొలది చెరువులను రక్షించుకుంటే చాలు మన వ్యవసాయ రంగానికి మరో ప్రాజెక్టు కొత్తగా కట్టవలసిన అవసరమే లేదనేది నిపుణుల అంచనా. ప్రజలకు ముందు తిండి కావాలి. ఆ తరువాతే మతం. కాబట్టి రేచర్ల రుద్రుడు రామప్ప గుడికి దక్షిణం మీదుగా ఒక కిలో మీటరు దూరంలో కొండల మధ్య ఆనకట్ట కట్టించి పెద్ద తటాకాన్ని ఏర్పరచాడు. దీనికి కూడా రామప్ప చెరువు అనే పేరే వచ్చింది. ఇది ఈ రోజు వరకు కూడా ఆరున్నర వేల ఎకరాల భూమికి సాగు నీటిని అందిస్తుంది.

63



రామప్ప చెరువు గట్టు ఈశాన్య మూలలో పాడి పంటల ప్రాధాన్యాన్ని తెలిపే దేవాలయాన్ని కట్టించారు. అందులో ఇటీవలి కాలం వరకు స్థానికుల చేత వేశ్య(లంజ)గా పిలువబడిన ఒక నగ్న సుందరి శిల్పం ఉండేది. నిజానికది వేశ్యది కాదు అనేది మేధావుల అభిప్రాయం. ఆ శిల్పానికున్న స్తన సంపద, నగ్నత్వం (మర్మ అవయవాలు) పాడి పంటలు, సంతాన సృష్టి, అభివృద్ధిలను తెలిపే సంకేతాలు. దురదృష్టవశాత్తు దుండగులు ఈ అందమైన విగ్రహాన్ని ధనం దొరుకుతుందనే ఆశతో ధ్వంసం చేశారు.

ఈ చెరువు గట్టు ఆలయంలోని ఒక స్తంభం కింది భాగంలో ఒక శిల్పం ఉ

ంది. అందులో ముగ్గురు స్త్రీలను నగ్నంగా శిల్పించారు. ఒక స్త్రీని పాల కుండను వంపుతున్నట్లు, మరొక స్త్రీని పంట కంకిని పట్టుకున్నట్లు చెక్కారు. మధ్యలో ఉన్న స్త్రీ పంటను మోసుకొస్తున్నట్లుగా చెక్కబడింది. ఈ విధంగా రామప్ప ప్రాంతం వాస్తు-శిల్ప కళా కౌశలాలకే కాకుండా, కాసులు పండించే పాడిపంటల అభివృద్ధికి కూడా నిదర్శనంగా నిలుస్తుంది.

## రామప్పలోని చిన్న దేవాలయాలు

రామప్ప దేవాలయానికి నైరుతిలో అర కిలో మీటరు దూరాన ఒక శివాలయము ఉంది. ఈ ఆలయంలో ఉన్న 20 అడుగుల చతురస్రాకార మంటపానికి మూడు పక్కలా 6.9 అడుగుల చతురస్రాకార గర్భగృహాలు, అంతరాళాలున్నాయి. వాస్తు, అలంకరణ లక్షణాలలో ఈ ఆలయం రామప్ప ప్రధానాలయాన్ని పోలి ఉంది. మంటప ఆవరణ చుట్టూ లోపల, వెలుపల ఉన్న జాలీలకు చెక్కిన శిల్పాలు నాటి శిల్పుల అద్భుత పనితనానికి నిదర్శనాలు. గర్భగృహాల దర్వాజాల పక్క దూలాలు, పై దూలాలు, పట్టీలు చాలా సమృద్ధిగా శిల్పాలంకృతాలయ్యాయి. వాటి పక్కల ఉన్న జాలీలు అద్భుతమైన సున్నితత్వంతో ఒప్పారుతున్నాయి. ఆలయం చుట్టూ రకరకాల శిల్పాలు చెక్కిన రాతి పట్టీలున్నాయి. అలా తూర్పు వైపున్న గోడకు కింది నుంచి పై వరకు కింద పేర్కొన్న శిల్పాల పట్టీలున్నాయి.



1. గూళ్ళల్లో దేవతలు
2. పూవుల వరుసలు
3. పౌరాణిక గాథలు
4. ఆకుల వరుసలు
5. జాలీలు

అలాగే పశ్చిమం వైపున్న గోడకు ఈ కింద పేర్కొన్న శిల్ప పట్టీలున్నాయి.

1. పూవుల వరుసలు
2. గూళ్ళల్లో కూర్చున్న దేవతలపై వివిధ రకాల శిఖరాలు
3. ఆకుల వరుసలు
4. వ్యాళీలు
5. హంసల వరుసలు
6. జాలీలు

ఆలయ చజ్జలు కూడా శిల్పాలంకృత శోభితాలు. తూర్పు వైపున్న ప్రవేశ ద్వారం అందమైన చూరుతో అలరారుతున్నది. గర్భగుడిలోని శివ లింగాలు ఇప్పుడు లేవు. నంది దూరంగా పడేసి ఉంది.

రామప్ప ప్రధానాలయానికి వాయువ్యంలో సుమారు ఒక కి.మీ. దూరాన ఒక దేవాలయ శిథిలాల మధ్య కుప్ప తాడిచెట్లు, ఇతర చెట్ల పొదల మధ్య కప్పబడిపోయి కనిపిస్తుంది. ఈ ఆలయం ముందు 23.6 x 24.6 అడుగుల పొడవు-వెడల్పులతో కూడిన మండపముంది. దానిని ఆనుకొని 9.3 అడుగుల చతురస్రాకారపు అంతరాళం, దాని వెనుక అదే ప్రమాణములో గర్భగృహము ఉన్నాయి. ఈ ఆలయం ముందు 10.9 అడుగుల చతురస్రాకారపు నంది మండపముంది. ఈ ఆలయ ప్రమాణాన్ననుసరించి అందమైన శిల్పాలున్నాయి. ఈ ఆలయ ద్వారానికి శిల్పాలు చెక్కడం పూర్తి కాలేనట్లు కన్పిస్తుంది. ఇతర ఆధారాలను బట్టి కూడా ఈ ఆలయ నిర్మాణం పూర్తి కాలేదనే అన్పిస్తుంది.

రామప్ప దేవాలయానికి దక్షిణం వైపున సుమారు కిలో మీటరున్నర దూరంలో ఉన్న రామప్ప చెరువు కట్ట పశ్చిమ కొసన ఒక దేవాలయం, తూర్పు కొసన ఒక దేవాలయం ఉన్నాయి. పశ్చిమ కొసనున్న దేవాలయం చెరువులో ప్రతిఫలిస్తూ అందంగా కన్పిస్తుంది. ఈ ఆలయంలో రెండు గర్భగృహాలు విడివిడిగా ఉన్నాయి. వాటి ముందు అందంగా చెక్కిన ద్వారపాలకుల శిల్పాలున్నాయి. ఈ గర్భగృహాల ముందున్న అంతరాళాలు కూడా సున్నితమైన జాలీ శిల్పాలతో అలంకరించబడ్డాయి. ప్రధాన ఆలయంలో ఉత్తరం, దక్షిణం, పడమర దిశల్లో మూడు గర్భగృహాలున్నాయి. వాటి ముందున్న అంతరాళాల ముందు 25.6 అడుగుల చతురస్రాకారపు మంటప ఆవరణ ఉంది. దాని ముందు తూర్పుకు అభిముఖంగా చూరు మంటపం (పోర్టికో) ఉంది. ఈ ఆలయంలోని శిల్పాలు అద్భుతంగా ఉన్నాయి. పశ్చిమ గర్భగృహపు దర్వాజాకు ఉన్న ఒక రాతి పట్టీకి చెక్కిన అరి కాలి ముల్లు తీసుకుంటున్న యువతి శిల్పమైతే మరీ ఆసక్తికరంగా ఉంది. అ యువతిలో జవసత్వాలు తొణకిస లాడుతున్నాయి. ఈ ఆలయ గోడల్లో ఉన్న గూళ్ళల్లో విష్ణు, లక్ష్మీ, గణపతి, మహిషాసుర మర్ధిని విగ్రహ మూర్తులున్నాయి.

రామప్ప చెరువు కట్ట తూర్పు కొసనున్న దేవాలయానికి నిజాం హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపనుల శాఖ మరమ్మత్తులు చేయించడం వల్ల దాని కళాత్మక, పురావస్తు విలువలు చాలా వరకు కనుమరుగయ్యాయి. ఈ ఆలయం 8 అడుగుల ఎత్తైన ఉపపీఠం మీద ఉంది. ఉపపీఠం పూవులు, జంతువుల శిల్పాలతో

అలంకరించబడింది. పశ్చిమాభి ముఖంగా ఉన్న ఈ ఆలయం గర్భగృహం (10.3 x 9.8 అడుగులు) ముందు 25.9 x 23.9 అడుగుల పొడవు, వెడల్పులతో కూడిన మంటప ఆవరణ ఉంది. దానికి మూడు పక్కలా (ఉత్తరం, దక్షిణం, పశ్చిమం) ప్రవేశమార్గపు చూరులున్నాయి. మంటపపు మధ్యనున్న నాలుగు స్తంభాల అడుగు భాగాల్లో చెక్కిన వాయిద్యకారులు, నృత్యకారిణుల శిల్పాలు వివిధ భంగిమల్లో అందంగా ఉన్నాయి. ఒక శిల్పంలో ఉన్న ముగ్గురు యువతుల నగ్న శిల్పాలు పాడిపంటల అభివృద్ధి కాంక్షను సూచిస్తున్నాయి. గర్భగృహపు ప్రవేశ ద్వారానికి ఇరువైపులా ఉన్న నిలువు దూలాల పట్టీలకు కూడా వాయిద్యకారులు, నృత్యకారిణుల శిల్పాలున్నాయి. ద్వారం పై దూలాలేమో చిన్న చిన్న శిఖరాలతో అలంకరించబడ్డాయి. ద్వారానికి ఇరుపక్కలా జాలీలున్నాయి. ఆలయ పై కప్పు కింద పూల దళాలున్నాయి.

రామప్ప ప్రధాన దేవాలయానికి పశ్చిమంలో అర కిలో మీటరు దూరంలో ఒక పాడుపడిన గుడి ఉత్తరాభిముఖంగా ఉంది. దాని శిఖరం మాత్రం ప్రత్యేకంగా చెప్పుకోదగినంత అందంగా ఉంది. ఆలయం కప్పు నుంచి పైకి పోతున్నకొద్దీ శిఖరం పరిమాణం తగ్గుతూ మొత్తంగా పిరమిడ్ ఆకారాన్ని పోలి ఉంది. శిఖరపు అంతస్థులు అర్ధ చంద్రాకారపు రాళ్ళతో అలంకరించబడ్డాయి. రెండవ అంతస్థు నుంచి ఒక రాతి దూలం మిగతా అంతస్థుల మీదుగా పై కొస వరకు పోయింది. శిఖరం పైన కిరీట స్థానంలో సమతలంగా ఉన్న చతుర్భుజ ఆకారపు రాయి ఉంది. దానికి బొట్టు స్థానంలో ఒక అలంకరణ శిల్పముంది.



రామప్ప చెరువు కట్టకు తూర్పున దానిని ఆనుకొని ఒక గుట్ట ఉంది. దాని పేరు 'వరహాల గుట్ట'. ఆ గుట్ట పరిసరాల్లో బంగారు నాణాల నిధులు (వరహాలు) దొరుకుతాయని ఆ గుట్టకు ఆ పేరు వచ్చింది. ఆ గుట్టపైన ఒక కోట ఉంది. దానిని స్థానికులు కళ్ళము (కల్లం) అంటారు. దాని మధ్యలో నల్లరాతి కుండ వంటి శిల్పము బోర్లించబడి ఉంది. దానిని 'కుంచము' అంటారు. పూర్వ కాలంలో అనుముల బ్రహ్మారెడ్డి అనే రైతు తన బండి కాడి రంధ్రం నుండి ఒక నల్ల పిట్ట ఈగి పోయిన శుభ ముహూర్తంలో తన చేనులో తెల్లజొన్న విత్తనాలు వేశాడట. జొన్న మొలకలు పెద్దవై పంటకు వచ్చినప్పుడు చూస్తే వాటి వెన్ను పొట్టల నిండా వరహాలున్నాయట. వాటన్నింటిని కోయించి, ఇక్కడి కళ్ళంలో శుద్ధి చేయించి ఇక్కడే కనిపించే నల్లని కుంచంతో ప్రజలకు వరహాలు కొలిచి పంచాడట. ఈ కథలో కనిపించే బ్రహ్మారెడ్డి రామప్ప ఆలయ నిర్మాత ఐన రేచర్ల రుద్రుని వంశ మూల పురుషుడుగా రామప్ప శిలా శాసనంలో పేర్కొనబడ్డాడు. ఇక్కడి కోట ఆయన మొదటి సైనిక స్థావరమని చెప్పవచ్చు.

## చిన్న శాసనాలు

రామప్ప శాసన మంటపంలో ఉన్న శిలా శాసనం కాకుండా మరో నాలుగు చిన్న శాసనాలు రామప్ప గుడిలో మంటపం పశ్చిమపు గోడకు చిత్రించిన గౌరీ దేవతకు నాలుగు దిక్కులా చెక్కి ఉన్నాయి. వాటిలో పెద్ద శాసనం సంస్కృత భాషలో, తెలుగు లిపిలో చెక్కబడింది. రెండవ శాసనం నంది నాగరి లిపిలో విభిన్నమైన సంస్కృత భాషలో చెక్కి ఉంది. రెండవ శాసనంలోని అంశమే మూడవ శాసనంలో సంస్కృతంలో పెద్ద పెద్ద అక్షరాలలో చెక్కబడింది. నాల్గవ శాసనం తెలుగు భాషలో, తెలుగు లిపిలోనే ఉంది. దీనిలో దేవత పేరు గౌరి అని మాత్రమే ఉంది. మిగతా మూడు శాసనాల్లో ఆనాడు వాడుకలో ఉన్న తెలుగు, నంది-నాగరి లిపుల్లో, తెలుగు, సంస్కృత భాషల్లో 'ఓరుగల్లులోని మాచిరాజుపల్లికి చెందిన విభూతి అనేవాడు శ్రీశైలం (శ్రీగిరి-శిఖరం)లో ఉన్న శ్రీ పండితారాధ్యుని మఠంలో ఉంటున్నాడని, అతడే రామప్ప గుడిలోని గౌరీ దేవత రక్షణను పొందడానికి వచ్చాడని' ఉంది. ఆ శాసనాలు ఇక్కడ యథాతథంగా ఇవ్వడమైనది.



1) శ్రీ ఓరుంగంట్యాంతం మాచిరాజు పల్లి జని శ్రీగిరి శృంగవాసి శ్రీ పండితారాధ్య గృహస్య దాసో విభూతి గౌరాయ సిక్ శరణాగతో నః.

*అనువాదం: ఓరుగల్లులోని మాచిరాజు పల్లిలో పుట్టి శ్రీగిరి శిఖరం పైన నివసిస్తున్న శ్రీ పండితారాధ్య గృహ దాసుడు విభూతి మా దగ్గరకు గౌరీ రక్షణ పొందడానికి వచ్చాడు.*

2) శ్రీ పర్వత నివాస శ్రీ విభూతి గౌరయ శరణార్థి.

*అనువాదం: శ్రీ పర్వతం పైన నివసిస్తున్న శ్రీ విభూతి గౌరీ రక్షణను అర్థిస్తున్నాడు.*

3) శ్రీ పర్వత ని
వాస శ్రీ వి
భూతి గౌ
రయ శరణా
ర్థి

*అనువాదం: శ్రీ పర్వత నివాసస్థుడు శ్రీ విభూతి గౌరీ రక్షణను అర్థిస్తున్నాడు.*

4) ఇది గౌరయ
రూపము

*అనువాదం: ఇది గౌరీ దేవత రూపము.*

## శిథిలం కావడానికి కారణాలు

సుమారు వంద సంవత్సరాల కాలం రాజ పోషణకు, ప్రజాదరణకు నోచుకున్న రామప్ప ఆలయాలు పద్నాలుగవ శతాబ్దం ప్రారంభంలో కాకతీయ రాజ్యంపై దండయాత్రలు చేసిన ఢిల్లీ సుల్తానుల విధ్వంసకాండకు గురయ్యాయి. నాలుగైదుసార్లు అలాంటి దండయాత్రలు జరిగాయి. నీటిపై తేలే ఇటుకలతో నిర్మించిన ఆలయ గోపురం ఆ దాడుల్లో ధ్వంసమైంది. ఇక్కడి విగ్రహాలు విచ్ఛిన్నమయ్యాయి.

అయితే రామప్ప ఆలయాలు శిథిలం కావడానికి ఇతర కారణాలు కూడా ఉన్నాయి. ఆలయ నిర్మాణంలో ఇసుక పునాదులను ఉపయోగించడం కాకతీయ వాస్తు శైలి ప్రత్యేకత. అయితే ఇసుక పునాది మీద నిర్మించిన బరువైన ఆలయం ఒత్తిడికి ఇసుక అటు–ఇటు, కిందికి–మీదికి జరిగిపోయి ఆలయం కుంగిపోవడానికి కారణమయ్యింది. గత ఎనిమిది వందల సంవత్సరాల కాలంలో చోటు చేసుకున్న చిన్న చిన్న భూకంపాల తాకిడికి కూడా గురైన ఇసుక పునాది ఆలయ కుంగుదలకు అవకాశమిచ్చింది. వర్షపు వరద నీరు పునాదిని ఒరుసుకొని పారటం వల్ల కూడా ఆలయం కుంగింది. ఆలయం మీదుగా ఉన్న రామప్ప చెరువు నీటి బరువు, ఊటలు, కాలువల ప్రవాహాలు కూడా ఆలయం పునాది మీద ప్రభావం చూపాయి. ఫలితంగా ఆలయం కుంగి, వేదిక, స్తంభాలు, పైకప్పు, గోడలు పగుళ్ళు చూపాయి. కొన్ని చోట్ల విరిగిపోయాయి కూడా.

ఇక ఈ మధ్య చోటు చేసుకుంటున్న మానవ తప్పిదాలు రామప్ప కట్టడాలకు మరింత ముప్పును తలపెడుతున్నాయి. దేవాదుల ప్రాజెక్టులో భాగంగా రామప్ప ఆలయాల పక్కనే పెద్ద పెద్ద బాంబులు పేల్చడం, భూగర్భంలో సొరంగం తీయడం, గ్రానైట్ పేలుళ్ళు మొదలైనవి రామప్పకు ఆగర్భ శత్రువులుగా పరిణమించాయి. ఈ మధ్య ఈ ప్రాంతంలో నాణ్యమైన బొగ్గు నిధులున్నాయని నిర్ధారణ అయ్యింది. బొగ్గు కోసం రామప్ప కింద చేసే సొరంగాలతో రామప్ప శాశ్వతంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

## పునరుద్ధరణ ప్రయత్నాలు

రామప్ప ఆలయాలను కట్టించిన రేచర్ల రుద్రుడే ఇక్కడ వేయించిన శాసనంలో 'ఎవరికైనా తను శత్రువు కావచ్చు కాని ఈ ఆలయం కాదు, కాబట్టి దీన్ని ధ్వంసం చేయకూడదు' అని వేడుకున్నాడు. అయినా ముస్లిం సైన్యాలు చేసిన విధ్వంసకాండల్లో ఈ ఆలయం పాక్షికంగా దెబ్బతింది. అయితే మరో ఆరు వందల సంవత్సరాల తరువాత మళ్ళీ ముస్లిం రాజే (నిజాం – సుమారు వంద సంవత్సరాల కింద) రామప్ప ఆలయాలను పునరుద్ధరించేందుకు పూనుకున్నాడు. 1914లో ఏర్పడిన నిజాం రాష్ట్ర పురావస్తు శాఖ ఈ ఆలయాలను వీలైనంతగా పునరుద్ధరించింది. 1932లో పింగళి వెంకటరామారెడ్డి ఆధ్వర్యంలో ఇక్కడ కాకతీయ ఉత్సవాలు జరిగాయి. తత్పర్యవసానంగా వెలువడిన 'కాకతీయ సంచిక'లో[9] ఈ ఆలయాల ప్రాధాన్యం గురించి తెలుగు ప్రపంచానికి తొలిసారిగా తెలిసింది. 1944లో ఆలయంలో పూజారులను నియమించారు. మాజీ ప్రధానమంత్రి శ్రీ పి.వి.నరసింహారావు ఈ ఆలయం రమనీయత గురించి ఇంగ్లీషులో రాసి 'ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా'లో 1966లో ప్రచురించి[10] ప్రపంచానికంతటికీ తెలియజేశాడు.

నటరాజు రామకృష్ణ రామప్ప శిల్పాలను అధ్యయనం చేసి పేరిణి నృత్యాన్ని పునరుద్ధరించి, 1985 ఫిబ్రవరి 17 శివరాత్రి పండుగనాడు ఇక్కడ వేల మంది సమక్షంలో తన శిష్య బృందంతో పేరిణి నృత్య ప్రదర్శన చేశాడు. తిరిగి 1991లో జరిగిన కాకతీయ ఫెస్టివల్‌లో భాగంగా ఫిబ్రవరి 25న తన శిష్యబృందంతో పేరిణి నృత్య ప్రదర్శన ఇప్పించాడు.

భారత పురావస్తు శాఖ పూనా నుండి తేలికైన ఇటుకలను తెప్పించి, రామప్ప ఆలయ శిఖరాన్ని పునర్నిర్మించి, పైకప్పును బాగుపరిచి, ఆలయ పునాదుల్లోకి వాన నీరు ఇంకకుండా ప్లాస్టరింగ్ చేయించింది. 2013 నాటికి రామప్ప ఆలయం కట్టి 800ల సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి కేంద్ర ప్రభుత్వం 2012–13లో కాకతీయ ఉత్సవాలు జరిపింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక శాఖ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రామప్ప చెరువులో బోటింగ్ ఏర్పాటు చేసింది. పర్యాటకుల వసతి, తిండి కోసం వసతి గృహాలను, రెస్టారెంట్‌ను కట్టించింది. ఇవి ఇప్పుడు నిరుపయోగంలో ఉన్నాయి. ఈ మధ్య ఇక్కడ సినిమాలు తీయడంతో రామప్ప మరింత వెలుగులోకి వచ్చింది.

రామప్పకు ఇటీవల ఏర్పడిన ప్రమాదాలపై పోరాడిన 'రామప్ప పరిరక్షణ కమిటీ'

కృషి మేరకు ప్రభుత్వం నియమించిన కమిటీ 'రామప్పకు నిజంగానే ప్రమాదం పొంచి ఉందని, ఆ ప్రమాద నివారణకై కృషి చేయాలని' తన రిపోర్టులో ప్రభుత్వానికి సూచించింది. రామప్ప పరిరక్షణ కమిటీ సాధించిన ఈ చిన్న విజయాన్ని పురస్కరించుకుని 1985లో నటరాజ రామకృష్ణ నిర్వహించినట్లుగానే 2012 జూన్ 17న రామప్పలో పదివేల దివ్వెల జాతరను నిర్వహించింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాకతీయ ఉత్సవాలను 2012 నవంబర్‌లో నిర్వహించాయి. ఉత్సవాల్లో రెండవ రోజైన 30వ తేదీనాడు రామప్పలో ప్రజలు, ప్రజాప్రతినిధుల సభ జరిగింది. ఇలాంటి మరో సభ 2013 ఏప్రిల్ 18న... అంటే తిథి ప్రకారం రామప్ప గుడిని కట్టించిన 800 సంవత్సర పరిసమాప్తి రోజున జరిగింది.

రామప్ప కేంద్రంగా పరిసర ప్రాంతాల్లో ఉన్న కటాక్షపురం, జాకారం, రామానుజపురం, గణపురం, మేడారం, మల్లూరు దేవాలయాలు, లక్నవరం చెరువులోని ఎకో-టూరిజం ప్రాజెక్టు, తాడ్వాయి అడవుల్లోని రాక్షస గుళ్ళు, రాతి దర్వాజాలు, లవ్వారం గిరిజన ద్వీపం, కొత్తగూడ అడవుల్లోని జలపాతాలను కలిపి ఒక పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేస్తే ఘనమైన కాకతీయ కళా వారసత్వాన్ని కాపాడినట్లవుతుంది, మరిన్ని కొత్త పర్యాటక స్థలాలు అందుబాటులోకి వచ్చి పర్యాటక ప్రజలు కూడా ఆనందిస్తారు. స్థానిక ప్రజలు కూడా ఆత్మ విశ్వాసంతో పాటు ఆర్థిక ప్రగతిని కూడా పొందుతారు.

*– ఆంధ్రభూమి ఆదివారం అనుబంధం*
*17-06-2012*

డా. ద్యావనపల్లి సత్యనారాయణ

# 8

# రుద్రమదేవి శిల్పాలు

తెలుగు రాజ్యాన్ని సుమారు మూడు దశాబ్దాల పాటు (క్రీ.శ. 1262–1289) ఏకఛత్రాధిపత్యంగా పరిపాలించిన ఏకైక తెలుగు రాణి రుద్రమదేవి. అయితే, ఆనాడు దేశంలోని రాజులు, సామంతులు అందరూ పురుషులే. వారంతా ఒక మహిళ రాజ్యమేలడాన్ని భరించలేకపోయారు. 'స్త్రీ రాజరికాన్ని' జీర్ణించుకోలేక పోయారు. కొందరు ఆమె రాజ్యానికి వాయువ్య దిశనున్న ప్రస్తుతపు మహారాష్ట్రలోని దేవగిరి రాజ్యపు యాదవ రాజైన మహాదేవుడిని ఓరుగల్లుపై దండెత్తడానికి ప్రోత్సహించారు. ఆ రాజు ఓరుగల్లు కోటను ముట్టడించాడు కూడా. కానీ రుద్రమదేవి సాహసానికి ఆ రాజు సేనలు చిత్తయి పారిపోయాయి. రుద్రమ అతడి శత్రు సైన్యాలను తరుముకుంటూ పోయి ప్రస్తుతం కర్ణాటకలో ఉన్న బీదరు కోటను వశపర్చుకుంది. తన విజయాన్ని ప్రస్తావిస్తూ అక్కడ కన్నడ భాషలో శిలాశాసనాన్ని కూడా వేయించింది. అందులో రుద్రమ తన తండ్రి గణపతిదేవుని బిరుదు 'రాయగజ కేసరి'ని తాను ధరించినట్లుగా ఉంది. 'రాయగజ కేసరి' అంటే, ఏనుగుల వంటి శత్రురాజులకు సింహం వంటిది' అని అర్థం.

రాణి రుద్రమదేవి బీదరు కోటను వశపర్చుకున్నది మొదలు 'రాయగజ కేసరి' శిల్పాలను దేవాలయ స్తంభాలపైన చెక్కించింది. అదే నమూనాను నాణేలపై కూడా ముద్రింపజేసింది. అలా చెక్కించడం వెనుక రుద్రమ అహంభావం కాదు, ఆమె ఆత్మవిశ్వాసమే వ్యక్తమౌతుంది. వీటిద్వారా శత్రువులను గెలవగలనన్న ధీమాను కూడా ఆమె వ్యక్తం చేసిందనుకోవచ్చు. వీటన్నింటినీ ఆనాటి స్త్రీలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచే చర్యలుగానూ చూడవచ్చు.

## రాయగజకేసరి శిల్పాలు

చాలా నునుపైన, అందమైన నల్ల శానపు 'రాయగజ కేసరి' శిల్పం ఒకటి రామప్ప గుడి దక్షిణ ద్వారపు స్తంభంపైన చూరును మోస్తున్నట్లుగా ఉంది. ఈ



శిల్పంలో ఏనుగు పైన దాన్ని అణగదొక్కుతున్న సింహం, మరొక స్త్రీమూర్తి చెక్కబడ్డాయి. ఈ శిల్పం రాయగజ కేసరి శిల్పం కాబట్టి, ఈ శిల్పంలోని స్త్రీ కాలివేళ్ళకు మెట్టెలు కూడా ఉన్నందువల్ల ఈ శిల్పం రుద్రమదేవిదే అని, పైగా ఆమెనే ఆ శిల్పాన్ని చెక్కించిందని ఘంటాపథంగా చెప్పవచ్చు. అదే అభిప్రాయాన్ని కాకతీయ చరిత్రకారులు డా॥ పి.వి.పరబ్రహ్మ శాస్త్రిగారు కూడా వ్యక్తం చేశారు. ''రామప్ప గుడి నిర్మాణం క్రీ.శ.1213లో పూర్తయినా ఇలాంటి శిల్పాలు, అలంకరణ శిల్పాలు ఎన్నో మరో శతాబ్దం పాటు కూడా చేర్చబడ్డాయి” అని అన్నారాయన.

మరో మూడు రకాల 'రాయగజ కేసరి' శిల్పాలు ఓరుగల్లు కోటలోని స్వయంభు దేవాలయ శిథిల శిల్పాల్లో ఉన్నాయి. ఒక శిల్పంలో సింహం తన ముందటి కుడి కాలును ఎత్తి గర్జిస్తూ ముందుకు ఉరుకుతున్నట్లుగా ఉండగా దానిపైన ఒక వీరవనిత తన కుడి చేత్తో కత్తి, ఎడమ చేతితో డాలు పట్టుకుని కుడికాలునెత్తి యుద్ధరంగంలోకి దూకుతున్నట్లుగా ఉంది. ఈ వీర వనిత ఎవరో కాదు రుద్రమదేవే.

రుద్రమ దేవగిరి యాదవ రాజుపైన గెలిచిన తరువాత తన రాజధాని ఓరుగల్లు కోటలో ఉన్న స్వయంభు దేవాలయంలో ఒక శిల్పాలంకృత మంటపాన్ని కట్టించి, ఆ మంటపం నాలుగు స్తంభాలకు పైన పేర్కొన్నటువంటి నాలుగు 'రాయగజ కేసరి' శిల్పాలను చెక్కించింది. వాటిని ఇప్పటికీ మనం చూడవచ్చు.

రెండవ రకం 'గజకేసరి' శిల్పాల్లో ఏనుగుపైన విజృంభించిన సింహం వీపుమీద ఒక స్త్రీ కూర్చుని, వెనుకకు వాలి ఆ సింహం తోకను కత్తితో కోయడానికి సిద్ధమవుతున్నట్లుంది. ఈ శిల్పం కూడా రుద్రమదేవిదే. ఆమె చెక్కించిందే. ఇందులో ఆమె శత్రు రాజులకు చేస్తున్న హెచ్చరిక కన్పిస్తుంది.



పైన చెప్పిన శిల్పానికి అనుకుని కన్పించే మరో శిల్పం మూడవ రూపుది. ఇందులో 'రాయగజ కేసరి' పైన ఒక బాలుడు పడుకుని ఆడుతున్నట్లు ఉంది. ఆ బాలుడు ప్రతాపరుద్రుడు. రుద్రమదేవి బిడ్డ కొడుకు. ఇతడే రుద్రమ దత్త పుత్రుడుగా ఆమె తర్వాత కాకతీయ రాజు అయ్యాడు. రుద్రమదేవి తన తర్వాత రాజు కాబోయేవాడు కూడా 'రాయగజ కేసరి' వంటి వీరుడే అని శత్రురాజులను హెచ్చరిస్తూ ఆ శిల్పాన్ని చెక్కించిందని అర్థం చేసుకోవచ్చు.

అయితే, ఇంకో సంగతి కూడా ఉంది. రుద్రమకు కొడుకులు లేరు కాబట్టి, ప్రతాపరుద్రున్ని అల్లారు ముద్దుగా ఆడిస్తూ పెంచింది. దీనికి నిదర్శనంగా మనకు రామప్ప దగ్గరి కటాక్షపురం దేవాలయంలో మరో శిల్పం కనిపిస్తుంది. అందులో రుద్రమ ప్రతాపున్ని తనతో పాటు హంసమీద కూర్చో పెట్టుకుని ఆడిస్తున్నట్లుగా ఉంది. అలాగే, రామప్ప గుడి ఉత్తరపు గోడపైన – కామ శిల్పాల పక్కన – ఖడ్గధారిణియైన రుద్రమ శిల్పం పక్కనున్న మరో శిల్పంలో రుద్రమతోపాటు బాల ప్రతాపుడు కూడా కనిపిస్తాడు.



## నాణేలపై ముద్రలు

రుద్రమదేవి తన బిరుదైన 'రాయగజ కేసరి'ని శిల్పాల్లోనే కాకుండా అదే బిరుదుతో కూడిన తన రూపాన్ని బంగారు నాణేలపై కూడా చెక్కించింది. అలాంటి ఆమె రూప నాణేలు కొన్ని హనుమకొండలోని పద్మాక్షి గుట్టపైన దొరికాయి. ఆ నాణేల్లో కొన్ని 'మండ మండని' అనే అక్షరాలు చెక్కినవి కూడా ఉన్నాయి. 'మండ మండని' బిరుదు కూడా రుద్రమకే వర్తిస్తుంది. ఆ నాణెంపై ఆమె గుర్రం మీద ఎక్కి చేతుల్లో బల్లెం, డాలు పట్టుకుని నలువైపులా సైన్యం తోడు రాగా యుద్ధరంగంలో విహరిస్తునట్లుగా చిత్రించబడింది.

అలాగే, రామప్పగుడి గోడపైన ఉన్న ఒక శిల్పంలో రుద్రమదేవి కాలును ఒక ఏనుగు తొండంతో పట్టుకోగా మరో ఏనుగు ఆమె పైకి గదను ఎత్తుతున్నట్లుండగా ఆ ఏనుగులను రుద్రమ కత్తి డాలుతో ఎదుర్కొంటున్నట్లుగా చిత్రితమైంది.

## సంక్షేమ కీర్తి శిల్పాలు

తన తండ్రిలాగే రుద్రమదేవి కూడా ప్రజలను తన కన్న బిడ్డల్లాగా చూసుకునేది అనడానికి నిదర్శనంగా ఆనాటి శాసనాలు, కావ్యాలు ఎన్నో కనిపిస్తున్నాయి. తన



రాజ్యంలో ఏ మూలన, ఏ ఒక్కరికి బాధ కలిగినా తనకు తెలిస్తే వీలు చూసుకుని అక్కడికి వెళ్ళి మరీ వారి బాధలను తీర్చేదనడానికి నిదర్శనమైన 'హృదయశల్యం' అనే మాడపాటి హనుమంతరావుగారి వందేళ్ళ నాటి వాస్తవికాధార కథను కొందరు చదివి ఉంటారు. ఇలాంటి ఆత్మీయమైన వ్యక్తిత్వం వల్ల రుద్రమకు ప్రజలు నీరాజనాలు పట్టారు. ఆమెను 'అంబ' (అమ్మ) అనీ పిలిచారు. అంబతో సమానంగా... అంటే, దేవతతో సమానంగా కొనియాడారు. ఈ భావనలను తెలిపే శిల్పాలు కూడా ఆనాడే చెక్కబడ్డాయి. (అయితే ఇలాంటి దేశ విహార శిల్పాలు రాజస్థాన్‌లోని ఒక విశాలమైన రాతి బావిలో కూడా ఉన్నాయి. అవి రుద్రమ కాలం కంటే ముందువి).

ఇలాంటి శిల్పాల్లో ప్రధానంగా చూడవలసిన శిల్పం ఒకటి రామప్ప గుడిలోని మంటపం నైరుతి మూలలో ఉంది. ఇది ఎర్ర రాతి శిల్పం. ఈ శిల్పంలో రెండు ఏనుగులపైన ఎక్కిన ఇద్దరు స్త్రీలు రెండు రాజఛత్రాలను (గొడుగులను) ఎత్తి పట్టుకోగా వారి మధ్యన ఏనుగుపైన రుద్రమదేవి కత్తి ధరించి ఊరేగుతున్నట్లుంది. ఇలాంటి శిల్పమే మరొకటి మంథని దగ్గర గోదావరి నదిలోని లంజ మడుగు పైనున్న గుహాలయ గోడపై చెక్కి ఉంది. ఈ శిల్పంలో సేవకుల నీరాజనాల మధ్య రుద్రమదేవి సేవికతో సహా గుర్రం పైన తన రాజ్యంలో విహరిస్తున్నట్లు చెక్కి ఉన్నది.

## 'కంచుకోటను రక్షిస్తున్న అశ్వయుత రుద్రమ' చిత్రాలు

రుద్రమ్మను ఇంతగా శిల్పాల్లో ప్రేమించిన ప్రజలు, కళాకారులు ఆమెను చిత్రాల్లో

కూడా ప్రేమించకుండా ఉంటారా? ఆనాడు ఓరుగల్లులో వేల సంఖ్యలో చిత్రశాలలుండేవని సమకాలీన సాహిత్యాధారాలు తెలుపుతున్నాయి. కానీ, దురదృష్టవశాత్తు మనకు రుద్రమ చిత్రం ఆనాటిది ఒక్కటి కూడా అందుబాటులో లేదు. కారణం ఆనాటి చిత్రాలు గోడలు, పత్రాలపైన వేసినవి కావడం, అవి కాలగర్భంలో కలసిపోవడం. అయితే, మన నిస్పృహను కొంత వరకు ప్రముఖ తెలంగాణ చిత్రకారులు కీ.శే.కొండపల్లి శేషగిరిరావుగారు తీర్చారు. ఆయన 18-2-2000 నాడు 'తను కట్టించిన కంచుకోటను సంరక్షిస్తున్న అశ్వయుత రుద్రమదేవిని చిత్రించారు. ఆయన వేసిన బొమ్మమీద ఆయనకే తనివి తీరక 25.03.2000 నాటికి అదే బొమ్మను మరింత రాజసంగా అందంగా తీర్చి చిత్రించారు. మరింత సమగ్రంగానూ ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. తొలి చిత్రంలో రుద్రమ రుమాలు ధరించి ఉండగా ఈ మలి చిత్రంలో రుమాలుతో పాటు కిరిటాన్ని ధరించి ఉంది.

## హైదరాబాద్‌లో రుద్రమ

ఆనాటి రాణి రుద్రమ్మ కీర్తికి సంక్షిప్త తార్కాణాలుగా తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోని టాంక్‌బండ్‌పై కూడా మూడు దృష్టాంతాలు కనిపిస్తాయి.

ఒకటి, సికింద్రాబాద్ నుంచి వస్తూ ఉండగా టాంక్‌బండ్ ప్రారంభంలో ఉన్న సిమెంట్ తోరణం. ఇది ఓరుగల్లు కోటలో రుద్రమ్మ కట్టించిన నిజమైన తోరణాలకు నకలు. రెండు, టాంక్‌బండ్ ప్రారంభంలో తోరణం పక్కనే ఉన్న అశ్వారూఢ ఖడ్గయుత రుద్రమదేవి విగ్రహం, మూడు, టాంక్‌బండ్ చివరన అంటే హైదరాబాద్ ప్రారంభంలో ఉన్న సిమెంట్ తోరణానికి ఇరుపక్కలా ఉన్న 'రాయగజ కేసరి' సిమెంట్ శిల్పాలు.

*- నమస్తే తెలంగాణ ఆదివారం అనుబంధం*
*24-02-2013*



9

# రామదాసు శిలాశాసనం, చిత్రలేఖనం

తెలుగు దేశంలో శ్రీరామనవమికి అత్యంత పవిత్రమైన ప్రదేశంగా భాసిల్లుతున్న భద్రాచలం రామాలయాన్ని, రామదాసును స్మరించుకోకుండా ఉండలేము. కారణం, ప్రస్తుతమున్న దేవాలయాన్ని రామదాసే 360 సంవత్సరాల కిందట కట్టించి, కీర్తించి ప్రాచుర్యంలోకి తేవడం. 2013వ సంవత్సరపు శ్రీరామనవమికి సరిగ్గా 360 సంవత్సరాల కిందనే ఇదే నందన నామ సంవత్సర చైత్ర శుద్ధ నవమి ఆదివారంనాడే రామదాసు ఈ ఆలయానికి దేవ, బ్రాహ్మణ వృత్తులు నిలిపి, శ్రీవారి సన్నిధిన జరిగే ఉత్సవ ప్రకరణముల వివరణములతో దేవాలయ ఆవరణలో రామస్తంభం అనే పేర



శిలాశాసనాన్ని వేయించాడు. అయితే క్రీ.శ. 1769లో 'ధంసా' అనే బిరుదున్న ముస్లిం నాయకుడు తన సేనలతో భద్రాచల రామాలయాన్ని ధ్వంసం చేసి దోచుకున్న సమయంలోనే రామస్తంభ శాసనాన్ని కూడా విరగ్గొట్టారు. అదే శాసనాన్ని 180 సంవత్సరాల తరువాత నాటి నిజాం నవాబు ప్రధాని చందూలాల్ ప్రోద్బలంతో ఇప్పటికి సరిగ్గా 180 సంవత్సరాల కిందట మళ్ళీ రాజా తూము లక్ష్మీనరసింహదాసు, వరద రామదాసు రామస్తంభ శాసనాన్ని (క్రీ.శ. 1832లో) చెక్కించి నిలిపారు. ఆ శాసనాన్ని భక్తులు ఇప్పుడు భద్రాచలం ఆలయ



ఆవరణలోనే ప్రధానాలయం వెనుక చూడవచ్చు. భక్తులు సులభంగా అర్థం చేసుకోవడానికి వీలుగా ఆ శాసన పాఠాన్ని ఇక్కడ యథాతథంగా ఇప్పుడు మనకు అర్థమయ్యే అక్షరాలలో అందిస్తున్నాను.


"స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శక వర్షంబులు **1574** అగు నేటి వర్తమాన వ్యవహారిక చాంద్రమాన నందన నామ సంవత్సర చైత్ర శు **9** భానువారం శ్రీ భద్రాచల సీతారామచంద్ర మహాప్రభువువారి సన్నిధిన శ్రీరామదాసుగారు శ్రీ తానీషాగారి అనుమతం వెంబడిన జరిగించిన దేవ బ్రాహ్మణ వృత్తులు శ్రీవారి సన్నిధిన జర్గే ఉత్సవ ప్రకరణములు వ్రాసివున్న శాసనం ధంసా ప్రపంచములో శ్రీవారు పోలవరం వలస వేంచేసినపుడు ఒక దుర్మార్గుడు శాసనం చెక్కివేసినందున సర్వజనులకు తెలిసి సంతోషించేటందుకు లేకపోగా దుర్మార్గుడు పుత్ర మిత్ర కళత్రాదులతోటి నశించి పోయినాడు. తదనంతరం శాలివాహన శక వర్షంబులు అగు నేటి **1754** నందన నామ సంవత్సర చైత్ర శు **9** ఇందువారం భద్రగిరి రామదాసు అనే రామదాసు హంశను జన్మించిన భక్తుడు కంచీ నగరం నుంచి శ్రీ భద్రాద్రికి వచ్చి తనకు తన భార్యకు గల సకల ఆభరణములు ధనము శ్రీవారికి అర్పణ చేశి ఆయన తల్లి అయిన రంగమ్మ అనే మభాగ్యవతి అనుమతం వెంబడి ఆత్మకుటుంబంతో కూడా హరిదాసులై స్త్రీలు సమ్మార్జన కయింకర్యమున్నూ పురుషుడు భజెన మొదలయిన సేవాదులున్నూ జర్గిస్తుండగా శ్రీవారు నాసరుద్దవులా వారి నవాబుగిరిలో చందూలాల్ అనే భగవదంశ సంభూతుడ్కి స్వప్నమందు దర్శనం కృపచేశి వరద రామదాసు రామదాసుగారి హంశ అనిన్ని హసనబాదు పరగణా శ్రీవారి మొహరుతోటి వరద రామదాసు దస్కతుతోటి అమలు జరిగించవలసిందనిన్ని అదివరకు దుర్మార్గులు ప్రపంచ పరిపాలన చేసుల చాతను దేవ బ్రాహ్మణ వృత్తులు నిరాటంకంగా జరుగుటం లేనందున అవి విమర్శగా జరిగించ వలసినదనిన్ని ఆజ్ఞ యిచ్చినందున చందూలాల్ అనే భగవదంశ సంభూతుడు అతి భక్తియుక్తుడై భగవదాజ్ఞ ప్రకారం దేవ బ్రాహ్మణుల అగ్రహారాలు. వృత్తులు రుస్ములు మొదలయినవిగాను అమాని గ్రామాదులు

**55 సరబస్తాలు 11 సాయరున్ను శివాయ బాపతులతో కూడ 71 డెబ్బయి వక్క వెయ్యి చలామణీ రూపాయీల్కు హసనాబాదా పరగణా రకం యేరుపరిశి అందుక్గా 32 వేలు సర్కారుకు నగదు చెల్లించెలాగ్నున్నూ 100 జనం శిబ్బంది తోపు శ్రీవారి సన్నిధిలో తయినాతీ వుండేలాగ్నున్నూ వారికి 8000 వేల రూపాయలు ప్రతి సంవత్సరం జీతాలు యిచ్చెలాగునను 18500 శ్రీవారి కైంకర్యము క్రింద జరిగేటట్టున్ను 12500 సాదరు శిబ్బంది దరబారు వ్రయం నిమిత్తంగాను నిర్నయం చేశి అమలు వరద రామదాసు పరం చేశినారు. గనుక భగవదనుగ్రహపాత్రుడైన రాజా తూము లక్ష్మీనరసింహ దాసున్ను వరద రామదాసున్ను శ్రీవారి ప్రేరణ వెంబడి హసనాబాదా పరగణాలో వుండె దేవ బ్రాహ్మణ వృత్తులు అగ్రహారములు విమర్శించి సర్వదుంబాలా జర్గగలందులకు యేరుపాటు చేశిన వివరం."**

ఇక భద్రాచల రామదాసుగా పేరు గాంచిన శ్రీ కంచర్ల గోపన్న గురించి తలుచుకోవడమే గాని ఆయన నిజ రూపం ఎలా ఉంటుందో రేఖా మాత్రంగానైనా భక్తులకు తెలియదు. అదృష్టవశాత్తు రామదాసు చిత్రాన్ని సుమారు అరవై ఏళ్ళ కిందట భద్రాచల దేవస్థాన కార్యనిర్వాహకులుగా పని చేసిన శ్రీ కొండపల్లి రామచంద్రరావుగారు సేకరించి భద్రపరిచారు. ఆ రామదాసు చిత్రలేఖనాన్ని భక్తుల కోసం ప్రచురించడమైంది.



– *నమస్తే తెలంగాణ ఆదివారం అనుబంధం*
06-04-2014 శ్రీరామనవమి



డా. ద్యావనపల్లి సత్యనారాయణ


# 10

# మన ప్రాచీన రాజధాని ఇంద్రపాలనగరం

1956లో మద్రాస్ నుండి విడిపోతున్నప్పుడు, 2014లో తెలంగాణ నుండి విడిపోతున్నప్పుడు ఆంధ్రులు రాజధాని నగరం కోసం కొట్లాడారు. అలాంటి రాజధానుల (చరిత్ర) కొరత తెలంగాణకు లేదు. తెలుగు చరిత్ర పుటలను తిరగవేస్తే తెలంగాణలోనే ఎక్కువ రాజధానులు కన్పిస్తాయి. అలాంటిదొకటి ఇంద్రపాలనగరం. ఇది వేయిన్నర సంవత్సరాల కిందటే కొంతకాలం యావత్ తెలంగాణకు, ఆపై నర్మదా నది వరకు గల దక్కను ప్రాంతానికి కూడా రాజధానిగా ఉండేది.



క్రీ.శ. 5–6 శతాబ్దాల మధ్య తెలంగాణను పాలించిన విష్ణుకుండి రాజుల మూడు రాజధానుల్లో ఇంద్రపాలనగరం ఒకటి. మొదటి రాజధాని అమరావతి. ఇది మహబూబ్‌నగర్ జిల్లాలోని అమ్రాబాద్ మండల కేంద్రం. రెండవ రాజధాని హైదరాబాద్ శివారులోని కీసరగుట్ట.








నాలుగు దశాబ్దాల కింద చరిత్రకారులు కీ.శే.బి.ఎన్.శాస్త్రిగారు ఇక్కడి సమీప గ్రామంలో విష్ణుకుండి రాజుల రాగి శాసనాలను సేకరించి, వాటిలోని వివరాలను ప్రచురించి ఇంద్రపాల నగరాన్ని వెలుగులోకి తెచ్చారు. ఈ నగరం విష్ణుకుండుల తరువాత కూడా రాష్ట్రకూట రాజులు, చాళుక్య రాజులకు కూడా ఒక ప్రాంతీయ రాజధానిగా వర్ధిల్లిందనే చారిత్రక ఆధారాలు ఉన్నాయక్కడ.

నల్గొండ జిల్లాలోని తుమ్మలగూడెం, వలిగొండ గ్రామాల మధ్య పారుతున్న మూసీనది ఒడ్డును ఆనుకొని ఉన్న ఒక విశాలమైన గుట్ట మీద, దాన్ని ఆనుకొని ఉన్న పరిసరాల్లో ఆనాటి ఇంద్రపాలనగరం ఉండేది. గుట్ట మీదనే పది పన్నెండు బురుజులతో కూడిన కోటగోడలు, శివాలయం, లక్ష్మీనరసింహాలయం, ఎల్లమ్మగుడి, వాటి పరిసరాల్లో కోనేర్లు, అత్యున్నత స్థానంలో రాజమందిరపు పునాదుల ఆనవాళ్ళు, ఏటవాలులో బౌద్ధ విహారాలు (మహాదేవి విహారం), ఆరామాలు, మరో శివాలయం, జైన మునుల శిల్పాలు, గుహాలయాలు మొదలైనవి నేటికీ దర్శనమిస్తాయి. శంకర్ అనే ఒక మాల పూజారి తనను శివుడు ఆదేశించాడని వీటిని సంరక్షిస్తుండడం అభినందనీయమైన విషయం, మేధావులు సిగ్గుపడవలసిన విషయం.

గుట్ట నుండి మూసీనదికి శిలా సోపానాలున్నాయి. మూసీనది ఆంగ్ల అక్షరం 'ఎస్' ఆకారంలో ప్రవహిస్తూ ఏర్పరచిన ఒక ద్వీపాకారపు గుట్టబోరు మీద చిన్న

చిన్న శివలింగాలు 108 చెక్కి ఉన్నాయి. మరో పక్క గంగమ్మ గుడి ఉంది. గుట్టకు మరోవైపు పారుతున్న మహబూబ్‌నహర్ కాలువ వైపు వేంకటేశ్వరాలయం, 40 స్తంభాల మంటపంతో కూడిన పంచ కూటాలయం, ముత్యాలమ్మవారి గుడి, కోనేర్లు, శిథిల శిల్పాలు, శాసనాలు మరెన్నో ఉన్నాయి. వీటన్నింటిని దర్శించి మన గత చరిత్రను చూసి గర్వించడమే కాకుండా ఆయా విశేషాలను శాస్త్రీయంగా డాక్యుమెంట్ చేసి వాటిని పరిరక్షించుకోవలసిన అవసరముంది.



ఇంద్రపాలనగరానికి సమీపంలో సమకాలీన చారిత్రక ఆలయాలున్న వలిగొండ, మత్స్యగిరిలను కూడా ఆసక్తిగలవారు దర్శించవచ్చు.

**ఇలా వెళ్ళాలి:**

ఇంద్రపాలనగరం హైదరాబాద్ నుండి ఎనభై కిలోమీటర్ల దూరంలో ఉంది. హైదరాబాద్ నుండి పోవాలనుకున్నవారు వరంగల్ రహదారిలో వచ్చే భువనగిరి నుండి కుడివైపున వచ్చే వలిగొండ మీదుగా చేరుకోవచ్చు. విజయవాడ రహదారిలో ప్రయాణించేవారు చౌటుప్పల్ నుండి ఎడమవైపున వచ్చే తుమ్మలగూడెం మీదుగా చేరుకోవచ్చు. రైలులో ప్రయాణించాలనుకొన్నా తుమ్మలగూడెంలోనే దిగాలి. సొంత వాహనాలు లేనివారు తుమ్మలగూడెం నుండి రెండు కిలోమీటర్ల దూరం ఆటోలోగాని, నడిచిగాని చేరుకోవచ్చు.

*– నమస్తే తెలంగాణ ఆదివారం అనుబంధం*
*(ప్రచురణలో ఉంది)*



*మత్స్యగిరిపై నుంచి $180^0$ కోణంలో కనిపించే వ్యూపాయింట్ దృశ్యం*

# 11


# మరో యాదగిరి... మత్స్యగిరి

హైదరాబాద్‌కు 85 కిలోమీటర్ల దూరంలో నల్లగొండ జిల్లాలో ఉన్న మత్స్యగిరి ఒక గొప్ప సందర్శనా స్థలం. ఇక్కడికి హైదరాబాద్ నుండి చౌటుప్పల్, వలిగొండ, ఆరూరు మీదుగా చేరుకోవచ్చు. మరో మార్గంలో భువనగిరి, వలిగొండ మీదుగా కూడా చేరుకోవచ్చు.

మత్స్యం అంటే చేప కదా! మత్స్యగిరి చేప ఆకారంలో ఉంటుంది కాబట్టి దానికి ఆ పేరు పెట్టారు. అయితే మత్స్యగిరి దగ్గరున్న పొట్టిగుట్ట దగ్గర్నుండి వెళ్తే ఈ గిరి అచ్చంగా చేప ఆకారంలో కనిపిస్తుంది.



మత్స్యగిరిని వేములకొండ పల్లె పరిసరాల నుంచి సగం వరకు ఎక్కగానే ఒక ప్రాచీన శిలా ద్వారం కనిపిస్తుంది. ఆ ద్వార బంధానికి ఒక చేప శిల్పం చెక్కి ఉండటం విశేషం. ప్రస్తుతం శిథిలమైనప్పటికీ ఆ శిల్పం సుమారు మూడడుగుల పొడవుంటుంది.




మత్స్యగిరి శిఖరాగ్రాన చిన్న చెరువుంది. ఈ చెరువూ ఒక వింతే. సాధారణంగా పెద్ద పెద్ద కొండల్లో ఇంకిన వర్షపు నీరు పారి కొండల కింద చెరువు లేర్పడతాయి. కానీ కొండ పైన చెరువుండటం నిజంగా వింతే! దీన్నే భక్తులు 'భగవంతుని లీలా మహాత్మ్యం' అని విశ్వసిస్తున్నారు.


ఈ చెరువులో చేపలుండడం మరో ముఖ్య విశేషం. ఇందులో ఉండేవన్నీ ఒకే రకపు చేపలు. అవన్నీ ఒకే పరిమాణంలో... సుమారు అర మీటరు పొడవుతో చిన్న డాల్ఫిన్లలాగా దొమ్మరి గంతులు వేస్తూ కనిపిస్తాయి. వాటన్నింటి తలమీద మూడేసి విష్ణు నామాలుంటాయి. ఇది మరీ ఆశ్చర్యానందాలకు గురి చేసే అంశం. ఎందుకంటే, ఇదివరకెప్పుడూ మనం ఇలాంటి నామాల చేపలను చూసి ఉండం!

ఈ చేపలుండే గుండం నిజానికి మూడు గుండాల సముదాయం. వీటి పేర్లు నామాలగుండం, విష్ణు గుండం, మాల గుండం. నీటి మట్టం పెరిగినప్పుడు ఇవి మూడూ కలిసిపోయి నైరుతి నుండి ఈశాన్యం వైపు అర్ధచంద్రాకారపు వంపు తిరిగిన ఒకే గుండం లాగా కనిపిస్తాయి. ఈ అర్ధచంద్రాకారపు గుండం మధ్యలో అంటే గుండం పడమటి ఒడ్డున... నీటి అంచున ఆరడుగుల పొడవైన చేప విగ్రహముంది. ఈ విగ్రహం చేప పల్టీ కొట్టేటప్పుడు కనిపించే వంపుతో ఈశాన్యం నుంచి నైరుతి వైపు తిరిగినట్లుగా కనిపిస్తుంది. చేప ముఖం మాత్రం తూర్పువైపుకు తిరిగి ఉంటుంది. ఈ విగ్రహం చుట్టూనే 1991లో ఆలయం కట్టారు. గుండంలో నీటి మట్టం పెరిగినప్పుడు ఈ చేప సాలగ్రామం నీటిలో తేలియాడుతున్నట్లు కనపడు తుందని అక్కడి పూజారి లక్ష్మణాచార్యులు చెప్పారు. ఈయన ఈమధ్య ఈ మత్స్యగిరి





మత్స్యగిరి ఎక్కుతున్నప్పుడు
కనిపించే గుహ



మార్గమధ్యంలో కనిపించే
ఒక శిలాతోరణం

స్థలపురాణం, ఇటీవలి చరిత్రను కూడా నిక్షిప్తం చేసే పనిలో ఉన్నారు. జిన్నం అంజయ్య అనే మరొక కవి కూడా ఈ మధ్యనే మత్స్యగిరిపై శతకం రాసి ప్రచురించారు.



మత్స్యగిరిపైన వృద్ధులు, రోగిష్టులు కనిపించడం సాధారణం. కొండ కిందికి ప్రయాణిస్తున్నప్పుడు, పైకి వెళ్తునప్పుడు రోగులు కనిపిస్తుంటారు. విచారిస్తే పైన కొన్నాళ్ళుంటే చాలు ఎంతటి క్లిష్టమైన రోగాలైనా నయమవుతాయని చెప్తారు. ఇక్కడి నీటికి రోగాలను నయం చేసే శక్తి ఉందన్నది ఇక్కడికి వచ్చేవాళ్ల విశ్వాసం.

నిజానికి భూ ఉపరితలం పైన నాలుగైదు వందల అడుగుల ఎత్తున ఉన్న ఈ మత్స్యగిరి ఆలయం పైకి స్వచ్ఛమైన, చల్లని గాలులు వీస్తుంటాయి. మత్స్యగుండం కూడా కాలుష్యానికి దూరంగా ఉండి స్వచ్ఛమైన నీటికి ఆలవాలంగా ఉంది. ఇటీవలి కాలం వరకూ ఈ గుండంలో ఉన్న తామర చెట్ల ఆకులు కూడా ఆ గుండంలోని మలినాలను, సూక్ష్మజీవులను గ్రహించి నీటిని పరిశుద్ధంగా ఉంచేవి. కాబట్టి, అంటువ్యాధులను వ్యాపింపజేసే సూక్ష్మక్రిములకు దూరంగా ఉన్న ఈ మత్స్యగిరిపై కొంతకాలం ఉండి, పరిశుద్ధమైన నీటిని తాగితే రోగాలు నయమవుతుండేవని చెబితే నమ్మడానికేమి అభ్యంతరం ఉండదు! ఇక ఈ మత్స్యగుండం నీటిని తాగిన వారికి సంతానమయ్యేదని, పంట పొలాలు, చేలపై చల్లుకుంటే కీటకాలు నశించి పంటలు బాగా పండేవని కూడా స్థానికులు చెబుతుంటారు.

మత్స్యగిరికి ఎదురుగా ఉన్న కొచ్చెగుట్టపైన కూడా ఒక మడుగు (గుండం) ఉంది. ఈ గుట్టను ఎక్కితే మంచి ట్రెక్కింగ్ ప్రాక్టీస్ అవుతుంది. ఇక్కడి మడుగులో

రాయి వేస్తే విచిత్రమైన శబ్దం వస్తుంది. బహుశా గుట్ట నిలువునా లోతైన బావిలాంటి గుండం ఉండడం వల్లనేమో... అలాంటి శబ్దం వస్తుంది. ఈ గుండం నీటిలో స్నానం చేస్తే చర్మ రోగాలు నయమవుతాయంటారు.

మత్స్యగిరికి వెనుకవైపున్న మాలగుట్ట గుహల్లో కూడా ఒక చిన్న గుంట ఉంది. ఈ గుంటలోని నీరును మనం తీసిన కొద్దీ అంతే పరిమాణంలో మళ్ళీ ఊరటం విశేషం.

ప్రస్తుతం మత్స్యగిరిపై కనిపిస్తున్న ఆలయ మంటపాదులు 1977 నుంచి నిర్మించబడుతున్నవే. అయితే, ఈ గిరి పరిసరాల్లో కనిపిస్తున్న శిథిల ఆలయాల చరిత్ర మాత్రం వేల ఏళ్ళ వెనకాలది. ఈ నేపథ్యంలో ప్రధాన ఆలయానికి దక్షిణంగా గుట్టను సగం దిగాక కనిపించే శివాలయం చాలా ప్రాచీనమైంది.

ఎక్కడైనా ప్రాచీన ఆలయాలు పూర్తిగా రాతితో గాని, ఇటుకలతో గాని నిర్మించబడుతయి. ఈ శివాలయం గర్భ గృహానికి మాత్రం మూడు వైపులా (ప్రవేశ దిశ మినహా) ఇటుకల గోడలున్నాయి. వాటి లోపల రాతిగోడలున్నాయి. ఈ ఇటుకల పొడవు, వెడల్పులు 14 X 10 అంగుళాలు.

14 అంగుళాల పొడవున్న ఇటుకలను సుమారు 1400 సంవత్సరాలకు పూర్వం వాడేవారు. ఈ ఇటుకల గుడి వాస్తు నిర్మాణ శైలిని బట్టి ఇది ఆనాడు 'జైనుల మందిరం' అని తెలుస్తుంది. ప్రత్యేకించి ఇది శ్వేతాంబర జైనులది. శ్వేత అంటే తెల్లని అని అర్థం. దగ్గర్లోని వలిగొండ అనే ఊరు ఆనాడు శ్వేతాంబర జైన ప్రాబల్యమున్న ఊరే అయ్యుంటుంది. పక్కనే వేముల కొండ ఉంది. వేములు అంటే జైనులే. ఆ ప్రక్కనే మునిపంపుల అనే ఊరుంది. 'మునులు' అంటే జైన మతానికి చెందిన ఋషులు. మత్స్యగిరి పక్కనున్న మాలగుట్ట పైనా జైనుల గుహలున్నాయి.

జైనులు తమ మతానికి ప్రతీకగా చేపను చూపుతారు. మీననాథుడు అనే ప్రఖ్యాతి చెందిన సిద్ధుడు కూడా జైనుడే. 24 మంది జైన తీర్థంకరుల్లో ఒకరికి ప్రతీక చేపనే. జైనులే కింది కులాల వారికి సమున్నత స్థానం కల్పించారు కాబట్టి ఇక్కడ మాలగుట్ట, మాలగుండం, మాదిగగుండం లాంటివి కన్పిసున్నాయని భావించవచ్చు.

ప్రస్తుతం కనిపిస్తున్న శివాలయం మొదట జైన బసది కాగా సుమారు 12వ శతాబ్దంలో... అంటే కాకతీయుల కాలారంభ దశలో శివాలయంగా మార్చబడిందని దాని వాస్తు శైలిని బట్టి తెలుస్తోంది. ఈ ఆలయ మంటపం చూడదగింది. ఆలయంలోని శివలింగం ప్రస్తుతం ఆలయానికి ఎదురుగా ఉత్తరంలో ఉన్న సహజ కోనేరులో పడి

ఉంది. నంది విగ్రహం మత్స్యగుండంలో మునిగిపోయింది.

ప్రధానాలయానికి ఉత్తరం దిశలో ఈ మధ్యనే హనుమాన్ ఆలయం కట్టారు. ప్రధానాలయానికి ఎగువన (పడమర) చాళుక్యుల కాలం నాటి ఆలయముంది. కాగా, ప్రధానాలయానికి ముందున్న కోనేరుకు ఎదుట తూర్పు దిశలో 16 కాళ్ళ నవరంగ మంటపాన్ని కడుతున్నారు. టోల్‌గేట్ దగ్గరి సీతారామాలయం నిర్మాణం ఈ మధ్యనే పూర్తయింది. ఈ ఆలయం వెనుక, దీనికి చేరేందుకు చేసిన ఒకప్పటి ప్రాచీన ప్రవేశ మార్గాలు ఇప్పుడు శిథిలమైనా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అక్కడక్కడ సత్రాలున్నాయి.

నిశ్చయంగా ఈ ప్రాంతం జైన మత ప్రాబల్యం గలదని చెప్పే శిలాశాసనం ఒకటి ఇక్కడికి దగ్గరలోని సైదాపూర్‌లో లభించింది. అందులో అగ్గలయ్య అనే ఒక జైన శస్త్ర చికిత్సకారుడు ఈ ప్రాంతంలోని ముచ్చనపల్లి, ఇక్కురికి అనే గ్రామాల్లో రెండు జైన బసదులను (మఠాలను) కట్టించాడని, ఆయనకు పశ్చిమ చాళుక్య రాజ్యంలో రాజుతో సమానమైన గౌరవం ఉండేదని రాసి ఉంది. ఈ రెండు బసదులకు స్థానిక గౌండు (గ్రామాధికారి) క్రీ.శ.1034 జూన్ 4వ తేదీన రెండు గ్రామాల భూములను దానం చేశాడు. ప్రస్తుతం మత్స్యగిరిపైనున్న శివాలయం, పొట్టిగుట్ట పైనున్న ఆలయాల నిర్మాణం ఆనాటి జైన బసదుల నాటిదే. శాసనంలో పేర్కొనబడ్డ ముచ్చనపల్లెయే తరువాతి శతాబ్దాలలో మత్స్యగిరి అయ్యింది. మత్యగిరి దగ్గరిలోని లక్ష్మీపురంలో మరో శాసనం ఉంది.





పూర్వం ఒక వేటకాడు మత్స్యగుండంలోని చేపలు పట్టి కూర వండుకోవడానికై వాటిని కోయగా అవి మళ్ళీ అతుక్కుపోయాయని వినిపించే స్థానిక కథ వెనక శాస్త్ర పరిజ్ఞానం కలిగిన అగ్గలయ్య వంటి మేధావుల కృషి ఉంది. అలాంటి వారే పాదరసంతో మత్స్యగుండం వంటి నీటి గుండాలను గుట్ట బండలపై కూడా ఏర్పరిచారని, ఒక ప్రత్యేకమైన చేప బ్రీడ్‌ను సృష్టించగలిగారన్నట్లు గౌరన 'నవనాథ చరిత్ర' ద్వారా తెలుస్తుంది. మత్స్యగుండంలోని చేప ముఖం ఉగ్ర నరసింహుని రూపంతో ఉండడం ఈ సందర్భంగా గమనార్హం.

మత్స్యగిరికి హైదరాబాద్ నుండి వెళ్ళే యాత్రికులను ప్రయాణ మార్గంలో చౌటుప్పల్ నుండి ఇరుపక్కలా మూడు రంగుల్లో కనిపించే కొండలు ఆకర్షిస్తాయి. అవి పొట్టివి, పొడవైనవి, ఎత్తైనవి, తెల్లనివి, నల్లనివి, పచ్చనివి. ఇలా అన్నేసి కొండలు రంగురంగుల్లో కనిపిస్తుంటే ప్రయాణ మార్గంలోనే ఒక ఆసక్తికరమైన భావన హృదయాలను పులకరింప చేస్తుంది. వలిగొండకు చేరుకునే ముందు మనకు కుడివైపున కనిపించే ఎత్తైన కొండల శిఖర ప్రదేశాల్లో శిలా తోరణాలు కన్పిస్తాయి. ఇలాంటి ఒక శిలా తోరణాన్ని తిరుపతిలో చాలామంది చూసే ఉంటారు. ఇక్కడ మాత్రం అలాంటివి మూడు తోరణాలు కనిపించి మనల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తాయి.



వలిగొండ దగ్గరి కొండల మధ్య పారే 'మూసీ' నది హైదరాబాద్‌లో కనిపించినట్లుగా మురుగు నది కాదు. ముచ్చటైన నది. అంతేకాదు, ఇక్కడ పచ్చని చెట్లతో దర్శనమిచ్చే లోయ మార్గం మనల్ని మరింత ఆశ్చర్యపరుస్తుంది. గోధుమ వర్ణపు రాళ్ళపై నుండి తెల్లని నురగలు కక్కుతూ పారే ఆ నదీ సోయగం చూడవలసిందే. మూసీ పక్కన వలిగొండ-ఆరూరుల మధ్యన ఉన్న చెరువు అందమూ ఆస్వాదించదగిందే. ఈ చెరువు పెద్దదే. ఇందులో బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తే మరీ బాగుంటుంది. మత్స్యగిరి ఎక్కిచూస్తే మన చుట్టూ గొలుసు కట్టు చెరువులు ఏడెనిమిది కనిపిస్తాయి.

వలిగొండ చెరువును దాటిన తరువాత కన్పించే గుట్టలు వింత ఆకారాలతో మనల్ని తన్మయుల్ని చేస్తాయి. మొదటగా చెరువు ఒడ్డున కనిపించే చిన్నగుట్ట అందం మనల్ని కట్టి పడేస్తది. అందుకు కారణం... చెరువుపై నుంచి వీచే చల్లగాలులకు అది కేంద్రం కావడమే కాదు, దానిపైన ఉన్న వేయేళ్ళ నాటి ప్రాచీన చెన్నకేశవాలయం సౌందర్యం ఆ చెరువులో ప్రతిఫలించడం!

ఆరూరు దాటిన తర్వాత మత్స్యగిరికి మళ్ళే ముందు రోడ్‌పై నిల్చుని చూస్తే కనిపించే గుట్టల అందం అజరామరమైంది. 'మాలగుట్ట', 'మత్స్యగుట్ట'ల మధ్య



గుండ్రని ఎత్తైన 'కొచ్చెగుట్ట' పానవట్టంలోని శివలింగం లాగా సహజ సౌందర్యంతో శోభిల్లుతోంది.



మత్స్యగిరిపైకి ఇటీవల ఒక దాత గార్లపాటి సురేందర్‌రెడ్డి కోటి రూపాయలతో వేయించిన ఘాట్‌రోడ్డు పచ్చని చెట్లమధ్య పారే నల్లని తాచుపాములాగా వంకర టింకరగా మెలికలు తిరుగుతూ మనల్ని అలరిస్తుంది. ఈ రోడ్డుకు వ్యతిరేక దిశలో... పశ్చిమం నుండి మత్స్యగిరి పైకి వేసిన రోడ్డు ఎర్రని మట్టితో గిరి అందానికి మరో రంగును అద్ది ఆకర్షింపజేస్తున్నది.

మత్స్యగిరికి తూర్పు-పడమర పాదాల్లో ఉన్న పల్లెలు వేములకొండపల్లె, ఆరూరు పల్లె, వాటి పరిసరాల్లోని పంటచేలు, తాటిచెట్లు, పశువుల మందలు - ఇవన్నీ గిరి ఔన్నత్యం ముందు చిన్న అంశాలుగా కనిపిస్తూ, మనకు విమానంలో నుంచి కిందికి చూస్తున్న అనుభూతిని కలిగిస్తాయి.

- నమస్తే తెలంగాణ ఆదివారం అనుబంధం

*25-11-2012*



మత్స్యగిరిపై నుంచి $180^{0}$ కోణంలో లోయలో కనిపించే పనోరమా దృశ్యం

డా. ద్యావనపల్లి సత్యనారాయణ


# 12

# మరో తిరుమల... తిరుమలనాథ కొండ

పశ్చిమ దేశాల్లో ఉన్నట్లుగా మన దేశంలో కూడా ఇటీవలి కాలంలో వారాంతపు పర్యటనల ప్రాముఖ్యం పెరుగుతున్నది. ముఖ్యంగా నగరాల్లో... ప్రత్యేకించి ఉద్యోగ కుటుంబాల్లో. అయితే, ఒకటి రెండు రాష్ట్రాలు మినహా మిగతా అన్ని రాష్ట్రాల్లోనూ వారానికి ఆదివారం ఒకటే సెలవురోజు. మరి ఈ 'ఒక్క రోజు వెళ్ళి వచ్చే పర్యాటక స్థలాలు... నగరాల చుట్టు ఎన్ని ఉన్నాయి?' అనే ప్రశ్నకు సమాధానం 'అలాంటి స్థలాలు చాలా అరుదుగా ఉన్నాయి' అని వస్తుంది. అలాంటి అరుదైన పర్యాటక స్థలాల్లో ఒకటి 'తిరుమలనాథ కొండ'.



తిరుమలనాథ కొండ మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం పెద్ద రేవళ్ళ గ్రామ పరిధిలో ఉంది. హైదరాబాద్ నుండి బాలానగర్ మీదుగా ఈ ప్రాంతానికి 80 కిలో మీటర్ల దూరం ప్రయాణించి చేరుకోవాలి. ప్రకృతిని ఇష్టపడేవారు షాద్‌నగర్,



బూర్గుల మీదుగా వెళ్తే 70 కిలోమీటర్లు. అయితే రెండవ దారిలో వెళ్ళేవారు సుమారు 10 కిలోమిటర్లు కచ్చా రోడ్డు మీద వెళ్ళవలసి ఉంటుంది.

## ప్రకృతి సోయగాల నడుమ...

బూర్గుల గ్రామ పరిసరాలు చాలా అందంగా ఉంటాయి. వర్షాకాలంలో పంటలతో పచ్చగా అలరారవలసిన బూర్గుల భూములు ఇప్పుడు మాత్రం బీడుపోయి వర్షానికి పచ్చని గరిక గడ్డి పెరిగి కావాలని పెంచిన లాన్‌లలాగా కనిపిస్తాయి. గుట్టబోర్ల ఏటవాలుల్లో రైతులు మలుచుకున్న చిన్న చిన్న పంటమడులు అలా గరిక గడ్డితో పచ్చని రంగు పులుముకొని ఊటీ, అస్సాం టీ, కాఫీ పైరులను తలపిస్తాయి. ఆ మడుల మధ్య పల్లం వైపు చిన్న చిన్న నీటి పాయలు ప్రవహిస్తున్నాయి. ఆ పచ్చని మడుల మధ్యే అక్కడక్కడా తెల్లతెల్లని ఆవుల మందలు, నల్ల నల్లని బర్రెల మందలు, గొర్రెల మందలు పచ్చిక మేస్తూ తిరుగాడుతాయి. ఇవన్నీ చూశాక ఇక ఊటీ వెళ్ళడం దండగ అనిపిస్తుంది.

ఇక తిరుమలనాథ కొండ ఎక్కిన తరువాత మనల్ని మనం మరచిపోక తప్పదు. ఇంత అందంగా ఉంటాయి దాని పరిసరాలు. తిరుమలనాథ కొండ చుట్టూ సుమారు పది కొండలున్నాయి. వాటిలో అన్నింటి కన్నా పెద్దది ఇదే. కాబట్టి ఈ కొండ పైకి ఎక్కితే మిగతావి చిన్న కుప్పల్లాగా అందంగా కనిపిస్తాయి. ఈ కొండ వాయువ్యంలో ప్రారంభమై ఒక లోయ ఆగ్నేయం వైపు అలవోకగా సాగిపోతుంది. ఈ లోయలో







ఏపుగా పెరిగిన ఎర్రని భూముల మధ్య పచ్చని వలయం లాగా ఒక చిత్రకారుని కాన్వాస్‌పై పెయింటింగ్‌లా కనిపిస్తాయి. వాటి పైనుంచి వీస్తున్న ఈదురుగాలి మన ముంగురులను, దుస్తులను రెపరెప లాడిస్తూ గిలిగింతలు పెడుతుంది. కొండ శిఖరం పైకి ఎక్కి కొండకు తూర్పున కొనసాగుతున్న కచ్చా రోడ్డును చూస్తే అది పచ్చని వెంట్రుకల (పక్కనున్న చెట్లతో కూడిన లోయ) మధ్య గోధుమ వర్ణము పాపిటలాగా అందంగా కనిపిస్తుంది.



తిరుమలనాథ కొండ ప్రకృతి సౌందర్యంతో పవిత్రమైందనడానికి నిదర్శనంగానేమో మనకు ట్రెక్కింగ్ ప్రారంభంలోనే ఒక చిన్న ఏరు జలజలా పారుతూ ఎదురవుతుంది, మన పాదాలను ప్రక్షాళన చేస్తుంది. ఆ ఏరు చుట్టూ ఏడెనిమిది రాతి స్తంభాలు నిలబెట్టి ఉన్నాయి. వాటి దగ్గరకెళ్ళి చూస్తే ఎన్నో ఆసక్తికరమైన విషయాలు తెలుస్తాయి. ఒక్కో స్తంభానికి నాలుగు వైపులు... ఒక్కో పక్క ఒక్కొక్క కథను లేదా పౌరాణిక ఇతివృత్తాన్ని తెలిపే నాలుగైదు శిల్పాలు ఒక్కో అడుగెత్తు చొప్పున చెక్కారు. ఇలాంటి స్తంభాలను శిల్పం నేర్చుకునేవారు గాని, దాతలు గాని చెక్కి(ంచి) ఉంటారు.

అలాంటి ఒక స్తంభానికి పులిని వేటాడుతున్న వీరత్వాన్ని, మద్దెల వాయిద్య నృత్యాలతో కళాకౌశలాన్ని ప్రదర్శిస్తున్న ఒక పురుషుడిని ప్రేమించిన ఒక యువతి, అతనికి పావురంతో తన ప్రేమ సందేశాన్ని పంపి, అతని ప్రేమను గెలిచి, ఆచంద్రతారార్కంగా పెళ్ళి చేసుకొని దాంపత్య సుఖాన్ని అనుభవిస్తున్నట్లుగా శిల్పాలు

చెక్కబడ్డాయి. అయితే చివరిదైన 'పురుషాయితరతి' శిల్పం వామాచార శాక్తేయ మత ప్రాభవాన్ని సూచిస్తుందేమో! ఇంకొక స్తంభ శిల్పంలో కృష్ణుడు కాళీయమర్దనం చేస్తున్న దృశ్యం చెక్కబడింది. మరో స్తంభానికి మూర, గజం, జాన అనే కొలతలు చెక్కి ఉన్నాయి. ప్రాచీనకాలంలో స్థానిక రాజు ఆ ప్రాంతమలో భూములను తన మూర, జాన, గజం, బారెడు (రెండు గజాలు) కొలతలతో ప్రజలు కొలుచుకునేందకు వీలుగా ఇలా అక్కడక్కడా ఏర్పాటు చేశాడట.

ఇలాంటి శిల్పకళాశోభితమైన స్తంభాలు దాటగానే మెట్లు కనిపిస్తాయి. మెట్లకు ఇరువైపులా చిన్నచిన్న రెయిలింగ్స్ ఉంటాయి. ఒక్కో రెయిలింగ్ రాయికి రెండు కొనల్లో రెండేసి గుంతలుంటాయి. ఆ గుంతల్లో పూర్వ కాలంలో పర్వదినాల్లో నూనెపోసి, వత్తులు వేసి వెలిగించేవారట. 'ఎంతటి ఆసక్తిని రేపే ఏర్పాట్లో' అనుకుంటూ మెట్లు ఎక్కుతూ వెళ్తే మనల్ని మరింత ఆనందానికి గురిచేసే శిల్పాలు కనిపిస్తాయి. ఇవి మెట్లకు రెండు పక్కలా అక్కడక్కడా ఉన్న సహజమైన గ్రానైట్ శిలలకు చెక్కబడ్డాయి. ఇలాంటి శిల్పాల్లో ఎక్కువగా హనుమంతుడు వివిధ రూపాల్లో చెక్కబడ్డాడు. తమకు ఆపదలు తొలిగి సంపదలు కలిగినప్పుడు భక్తులు ఇలాంటి శిల్పాలను చెక్కించడం అనాదికాలంలో ఆచారంగా ఉండేది.



## సహజ శిల్ప సౌందర్యం...

తూర్పు నుంచి పడమటివైపు సాగుతున్న మార్గమధ్యంలో ఎడమవైపు పందిరి వేసినట్లు ఒక సహజ శిలాతోరణం ఉంది. దీనిలో పూర్వం ఒక దేవతా విగ్రహం ఉండేదన్నట్లు కనిపిస్తుంది. కనుకనే దాని చుట్టూ ప్రదక్షిణ పథం ఉంది. అదీ సహజ శిలలదే!

ఈ సహజ శిలాతోరణం ముందు నిల్చుని ఉత్తరం వైపు చూస్తే ఊపిరి పీల్చుకుని, గుండెమీద చేయివేసుకుని 'అమ్మ ఎంత అందమైన శిలలు' అనిపించే సహజ శిలా శిల్పాలు ఎన్నో కన్పిస్తాయి. ఒక శిలా సముదాయంలో మొగ్గ విప్పిన రేకులతో కమలం, తిరునామాలు కనిపిస్తే... మరో శిలా సముదాయంలో ఎత్తు మీదున్న కప్పను ఒక తాబేలు ఎగిరి పట్టుకునే ప్రయత్నం చేస్తున్నట్లుంటుంది. ఇంకొక శిల ఎలుగుబంటి ఆకారంలో ఉంటుంది. ఇలాంటి సహజ శిలాకృతులు కొన్నింటిని హైదరాబాద్‌లోని శిల్పారామంలో చూస్తాం. అయితే అవి ఎక్కడినుండో తెచ్చి కృత్రిమ వాతావరణంలో పెట్టినవి. కాని ఈ తిరుమలనాథ కొండ మీద ఉన్నవి సహజ వాతావరణంలో అత్యంత సౌందర్యంతో భాసిల్లుతున్నవి.

## కోటగోడలు - యుద్ధపు ఆనవాళ్ళు...

తిరుమలనాథ కొండ ప్రాంతం ఒక ప్రాంతీయ రాజ్య ప్రాధాన్యమున్న స్థలంగా కనిపిస్తుంది. కొండ ఎక్కడానికి ముందే ఒక వీరుని శిల్పం (వీరగల్), వీరధ్వజ స్తంభం కనిపిస్తాయి. వాటి ఆధారంగా అక్కడ ఈ మధ్య ఒక హనుమాన్ మందిరం కట్టారు. తమ ప్రజల సంక్షేమం కోసం శత్రుసైన్యాలపై పోరాడి వీరమరణం పొందినవారికి గుర్తుగా ఇలా వీరగల్లు శిల్పాలని చెక్కించే ఆచారం మూడు నాలుగు వందల సంవత్సరాల క్రితం వరకూ మనుగడలో ఉండేది. ఈ నేపథ్యంలో ఇక్కడ ఎప్పుడు ఎవరెవరికి యుద్ధం జరిగిందో పరిశోధించవలసి ఉంది.

ఇక సహజ శిలా మండపం మొదలుకొని మనకు మెట్లెక్కుతున్నప్పుడు రెండు పక్కలా కోటగోడను నిర్మించినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. మెట్లెక్కడం పూర్తయినాక సమతలంలో రెండు మూడు ఆలయాలున్నాయి. ఈ సమతలం చుట్టూ కోటగోడ ఉంది. అంటే దేవాలయాల చుట్టూ కోట గోడ కట్టారన్నమాట. అలాంటి రక్షణ గోడ కట్టడం వలన పశ్చిమాభిముఖంగా ఉన్న ప్రధానాలయానికి ముందర రెండు సహజ కుంటలున్నాయి. మరో కోనేరును దానికి సమీపంలో కట్టారు. ఈ మూడు నీటి వనరులు యుద్ధ సమయాల్లోనూ, సాధారణ సమయాల్లోనూ ఈ కొండపైనున్నవారికి అవసరాలు తీర్చేవన్నమాట. ప్రధానాలయ గోపురంలో కూడా నలుదిక్కులా శత్రువులపై ఆయుధాలను ప్రయోగించే ఏర్పాట్లు (గూడులు) ఉన్నాయి. తెలుగు దేశంలో ముస్లింలు ప్రవేశించాక (14-16 శతాబ్దాల) వారి వల్ల హిందూ దేవాలయాలకు రక్షణ కరువైందని, అందుకే వారి బారినుంచి తమ దేవాలయాలను రక్షించుకునేందుకు హిందువులు వాటి చుట్టూ రక్షణ కోటగోడలను నిర్మించుకున్నారని కొందరు చరిత్రకారులు చెప్తారు. అలాంటి ఏర్పాట్లనే మనం ఇక్కడ చూస్తాం.

## ఆలయం వైచిత్ర్యం...

ప్రధాన దేవాలయం కాలక్రమంలో ఎన్నో మార్పుచేర్పులకు గురై విచిత్రంగా కనిపిస్తుంది. సాధారణంగా హిందూ దేవాలయాలన్నీ తూర్పు దిక్కుకు అభిముఖంగా

ఉంటే దీనికి మాత్రం పశ్చిమపు వాయువ్య ద్వారాలు ప్రధాన ద్వారాలు కాగా ఉత్తరాభిముఖంగా రెండు ద్వారాలు, దక్షిణ ఆగ్నేయంలో మరో ద్వారం ఉంది. దేవుడిని కూడా తిరుమలనాథుడని, వేంకటేశ్వరుడని, సీతారాముడని, విష్ణువని రకరకాల పేర్లతో పిలుస్తున్నారు. ఆలయానికి దక్షిణం, పశ్చిమ దిశల్లో మంటపాలున్నాయి. ఉత్తర దిశకు ఉన్న గుండ్లకు హనుమాన్, గరుత్మంతులవి రెండేసి విగ్రహాలు తొలిచి ఉన్నాయి. ఆలయ భాగంలోనే ఈశాన్యంలో అమ్మవారి గుడి ఉంది. గర్భగృహానికి ఉత్తరంగా ఉన్న రంగమంటపం నల్లరాతి స్తంభాలతో శిల్పకళాశోభితమై చూపరులను కట్టిపడేస్తుంది.

ఆలయం చుట్టూ ప్రదక్షిణ పథం ఉంది. ఆలయం వెనుక వైపున్న సహజ శిలలు, గుహలు మన దృష్టిని విశేషంగా ఆకర్షిస్తాయి. ఆలయానికి వాయువ్యదిశలో ఆళ్వార్ల మందిరం ఉంది. నైరుతి దిశలో కొంత దూరాన మరో మందిరం ఉంది. దాన్ని హనుమాన్ మందిరం అంటున్నారు. కాని అందులోని రాయికి చెక్కిన విగ్రహం మాత్రం హనుమంతుని చిత్రంలా లేదు. ఈ మందిరానికి తూర్పున ఉన్న ఇంకో చిన్న మందిరాన్ని ఇటీవలే దుండగులు ధనం కోసం ధ్వంసం చేశారు. ప్రధానాలయానికి ఎడమపక్కన ఒకప్పుడు ఒక పెద్ద మఠం లేదా సత్రం ఉండేదనడానికి నిదర్శనంగా దాని పునాదులు కనిపిస్తున్నాయి. ఇప్పుడు ఈ పరిసరాల్లో మేకలు మేస్తున్నాయి. అదొక అందమైనప్పటికీ 'ఓడలు బళ్ళు – బళ్ళు ఓడలు అవుతాయి' అనే సామెత గుర్తురాక తప్పట్లేదు.



## శాసనాలు – చరిత్ర...

ఆలయం ముందు ధ్వజస్తంభం నిలబెట్టిన గుండు కింద రెండు గజాల పొడవుతో ఏడు వరుసల శాసనం ఒకటి ఉన్నది. ఆలయపు కుబేరస్థానమైన ఉత్తర దిశలో ఉన్న గుండుకు చెక్కిన హనుమ, గరుత్మంత శిల్పాల కింద రెండున్నర గజాల పొడవుతో నాలుగు వరుసల శాసనం మరొకటుంది. ఇవి రెండూ ఒకదాని తరువాత మరొకటి కాకతీయుల తరువాతి కాలంలో... అనగా 14 నుంచి 16 శతాబ్దాల మధ్య (రాచకొండ పద్మనాయక రాజుల) కాలంలో చెక్కినట్టుగా లిపి పద్ధతిని బట్టి అర్థమవుతున్నది. మొదటి శాసనానికి భక్తులు సున్నం, జాజు పూశారు. కాబట్టి దాన్ని శుభ్రంగా కడిగి కాపీ (నకలు) చేస్తే ఆలయపు అసలు చరిత్ర బయటికొస్తుంది. ఏమైనా ఈ శాసనాలు ఇక్కడి ఆళ్వార్ల సన్నిధి, హనుమ, గరుత్మంత విగ్రహాలు ఒకే కాలానికి చెందినవని చెప్పవచ్చు.




అయితే ఆలయ చరిత్ర మాత్రం మరో వేయి సంవత్సరాలు ముందుకెళ్తుందని అనడానికి ఇక్కడ నిదర్శనాలున్నాయి. మొదట ఈ క్షేత్రం ఒక స్త్రీ దేవతదని తెలుస్తోంది. విగ్రహారాధన ప్రారంభమైనప్పటి నుంచీ స్త్రీ దేవతారాధన ఉంది. చారిత్రక యుగం తొలినాళ్ళలో స్త్రీ దేవతన 'హారతి' అనేవారు. తొలి చాళుక్యులు ఆమెకు మొట్టమొదటి గుహాలయాలు కట్టించారు (క్రీ.శ. 7వ శతాబ్దంలో). వారి కాలపు నిరాడంబర స్తంభాల మంటపం, స్తంభాల కింద పూర్ణకుంభ శిల్పాలు, పై ద్వారబందానికి గజలక్ష్మి శిల్పం మొదలైన వాస్తు శిల్ప విశేషాలను ఇక్కడి ఆలయంలో చూడవచ్చు. తరువాత వచ్చిన మలి చాళుక్యులు 10-11 శతాబ్దాల్లో ఈ ఆలయపు దక్షిణ మంటపాన్ని నిర్మించి మరికొన్ని నిర్మాణాలు చేయించి ఉంటారు. ముందున్న శిథిల సీతారామాలయంలోని సీత విగ్రహం పద్మాసనంలో యోగస్థితిలో ఉన్నది. మరోచోట చింతచెట్టు కింద ఆసీనురాలైన స్త్రీ దేవతా విగ్రహం ఉన్నది. ఇవి కూడా మలి చాళుక్యుల కాలం నాటివే అయ్యుంటాయి.

కాకతీయులు (12, 13 శతాబ్దాలు) ఇక్కడి ప్రధానాలయానికి అందమైన రంగమంటపాన్ని కట్టించారు. వీరి తరువాత ఇక్కడ భైరవోపాసన కూడా జరిగిందనడానికి నిదర్శనంగా కొండ మెట్లకు కుడివైపున భైరవ శిల్పం కనిపిస్తుంది. ఈ శిల్పం ఆధారంగా 15, 16 శతాబ్దాల్లో... అంటే రాచకొండ రాజుల కాలంలో ఈ ఆలయం ఇప్పుడు కనిపిస్తున్న వైష్ణవాలయ రూపాన్ని సంతరించుకున్నదని చెప్పవచ్చు. ప్రస్తుతం ఇక్కడ సంక్రాంతి పండుగకు జాతర జరుగుతుంది.

ఇలా చారిత్రక విశేషాలకు, సహజ సౌందర్యానికి నిలయమైన ఈ తిరుమలనాథ కొండ హైదరాబాద్ నగరానికి చేరువలో ఉండి వారాంతపు పర్యటనలకు అనుకూలంగా ఉండడం విశేషం.

– సూర్య దినపత్రిక

*14-08-2012*

# 13

# అలనాటి అతిపెద్ద గణపతి

వక్రతుండ మహాకాయ!

సూర్యకోటి సమప్రభ!

అంటూ సాగే పాటను మనం వినాయక చవితి పండుగ సమయంలో వింటుంటాం. మరి ఆ పల్లవిలోని పదాలకు అర్థమేమిటి? వాటికి నిదర్శనమైన వినాయక విగ్రహం ఎక్కడుందని ఎప్పుడైనా ఆలోచించారా?



ఇంతకీ ఆ పల్లవికి అర్థమేమిటంటే... వంకర తొండంతో, భారీ శరీరంతో ఉండే గణపతి దేవుడు కోటి సూర్యుల ప్రభలతో ప్రకాశిస్తాడు అని. అలాంటి గణపతి విగ్రహం మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆవంచ గ్రామంలో ఉంది.

హైదరాబాద్-బెంగళూరు రహదారిలో 95 కిలోమీటర్ల ప్రయాణం తరువాత వచ్చే జడ్చర్లకు 12 కిలోమీటర్ల దూరంలో ఉంది ఆవంచ. ఈ గ్రామానికి ఉత్తరంలో పంట పొలాల మధ్యనుంది ఈ భారీ వినాయక విగ్రహం. స్థానికులు దీన్ని 'ఎంకయ్య గుండు' అని పిలుస్తారు.

గుండ్రంగా ఉన్న ఈ గుండు ఎత్తు సుమారు 25 అడుగులుండగా, వెడల్పు సుమారు 15 అడుగులుంటుంది. ఈ గుండునే శిల్పులు ఉండ్రాళ్ళయ్యగా చెక్కారు.

## 900 ఏళ్ళ తొండపయ్య

ఎప్పుడు ఆ విగ్రహాన్ని చెక్కారు? అనే ప్రశ్న వేయదల్చుకున్నారా? మీ ప్రశ్నకు సరైన సమాధానం చెప్పడానికి ఇప్పటివరకైతే శాసనాధారం గాని, సాహిత్యాధారం గాని దొరకలేదు. కాబట్టి సమకాలిక శిల్పాలశైలి అధ్యయనం ఆధారంగా ఆ విగ్రహ కాలాన్ని రాబట్టవలసి ఉంటుంది.


ఆవంచ ప్రాంతం చుట్టు పక్కలా ఉన్న మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లోని

పలు ప్రాంతాలను సుమారు వేయేళ్ళ కిందట కందూరు చోడులు అనే రాజవంశీకులు పరిపాలించారు. వారు 11, 12 శతాబ్దాల్లో కట్టించిన దేవాలయాలు, చెక్కించిన శిల్పాలు వారి రాజధాని నగరాలైన ఆమన్‌గల్లు, కోడూరు, కందూరు, పానగల్లు, మల్లేశ్వరం మొదలైన నగరాల్లో ఉన్నాయి. ఆ నగరాలకు ఈ ఆవంచ దగ్గరలో ఉన్న కారణంగా ఆ నగరాల్లోని శిల్పాలతో ఈ భారీ వినాయక శిల్పానికి ఉన్న పోలికల దృష్ట్యా, ఈ వినాయక విగ్రహాన్ని కూడా కందూరు చోడ రాజులే సుమారు తొమ్మిది వందల ఏళ్ళ కింద చెక్కించారని చెప్పవచ్చు.

## భారతదేశంలోనే భారీ విగ్రహం

1893లో బొంబాయిలో బాల గంగాధర్ తిలక్ ప్రారంభించిన గణపతి ఉత్సవాలు కొద్ది సంవత్సరాల్లోనే హైదరాబాద్‌లో ఆర్య సమాజ్ వారిచే ప్రారంభించబడి గత రెండు వందల సంవత్సరాలుగా భారతదేశంలోనే భారీ వినాయక విగ్రహ ప్రతిష్టకు (ఖైరతాబాద్‌లో) నిదర్శనంగా నిలుస్తున్నాయి. హైదరాబాద్/తెలంగాణ ఘనత ఇంతటితోనే ఆగిపోలేదు. అంతకు ముందు ఏడు వందల సంవత్సరాల కిందనే ఈ ఆవంచ భారీ వినాయక విగ్రహం భారీ విగ్రహ రూపకల్పనకు బీజం వేసి నేటికీ తన స్థానాన్ని నిలబెట్టుకుంటూనే ఉంది.

అనంతపురం జిల్లా లేపాక్షిలో ఉన్న పది అడుగుల ఎత్తైన బసవన్న విగ్రహాన్నే ఇప్పటివరకూ భారీ విగ్రహంగా చెప్తూ వస్తున్నారు. దాని కంటే మూడు రెట్లు ఎత్తైనది,



ఐదు శతాబ్దాల ముందటిదైన ఈ ఆవంచ వినాయకుని గురించి చెప్పుకోకపోవడం విద్దూరం!


## ఈ వినాయక విశిష్టత


తెలంగాణలో వెయ్యేళ్ళ కిందట హిందూ మతంలోనే షణ్మతాలు (ఆరు రకాల దైవాలు) వర్థిల్లాయి. అందులో ఒకటి గాణాపత్యం. అంటే ఈ మత శాఖకు చెందిన భక్తులకు ప్రధాన దైవం గణపతి. అతని తల్లిదండ్రులైన శివుడు (శైవం), పార్వతి (శాక్తేయం) కూడా వారికి ప్రధాన దైవాలు కారు. అంతగా వారు గణపతి పూజకు ప్రాధాన్యమివ్వటానికి ఈ ఆవంచ భారీ గణపతి విగ్రహం కూడా ఒక ప్రధాన కారణమని ఎవరికైన సులభంగానే అర్థమౌతుంది.

## మహాకాయునికి మహర్దశ

ఈ మహాకాయునికి త్వరలోనే మహర్దశ పట్టనుందని ఇటీవలి పరిణామాల కారణంగా తెలుస్తున్నది. కొద్ది సంవత్సరాల కిందట మహారాష్ట్రలోని ఒక భక్త సమాజం ఒక కోటి రూపాయల పెట్టుబడితో ఈ వినాయకుడికి ఒక భారీ గుడిని కట్టిద్దామని ప్రణాళిక సిద్ధం చేసుకుందట. ఈ ఆవంచ గ్రామానికే చెందిన ఎం.ఎల్.ఎ. లక్ష్మారెడ్డిగారు కూడా ఐదేళ్ళ కిందటే రాష్ట్ర పురావస్తు నిపుణులు డా॥ఈమని శివనాగిరెడ్డిగారికి ఈ విగ్రహాన్ని చూపించి అభివృద్ధి ప్రణాళికలు సూచించుమన్నారట.

మొత్తమ్మీద వినాయకుడికైతే తాత్కాలిక రేకుల షెడ్డు నిర్మాణమైంది... రెండేళ్ళ కింద. దాన్నిప్పుడు విప్పి కుప్ప పెట్టారు. బోరు తవ్వించారు. విగ్రహం చుట్టు పక్కల 9 ఎకరాల భూమి సేకరించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారు కూడా రెండేళ్ళ కిందట ఈ విగ్రహాన్ని సందర్శించారని స్థానికులు చెప్పారు. కాబట్టి ఈ భారీ వినాయకుడికి, ఆ దేవుడిని సందర్శించే భక్తులకు మహర్దశ పట్టినట్లేనని ఆశావహులు భావిస్తున్నారు.





## విగ్రహ రూపు రేఖలు



ఈ వినాయకుడు "సూర్యకోటి సమప్రభ" అన్నట్లు ఉదయించే సూర్యునికి ఎదురుగా హుందాగా కూర్చుని తొండంతో ఉండ్రాలు/లడ్డు తింటున్నట్టున్నాడు. ఇతని చెవులలోని నరాల గీతలు కోటి సూర్యకిరణాలలాగా ప్రకాశిస్తున్నట్లు ప్రతిబింబిస్తున్నాయి. వినాయకుడి బొజ్జ చుట్టూ పడగ విప్పిన నాగుపాము బంధం అందంగా శిల్పించబడింది. మొత్తంగా చూస్తే ఈ వినాయకుడు తన ప్రసన్న వదనంతో మన సర్వ విఘ్నాలను తొలగించి మనకు శాంతిని ప్రసాదిస్తున్నట్లు కన్పిస్తున్నాడు. ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే!

*– నమస్తే తెలంగాణ దినపత్రిక*
*29-08-2014 (వినాయక చవితి)*

*– దక్కన్ ల్యాండ్ మాసపత్రిక*
*సెప్టెంబర్ 2014*

# 14

# నల్లమలలో చల్లని పర్యటనలు

"నీ కడుపు చల్లగుండ".

పెద్ద మనుషులు మనల్ని దీవించేటప్పుడు మనకు వినిపించే ప్రధాన వాక్యం ఇది. కారణం మనది వేడి ప్రదేశం... కాబట్టి మనకు చల్లదనం కావాలి. వేసవి కాలపు సెలవుల్లో చల్లదనం కోసం కూర్గ్, ఊటీ, కొడైకెనాల్, కుల్లు-మనాలి వంటి ప్రదేశాలకు ప్లాన్ చేసుకుంటుంటాం. డబ్బులు వేస్ట్ చేసుకోకుండా ఒక్కసారి మన తెలంగాణలోనే ఏవైనా చల్లని ప్రదేశాలున్నాయేమో ఆలోచించండి. ఏవీ తట్టలేదా? అయితే ఈ వ్యాసం చదవండి... తెలంగాణలోనూ ఉన్న చల్లని పర్యాటక స్థలాలేవో మీకే తెలుస్తుంది.



చల్లగా ఎక్కడుంటుంది? ఎత్తైన గుట్టలు, జలపాతాలు, నదులు... ఇక్కడేగా చల్లగా ఉండేది. మనది దక్కన్ పీఠభూమి. ఎత్తుగా ఉంటుంది. పైగా నల్లమల పర్వతాలు, దండకారణ్య పర్వత సానువులు కూడా తెలంగాణలో ఉండడంతో ఎత్తైన గుట్టలకు, వాటిపై నుండి దూకే జలపాతాలకు, వాటి మధ్య నుండి పారే నదులకు కొదువ లేదు. మరి చల్లదనానికి కొదువ ఎందుకుంటుంది?

అది సరే. ఇంతకీ ఎక్కడ ఎత్తైన గుట్టలున్నాయి? ఎక్కడ జలపాతాలున్నాయి? ఎక్కడ నదులు అనువుగా ఉన్నాయి?... ఇవేగా మీ ప్రశ్నలు? అయితే చదవండి.

## నల్ల'మలయ' పర్వతాల్లో

తెలంగాణకు దక్షిణాన మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో కృష్ణానది సరిహద్దుగా విస్తరించాయి నల్లమల అడవులు. వీటిల్లో 1978లో పులుల సంరక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఇది భారతదేశంలోనే అతి పెద్ద పులుల సంరక్షణా కేంద్రం. అధికారిక అంచనాల ప్రకారం ప్రస్తుతం నల్లమలల్లో చిన్నవి పెద్దవి కలిపి సుమారు 164

పులులున్నాయట. పులులతో పాటు అనేక జంతువులు, పక్షులు, క్రిమికీటకాలు, వృక్ష జాతులు... ఇలా ఎన్నో వైవిధ్య భరితమైన జీవజాలానికి నిలయమైన నల్లమల అడవులు దేశంలోనే రెండవ అతిపెద్ద అడవులు. వీటి వైశాల్యం 3,568 చదరపు కిలోమీటర్లు. నల్లమల గుట్టల సరాసరి ఎత్తు 914 మీటర్లు. కాబట్టి చల్లగా ఉంటాయి. వాటిమీది నుంచి ఎన్నో జలపాతాలు, వాటి మధ్య నుంచి ఎన్నో ఏరులు పారుతున్నాయి. అవేమిటో... మనం ఈ వేసవి కాలంలో ఎక్కడికి వెళ్ళి చల్లగా, హాయిగా గడపవచ్చో చూద్దాం.

## మల్లెల తీర్థం జలపాతం

హైదరాబాద్ శ్రీశైలం రూట్‌లో వటవర్లపల్లి మీదుగా... బస్సులో గాని, సొంత వాహనంలోగాని ప్రయాణించి ఈ జలపాతాన్ని చేరుకోవచ్చు. మొత్తం 165 కిలోమీటర్ల ప్రయాణం. ఇందులో 40 కిలోమీటర్లు మాత్రం నల్లమల అడవుల్లో రోడ్డుకు ఇరువైపులా జుయ్‌య్... మని ఈదర గాలినిచ్చే ఎత్తైన చెట్ల మధ్య, కోతులు, కొండెంగలు, అడవి కోళ్ళు, నల్లమల ఉడుతలు, నెమళ్ళ మధ్య... ఎర్లీ మార్నింగ్, లేట్ ఈవినింగ్ అయితే ఎలుగుబంట్లు, జింకలు, అడితులు, అడవి పందుల మధ్య ఆసక్తికరమైన అనుభవాలతో ఎంజాయ్ చేస్తూ సాగిపోవచ్చు. అలా మధ్యలో కనిపించిన అటవీ జీవజాలాన్ని ఉచితంగా ఫోటోలు తీసుకోవచ్చు కూడా.



ఈ 40 కిలోమీటర్ల అటవీ ప్రయాణంలో మనకు అటవీ జీవజాలం మాత్రమే కాదు అడవుల్లో నివసించే చెంచులు, లంబాడీలు, వారి పెంటలు, తండాలు... అంటే చిన్న చిన్న గ్రామాలు... వారి వేషభూషాదులు, తిండి తిప్పలు... అన్నీ మనకు కొత్తగానే కన్పిస్తాయి. అవన్నీ మనమో, మన పూర్వీకులో దాటి వచ్చారనుకుంటే మనకు ఒక ఆశ్చర్యకరమైన ఆసక్తి ఏర్పడుతుంది.

ఇక ఈ అడవుల్లో ఎన్నో ఘాట్లు, మూల మలుపులు, వాటిపై ప్రయాణిస్తున్నప్పుడు, వాహనాల్లో నుంచి లోయల్లోకి చూస్తున్నప్పుడు మనం ఎంత ఉన్నత స్థితిలో ఉన్నామో తెలిసి పులకించిపోతాం. అదే లోయలో ప్రయాణిస్తూ కొండల అంచులను చూస్తున్నప్పుడు మనం ఎంత కింది స్థితిలో ఉన్నామో కూడా తెలుస్తుంది. ఇక పీఠభూమి సమతలంపై ప్రయాణిస్తున్నప్పుడు ఎత్తైన పచ్చని చెట్ల వరుసల మధ్య





నల్లని సన్నని పాపిట దూరంగా పరుగెత్తుతున్నట్లు కనిపిస్తుంది... ఇలా నల్లమలలో చేసే ప్రయాణమే ఒక పరవశం.

మల్లెల తీర్థం జలపాత నిర్వహణను సార్లపల్లి–కుడిచింతలబైలు అనే చెంచు పెంటలకు చెందిన స్థానిక చెంచు గిరిజనులకు అప్పజెప్పారు. వారి దగ్గర టికెట్లు తీసుకుంటుండగానే మనకు జలపాతపు హోరు వినిపిస్తూనే ఉంటుంది. కాని దాన్ని చూడటానికి మాత్రం సుమారు మూడు వందల మెట్లు దిగవలసి ఉంటుంది. సగం మెట్లు దిగుతుండగానే ఎడమ వైపు చెట్ల మధ్య నుంచి నురగలు కక్కుతూ దూకే జలపాతం మనల్ని ఉవ్విళ్ళూరిస్తుంది. ఇక కాళ్ళకు ఎక్కడ లేని శక్తి వచ్చి జలపాతం వైపు పరుగెత్తుతాం. దగ్గరికి వెళ్ళే వెళ్ళక ముందే మన కళ్ళ ముందు అద్భుతమైన అందమైన జలపాతం ఆవిష్కారమవుతుంది.

మల్లెల తీర్థం జలపాతం ఎత్తు సుమారు వంద అడుగులు. రెండు పర్వత సానువుల మధ్యనున్న లోయలో నుంచి ఒక ఏరు పారుతూ వచ్చి అకస్మాత్తుగా మరో లోయలోకి దూకుతుంది. దూకే క్రమంలో జలధారలు మల్లెపూవుల ఆకారం తీసుకోవడమే కాకుండా మల్లెల వలె చల్లగా కూడా ఉంటాయి కాబట్టి ఈ జలపాతానికి మల్లెల తీర్థమని పేరు. అయితే జలపాతానికి కుడివైపునున్న ప్రాచీన శివలింగాన్ని సుమారు రెండు వేల మూడు వందల ఏళ్ళ కింద మౌర్య చక్రవర్తి చంద్రగుప్తుని కూతురు చంద్రావతి ప్రతిష్టించి మల్లెపూలతో పూజించడం వల్ల ఇక్కడి జలపాతానికి మల్లెల తీర్థం అని పేరు వచ్చిందని స్థానిక / పురాణ కథనం.

ఈ జలపాతం అందమైనది మాత్రమే కాకుండా ఆహ్లాదకరమైంది కూడా. చాలా జలపాతాలను చూడడమే కాని వాటితో కలిసిపోయి ఆనందించలేము. మల్లెల తీర్థం జలపాతం కింద మాత్రం స్త్రీ, బాల, వృద్ధులు, యువకులు అందరూ స్నానం చేయవచ్చు. కొండ మీద నుంచి గుండంలోకి జలపాతం దూకేటప్పుడు కొండ చరియకు, గుండానికి మధ్య ఏర్పడిన ఆ ఖాళీ స్థలంలోకి మనం వెళ్ళి ఎంచక్కా జలపాత ధారల కింద ఎంజాయ్ చేయవచ్చు. మండుటెండలో వెళ్ళిన మనకు జలపాత ధారలు మరీ చల్లగా తగలడంతో అలవోకగా మన నోటి నుండి అత్యుత్సాహంతో కేరింతలు వెలువడతాయి. ఆ కేరింతల ధ్వనులు అక్కడి గుట్టలు, లోయల మధ్య గింగిరాలు తిరిగి వింతైన ప్రతిధ్వనులు వస్తాయి. అలాంటి ప్రతిధ్వనులు అక్కడికి వెళ్ళినవారికే ప్రత్యేకం/సొంతం.

జలపాతం ముందున్న నీటి గుండం కూడా చాలా లోతైనది, విశాలమైనది, అందమైనది. పెద్ద పెద్ద వట వృక్షాలు ఆ గుండం నీటి ఉపరితలంపై తమ కొమ్మలను


వేలాడేయడంతో కన్పించే దృశ్యం ఒక సుందరకాండ.

రెండు గుట్టలను చీల్చుకుంటూ పారుతున్న గుండం నీళ్ళు అలా ఉత్తరం వైపు ముందుకు సాగుతూ అల్లంత దూరంలో ఒకటి తర్వాత ఒకటి చొప్పున మరో ఆరు జలపాతాలను ఏర్పరుస్తాయట. ఆ ఏరుకు ఇరువైపులా ఉండే ఒడ్ల మీది నుంచి నడుచుకుంటూ వెళ్ళి వాటినీ చూడవచ్చు. కాని మధ్యలో చాలా గుబురు పొదలు అడ్డుతగుల్తాయి. అంతేకాదు, ముందుకు వెళ్ళినకొద్దీ అడవి చిక్కనవుతుంది కాబట్టి అడవి జంతువుల సంచారం కూడా ఉంటుంది. కాబట్టి గుండం ముందు ఫర్లాంగు దూరంలో ఉన్న విశాలమైన స్థలంలో నీటి అంచున చెట్ల నీడలో కావలసినంత సేపు కాలం గడిపి వెనుదిరగడం శ్రేయస్కరం. ఇప్పుడిప్పుడే ఇక్కడ పర్యాటకుల వసతి ఏర్పాట్ల గురించి ఆలోచిస్తున్నారు. అయితే ఇప్పటికే ఇక్కడ స్థానిక గిరిజనులు టిఫిన్స్, స్నాక్స్ పర్యాటకులకు అందుబాటులో ఉంచారు.

ఇక తిండి, వసతి సౌకర్యాలు కూడా ఈ జలపాతానికి 25 కిలోమీటర్ల దూరంలో హైదరాబాద్ వైపున్న మన్ననూరిలోని చీతల్ రెస్టారెంట్‌లోను, 25 కిలో మీటర్ల దూరంలో శ్రీశైలం వైపున్న దోమలపెంట వనమయూరి గెస్ట్ హౌజ్‌లోను అందుబాటులో ఉన్నాయి. వనమయూరి గెస్ట్ హౌజ్ కృష్ణానది ఒడ్డున ఉంది కాబట్టి, శ్రీశైలం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్స్ నల్లమల పర్వత సానువుల్లో చిక్కుకున్న అందమైన దృశ్యాన్ని, ఆ నీటి పైనుంచి వచ్చే చల్లగాలులను ఆ గెస్ట్ హౌజ్‌లో ఉండి ఆస్వాదించవచ్చు. చీతల్ రెస్టారెంట్ (వనమాలి గెస్ట్ హౌజెస్), వనమయూరి గెస్ట్ హౌజ్... రెండూ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఉన్నాయి కాబట్టి సందర్శకులు ముందే వాటిని బుక్ చేసుకోవలసి ఉంటుంది. వనమాలి గెస్ట్ హౌజ్‌లో ఉన్నవారు ఆ చుట్టు పక్కల్లో ఉన్న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషనల్ సెంటర్‌ను, చెంచు లక్ష్మి అనే గిరిజన మ్యూజియంను, దగ్గరలోని ఉమామహేశ్వరం అనే గుహాలయాన్ని, ప్రతాపరుద్ర కోటను, షావలి దర్గాను కూడా సందర్శించవచ్చు.

## లొద్దిలో మరో జలపాతం

మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్ననూరులో ఉన్న వనమాలి గెస్ట్ హౌజ్ నుంచి శ్రీశైలం వైపు వెళ్తున్నప్పుడు 16 కిలో మీటర్ల దూరంలో రోడ్‌కు కుడివైపున లొద్ది అనే ప్రదేశం ఉంది. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వారి వాచ్‌మన్ గది దగ్గర తమ వాహనాలను ఆపి సుమారు అర కిలోమీటరు దూరం అడవిలో నడిచాక ఒక వింతైన లొద్ది కనిపిస్తుంది. మూడు దిక్కులా వేయి అడుగుల ఎత్తైన గుట్టలు వర్తులాకారంలో





మూసుకోగా తూర్పు వైపు నుంచి పడమర వైపు ప్రవహిస్తున్న ఒక ఏరు (చంద్రవాగు) సుమారు 150 అడుగుల ఎత్తునుండి లోయలోకి దూకుతుంది. ఆ అరుదైన అందమైన దృశ్యాన్ని చూడడానికి మనం తూర్పు వైపున చంద్రవాగును దాటి దక్షిణం వైపు నుండి పావు కిలోమీటరు ప్రయాణించి, ఉత్తరం వైపుకి తిరిగి లోయలోకి చేరుకున్నాక మళ్ళీ పశ్చిమం వైపు నుండి తూర్పు వైపుకి తిరిగి లొద్ది జలపాతం వైపుకు నడిచి చేరుకోవలసి ఉంటుంది. నడువలేనివారు జలపాతం పైనుంచే లోయలోకి చూసి అందులో నుండి వేగంగా వచ్చే ఈదర గాలులను ఆస్వాదించవచ్చు.

లొద్ది జలపాతం తాకిడికి దాని కింద ఒక విశాలమైన గుండం ఏర్పడింది. అందులోని నీళ్ళు చాలా తేటగా, స్వచ్ఛంగా ఉంటాయి. నీళ్ళపైకి గుండం చుట్టూ పెరిగిన పెద్ద పెద్ద చెట్లు వంగి అద్భుత దృశ్యాన్ని ఏర్పరుస్తుంటాయి. గుండం నీళ్ళల్లో ఎవరైనా... ఈత రానివారు కూడా స్నానం చేయవచ్చు. ఎందుకంటే, గుండం లోతు తక్కువగా ఉండి దాని అడుగు పైకే కనిపిస్తుంది.

గుండం తూర్పు అంచున జలపాతం కింద ఒక చదునైన బండ ఉంది. దానిపై నిల్చుని కూడా జలపాతం కింద హొయలు పోవచ్చు. ఆ బండ మీద నిల్చున్న వారు పాపాత్ములైతే వారి మీద జలపాతం దూకకుండా పక్కకు తప్పుకుంటుందని, అది ఈ 'పుష్కర తీర్థం' మహిమ అని 17వ శతాబ్దానికి చెందిన నాగలూటి శేషనాథా చార్యులు 'శ్రీ పర్వతపురాణం'లో వర్ణించారు.

గుండం చుట్టూ గుట్టల సొరికెలు(గుహలు)న్నాయి. వాటిల్లో సునాయాసంగా నడవవచ్చు. జలపాతం వెనుక ఉన్న గుహలో జలపాతపు చల్లని తుంపర్లను ఆస్వాదిస్తూ నడువడం మరువలేని మధురానుభూతినిస్తుంది. ఉత్తరపు గుహ చాలా విశాలమైంది, లోతైంది. కాబట్టి అందులో 1600 సంవత్సరాల కిందనే ఈ ప్రాంతం నుంచి ఎదిగిన విష్ణుకుండి రాజులు శివాలయం కట్టించారు. కాకతీయుల కాలం (క్రీ.శ. 1200)లో మరిన్ని విగ్రహాలు చేర్చారు. ఇక్కడ ప్రతి యేటా తొలి ఏకాదశి పండుగ సందర్భంలో స్థానిక చెంచు గిరిజనుల ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జాతర జరుగుతుంది. ప్రకృతి ప్రేమికులు, చల్లదనాన్ని ఆస్వాదించాలనుకునేవారు మిస్ కాకండి మరి. ప్రధాన గుహ ముందు పైకి చూసి పావు కిలోమీటరు ఎత్తైన గోడ లాంటి గుట్ట నుండి పొడుచుకొచ్చిన రాయికి పెట్టిన తేనె తుట్టెలను చెంచులు ఎలాంటి నిర్మాణాల (మంచెల) సహాయంతో కొట్టుతున్నారో చూసి ఆశ్చర్యపడండి.

గుండం నుంచి పారుతున్న ఏరు వెంట కొంత దూరం వెళ్ళి అక్కడున్న నిటారైన గుట్టను స్త్రీబాలవృద్ధులు కూడా చీమల దండులా నిజాం కాలం నాటి నిచ్చెన నెక్కుతూ 'వత్తున్నాం వత్తున్నాం లింగమయ్యా' అని అరుస్తూ ఎలా వస్తున్నారో చూసి వెనుదిరగండి.



**ఊహకందని వ్యూ పాయింట్స్**

లొద్ది నుంచి శ్రీశైలం వైపు ఫర్లాంగు దూరం ప్రయాణించగానే ఫరహాబాద్ గేట్ వస్తుంది. అక్కడ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వారు ఆరుగురికి ఆరు వందల రూపాయలు తీసుకొని ఫారెస్ట్ జీప్‌లో టైగర్ సఫారీకి తీసుకెళ్తారు. మన అదృష్టాన్ని బట్టి పులులు, జింకలు, ఎలుగుబంట్లు, ముళ్ళ పందులు, అడవి పందులు, అడితిలు వంటి జంతువులు అక్కడక్కడా ఉండే నీటి గుంటల్లో నీళ్ళు తాగడానికి వస్తూ కన్పిస్తాయి. మార్గ మధ్యంలో నిజాం కట్టించుకున్న గెస్ట్ హౌజ్, వంటశాల, గుర్రాల శాలలను చూసి... ఏడెనిమిది దశాబ్దాల క్రితం ఈ అడవుల్లో నిజాం రాకుమారులు వేటాడి ఆ జంతువుల మాంసాన్ని వండించుకుని తిని తాగి ఆనందించిన వైనాన్ని తలచుకుంటే కూడా థ్రిల్ అన్పిస్తుంది.


ఇదే నిజాం రాజులు మరో ఏడెనిమిది కిలోమీటర్ల ప్రయాణం తర్వాత వచ్చే పర్వత సానువు అంచున కూడా గెస్ట్ హౌజ్ కట్టించారు. వాటిని పదిహేనేళ్ళ క్రితం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిత్వ హయాంలో పునరుద్ధరించి వసతి యోగ్యంగా చేశారు. కాని, నక్సలైట్లు పేల్చేశారు. అట్లని నిరుత్సాహపడకండి. ఆ శిథిల గెస్ట్ హౌజ్‌ల ముందర ఉన్న గుట్ట కొసకెళ్ళి చూడండి... భయము ప్లస్ అనిర్వచనీయమైన

ఆనందం ఒకేసారి కలిగే దృశ్యం కన్పిస్తుంది. ఆ గుట్ట అంచున నిల్చున్న మన కాళ్ళ కింద కిలో మీటరు లోతైన లోయ, మైదానాలు, వాటిల్లో చిక్కటి అడవుల్లో చిక్కుకున్న పెద్ద పెద్ద చెరువులు కాన్వాస్ మీద గీసిన చిత్రాల్లా కన్పిస్తాయి. మనం ఆ లోయలోకి పడిపోతా మేమోనన్న భయమూ కలుగుతుంది. తల తిరిగినట్లనిపిస్తుంది. అందుకే అక్కడ రైలింగ్ (ఇనుప కంచె) ఏర్పాటు చేశారు... మనం పడిపోకుండా. ఆ కంచె కడీలను పట్టుకొని లోయలోకి చూస్తుంటే ఆ పల్లపు ప్రాంతపు చెట్ల పుప్పొడి (వాసన)ని, నీటి తుంపర్లను మోసుకొంటూ వస్తూ మనల్ని వెనక్కి తోసి పడేసేంత వేగంగా వీస్తున్న ఈదర గాలులను ఆస్వాదిస్తుంటే 'గాల్లో తేలినట్టుందే' అని అరువక మానం.

నిజాం గెస్ట్‌హౌస్ నుంచి రాంపూర్ పెంట మీదుగా కుడివైపు 18 కి.మీ. దూరంలో సలేశ్వరం జలపాతం, గుహాలయాలు ఉన్నాయి. ఇక్కడ స్థానిక చెంచు గిరిజనుల ఆధ్వర్యంలో ప్రతి ఏటా చైత్ర పౌర్ణమికి జాతర జరుగుతుంది.

వ్యూ పాయింట్ మరొకటి ఫరహాబాద్ గేట్ నుండి శ్రీశైలం రూట్‌లో సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. దాని పేరు 'ఆక్టోపస్ వ్యూ పాయింట్'. ఇది కృష్ణానది ఎడమ ఒడ్డున అర కిలోమీటరు ఎత్తులో ఉంది. ఇక్కడ వ్యూ పాయింట్ కియోస్క్ (మెట్ల గూడు) కట్టారు. దానిపై నుంచి శ్రీశైలం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్స్ ఆక్టోపస్ ఆకారంలో పచ్చగా ఉన్న కొండల మధ్య చిక్కి(పోయి)న సౌందర్యం, ఆ నీళ్ళల్లో శ్రీశైలంలోని పాతాళ గంగ నుంచి వీచే చల్ల గాలులకు ఎగిరే మన ముంగురులను సవరించుకుంటూ ఆ ప్రాంతంలో ఎక్కువగా సంచరించే నెమళ్ళను, 2,300 ఏళ్ళనాటి చంద్రగుప్త పట్టణపు శిథిలాలను చూస్తూ ఆనందంతో కడుపు నిండిన స్మృతులతో వెనుదిరగండి.







## అరుదైన అక్కమహాదేవి గుహలు




ఫరహాబాద్ గేట్ నుండి శ్రీశైలం రూట్‌లో వటవర్లపల్లి మీదుగా సుమారు 18 కిలోమీటర్ల దూరం ప్రయాణించిన తరువాత కుడివైపున్న లోయలో 'అక్కమహాదేవి గుహలకు దారి' అనే బోర్డు కన్పిస్తుంది. అక్కడి నుండి సుమారు ఆరు కిలోమీటర్ల దూరం ఆహ్లాదకరమైన ప్రకృతిలో వెలగపండ్లు, పరికి పండ్లు తింటూ ట్రెక్కింగ్ చేసి శ్రీశైలం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్స్ అంచున ఉన్న అరుదైన గుహలను చేరుకోవచ్చు. క్రీ.శ.12వ శతాబ్దంలో ఈ గుహల్లో కర్ణాటక నుంచి వచ్చిన శివభక్తురాలు శ్రీశైలం శివుణ్ని సేవించి తరించడంతో ఆమె పేరు మీద వీటిని అక్కమహాదేవి గుహలు లేదా అక్కమ్మ బిలం అంటున్నారు.



ముందుగా మనల్ని సహజ శిలాతోరణం ఆహ్వానిస్తుంది. తూర్పు పడమర దిక్కుల మధ్య సుమారు 50 గజాల దూరంతో రెండేసి స్తంభాలు ఇరువైపులా సహజంగా ఏర్పడగా వాటిపైన రెండు గజాల మందం, నాలుగు గజాల వెడల్పు, 55 గజాల




పొడవు ప్రమాణాలతో ఉన్న ఒక చదునైన బండను పొందించినట్లున్న సహజమైన ఏర్పాటుంది. ఈ బండ (పందిరి) కింద సుమారు వేయి మంది నిల్చోవచ్చు. ఏవైనా ఆహ్లాదకరమైన కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చు.

అన్నట్టు ఇక్కడ స్థానిక చెంచు పిల్లలు అమ్మే బోలు


అక్కమహాదేవి గుహల ముందు కృష్ణానదీ జలాల్లో బోటు విహారం



పేలాలు ఓ ప్లేటు తిని టీగాని, మజ్జిగగాని తాగి వాళ్ళలో ఒకర్ని గైడ్‌గా తీసుకొని గుహలోకి గబ్బిలాల శబ్దాల మధ్య కొవ్వొత్తి వెలుతురులో మూడు మలుపుల ద్వారా 108 అడుగులు నడిచి గుహ చివరనున్న గజమెత్తు గద్దెపైన సహజంగా వెలిసిన శివలింగాన్ని దర్శించుకుని ఆధ్యాత్మిక ఆనందంతోపాటు అడ్వెంచరస్ థ్రిల్లింగ్‌నీ మన సొంతం చేసుకోవచ్చు. తూర్పునుండి పడమర వైపు సాగే ఈ గుహకు ఎదురుగా మరో గుహ, దానికి సమాంతరంగా ఇంకో గుహ, వీటన్నింటి పైన మరి రెండు గుహలు ఉన్నాయి. పై గుహల్లో ఇప్పటికీ కర్ణాటక నుండి వచ్చిన శివ భక్తులు నివాసం ఉంటున్నారు. కింది గుహల్లో అదే రాష్ట్రానికి చెందిన శివశరణురాలు నివాసం ఉంటున్నది.

ఈ గుహల అంచునే ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో స్నానం చేయడం మర్చిపోకండి. చేస్తూ అవతలి ఒడ్డుపైన అక్కడక్కడా విసిరేసినట్లు కన్పిస్తున్న ఆవులపెంట, చేపలోళ్ళ పెంటలు, సూర్యోదయం, సూర్యాస్తమయం నీళ్ళలో ప్రతిఫలిస్తున్న ప్రతిబింబాల అందాలనూ చూడండి. పాతాళగంగ నుంచి ఇక్కడికి 22 కిలోమీటర్లు పర్యాటక శాఖవారి బోటులో ప్రయాణించి కూడా చేరుకోవచ్చు. తెలంగాణ వైపున్న నీలిగంగ రేవు నుండి ప్రైవేటు బోట్లనూ ఎంగేజ్ చేసుకోవచ్చు. బోటు విహారమూ ఒక థ్రిల్లింగే కదా!

*– నమస్తే తెలంగాణ ఆదివారం అనుబంధం*
*11-05-2014*

డా. ద్యావనపల్లి సత్యనారాయణ

# 15

# పాల్కురికి పేర్కొన్న పర్యాటక స్థలాలు



తెలంగాణ సాహిత్య చరిత్రలో మనకు కనిపించే అతి గొప్ప కవి పండితుడు పాల్కురికి సోమనాథుడు అనేది తెలుగు సాహిత్య లోకానికి తెలిసిన విషయమే. సోమనాథుని రచన 'బసవ పురాణం'కు 1926లో ముందుమాట (విపులమైన పీఠిక) రాస్తూ ఆయన వరంగల్ జిల్లాలోని పాలకురికి గ్రామానికి చెందినవాడు అని వేటూరి ప్రభాకర్ శాస్త్రిగారు రాశారు. ఇంతవరకు బాగానే ఉంది కాని సోమనాథుని కాలం గురించి మాత్రం ఐదు పేజీల చర్చ చేసి ఆయన క్రీ.శ. 1132–1198 మధ్య కాలానికి చెందినవాడు అని అభిప్రాయపడ్డారు. ఇది చారిత్రక సత్యం కాదు. కాబట్టి నాటి నుండి సుమారు మూడు దశాబ్దాలపాటు పాల్కురికి సోమనాథుడు ఎప్పటివాడు అని వాదోపవాదాలు జరిగాయి.

1945లో మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ఒక వ్యాసంలో పాల్కురికి సోమనాథుడు క్రీ.శ. 1290–1320 ప్రాంతానికి చెందినవాడు అని చారిత్రకాధారాలతో నిరూపించాడు. కాకతీయ రాణి రుద్రమదేవి సామంతుడు, శత్రువు అయిన అంబదేవుడు క్రీ.శ. 1290–91లో వేయించిన నీల గంగవర శాసనంలో సోమనాథుని సమకాలికులుగా అతని గ్రంథాలలో పేర్కొనబడిన రెంటాల మల్లినాథుడు, దోచమాంబలకు సంబంధించిన విషయాలను సోమశేఖరశర్మగారు ఆధారంగా చూపారు. ఇవే విషయాలను మరిన్ని చారిత్రకాధారాలతో సమన్వయం చేసి 1955లో 'పాల్కురికి సోమనాథుఁడు ఎప్పటివాడు?' అనే పుస్తకంలో నేలటూరి వెంకటరమణయ్యగారు సోమనాథుడు క్రీ.శ. 1280–1340 ప్రాంతాలకు చెందినవాడు అని నిర్ధారించారు. దాంతో తెలుగు సాహిత్య చరిత్రలో ఒక మహా మేధావి కాలం విషయమై స్పష్టత వచ్చింది. అయినా ఇంకా ఈ మధ్య కొందరు ప్రముఖ తెలంగాణ సాహిత్య / చరిత్రకారులు సోమనాథుడు క్రీ.శ. 12వ శతాబ్దానికి చెందినవాడని

పేర్కొంటుండడం శోచనీయం.

పాల్కురికి సోమనాథుడు తెలుగు సాహిత్యంలో పలు కవిత్వ ప్రక్రియలకు ఆద్యుడనే విషయం అందరికీ తెలుసు కాని ఆయన తెలుగులో యాత్రా కథనాలకు (యాత్రా చరిత్రలకు) కూడా ఆద్యుడని కొందరికే తెలుసు. ఆయన అతి గొప్ప రచన 'శ్రీ పండితారాధ్య చరిత్ర'లోని పర్వత పక్రరణం క్షుణ్ణంగా చదివితే అది ఎంత గొప్ప యాత్రా రచననో అర్థమవుతుంది.

పర్వత ప్రకరణం శ్రీశైల పర్వతం పైనున్న సందర్శనా స్థలాల గురించి వర్ణిస్తుంది. అలాంటి 'కొన్ని స్థలాల'ను పేర్కొంటున్నాను అని చెప్తూ డా॥చిలుకూరి నారాయణరావుగారు 408 స్థలాల లిస్ట్ ఇచ్చారు – 'శ్రీ పండితారాధ్య చరిత్ర' ఉపోద్ఘాతంలో, 1939లో. వీటిల్లో 45 స్థలాలు మాత్రం పాల్కురికి సోమనాథుని మరో రచన 'బసవ పునాణం'లోనివని పేర్కొన్నారు. నారాయణరావుగారు నిజాయతీగా పేర్కొన్నట్లు ఆయన తన లిస్ట్‌లో ఎన్నో స్థలాలను పేర్కొనడం మరిచిపోయినట్లు నేను అనుభవపూర్వకంగా గమనించాను.



క్రీ.శ. 12వ శతాబ్దంలో బసవేశ్వరుడు అనేవాడు వీరశైవం అనే మత శాఖ ఆవిర్భవించడానికి మూల కారకుడు. ఆయన జ్ఞాని అయింది, సమాధి అయింది మహబూబ్‌నగర్ జిల్లాలోని కూడలి సంగమేశ్వరంలో. ఆయనకు ఏకలవ్య శిష్యుడు మల్లికార్జున పండితారాధ్యుడు. ఈయన అదే జిల్లాలోని ఉమామహేశ్వర క్షేత్రంలో ప్రారంభమయ్యే నల్లమల పర్వతరాజాన్ని పెద్ద శివలింగంగా భావించి దాన్ని తన పాదాలతో తొక్కుతూ ఎక్కడానికి ఇష్టపడక తన శిష్యుడు దోనమ రాజయ్యను శ్రీశైల క్షేత్రమును, దాని పరివార ఆలయాలను దర్శించుకుని రమ్మని పంపించాడు. ఆయన శ్రీశైల ఉత్తర ద్వార క్షేత్రమైన ఉమామహేశ్వరంతో ప్రారంభించి సుమారు 400 తీర్థ క్షేత్రాదులను దర్శించినట్లు పర్వత ప్రకరణంలో ఉంది. వాటన్నింటిని క్రీ.శ. 1167–68లో దోనమయ్య దర్శించాడో లేదోగాని పాల్కురికి సోమన మాత్రం క్రీ.శ. 1280 ప్రాంతంలో తప్పకుండా దర్శించి ఉంటాడు. దర్శించనిది వాటి గురించి రాయలేదు గదా! ఆయన దర్శించిన స్థలాలు ఇప్పటికీ ఇంచుమించుగా అవే పేర్లతో ఉన్నాయి.

పాల్కురికి సోమన స్ఫూర్తితో నేను పర్వత ప్రకరణంలో పేర్కొన్న తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన స్థలాలనన్నింటినీ తిరిగి చూశాను. నేను కూడా దోనమయ్య, సోమనలాగా ఉమామహేశ్వర క్షేత్రం నుండే నా పర్యటనను ప్రారంభించాను. ఆ క్షేత్ర అభివృద్ధికై అప్పటికే అర్ధ శతాబ్దం క్రితం నుండి కృషి చేస్తున్న శ్రీ మర్యాద గోపాలరెడ్డిగారిని కలిసి, ఆయన శ్రీ గడియారం రామకృష్ణశర్మగారిచే 1974లో

రాయించిన 'శ్రీ ఉమా మహేశ్వర క్షేత్రము' పుస్తకాన్ని తీసుకుని చదివి, తద్వారా 'పర్వత ప్రకరణం' ప్రాముఖ్యాన్ని తెలుసుకొని, దాని ఆధారంగా అందులో పేర్కొన్న అన్ని స్థలాలను సందర్శించాలని సమాయత్త మయ్యాను. కాని ఈ క్రింద పేర్కొన్న స్థలాలను స్థానికులు కూడా అప్పటికే మరిచిపోయారు.

1 ఉమామహేశ్వరంలోని పెద్ద వాద్యం (అర్ణవ ఘోషణం)
2 కుబేరేశ్వరం
3 సిద్ధేశ్వరం
4 కుర్వదారులు
5 గుప్త మల్లికార్జునం
6 శివపుర ద్వారం
7 చతుర్ముఖ బసవేశ్వరం
8 కన్యాసిద్ధనాథని బిలం, భవనం
9 మందాకిని
10 గోమాతృ పంచకం / నాగపంచి / మాతంగేశ్వరం
11 గుప్త మహేశ్వరం
12 చరుకేశ్వరం
13 సంధ్యా సమాధి
14 దేవహ్రదేశ్వరం / రామేశ్వరం
15 కాలహ్రదేశ్వరం
16 వేద పర్వతం / అశ్వమేధ శిలోచ్చయం
17 శ్వేతాద్రి / లింగశృంగం
18 గుండ శిఖరి
19 కిన్నెరేశ్వరం

ఈ స్థలాలన్నింటినీ నేను గుర్తించాను. ఇందుకు నేను 'పర్వత ప్రకరణం' పదేసిసార్లు క్షుణ్ణంగా చదివాను. దాని ఆధారంగా దాని తర్వాత రెండు శతాబ్దాలకు రచించబడిన శ్రీ నాగలూటి శేషనాధాచార్యుని 'శ్రీ పర్వత పురాణం' చదివాను. స్కాంద పురాణాంతర్గత శ్రీశైల ఖండం, శ్రీ ఉమామహేశ్వర జీర్ణోద్ధారణ (జంగం కథ) తదితర గ్రంథాలు, శాసనాలను చదివాను. వాటిల్లోని ఆయా అంశాలను సమన్వయం చేయడానికి మాటి మాటికి అక్కడి మన్ననూరు కేంద్రంగా అనేక స్థలాలను అనుమానించి తిరిగాను, వెతికి వెలికి తీశాను. అయినా ఇంకా కొన్ని స్థలాలను

మాత్రం ఇప్పటికీ తెలుసుకోలేక పోయాను. అవి ఇక ఎప్పటికీ తెలియవేమో! కారణం అవి వ్యవసాయ విస్తరణలో తమ ఉనికిని కోల్పోవడమో లేక పాల్కురికి వాటిని తెలుగులో కాక సంస్కృతీకరించి పేర్కొనడం వల్ల మనమిప్పుడు గుర్తించలేకపోవడమో జరిగి ఉంటుంది. అయితే అవి అంత ప్రధానమైన స్థలాలు అయ్యుంటే నా తీవ్ర ప్రయత్నంలో తెలిసి ఉండేది. కొన్ని స్థలాలనేమో తెలుసుకోవడానికి వీలు లేకుండా పోయింది. కారణం అవి నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులలో మునిగిపోయాయి. అవి నల్గొండ జిల్లా ఏలేశ్వరం, మహబూబ్‌నగర్ జిల్లా మల్లేశ్వరం (కొల్లాపురం) ప్రాంతాల్లో ఉండేవి.

ఇక ప్రజలు, పండితులకు తెలియక నేను తెలుసుకొని పైన పేర్కొన్న స్థలాలు ప్రధానంగా ఉమామహేశ్వరం – మన్ననూరు పరిసర ప్రాంతాల్లోనే ఉన్నాయి. వీటిల్లో చాలా వాటిని దోనమ రాజయ్య స్వయంగా తిరిగి చూసినట్లు, మరి కొన్నింటినేమో మల్లికార్జున దేవుడు మారువేషంలో ఆయనను తిప్పి చూపినట్లు పాల్కురికి సోమన పర్వత ప్రకరణంలో వివరించాడు. పై స్థలాల్లో ఒక్కొక్కదాన్ని గూర్చి చూద్దాం – దోనమయ్య చూసిన క్రమంలోనే.



## 1. అర్ణవ ఘోషణం (పెద్ద వాద్యం)

ఉమామహేశ్వరపురాన్ని వర్ణిస్తూ పాల్కురి సోమన ఇలా పేర్కొన్నాడు.

'అర్ణవ ఘోషణంబట్లహర్నిశము
ఘూర్ణిల్లు బహువాద్య ఘోషంబులదియు
నట్టి మాహేశ్వరోద్యత్పురవరము'

మహేశ్వరపురం ఎట్టిదంటే, ఆ పురంలో పగలు–రాత్రులంతా పెద్ద వాయిద్య, బహు వాయిద్య ఘోషలు విన్పిస్తుంటాయి అని పై ద్విపద పద్య పాదాల భావం. పెద్ద వాద్యం ఇప్పుడు శిథిలమై ఉమామహేశ్వర ప్రధానాలయం నుంచి పాపనాశనం అనే చిన్న జలపాతం వైపు నడుస్తుంటే ఎడమ పక్కన కన్పిస్తుంది. ఆ వాద్యం ఎంత పెద్దదంటే బహుశా అంత పెద్ద వాద్యం ప్రపంచంలోనే మరొకటి ఉండి ఉండదు. దాని పొడవు సుమారు నాలుగు గజాలుండగా, ఎత్తు రెండు గజాలుంది. ఇనుప కమ్మీకి ఏనుగు తోలును వాయిద్య పొరలుగా చుట్టినట్లు కన్పిస్తుంది. దీనిని క్రీ.శ. 5వ శతాబ్దంలో ఇక్కడి నుంచే ఎదిగిన విష్ణుకుండి రాజులు చేయించినట్లుంది. వారి ఒక శాసనంలో ఈ 'భేరి' ప్రస్తావన ఉంది. శ్రీశైలంలో మోగే ఇలాంటి భేరి శబ్దం ఇక్కడి ఉమామహేశ్వరానికి, అక్కడి నుండి కీసర, ఇంద్రపాలనగరం (ఇవీ హైదరాబాదు






శివార్లలో ఉన్న ఆనాటి విష్ణుకుండి రాజుల (ప్రాంతీయ రాజధానులు) వరకు పరంపరగా విన్పించేటట్లు ఆ రాజులు ఏర్పాటు చేసుకున్నారని స్థానిక కథనం.

## 2. కుబేరేశ్వరం

దోనమయ్య ఉమామహేశ్వరున్ని చూసిన తరువాత కుబేరేశ్వర, సిద్ధేశ్వర మొదలైన అనేక లింగాలను, మహేశ్వర బిలాన్ని చూస్తూ వాటి అద్భుత నేపథ్యాలను తెలుసుకొంటూ ఆశ్చర్యచకితుడయ్యాడని పర్వత ప్రకరణంలో కింది విధంగా ఉంది.

'శ్రీ కుబేరేశ్వర సిద్ధేశ్వరాద్య
నేక లింగములు మహేశ్వర బిలము
కనుగొంచు నద్భుతాక్రాంతాత్ముడగుచు'

మహేశ్వర బిలము ఉమామహేశ్వర ఆలయానికి కుడి వైపున కొంచెం దూరంలోనే ఉంది. కుబేరేశ్వరాన్ని ఇప్పుడు ధనంబండగా పులుస్తున్నారు. ఇది రంగాపురం నుంచి ఉమామహేశ్వరం వైపు వెళ్తున్నప్పుడు ఫారెస్ట్‌లైన్ ప్రాంతంలో దారికి కుడివైపున కన్పిస్తుంది. ఇది ఒక పెద్ద పరుపు బండ. ఈ బండ తూర్పు కొసన కుబేరుని శిల్పం చెక్కి ఉంది. దీనికి ఉత్తరాన ఇటుకలతో నిర్మించిన

కుబేరేశ్వరాలయం ఉంది. కుబేరుడు ధనానికి ప్రతీక కాబట్టి ఆ ఆశతో ప్రబుద్ధులు ఈ ప్రాంతంలో విపరీతంగా తవ్వకాలు జరుపడంతో కుబేరేశ్వర ఆలయ పునాదులు కూడా శిథిలమవుతున్నాయి.

'శ్రీశైల ఖండం' ఇక్కడి ఉమామహేశ్వర ప్రాంతం కుబేర స్థలం అని, అతని పట్టణం మొదటి పేరు మణిగిరి అని, తరువాత దాని పేరు చంద్రప్రభ పట్టణంగా మారిందని తెలియజేస్తుంది. గుంటూరు జిల్లాలోని భట్టిప్రోలు శాసన ఫలకాల మీద ఉన్న కుబేరుని పేరును బట్టి, ఆదిలాబాదు జిల్లాలో కుబేరుని పేరు మీదున్న కుబీర్ పట్టణంలో కన్పించే పురావస్తు ఆధారాలను బట్టి కుబేరుడు అనే రాజు తెలుగు దేశాన్ని క్రీ.పూ. 4వ శతాబ్దం ప్రాంతంలో పరిపాలించాడని తెలుస్తున్నది. అప్పటి మణిగిరి పట్టణం క్రీ.శ. 4వ శతాబ్దం నుండి చంద్రప్రభ పట్టణంగా మారిందని చంద్రగుప్తుని కూతురు చంద్రవతి కథ తెలుపుతుంది. ఈ నేపథ్యంలో ఇక్కడి ఆలయాలు చరిత్ర తొలి యుగంలో రూపుదిద్దుకొని ఇప్పటికీ శిథిలమాత్రంగానైనా నిలిచి ఉన్నాయని చెప్పవచ్చు.


## 3. సిద్ధేశ్వరం



పైన పేర్కొన్న ద్విపద పాదాలలో కుబేరేశ్వరం తర్వాత దోనమయ్య చూసింది సిద్ధేశ్వర లింగాన్ని అని ప్రస్తావించబడింది.

ఈ సిద్ధేశ్వర ఆలయం హైదరాబాదు నుండి అచ్చంపేట మీదుగా శ్రీశైలం వైపు ప్రయాణిస్తున్నప్పుడు నల్లమల కొండల ప్రారంభంలో పారే ఒక వాగు కుడి ఒడ్డున ఉంది. 1975లో ఒక ఫారెస్ట్ రేంజర్ (అటవీ అధికారి) ఈ శిథిల ఇటుక ఆలయాన్ని చూసి శిథిలాలను అటూ ఇటూ తన్నుతూ శివలింగాన్ని కూడా తన్నగా అది విరిగిపోయిందట. ఆ తరువాత మనశ్శాంతి లేక ఆ రేంజర్ తన తప్పు తెలుసుకొని ప్రాయశ్చిత్తంగా శిథిల ఆలయ స్థానంలో ఒక షెడ్‌ను కట్టించాడట. అదే ఇప్పుడు ఉంది. చాలా చోట్ల ఉత్తరాభిముఖంగా ఉండే పానవట్టం ఇక్కడ తూర్పుకు అభిముఖంగా ఉంది. చతురస్రాకారంలో ఉన్న ఆ పానవట్టంలో ఒక ఫీట్ ఎత్తు లింగముంది. దానికి ఊర్ధ్వ పుండ్రాలున్నాయి. ఇదే సిద్ధేశ్వర లింగమై ఉంటుంది. ఎందుకంటే, సుమారు అర్థ శతాబ్దం కింద ఇక్కడ రోడ్ వేస్తునప్పుడు దొరికిన సిద్ధుల విగ్రహాలను ఇక్కడున్న 'మూల మలుపు' దగ్గర పోగేశారు. సిద్ధులు స్థాపించిన అరుదైన మరకత లింగం (చిగురు పచ్చనిది) 2010 వరకు కూడా అక్కడే ఉండేది. ఇప్పుడు కొన్ని సిద్ధుల విగ్రహాలు ఇక్కడికి సమీపంలో ఉన్న మన్ననూరు తూర్పునున్న ఒక వేపచెట్టు కింద ఉన్నాయి.

## 4. కుర్వ దారులు




సిద్ధేశ్వరం చూసిన తర్వాత దోనమయ్య 'మల్లికార్జునము' చేరుకోవడానికి సిద్ధేశ్వరం నుండి నేరుగా (అభిముఖుడుగా) అటువైపుగా ప్రయాణిస్తున్న యాత్రికుల బృందంతో కలిసి ఎదురుపడిన గుట్ట (కుర్వ)ను రెండుగా చీలిన దారుల ద్వారా పాకుతూ ఎక్కినాడని తెలిపే కింది పద్య పాదాలు పర్వత ప్రకరణంలో ఉన్నాయి.

'...... మల్లికార్జునము
సన నభిముఖుడుగా సాతును నలరి
భోరున నగమధ్యమున దిగ జాగి
రతి కల్పవృక్షంబు ప్రాకెడు కల్ప
లతయును బోలె నల్లన కుర్వజేరి
యక్కజంబంద స్వర్గాపవర్గములు
నెక్కొని నిల్చిన నిశ్రేణులట్లు
నెక్కొన్న యారెండు నిచ్చెనల్ గడచి'



పై పద్య పాదాలలో దోనమయ్య, యాత్రికులు కొండను సగం దాకా ఎక్కి కొంచెం దిగువ ప్రదేశానికి దిగజారారని, అక్కడ ఒక ఏటవాలు బాట కల్పవృక్షాన్ని పాకుతున్న కల్పలతలాగా కన్పించిందని, ఆ దారిలో కొంచెం ముందుకు ప్రయాణించగా అక్కడ స్వర్గాపవర్గాలకు చేరడానికి వేసిన నిచ్చెనలలాగా రెండు బాటలు కన్పించాయని, వాటిని వారు నిలువునా ఎక్కారని విపులీకరించబడింది.



యాత్రికులు కొండనెక్కారని సరళంగా చెప్పకుండా సోమనాథుడు పైన వివరించినంత పొడవుగా రచించడానికి కారణం ఆ కొండ మధ్యలో చాలా విశేషాలుండడం. ఒకటి, సోమనాథుడు పేర్కొన్నట్లుగానే దోనమయ్య ఎక్కిన కొండను స్థానికులు ఇప్పటికీ 'కుర్వ' గానే

పిలుస్తున్నారు. ఆ కుర్వను సగం దూరం ఎక్కిన తరువాత 'కుంచెన్ మలుపు' అనే స్థలం వస్తుంది. ఇప్పుడు అక్కడి నుంచి కుడివైపు చూస్తే గుట్ట కింది నుండి రెండు బాటలు ఆ మలుపు వైపు కొంత దూరం ప్రయాణించి మధ్యలో కలిసిపోతుండడాన్ని గమనించవచ్చు. ఆ రెండు బాటలూ చిన్న రాతి గోడలవలె, పచ్చని చెట్ల మధ్య సాగే తెల్లని పాపిటలవలె అందంగా కన్పిస్తున్నాయి – ఇప్పటికీ. ఇక కుంచెన్ మలుపు నుండి ఎడమ వైపు కుర్వ పైకి ప్రయాణించే బాటలో ప్రయాణిస్తే 'మల్లికార్జునం' వస్తుందని సోమనాథుడే పేర్కొన్నాడు.

## 5. గుప్త మల్లికార్జునము

దోనమయ్య కుర్వ దారుల్లో మల్లికార్జునం వైపే పయనించాడని ఇంతకు ముందు పేరాల్లో పేర్కొనడం జరిగింది. ఈ సందర్భంలో సోమన ఈ క్షేత్రాన్ని 'మల్లికార్జునము' అనే పేర్కొన్నాడు కాని పర్వత ప్రకరణంలోనే మరో చోట 'గుప్త మల్లికార్జునము' అని పేర్కొన్నాడు. ఇది కుంచెన్ మలుపుకు ఎడమ వైపున కొంత ఎత్తులో ఉంది. కుర్వను పూర్తిగా ఎక్కే పాతకాలపు (దోనమయ్య ఎక్కిన) బాట గుప్త మల్లికార్జున క్షేత్రం గుండానే సాగుతుంది. ఈ మల్లికార్జునం ఆలయం శ్రీశైల పూజారులు చదివే సాంప్రదాయ మహాసంకల్పంలో కూడా పేర్కొనబడుతుంది – దివ్య స్థానంగా. ఈ ఆలయం ఇప్పుడు శిథిలమైంది. చుట్టు పక్కలా పెద్ద పెద్ద చెట్లు పెరిగి ఎండాకాలంలో తప్ప ఇతర కాలాల్లో కన్పించకుండాపోతుంది.



కాకతీయుల కాలం (క్రీ.శ. 1323) తర్వాత ఢిల్లీ సుల్తానుల సైన్యం చేతుల్లో ఈ క్షేత్రం ధ్వంసం అయ్యుంటుంది. ఎందుకంటే ఆ తరువాత శతాబ్ది కాలానికే ఈ క్షేత్ర పరిసరాల్లో ఉన్న ఒక గుండుపైనున్న శాసనంలో ఇక్కడి స్థానిక రాజులు అడవిని పెంచారు అని రాసి ఉంది.

ఇది ఇలా ఉండగా ప్రస్తుత మన్ననూరు తండాకు తూర్పున ఒక కిలో మీటరు దూరంలో 'మల్లప్పగుట్ట' ఉంది. దానిపైన మల్లికార్జున ఆలయముంది. సోమన పేర్కొన్న 'మల్లికార్జునము' ఈ మల్లప్పగుట్ట కూడ కావచ్చు.

## 6. శివపుర ద్వారం

ఉమామహేశ్వరం కొండ పైన శివపురము, దానికి ద్వారము, తీర్థము ఉన్నాయని, అవన్నీ మహిమోపేతమైనవని వాటిని గురించి వింటూ, సంతోషిస్తూ దోనమయ్య మల్లికార్జునము వైపు సాగాడని సోమన ఇలా వర్ణించాడు.

'ఘనమగు తన్నగాగ్రము శివపురము
మహిమయు తద్వార మహిమయు లేర
మహిమయు వినుచు ధీమణి దోనమయ్య
మనమున హర్షించి...'

పై పాదాల్లో పేర్కొనబడిన శివపురం ఇప్పుడు లేదు గాని దాని ద్వారం మాత్రం ఇప్పుడు కుంచెన్ మలుపు దాటిన తరువాత రోడ్ పక్కన గుట్టదరి వైపు కన్పిస్తుంది. ఈ ద్వారానికి పూర్వ కాలంలో తలుపులు కూడా ఉండేవి. ఈ ద్వారం గుండా శ్రీశైలం లేదా ప్రతాపరుద్రకోటలోకి సాగే రాచబాటకు కాపలాదారులుగా పనిచేసిన వారు రాచమల్లు వంశంగా పేరొందినారు. (శ్రీశైల యాత్రికుల కోసం వారు తవ్వించిన బావి ఇక్కడికి ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉంది. దాన్ని రాచమల్ల బావి అనే ఇప్పటికీ పిలుస్తున్నారు). ఈ తలుపుల ద్వారం ప్రాంతాన్ని 'తలుపుల కుర్వ' అని పిలుస్తున్నారు. ఇది దాటి మన్ననూరు వైపు సాగుతున్నప్పుడు మనకు అడ్డంగా ఒక ఏరు కలుస్తుంది. దాని 'తీరం'లో ఒక శివాలయం, దానికి ఈశాన్యంలో ఒక గుండం, దాని ఒడ్డున ఒక శిథిలాలయం కన్పిస్తాయి. ఈ గుండం పాల్కురికి పేర్కొన్న బ్రహ్మగుండం, సమాధి తీర్థం అని స్థానిక చరిత్రకారులు కపిలవాయి లింగమూర్తి భావించారు కాని సమాధి తీర్థం మరోచోట ఉంది. 

## 7. చతుర్ముఖ బసవేశ్వరం

ఉమామహేశ్వరం పర్వంతం పైన తూర్పు దిక్కున ఐదు క్రోసుల దూరంలో ఉన్న రమ్యమైన మునిపురికి పశ్చిమాన చాల అందమైన బిలము, చతుర్ముఖ బసవేశ్వరం ఉన్నాయంటూ పర్వత ప్రకరణంలో పాల్కురికి సోమనాథుడు చతుర్ముఖ బసవేశ్వరం మీద చిన్న పురాణ కథను కూడా చెప్పాడు.

సృష్టి ప్రారంభంలో శివుని ఆజ్ఞ మేరకు వృషాధిపుడు ఇక్కడ వేయి బాణాల ప్రమాణంలో (2000 అడుగుల పొడవు, వెడల్పులతో) వృషభ పురమును కట్టించి, నాలుగు గోముఖాలతో కూడిన వృషభేశ్వర లింగాన్ని ప్రతిష్టించి, తద్వారా సృష్టించిన పశురాశి కన్యాసిద్ధనాథుని భవనాంతరమున ఉన్న బిలం నుండి బయటికి రాగా, వాటిలోని బంగారు రంగుగల ఆవులను ముని కన్యకలు తీసుకొనిపోగా మిగిలిన వాటితో ఇక్కడ పశూత్పత్తి జరిగిందని, ఇక్కడి చతుర్ముఖ లింగానికి దక్షిణాన మందాకిని నది ప్రవహిస్తుందని, దాని తీరంలో ఇంద్రేశ్వరుడు పూజింపబడుతాడని చతుర్ముఖ బసవేశ్వర కథనంలో వర్ణించబడింది.

పై కథనాన్ని పుక్కిటి పురాణం అని కొట్టి పారేయడానికి వీలు లేదు. అందులో చారిత్రక సత్యాలు చాలా ఉన్నాయి. వృషభపురం అని పాల్కురికి సోమన పేర్కొన్న స్థలంలో కొన్ని దశాబ్దాల కిందటి వరకు 'ఆవులపెంట' ఉండేదట. అక్కడ అమరాబాదు జాతికి చెందిన పశువుల ఉత్పత్తి జరిగేదని 1923లో అక్కడి తహశీల్దార్ సయ్యద్ గౌస్ తన ఉర్దూ పుస్తకం 'బాలా-ఎ-కోహ్ అమ్రాబాద్'లో పేర్కొన్నాడు. ఇదే విషయాన్ని మరో ఇరవయేళ్ళ తరువాత ఈ ప్రాంతాన్ని పరిశోధించిన ఆస్ట్రియా దేశపు మానవ శాస్త్రవేత్త హైమండార్ఫ్ కూడా ధృవీకరించారు. సోమన కాలం (క్రీ.శ.1280) నాటికే ప్రాచీనతమమైన పశూత్పత్తి పద్ధతి ఆయన తరువాత 700 సంవత్సరాల వరకూ కొనసాగినట్లూ పై ఆధారాలు తెలియజేస్తున్నాయి.

ఈ వృషభపురము లేదా ఆవులపెంట మునిపురికి పశ్చిమాన ఉందన్నాడు పాల్కురికి. శాసనాల్లో పేర్కొనబడిన మునులూరు (నేటి మున్ననూరు) కొన్ని దశాబ్దాల క్రితం వరకు ఈ వృషభపురానికి తూర్పుననే ఈనాటి మల్లప్పగుట్ట దగ్గర ఉండేదట. అక్కడి గ్రామం కాలిపోవడంతో అక్కడి నుండి ప్రజలు పశ్చిమం వైపు... అంటే వృషభపురం (ఆవులపెంట) వైపు వచ్చి స్థిరపడ్డారు. ఇప్పుడు ఈ స్థలంలో మున్ననూరు తండా ఉంది.



ఈ తండాకు చెందిన వడ్త్యావత్ వశ్యానాయక్ (52 సంవత్సరములు) ఇల్లు కట్టుకోవడానికై పునాదిని తవ్వుతుండగా ఒక అడుగు లోతున 19.07.2005 నాడు చతుర్ముఖ బసవేశ్వర లింగం బయటపడింది. రెండున్నర అడుగుల పొడవు వెడల్పులతో ఉన్న నునుపైన నల్లని అందమైన పానవట్టం పైన అడుగు ఎత్తు శివలింగం, దానికి నాలుగు వైపులా గోముఖాలు (బసవన్నలు) శిల్పించి ఉన్నాయి. దేశంలోనే చాలా అరుదైన శివలింగమిది. పాల్కురికి వర్ణించిన చతుర్ముఖ బసవేశ్వర లింగమిదే. దీని చుట్టుపక్కల ఇళ్ళ పునాదుల్లో ఆలయ శిలలు ఎన్నో ఉన్నాయని ఆ తండా పెద్దలెవర్ని అడిగినా చెప్తారు.

ఉమామహేశ్వరంలోని ఏకాదశ (11) తీర్థాల్లో (వాగు వంకలు, గుండాలు) ఉన్న లింగాలను దర్శించి వందనార్చనలు చేసినా ఫలితముండదు - ముందు ఈ చతుర్ముఖ బసవేశ్వరున్ని పూజించకపోతే - అని పాల్కురికి ఈ ఆలయానికి ఉన్న అత్యంత ప్రాధాన్యతను గూర్చి నొక్కి వక్కాణించాడు.

'ఆ చతుర్ముఖ వృషభాంక లింగంబు
భజియింప నభిమత ఫలములు పొందు
నిజ భక్తి ముక్తులు నెక్కొనజెందు
నట్టి శ్రీ బసవేశ్వరాలయంబంతి

కట్టెదురను గాంచి ఘనుడు దోనమయ్య' శ్రీశైలం వైపు వెళ్ళసాగాడని పాల్కురికి చెప్పాడు. చివరి పాదంలో ఉన్న 'కట్టెదుర' అనే పదంను తరువాతి కాలపు వాగ్గేయకారులు అన్నమాచార్య మొదలుకొని దాదాపు అందరూ కాపీ చేశారు.

చతుర్ముఖ బసవేశ్వరం సోమనాథునికి ఎంత ఇష్టమంటే అతని కొడుకుకు ఆ పేరే పెట్టాడు. మరో కొడుకుకి బసవ పురాణం అనే పేరు పెట్టాడని నిడదవోలు వెంకటరావుగారు 'బసవపురాణం' పీఠికలో రాశారు, 1952లో.

## 8. కన్యాసిద్ధనాథుని బిలం, భవనం

వృషాధిపుడు సృష్టించిన పశురాశి కన్యాసిద్ధనాథుని బిలం నుంచే బయటకు వచ్చాయని, వాటిలో బంగారు వన్నెగల గోవులను ముని కన్యకలు కొనిపోయారని, వారు, మునులు కన్నాసిద్ధనాథున్ని పూజించేవారని, ఆ ప్రాంతంలో కన్యాబిలం, కన్యాసిద్ధ నాథుని భవనం ఉన్నాయని పైన పేర్కొనడంమైంది. మన్ననూరులోని మల్లప్పగుట్ట దగ్గర రెండు దశాబ్దాల క్రితం వరకు కన్యకల బిలం అనే ప్రదేశం ఉ ండేది. అది ఒక గుహ ప్రవేశ మార్గం. ఆ గుహ ఎంత దూరం పోతుందో ఎవరికీ తెలియదు. తెలుసుకోవడానికి సుమారు మూడు దశాబ్దాల క్రితం ఆవులు మేపే ఒక రెడ్డి కుల వ్యక్తి ఆ గుహలోకి వెళ్ళాడట. కొద్ది దూరం వెళ్ళాక అతనికి ఒక సిద్ధుడు కనిపించి 'ఇక మీదట ఈ గుహలోకి రావద్దు. వస్తే వెనక్కి పోలేవు. ఇదుగో నీకొక మందు గుళిక (సిద్ధసాధ్యమైనది) ఇస్తున్నాను. దీన్ని ఎప్పుడూ నీ దగ్గరే ఉంచుకో. నీకు ఏ (ఆరోగ్య) సమస్య వచ్చినా ఈ గుళికలోని గోరెడంత మందును నోట్లో వేసుకో, సమస్య తీరిపోతుంది' అని చెప్పి మందు గుళిక ఇచ్చాడట. సదరు రెడ్డి ఇటీవలే మరణించేంత వరకు ఏ సమస్యా లేకుండా జీవించాడని మన్ననూరు మాజీ సర్పంచ్ మాచయ్య చెప్పాడు.

కన్యకల బిలం ప్రవేశ ద్వారం ఇటీవల కూరుకుపోయి అందులో నీరు నిండడంతో దాన్నిప్పుడు అక్కడి తండా వాసులు కానుగుల బావి అంటున్నారు. ఇక కన్యాసిద్ధనాథుని భవనం లేదా ప్రాసాదం మన్ననూరు తండాలో ఉన్న వేణుగోపాల ఆలయం ముందరున్న ప్రాసాదం అయ్యుంటుంది. ఆ ప్రాసాదం గోడలు, కొన్ని బురుజులు, ఒక బురుజు మీద ఒక ఇల్లు మాత్రం ఇప్పుడు కన్పిస్తున్నాయి.

## 9. మందాకిని నది

చతుర్ముఖ బసవేశ్వర లింగానికి దక్షిణాన మందాకిని నది పారుతున్నట్లు,

దాని తీరంలో ఇంద్రేశ్వరుడున్నట్లు పర్వత ప్రకరణంలో ఉంది. నిజంగానే బసవేశ్వర లింగమున్న మన్ననూరుకు దక్షిణంగా కొల్లంపెంట, కొమ్మన్‌పెంట ప్రాంతంలోని లోయలో 'మందవాగు' పారుతున్నది. దాని ఒడ్డున ఒక అద్భుతమైన శివలింగముంది. ఇదే పాల్కురికి పేర్కొన్న ఇంద్రేశుడు. దీన్ని బ్రాహ్మణులు పూజించేవారట. ఈ శివలింగం పైనే (చుట్టూ) రెండు కాలాలకు చెందిన శాసనాలున్నాయి. మందవాగు పరిసరాల్లోని సుమారు వంద ఎకరాల్లో నవీన శిలాయుగపు (5 వేల సంవత్సరాల క్రితపు) మానవ సంస్కృతి వర్ధిల్లిందని అక్కడ లభించిన చారిత్రక రాతి పనిముట్ల ఆధారంగా తెలుగు విశ్వవిద్యాలయం, శ్రీశైలం కేంద్రం వారు, అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురాతత్వ శాఖ వారు రిపోర్టులు ప్రచురించారు.

## 10. గోమాతృ పంచకం / నాగపంచి / మాతంగేశ్వరం

పర్వత ప్రకరణంలో ఈ మూడు క్షేత్రాలు వివిధ సందర్భాల్లో పేర్కొనబడినా మూడూ ఒకటేనని క్షుణ్ణంగా పరిశీలిస్తే అర్థమవుతుంది. ఈ మూడూ పశువులను, శిశువులను ఇచ్చే దేవతా క్షేత్రాలుగా కీర్తించబడ్డాయి. ఉమామహేశ్వరం దగ్గరి గంగకు తూర్పున నాగపంచి ఉందని పేర్కొనడంతో ఈ క్షేత్రాన్ని గుర్తించడం సులువైంది. ఈ క్షేత్రాన్నిప్పుడు 'మమ్మాయిబోళ్ళు' అని రంగాపురం స్థానికులు పిలుస్తున్నారు. మాతంగినే సామాన్యులు మమ్మాయి అని, శిష్టులు మహామాయి అని అంటారు. పశ్చిమాభిముఖంగా ఉన్న ప్రధానాలయానికి ఎదురుగా పంచ ఆలయాలు, వాటిల్లోని కొన్నింటిలో నాగ ప్రతిమలు (నాగపంచి) ఉన్నాయి. ఇది చాలా ప్రాచీన ఆలయం. కనీసం రెండుసార్లు పునరుద్ధరించ బడింది. ఇప్పుడు శిథిలావస్థలో ఉంది.

పైన పేర్కొన్న నాలుగు క్షేత్రాలు వాటి కథనాలు, వాటి చుట్టు పక్కల లభిస్తున్న చారిత్రకాధారాల మేరకు అవి చాలా ప్రాచీనమైనవని తెలుస్తుంది. మానవ నాగరికతకు తొలి బీజాలు ఇక్కడ కనిపిస్తున్నాయి. మందవాగు చుట్టుపక్కల వేల ఏళ్ళ క్రితపు మానవ జీవన పనిముట్లు లభించాయని పేర్కొనటం జరిగింది. చతుర్ముఖ బసవేశ్వరం వెనుక కూడా అలాంటి రాతి పనిముట్లే లభించాయి. వాటిని మూడు దశాబ్దాల క్రితం గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణా సంస్థకు సంబంధించిన అధికారి డా॥ కంచర్ల మోహనరావు గారు సేకరించి హైదరాబాదులోని నెహ్రూ శత జయంతి గిరిజన మ్యూజియంలో ప్రదర్శనకు పెట్టారు. మన్ననూరు శివారులోని నల్లమల గుట్టల ప్రారంభంలో కనిపించే రాతి కోటను కూడా వేల ఏళ్ళ కిందట ప్రాచీన మానవులే తమను తాము జంతువుల బారినుండి రక్షించుకోవడానికి కట్టుకుని ఉ

ంటారు అని ప్రముఖ చరిత్రకారులు డా॥పుచ్చా వాసుదేవ పరబ్రహ్మశాస్త్రిగారు అభిప్రాయపడ్డారు. మన్ననూరు తండాకు తూర్పున ఉన్న చేలల్లో కూడా రెండు వేల ఏళ్ళనాటి ఇనుపయుగ నాగరికత అవశేషాలున్నాయి. వీటన్నింటినిబట్టి చతుర్ముఖ బసవేశ్వరం (ఈనాటి మన్ననూరు తండా) ప్రాంతంలో మొదట పశుపాలకులు నాగరికతను ప్రారంభించి క్రమంగా ఇనుప లోహ యుగం నుండి వ్యవసాయ నాగరికులుగా రూపాంతరం చెందారని చెప్పవచ్చు. ఇది పాల్కురికి సోమన నాటికే ప్రాచీన చరిత్ర. కాబట్టి ఆయన ఈ చారిత్రక నేపథ్యాన్ని చతుర్ముఖ బసవేశ్వర కథనంలో కొద్దిగా వివరించి చెప్పాడు. ఆయన చారిత్రక దృష్టి అమోఘం.

## 11. గుప్త మహేశ్వరం

పర్వత ప్రకరణంలో దోనమయ్యకు సర్వజ్ఞ మల్లికార్జున దేవుడు వృద్ధ తపస్వి రూపంలో కనిపించి ఉమామహేశ్వరానికి

'తూర్పున చూడు సంస్తుత్యమై గుప్త
మాహేశ్వరంబొప్పు మహిత తల్లింగ
మాహాత్మ్యమది యవాఙ్మనసాత్మకమ్ము' అంటూ గుప్త మహేశ్వరాన్ని చూపించి, సదా స్తుతించబడే ఆ ఆలయంలో మహిమాన్వితమైన శివలింగం ఉన్నదని, దాని మహత్యాన్ని ఊహించలేము, చెప్పలేము అని వివరించాడు. 

దురదృష్టవశాత్తు ఆ శివలింగం ఇప్పుడు లేదు. దుండగుల చేతుల్లో ధ్వంసమైన గుప్త మహేశ్వర శిథిలాలయం మాత్రం ఉమామహేశ్వరానికి తూర్పున ఫారెస్ట్‌లైన్ దగ్గర పారే గుప్త మహేశ్వర వాగు కుడి తీరాన ఉంది. అర్థ మంటపం, అంతరాళం, గర్భ గృహాలతో శిలా నిర్మితమైన ఈ ఆలయం తన అత్యంత ప్రాచీన వైభవాన్ని





చాటుతున్నది. అంతరాళం ద్వారం పై కడపకు లక్ష్మీదేవి విగ్రహముంది.

ఈ ఆలయం ఎదురుగా పడమరన యాభై అడుగుల దూరంలో అత్యంత అరుదైన నంది విగ్రహముంది. ఒక అడుగు ఎత్తు, రెండు అడుగుల పొడవున్న ఆ నంది విగ్రహాన్ని మెత్తటి రాయి నుండి గాని, సున్నపు గారతో గాని శిల్పించారని అర్థమవుతుంది. ఇలాంటి నంది విగ్రహం ఒకటి గుంటూరు జిల్లా అమరావతిలోని అమరేశ్వరాలయంలో ఉంది. అది క్రీ.శ. 2-4 శతాబ్దాల నాటిదని పురావస్తు నిపుణులు ఐ.కె. శర్మగారు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో గుప్తమహేశ్వరంలోని నంది కూడా కనీసం 1600 సంవత్సరాల కిందటిదని నిర్ధారించవచ్చు. పూర్వం ఈ నంది ఆలయ అంతరాళంలో ఉండి ఉంటుంది. గుప్త మహేశ్వరంలో వందేళ్ళ క్రితం వరకు కూడా ప్రతి శివరాత్రికి జ్యోతిని వెలిగించేవారట.

గుప్త మహేశ్వరాలయాన్ని చంద్రగుప్తుని కూతురు చంద్రవతి కట్టించిందని శ్రీ ఆదిరాజు వీరభద్రరావు గారన్నారు. ఉత్తర భారతదేశానికి చెందిన పాటలీపుత్రం రాజు చంద్రగుప్తుడు క్రీ.శ. 4వ శతాబ్దాంతంలో పాలన సాగించాడు. కాని ఈ చంద్రవతి ఆయన కూతురు కాదు. ఈమె స్థానిక సోమవంశపు రాజైన చంద్రగుప్తుని కూతురని స్థానిక చరిత్రకారులు శ్రీ కపిలవాయి లింగమూర్తిగారు భావించారు. వీరు కూడ క్రీ.పూ. 300 ప్రాంతంలో భారతదేశపు రాజు మౌర్య చంద్రగుప్తుడు కూడా సింహాసనాన్ని వారసులకు అప్పజెప్పి తను దక్షిణాదికి వెళ్ళి శ్రావణబెళగొళలో చివరి జీవితం గడిపాడు. 12వ శతాబ్దపు కన్నడ 'జైనామృతం' అనే గ్రంథంలో శ్రీశైల ప్రాంతం మొదట జైనులదే అని తెలుపడంతో జైనాన్ని పాటించిన మౌర్య చంద్రగుప్తుడు శ్రీశైల ప్రాంతం గుండా ప్రయాణించాడేమో! ఏది ఏమైనా చంద్రగుప్త పట్టణం మాత్రం శిథిలమై ఇప్పటికీ కన్పిస్తుంది - శ్రీశైలానికి ఎదురుగా, కృష్ణానది ఎడమ గట్టునున్న అడవుల్లో.

## 12. చరుకేశ్వరం

ఉమామహేశ్వరం - మన్ననూరు ప్రాంతాన్ని కాకతీయుల సామంతులైన చెరకు రాజులు పాలించారు. వీరు మన్ననూరులో తమ పేరున కట్టించిందే చరుకేశ్వరాలయం. ఇది 12వ శతాబ్దానికి ఇటు-అటుగా కట్టించింది. దాని శిథిలాలు, కోనేరు, కోట గోడలు, బురుజులు ఇప్పుడు మన్ననూరులోని వేణుగోపాలాలయం ముందు కన్పిస్తున్నాయి. చరుకేశ్వర ఆలయాన్ని కాకతీయుల తర్వాత తురుష్కుల సైన్యం చేయగా మరో శతాబ్దం తరువాత నంది మల్లారెడ్డి అనే స్థానిక పాలకుడు ఇప్పుడున్న వేణుగోపాల ఆలయాన్ని కట్టించాడు.

## 13. సంధ్యా సమాధి



సంధ్యా సమాధి తీర్థం

పర్వత ప్రకరణంలో సంధ్యా సమాధి ఒక తీర్థంగా పేర్కొనబడింది. అంటే అక్కడ ఒక నీటి వనరు, ఒక ప్రముఖుని సమాధి ఉండాలి. ఇలాంటి స్థలం ఉమా మహేశ్వర సమీప గ్రామమైన రంగాపూర్ శివారులో ఉన్న చంద్రబండకు తూర్పున ఉంది. నలువైపులా మెట్లతో ఉన్న అందమైన కోనేరులో ఇప్పటికీ నిండా నీళ్ళున్నాయి. దానికి వాయువ్యంలో ఒక ప్రముఖుని సమాధి, దానిపైన శాసనం ఉన్నాయి.

## 14. దేవహ్రదేశ్వరం / రామేశ్వరం

పాల్కురికి పేర్కొన్న మరో తీర్థం దేవహ్రదేశ్వరం. చంద్రబండనే స్థానికులు దేవరబండ అని కూడా పిలుస్తారు. ఇదొక విశాలమైన బండ. దానికి తూర్పున రెండు గుహలున్నాయి. ఆ గుహలను గర్భగుడులుగా చేసి వాటి ముందు మంటపాలు నిర్మించి ఆలయాలుగా తీర్చిదిద్దారు. ఈ ఆలయాల సమీపంలో రెండు మూడు నీటి గుండాలు కూడా ఉన్నాయి. ఇక్కడి ప్రధాన దైవం రామలింగేశ్వరుడు కాబట్టి పాల్కురికి పేర్కొన్న మరో తీర్థం రామేశ్వరం కూడా ఈ దేవరబండనే. క్రీ.శ. 5వ శతాబ్దంలో రామలింగేశ్వర ఆలయాలను కట్టడం ప్రారంభించింది ఈ ప్రాంతం నుంచే ఎదిగిన విష్ణుకుండి రాజులు. స్థానిక కథనాలను బట్టి ఇక్కడ నడిచిన శిల్పశాల నుండే చుట్టుపక్కల ఆలయాల నిర్మాణం జరిగిందని చెప్పవచ్చు. ఇక్కడ ఇప్పటికీ శ్రీరామ నవమికి ఉత్సవాలు జరుగుతున్నాయి.



## 15. కాలహ్రదేశ్వరం

ఉమామహేశ్వర క్షేత్ర పరిధిలో గల ఏకాదశ భవ్య తీర్థములలో ఐదవ తీర్థంగా 'కాలహ్రదేశ్వరంబు' పేర్కొనబడింది. దీన్నిప్పుడు కాలాపానీ అని పిలుస్తున్నారు. ఇది మన్ననూరు చౌరస్తా నుండి శ్రీశైలం వైపు ప్రయాణిస్తున్నప్పుడు కుడివైపున ఒకరి ఇంటి ఆవరణలో బావి రూపంలో ఉంది. పూర్వం ఇదొక గుండం అయ్యుంటుంది. నైజాం ప్రభుత్వ కాలంలో నేరస్థులను, స్వాతంత్ర్యోద్యమ నాయకులను మన్ననూరులోని జైలులో బంధించి మరణశిక్ష వేయాలనుకున్నప్పుడు అలాంటి నేరస్థులకు ఈ కాలాపానీ తాగించేవారట. ఈ విషయాన్ని ఇక్కడ 1940లలో జైలు శిక్షననుభవించిన ఆర్య సమాజ ఉద్యమకర్త పండిత్ నరేంద్రజీ కూడా తన స్వీయ జీవిత చరిత్రలో

ప్రస్తావించారు. శివుని కంఠంలో హాలహలం ఉంటుంది కాబట్టి ఈ కాలాపానీ అలాంటి విషపు నీరైనా పవిత్రంగా భావించబడి ఉంటుంది.

## 16. వేద పర్వతం / అశ్వమేధ శిలోచ్ఛయం

ఉమామహేశ్వరంలో తీర్థముల తర్వాత పవిత్ర సందర్శనా స్థలాలుగా పర్వతాలు పేర్కొనబడ్డాయి.

'వేద పర్వతమును శ్వేతాద్రి నీల
మేదినీధర మశ్వమేధ శిలోచ్ఛ
యంబును లింగ శృంగంబు కన్యా న
గంబు నుమాగిరి కనక నగంబు
గుండశిఖరి..................'

ఈ ప్రాంతంలో పుట్టి ఐదవ శతాబ్దంలో నర్మదా నది నుండి కృష్ణా నది మధ్యన గల దేశాన్ని పాలించిన విష్ణుకుండి రాజులు వేదాలను, వేద పండితులను ఆదరించారు. వేద సహితమైన అశ్వమేధాది ఎన్నో యజ్ఞాలను చేశారని వారి శాసనాలు ఘోషిస్తున్నాయి. మన్ననూరు శివారులో ఉన్న ప్రతాపరుద్ర కోట మీద ఆ రాజులు యజ్ఞాలు చేయడానికై స్నానం చేసే అవబృధ స్నానవాటిక ఇప్పటికీ కనిపిస్తూ ఉంది. కాబట్టి పర్వత ప్రకరణంలో పేర్కొన్న అశ్వమేధ శిలోచ్ఛయము లేదా వేద పర్వతం ఇదే.



## 17. శేతాద్రి

అశ్వమేధ పర్వతానికి ఎదురుగా పడమటి దిక్కున ఉన్న 'కుప్పగుట్ట' (లింగ శృంగం?) తూర్పువైపు తెల్లని పరుపు బండలు విశాలంగా ఉండటం వల్ల (చూడడానికి తెల్లగా కన్పిస్తుండడం వల్ల) దీన్ని తెల్లకొండ అని, సంస్కృతీకరించి శ్వేతాద్రి అని పిలుస్తుండి ఉంటారు. రెండు వేల ఏళ్ళ కిందటి సాతవాహన రాజుల శాసనాల్లో కూడా శ్రీశైలాన్ని సూచించే 'సిరితాన', ఈ శ్వేతగిరిని సూచించే 'సేదగిరి' వారి రాజ్యంలో ఉన్న స్థలాలుగా పేర్కొనబడ్డాయి. ఈ శ్వేతాద్రి శృంగం (కొన) మీద కుతుబ్షాహీల కాలపు ఫిరంగి ఉందట.

## 18. గుండ శిఖరి

మన్ననూరి నుంచి శ్రీశైలం వైపు ప్రయాణం చేస్తుండగా సుమారు పది కిలోమీటర్ల దూరంలో పులిమడత అనే ప్రదేశం రోడ్డుకు కుడివైపున వస్తుంది. అక్కడి నుండి సుమారు

అర కిలోమీటరు దూరంలో 'లొద్ది' అనే గుండం, కిలోమీటరు దూరంలో 'గుండం' అనే ప్రదేశం వస్తాయి. వీటిల్లో మొదటిదేమో ఒక శిఖర పర్వతం కింద, రెండవదేమో దాని మీద ఉన్నాయి కాబట్టి పాల్కురికి పేర్కొన్న గుండశిఖరి ఇదే. ఇక్కడి రెండు గుండాల పేర్లు పాల్కురికి పేర్కొన్న రామగుండం, భీమగుండం. ఇలా సమన్వయం చేయకుండా కపిలవాయి లింగమూర్తిగారు, శ్రీశైల దేవస్థానం అధికారి అనిల్‌కుమార్ గారు లొద్ది గుండాన్ని గుప్త మల్లికార్జునం అంటూ రాశారు. లొద్దిలో ప్రతి సంవత్సరం ఏకాదశి పండుగకి స్థానిక చెంచు గిరిజనుల ఆధ్వర్యంలో జాతర జరుగుతుంది.

## 19. కిన్నెరేశ్వరం

పర్వత ప్రకరణంలో పేర్కొనకున్నా కిన్నెర బ్రహ్మయ్య కథను సోమన తన 'బసవ పురాణం'లో విపులంగా వర్ణించాడు. వీరశైవ శాఖ సృష్టికర్త బసవేశ్వరుడు చాళుక్య రాజధాని కళ్యాణి (కర్ణాటక) విడిచి వెళ్ళిపోవటానికి కారణమైన రాజు కాలచురి బిజ్జలున్ని బసవేశ్వరుని అనుయాయులు జగదేవుడు, మల్లయలతో కలిసి కిన్నెర బ్రహ్మయ చంపాడు. అందుకు వీరశైవంలో ఆయనకు చాలా పేరు ప్రఖ్యాతలు వచ్చాయి. ఆయన పేరు మీద ఆలయాలు కూడా వెలిశాయి. అలా వెలిసిన ఒక శివాలయమే కిన్నెరేశ్వరం. ఇది మన్ననూరిలో ఉన్న మల్లప్పగుట్ట కింద ఉంది. ఇది చాలా అందమైన ఆలయం. ఉత్తరాభిముఖంగా ఉంది. దాని వెనుక చెరువుంది. ఇందులోని శివలింగాన్ని స్థానికులు కిన్నెరయ్య అని పిలిచేవారు. ఇటీవల ఆలయం బాగా శిథిలం కాగా శివలింగాన్ని మాత్రం మహబూబ్‌నగర్ జిల్లాలోని పిల్లలమర్రి మ్యూజియానికి తరలించారని స్థానికుడు ఒకాయన చెప్పాడు.

రాష్ట్రంలో అందమైనవి, ఆహ్లాదకరమైనవి, పవిత్రమైనవి నల్లమల అడవులు. వాటిల్లోనూ పవిత్రమైన స్థలాలను పాల్కురికి సోమనాథుడు దర్శించి వాటి మహత్యాన్ని మొదటిసారిగా వర్ణించాడు కాబట్టి, ఆ స్థలాలు ఇప్పటికీ అదే అందంతో అలరారుతున్నాయి కాబట్టి, ప్రపంచంలో అత్యంత వేగంగా విస్తరించుతున్నది పర్యాటక రంగం కాబట్టి నల్లమలల్లో 'పాల్కురికి సోమన పర్యాటక ప్రాజెక్టు'ను ఏర్పాటు చేస్తే ప్రజలకు కొత్త పర్యాటక స్థలాలు – ఆహ్లాదకరమైనవి, పవిత్రమైనవి – అందుబాటులోకి వచ్చి ఆనందిస్తారు. తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ ఈ కల సాకారం కావడానికి కృషి చేయాలని ఆకాంక్షిద్దాం.

*– నమస్తే తెలంగాణ దినపత్రిక*
*(ప్రచురణలో ఉంది)*

# 16

# వృక్ష క్షేత్రం మరికల్ మర్రి

మహబూబ్‌నగర్ జిల్లా వట వృక్షాలకు పేరెన్నిక గన్నది. మహబూబ్‌నగర్ జిల్లా క్షేంద్రం నుండి చుట్టు పక్కల సుమారు 30 కిలోమీటర్ల వ్యాసార్థంలో అరడజన్ మర్రి వృక్షాలున్నాయి. ఇవన్నీ పర్యాటకానికి అనువైనవే. కాని ఒక పిల్లలమర్రిని మాత్రమే ఇప్పటివరకు ప్రభుత్వం పర్యాటక స్థలంగా అభివృద్ధి చేసింది. అలా అభివృద్ధి చేయవలసినది, అంతకంటే అందమైన మర్రి మరొకటి పిల్లలమర్రికి 30 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. దాని పేరు గోసాయి మర్రి.



కొన్ని వందల సంవత్సరాల కింద ఈ మర్రి కింద గోసాయిలు అనే సన్యాసులు నివసించారు. కాబట్టి దానిని గోసాయి మర్రి అని స్థానికులు పిలుస్తున్నారు. కాని ఆ వృక్షం గోసాయిల కంటే ముందు నుంచే మనుగడలో ఉంది కాబట్టి ఆ మర్రి ప్రాంతంలో ఏర్పడిన ఊరికి దాని పేరునే పెట్టారు. అదే మరికల్. ఈ మరికల్ గ్రామం రంగారెడ్డి జిల్లాలోని కులక్‌చర్ల మండల పరిధిలోని కొత్తపల్లి తాండాకు దగ్గరలో ఉంది.



హైదరాబాద్ నుండి బెంగళూరు రహదారిలో వచ్చే జడ్చర్లకు ముందున్న మాచారం (87 కి.మీ.) నుండి కుడివైపుకు తిరిగి నవాబ్‌పేట మీదుగా 20 కిలోమీటర్లు ప్రయాణించి ఈ మర్రిని చేరుకోవచ్చు.

## వృక్ష క్షేత్రం

ఈ మర్రి కేవలం పెద్ద చెట్టుగా మాత్రమే కాకుండా క్షేత్రంగా కూడా తరతరాల నుండి పూజలందుకుంటున్నది. ఇందుకు కొన్ని కారణాలు కన్పిస్తాయి. ఒకటి, ఇది అందమైనది, ఆహ్లాదకరమైనది కావడం వల్ల మనుషులతో పాటు పశుపక్ష్యాదులు కూడా ఈ చెట్టును ఆశ్రయిస్తున్నాయి. ఎన్నో ఏళ్ళ కింద గోసాయిలు సంచార వశంగా వచ్చి, ఈ చెట్టు అందం నచ్చి దీని కిందే కొంత కాలం నివసించారు. చుట్టుపక్కల గ్రామ ప్రజల రోగాలకు, గ్రహ బాధలకు మందులిచ్చి మంచి చేయడం వల్ల ఆ మంచికి కేంద్రమైన మర్రి చెట్టు ఒక క్షేత్రమైంది. ఈ మర్రి కిందే గోసాయిలు వీరాంజనేయ విగ్రహాన్ని ప్రతిష్టించి మర్రి ఊడలనే గోడలుగా మలచుకొని ఆలయం నిర్మించారు. ఆంజనేయుడు శని గ్రహ బాధల నుండి భక్తులను విముక్తులను చేయడం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ ఆంజనేయుని విగ్రహం దక్షిణాభిముఖంగా ఉంది. 127
సూర్య కిరణాలు విగ్రహం మీద పడుతుండడం గమనార్హం. ఈ కారణంగా హనుమంతుని విగ్రహం మహిమాన్వితమైందని, కాబట్టి కొన్ని దశాబ్దాల క్రితం ఒక కోతి ఈ హనుమంతుని చుట్టే తిరుగుతూ కొన్ని సంవత్సరాల కాలం గడిపిందని, ఆ కోతిని ఒక ఆకతాయి వడ్డెర కులస్థుడు తుపాకితో కాల్చి చంపాడని, ఆ పాప ఫలితంగా కొన్నాళ్ళకు అతని కుటుంబం మొత్తం నామరూపాల్లేకుండా తుడిచిపెట్టుకుపోయిందని స్థానికులు చెప్తారు.

ఆంజనేయుని ఆలయం ముందు రెండు శిల్ప శోభితాలైన స్తంభాలున్నాయి. సుమారు ఐదు అడుగుల ఎత్తుతో నలు చదరాలుగా ఉన్నాయవి. ఒక స్తంభానికి హనుమంతుడు నాలుగు రూపాలతో శిల్పించబడ్డాడు. ఎడమ వైపుకు చూస్తున్నట్లు, కుడి వైపుకు చూస్తున్నట్లు, ఎదురుగా చూస్తున్నట్లు, వంగి చూస్తున్నట్లున్న హనుమంతుడు సదా జాగరూకుడై మానవాళి సంక్షేమానికై కృషి చేస్తున్నట్లు ఒక అర్థం స్ఫురించగా, హనుమంతుడి నడకను సూచిస్తుంది ఇంకొక విశ్లేషణ. ఈ శిల్పాల్లో హనుమంతుడు చేతులు జోడించి పబ్బతి పట్టుకున్నట్లుండడం అతని రామభక్తిని తెలియజేస్తుంది. అయితే రాముడి విగ్రహం ఈ పరిసరాల్లో కనిపించలేదు. కాని రాముని పూర్వ అవతారాలుగా చెప్పే విష్ణు, వరాహం, కూర్మం, మత్స్యం శిల్పాలు మరో స్తంభానికి



చెక్కి ఉన్నాయి. తాబేలు శిల్పం కింద ఒకే కన్ను ఆధారంగా నాలుగు చేపలు శిల్పించిన తీరు ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఈ మర్రికి ఈశాన్యంలో ఉన్న ఊరి కుంటలో, ఆగ్నేయంగా ఉన్న ఊరి చెరువులో తాబేళ్ళు, చేపలుండటం గమనార్హం. అయితే ఈ శిల్పాలన్నీ సృష్టి క్రమాన్ని సూచిస్తుండడమూ గమనార్హం. దీనికి నిదర్శనంగా రెండవ స్తంభానికి ఒక వైపు దంపతులు కూర్చుని సంభోగిస్తున్నట్లున్న శిల్పం కన్పిస్తుంది. హనుమంతుని శిల్ప స్తంభం మీద ఒక గుండు, దానిపై ఆరు అంగుళాల ఎత్తున్న పిడి ఉన్నాయి. ఇవి హనుమంతుని జెండాను సూచిస్తాయేమో!

మర్రి చెట్టుకు వాయువ్య దిశలో ఉన్న బురుజు దగ్గర 'బురుజు మైసమ్మ' సన్నిధి ఉంది. అదే దిశలో ఫర్లాంగు దూరంలో ఉన్న మరో బురుజు దగ్గర పరిగి తిప్పవ్వ విగ్రహముంది.



పైన పేర్కొన్న వివరాలు ఈ మర్రి, దీని పరిసరాలు పవిత్ర స్థలాలని తెలియజేస్తున్నాయి. కాబట్టి స్థానిక గ్రామాల ప్రజలు ఈ మర్రి వృక్షం చుట్టూ ప్రతి యేటా ఉగాది పండుగనాడు ఎడ్లబండ్లు తిప్పుతున్నారు. పరిగి తిప్పవ్వ పేరును బట్టి, ఆ విగ్రహమున్న ఒకప్పటి ఊరు పేరు (అప్పిరెడ్డి గూడెం)ను బట్టి కొన్ని వందల ఏండ్ల కింద ఇక్కడికి సమీపంలో ఉన్న పట్టణం పరిగి నుండి అప్పిరెడ్డి అనే భూస్వామి వచ్చి ఇక్కడ తన పేర గ్రామాన్ని పొందించి దాని చుట్టూ కోట కట్టి ఆ కోటలో అతను, అతని వంశ పరంపర నివసించారు అని అర్థమవుతుంది. ఇప్పుడు పూర్తిగా శిథిలమైన ఆ కోటలో ఆనాటి కుండ పెంకులు, తదితర వస్తుగత ఆధారాలను కొన్నింటిని తెలంగాణ రిసోర్స్ సెంటర్ అధ్యక్షులు శ్రీ ఎం.వేదకుమార్ గారు, ఈ వ్యాసకర్త సేకరించారు. ఇప్పటికీ ఈ మర్రి అప్పిరెడ్డి గారి వంశస్తుల ఆధీనంలోనే ఉంది.

ఈ చెట్టును కొన్ని దశాబ్దాల కింద ఇక్కడికి దగ్గరలో ఉన్న వెంకటాపురం గ్రామస్థుడైన ఒక ముస్లిం పెద్ద మనిషి 66 వేల రూపాయలకు కొనుగోలు చేశాడట. కాని కీడు సూచిత మవడంతో దాన్ని కొట్టి కలపను అమ్ముకునే ప్రయత్నాన్ని మానుకున్నాడట.

## పర్యాటక ప్రయత్నాలు

ఈ విశిష్టమైన మర్రికి విశేష ప్రాధాన్యం కల్పించాలని సుమారు మూడు దశాబ్దాల కిందట కొందరు స్థానిక యువకులు ప్రభుత్వానికి విన్నపాలు చేయగా ఆనాటి జిల్లా కలెక్టర్ శ్రీ ఎస్.పి. టక్కర్‌గారు స్వయంగా వచ్చి ఈ చెట్టును చూసి దాని అభివృద్ధికై ప్రణాళికలు రచించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులు ఈ మర్రిని పరిశీలించి, ఇది 600 సంవత్సరాల కంటే ముందుదని, తమిళనాడు రాష్ట్రంలో ఉన్న అడయార్ మర్రి కంటే పెద్దదని నివేదించారు. అటవీ శాఖ వారు ఇంతటి విశిష్టమైన చెట్టును అభివృద్ధి చేయడానికి దీనిని సమీపంలోని మహమ్మదాబాద్ అడవుల్లో భాగంగా చూపుతూ దీని కింద మొక్కలను (నర్సరీ) పెంచాలని, జింకల పార్కును ఏర్పాటుచేయాలని అందుకు తగిన నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి నివేదించారు. కాని ప్రభుత్వం ఇప్పటివరకు ఏ కార్యక్రమాలనూ ఇక్కడ చేపట్టలేదు. పైగా ఈ చెట్టు చుట్టు పక్కలా భూ ఆక్రమణలు విస్తరిస్తున్నాయి.

## పర్యాటక అవకాశాలు

ఈ మర్రి చెట్టు, దాని పరిసరాల్లో పర్యాటక అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. కాబట్టి ప్రభుత్వం ఈ క్రింది కార్యక్రమాలు చేపడితే బాగుంటుంది.

1. ముందుగా ఈ చెట్టు ఇక మీదట ఆక్రమణకు గురికాకుండా దీని చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి.
2. దీని కింద నర్సరీని పెంచాలి.
3. దీని కింద జింకలు, కుందేళ్ళను పెంచాలి. సందర్శకులకు అవి ఆహ్లాదాన్ని కూడా పంచుతాయి.
4. ఈ చెట్టు కొమ్మలు, ఊడలు చాలా ఎత్తుగా ఉన్నాయి. కాబట్టి వాటి పైన (పది మీటర్ల ఎత్తున) పావు కిలోమీటర్ పొడవున తలకోన (చిత్తూరు జిల్లా)లో ఏర్పాటు చేసినట్లుగా ఊగే ఊయల వంతెన ఏర్పాటు చేసి దాని మీద ఆహ్లాదకరంగా నడిచే అవకాశాన్ని పర్యాటకులకు కలుగజేయాలి.
5. సమీపంలోని ఊరి కుంట, ఊరి చెరువులో పెడల్ బోట్లు ఏర్పాటు చేయాలి.
6. చెట్టు, ఊరి కుంట మధ్యలో పిల్లల ఆట స్థలం ఏర్పాటు చేయాలి.
7. పర్యాటకుల కోసం ఒక రెస్టారెంట్ ఏర్పాటు చేయాలి.






పైన పేర్కొన్న విధంగా చేస్తే ఆరు వందల ఏళ్ళ చరిత్ర కలిగి నాలుగు ఎకరాల్లో విస్తరించిన ఈ అరుదైన మర్రి చెట్టును కాపాడినట్లూ అవుతుంది, పర్యాటకులకు కొత్త పర్యావరణ పర్యాటక క్షేత్రాన్ని అందుబాటులోకి తెచ్చినట్లూ అవుతుంది. ప్రభుత్వానికి సాధ్యం కాకపోతే పర్యావరణ హిత నిబంధనలతో అభివృద్ధి చేయాలని ప్రైవేట్ సంస్థ(ల)కైనా పై పనులను అప్పగించాలి. లేదంటే ఈ అరుదైన చెట్టు ఆక్రమణలకు గురై అవశేష స్థితికి చేరే ప్రమాదముంది.

*– దక్కన్ ల్యాండ్ మాసపత్రిక*
*సెప్టెంబర్ 2014*



# 17

# తెలంగాణా ఎత్తిపోతల జలపాతం

ఎవరైనా ఎత్తిపోతల జలపాతం ఎక్కడుందంటే ఠక్కుమని నాగార్జునసాగర్ దగ్గరుందని చెప్తారు. కాని, మెదక్ జిల్లాలో ఉన్న జహీరాబాద్ దగ్గర కూడా అదే పేరుతో మరో జలపాతముందని ఎవరూ చెప్పలేరు. అందరికీ తెలిసిన ఎత్తిపోతల జలపాతం రాతి గుట్టల మీద నుంచి దూకితే మనం తెలుసుకోబోతున్న జలపాతం రాతిమట్టి గుట్టల మీది నుంచి దూకుతుంది.

ఈ ఎత్తిపోతల జలపాతం మూడు జలపాతాల సముదాయం. తూర్పు నుంచి పడమర వైపు వడివడిగా ప్రయాణిస్తున్న వాగు మూడు పాయల జలపాతంగా మారగా, దీనికి కుడివైపు నుంచి జలజల పారుతున్న ఒక ఏరు మొదటి జలపాతం ప్రవాహంలోకి దూకుతున్నది. ఈ రెండు జలపాతాలు కలిసిపోయి ఒకే ప్రవాహంగా మారి ఒక ఫర్లాంగు దూరం ఎత్తైన మట్టి గుట్టల మధ్య ప్రవహించి, అక్కడ ఒక చదునైన 30







మీటర్ల పొడవైన బండ మీది నుంచి 40 అడుగుల లోతున లోయలోకి దూకుతుంది. పచ్చని ఇరుకైన లోయలో కన్పించే ఈ దృశ్యం కన్నుల పండువగా ఉంటుంది. ఈ జలపాతం అంచునే కర్ణాటక రాష్ట్రం ఉంది.

ఈ ప్రాంతపు మట్టి గుట్టల మధ్య చిక్కుకుపోయినట్లు కనిపించే చెరువు, భూమినుంచే ఇటుక రాళ్ళను చెక్కుకొని వాటితోనే ఇళ్ళు కట్టుకోవడం, మెట్ట పంటలు, చిన్న చిన్న లంబాడి తండాలు... ఈ విశేషాల మధ్య చేసే ప్రయాణం ఆసక్తికరంగా ఉంటుంది. ఆసక్తి, సమయం ఉన్నవారు పక్కనున్న మొగ్దంపల్లి మీదుగా పది కిలోమీటర్ల దూరం ప్రయాణించి గొట్టంగుట్ట అనే మరో పర్యాటక స్థలాన్ని దర్శించవచ్చు. హైదరాబాద్ నుంచి వెళ్ళేవారు దారిలో నందికందిలో నక్షత్రాకార శివాలయం (వేయేళ్ళనాటిది) చూడవచ్చు. దేశంలో మొట్టమొదటి శాస్త్రీయ పట్టణమైన సదాశివపేటను చూడవచ్చు.



మన రాష్ట్రంలో ఉన్న ఒకే ఒక ఆర్గానిక్ హోటల్ జహీరాబాద్‌లోనే ఉంది. కాబట్టి అక్కడ ఆర్గానిక్ ఫుడ్ లాగించేయొచ్చు. ప్రత్యామ్నాయంగా తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ వారి హరిత హోటల్ కూడా అక్కడే ఉంది.

ఈ ఎత్తిపోతల హైదరాబాద్‌కు సుమారు 110 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఎటునుంచి వెళ్ళేవారైనా ముందు ముంబై రహదారిలో ఉన్న జహీరాబాద్‌కు రైలులోగాని, బస్సులోగాని, ప్రైవేటు వాహనంలోగాని చేరుకోవాలి. ఆ తరువాత పది కిలోమీటర్ల దూరం ప్రయాణానికి ప్రైవేటు వాహనదారులకు తప్ప మిగతావారికి ఆటోలే శరణ్యం. జహీరాబాద్ రైల్వే ట్రాక్ దాటిన వెంటనే ఎడమ వైపుకి తిరిగి హోతి-బి, పర్వతాపూర్, ఉప్పు తండాలు దాటి ఎత్తిపోతలను చేరుకోవచ్చు.

*– నమస్తే తెలంగాణ ఆదివారం అనుబంధం*
*17-08-2014*

డా. ద్యావనపల్లి సత్యనారాయణ

18

# గిరిజన మ్యూజియం



పూర్వపు ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు చోట్ల గిరిజన సంగ్రహాలయాలున్నాయి. అవి:

1. నెహ్రూ శతజయంతి గిరిజన సంగ్రహాలయం, హైదరాబాద్.
2. చెంచులక్ష్మి గిరిజన సంగ్రహాలయం, మన్ననూర్, మహబూబ్‌నగర్ జిల్లా.
3. చెంచులక్ష్మి గిరిజన సంగ్రహాలయం, శ్రీశైలం.
4. అరకు గిరిజన సంగ్రహాలయం, అరకు లోయ, విశాఖపట్నం జిల్లా.

వీటన్నింటినీ పూర్వపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారి గిరిజన సంక్షేమ శాఖ నిర్వహిస్తూండేది. వీటిల్లో ఆ రాష్ట్రంలోని 35 రకాల తెగల జీవన విధానం, సంస్కృతులకు సంబంధించిన వస్తువులను భద్రపరిచి పర్యాటకులకు, పరిశోధకులకు, విద్యార్థులకు, సందర్శకులకు ప్రదర్శనకై అందుబాటులో ఉంచారు. ఇవి కాక శ్రీ రవీంద్రశర్మ అనే ఔత్సాహికులు వ్యక్తిగతంగా ఒక గ్రామీణ గిరిజన వస్తు సంగ్రహాలయాన్ని ఆదిలాబాద్‌లో ఏర్పరచి నిర్వహిస్తున్నారు. వీటన్నింటిలో ప్రధానమైన నెహ్రూ శతజయంతి గిరిజన సంగ్రహాలయం గురించి తెలుసుకుందాం.



## నెహ్రూ శతజయంతి గిరిజన సంగ్రహాలయం


క్రీ.శ. 1962-63లో ఏర్పాటైన 'గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ'లో భాగంగా గిరిజన సంగ్రహాలయాన్ని ఏర్పరచారు. అప్పటినుండి గిరిజన వస్తు సామాగ్రిని సేకరిస్తూ వస్తున్నారు. 1989లో జరిగిన జవహర్‌లాల్ నెహ్రూ శతజయంతిని పురస్కరించుకుని ఈ సంగ్రహాలయానికి 'నెహ్రూ శతజయంతి గిరిజన సంగ్రహాలయం' అని నామకరణం చేసి, భారత ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో మూడు అంతస్థుల భవనాన్ని 2003లో నిర్మించారు. రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాల నుంచి గిరిజన జీవనం, కళలకు సంబంధించిన అనేక వస్తువులను భారీగా సేకరించి, వాటిని వివిధ విభాగాలలో (గ్యాలరీలలో) అమర్చి ప్రదర్శనకు అందుబాటులో ఉంచారు. ఈ సంగ్రహాలయంలో కింది విభాగాలున్నాయి.

1. చెంచు / ఫోటోగ్రఫీ విభాగం.
2. గిరిజన గుడిసెల విభాగం.
3. గిరిజన జీవన / సాంస్కృతిక వస్తు విభాగం.
4. దృశ్య శ్రవణ విభాగం.
5. ప్రాంగణ ప్రదర్శన విభాగం.
6. గిరిజన కళా ప్రాంగణ విభాగం.



చెంచు గ్యాలరీలో చెంచు గిరిజన ప్రజలు కర్రతో అగ్ని పుట్టించుకునే విధం, గుడిసెలో వంట చేసుకోవడం, వస్తువులు అమర్చుకునే విధానం, వేటాడే విధానం, భూమిలో నుంచి గడ్డలు తవ్వుకునే విధానం, వారి బాణాలు, తేనె సేకరణ పనిముట్లు, తేనె సేకరణ విధానాలను డయోరమాలు (సూక్ష్మ ప్రతిరూపాలు), షోకేసుల్లో (గాజు గూళ్ళల్లో) ప్రదర్శించారు.

ఫోటోగ్రఫీ గ్యాలరీలో పూర్వపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న 35 రకాల గిరిజన తెగల ప్రజల రూపు రేఖలు, వస్త్రాభరణాలు, నృత్యాలు, దేవతలు, పనులు, ఇళ్లు,





పంటలు (పోడు వ్యవసాయం), ఆధునిక సాగు విషయమై ప్రభుత్వం గిరిజనులకు అందజేస్తున్న సహాయ సహకారాలు, గిరిజన వార సంతలు (షాండీలు), గిరిజన సాంప్రదాయక వైద్య విధానం, ప్రభుత్వ వైద్య విధానం, ప్రభుత్వ విద్యా సౌకర్యాలు, ప్రభుత్వ గిడ్డంగులు, పాపికొండలు పర్యాటకం నిర్వహించుకునేందుకు ప్రభుత్వం గిరిజన నిరుద్యోగులకు అందజేసిన పడవలు, తదితర విషయాల నిజమైన ఫోటోలు ప్రదర్శనకు పెట్టారు.

సంగ్రహాలయం మొదటి అంతస్థులో నిజమైన గిరిజన గుడిసెలను ప్రదర్శన నిమిత్తం నిర్మించారు. అలాంటివి ఇందులో సవర గుడిసె, చెంచు గుడిసె, బంజారా గుడిసె, కోయ గుడిసె, పోర్జ గుడిసె, బగత గుడిసె, ఎరుకల గుడిసె, యానాదుల గుడిసెలు వరుసగా కన్పిస్తాయి. ఆయా గుడిసెల్లో గిరిజనుల జీవన విధానం ప్రస్ఫుటంగా కన్పించే విధంగా అవసరమైన చోటల్లా గిరిజనుల విగ్రహాలు రకరకాల పనుల్లో నిమగ్నమైనట్లుగా శిల్పించారు. సవర గుడిసెల్లో సవరలు సాంప్రదాయకంగా పూజించే 'ఇదిసింగ్' (గోడ పెయింటింగ్) కన్పిస్తుంది. ఈ గుడిసెలను చూస్తే చాలు ఆయా గిరిజనుల జీవన విధానం, సంస్కృతులు ఎలా ఉంటాయో తెలుస్తాయి.

సాంస్కృతిక గ్యాలరీలో గిరిజనుల సంగీత పరికరాలు, చేపలు, పక్షులు, ఎలుకలు, కుందేళ్ళ వంటి చిన్న జంతువులను వలలు వేసి పట్టుకునే పరికరాలు, వేట పనిముట్లు, పోడు/వ్యవసాయ పనిముట్లు, ఇంటి పనిముట్లు, నృత్య వేషధారణ వస్తువులు, ముఖ తొడుగులు, బుట్టబొమ్మలు, లంబాడీ, కొలామీల సాంప్రదాయక ఆభరణాలు, షాండీ, గిరిజన పంచాయతీ విధానం, భీమాయక్, గుస్సాడ దేవత ఆలయాలు, సవరలు, గోండుల సమాధులు, ఇనుము, లక్క, కాల్చిన మట్టి (టెర్రకొట్ట), ఇత్తడి బొమ్మలు, నవరత్నాలను శుద్ధి చేసే పరికరాలు మొదలైనవి ప్రదర్శనలో ఉన్నాయి.

దృశ్య శ్రవణ విభాగంలో లఘు (చిత్ర) ప్రదర్శనశాల (మినీ ఆడిటోరియం), టచ్ స్క్రీన్ కంప్యూటర్ ఉన్నాయి. మినీ ఆడిటోరియంలో విద్యార్థులకు, అధికారులకు, శిక్షణలో ఉన్న ఐ.ఏ.ఎస్. (ఉన్నత) అధికారులకు ముందస్తు అనుమతితో 25-30 నిమిషాల నిడివి గల లఘు చిత్రాలను ప్రదర్శిస్తారు. ఇవి ఆయా గిరిజనుల జీవనశైలి, సాంస్కృతిక విశేషాల మీద చిత్రించినవి. దేశంలో 18 రాష్ట్రాల్లో ఉన్న గిరిజన సంగ్రహాలయాల్లో ప్రదర్శనకు ఉంచిన వస్తు విశేషాలను టచ్ స్క్రీన్ కంప్యూటర్‌లో ఎవరికి వారు చూసుకునే వెసులుబాటు కల్పించారు.

సంగ్రహాలయంలో ప్రవేశించగానే సందర్శకులను గోండు గిరిజనుల ఎద్దుల బండి స్వాగతిస్తుంది. ఆ తరువాత కనిపించే 'మేరియ బలి' దృశ్య రూపం ఆసక్తిని



రేపెట్టుగా ఉంది. ఉత్తరాంధ్రలో నివసించే ఖోందులు రెండు శతాబ్దాల క్రితం రెండు సంవత్సరాలలోపు వయసుండే ఒక మాల బాలున్ని కొని 18 సంవత్సరాలు ఊరిలో పెంచి, తరువాత సంతానం, పాడి పంటల అభివృద్ధి కోసమని ఆ బాలున్ని బలిచ్చేవారట. ఆ సంస్కృతిని బ్రిటిష్‌వారే బహిష్కరించారు. సంగ్రహాలయం మూడవ అంతస్థులో 'సమాచార గ్యాలరీ' ఉంది. ఇందులో జిజ్ఞాసువులు, పరిశోధకులకు అవసరమైన రాష్ట్ర గిరిజనుల జనాభా, వారి వృత్తులు, ప్రాంతాలు తదితర అధికారిక అంకెల సమాచారం లభిస్తుంది. సంగ్రహాలయం మొదటి, రెండవ అంతస్థుల స్తంభాల నలుమూలలను వెదురు బద్దలతో అలంకరించి వాటి మధ్య గిరిజన జీవన సంస్కృతులకు సంబంధించిన ఫోటోలను, వేట విధానాలకు సంబంధించిన పెయింటింగ్‌లను ప్రదర్శనకు పెట్టారు. ఈ స్తంభాల మధ్యగల నాలుగేసి దూలాల స్థానంలో ఉత్తరాంధ్ర సవరలు తదితర గిరిజనులు పెళ్ళిళ్ళు, పండుగల్లో ఉపయోగించే ముఖతొడుగులను (మాస్క్‌లు) అలంకరించారు. రెండవ అంతస్థు మెట్లు ఎక్కగానే నాయకపోడు గిరిజనుల మాస్క్‌లు కన్పిస్తాయి.



సంగ్రహాలయం భవనం ముఖ ప్రాంగణం సవరల సాంప్రదాయక పెయింటింగ్‌లో కనిపించే వివిధ చిత్రాలతో అలంకరించబడింది. ప్రాంగణం కుడివైపు గోండుల గుస్సాడి నృత్యం, ఎడమవైపు కోయల కొమ్ము నృత్యం శిల్పాలు ప్రదర్శనకుంచారు. ముఖ ప్రాంగణం ముందున్న ఖాళీ స్థలంలో సమ్మక్క–సారలమ్మల గద్దెలు, మైసమ్మ, నిశాని దేవతలు, ఆకిపేన్, పెర్సాపేన్, పెదదేవుడు తదితర దేవతల నిజ ఆలయాల విగ్రహాల ప్రతిరూపాలను ప్రతిష్ఠించారు. కళా ప్రాంగణంలో 6 గిరిజన గుడిసెలు, కార్యక్రమాలు నిర్వహించుకునే షామియానా గద్దె, ఊయల, ముఖ్యమైన గిరిజనుల పరిచయ బోర్డులు తదితర ఏర్పాట్లున్నాయి.

*– నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మ్యానేజ్‌మెంట్*
*హైదరాబాద్ వారి ప్రత్యేక సంచిక, 2014*

డా. ద్యావనపల్లి సత్యనారాయణ

# 19

# తెలంగాణా ప్రాచీన శివాలయాలు

భారతదేశంలో మొట్టమొదటి ఆలయాలు తెలంగాణలో బయటపడ్డాయి – నాగార్జునకొండలో, కృష్ణానది ఉత్తర తీరపు నల్లమల అడవుల్లో. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కడుతున్నప్పుడు భారత పురావస్తుశాఖ నాగార్జున కొండ పరిసరాల్లో చేపట్టిన తవ్వకాల్లో అనేక శివాలయాలు వెలుగు చూశాయి. ఇవి క్రీ.శ. 2వ శతాబ్దం నుండి నిర్మించబడ్డాయి. రెండవ శతాబ్దంలో తెలంగాణను పాలించిన శాతవాహనులు తాము పశుపతిని... అంటే శివున్ని, గౌరిని... అంటే పార్వతిని పూజించామని చెప్పుకున్నారు. కాని దేవాలయాలను కట్టించామని చెప్పుకోలేదు.



శాతవాహనుల తర్వాత... అంటే క్రీ.శ. 3వ శతాబ్దంలో తెలంగాణను పాలించిన ఇక్ష్వాకులు దేవాలయాలను కట్టించారు, కట్టించామని శాసనాలు కూడా వేయించారు. వారు నాగార్జునకొండ పరిసరాల్లో కట్టించిన శివాలయాల్లో ప్రధానమైనవి పుష్పభద్రస్వామి దేవకులం (దేవాలయం), సర్వ దేవాలయం కాగా శివ పరివార ఆలయాల్లో ముఖ్యమైనవి కార్తికేయ, దేవసేన దేవాలయాలు, నవగ్రహ, కుబేరేశ్వర ఆలయాలు.

భారతదేశంలో నదీనదాలు ఉత్తరం వైపు తిరిగే చోట్లను వారణాశితో సమానమైన పవిత్ర స్థలాలుగా భావించి అక్కడ పవిత్ర శివాలయాలు కట్టడం అనాదిగా ఆనవాయితీగా వస్తున్నది. అలా కృష్ణానది నాగార్జునకొండ దగ్గర ఉత్తరం వైపు తిరిగే చోట పుష్పభద్రస్వామి ఆలయం ఇటుకలతో కట్టబడింది. దీనిని ఇక్ష్వాకు రాజు ఎహువల చాంతమూలుని 16వ రాజ్య సంవత్సరంలో అతని భార్య కూపనసిరి, కొడుకు రెండవ వీరపురుషదత్తుడు నిర్మించారు. ఈ ఆలయం గర్భగృహం, 16 స్తంభాల ముఖ మండపం, ధ్వజ స్తంభం, 4 తోరణ ద్వారాలతో కూడిన ప్రాకారం... ఇలా సర్వ హంగులతో కూడిన సంపూర్ణ దేవాలయం. దేశంలో మొదటిది. దీని




పశ్చిమ ద్వారం నుంచి కృష్ణానదీ తీరంలో కట్టిన అందమైన స్నానవాటికకు దారి వేసి ఉంది.



నాగార్జునకొండ మీద కృష్ణానది ఒడ్డునే కట్టిన సర్వదేవాలయం చాలా అందమైంది. ఇది రెండంతస్థుల ఆలయం. వరదలను తట్టుకునేందుకు ఇటుకలతో ఎత్తైన అరుగు కట్టి దాని మీద ఆలయం నిర్మించారు. ఈ ఆలయం చాలా విశాలమైన మంటపాన్ని కలిగి ఉండటంతో ఇది సాంకేతికంగా 'శ్రీ విశాల' అనే శైలితో తరువాతి కాలపు భారతదేశ వాస్తు నిపుణులకు ఆదర్శప్రాయమై నిలిచింది.

నవగ్రహ ఆలయంలో కూడా శివుడే ప్రధాన దైవం. నాగార్జునకొండలో బయల్పడిన అతి పెద్ద దేవాలయం కుబేరేశ్వర ఆలయం. నల్లమల కొండలు బంగారం, వజ్రాలు, నవరత్నాలకు నిలయాలు కాబట్టి వాటిని ప్రాచీన కాలంలో శ్రీ పర్వతం అని, వాటికి అధిపతి కుబేరుడని, శివ ప్రాధాన్యమైన కొండల్లో నెలకొన్నాడు కాబట్టి కుబేరేశ్వరుడని (కుబేర+ఈశ్వర) అన్నారు. కుబేరేశ్వరాలయం వంద స్తంభాల గుడి. దీనికి దక్షిణాన చల్లగుండం (దదిసరస్) అనే కోనేరుంది.

ఈ ఆలయాలతో పాటు కృష్ణానది తీరంలోనే మరో రెండు శివాలయాలు ఆ కాలపువే మహబూబ్‌నగర్ జిల్లాలో రంగాపూర్, గూమకొండ (గుమ్మడం) గ్రామాలలో ఉన్నాయి. రంగాపూర్ దేవాలయం కర్నూలు–హైదరాబాద్ రహదారి మీద కనిపించే 162 కి.మీ. రాయికి కుడివైపున ఫర్లాంగు దూరంలో కృష్ణానది ఉత్తర గట్టున కన్పిస్తుంది.

ఇది సుమారు 2.20 మీటర్ల చతురస్ర వైశాల్యంతో కూడిన గర్భగృహం కలిగి 30x20x8 సెం.మీ.ల పొడవు, వెడల్పు, ఎత్తు కొలతలు గల ఇటుకలతో నిర్మిచబడింది... క్రీ.శ.300 ప్రాంతంలో. ఈ దేవాలయం సాధారణ మంచక పద్ధతిలో నిర్మించిన అధిష్ఠానంపైన కట్టబడింది. ఆలయానికి చుట్టూ పద్మబంధ జగతి ఉంది. మూల విగ్రహం ఒక పీఠంలో నిలబెట్టిన ఆనవాలు కనిపిస్తుంది.

గూమకొండ (గుమ్మడం) గ్రామ శివారులో పారే పెద్దవాగు తీరంలో మరో రెండు దేవాలయాలున్నాయి. ఇవీ ఇటుక దేవాలయాలే. తూర్పున ఉన్న దేవాలయం వెనుక... అంటే పశ్చిమాన మరో దేవాలయముంది. ఈ రెండింటి చుట్టూ ప్రాకారముంది. తూర్పు దేవాలయానికి మంచక శైలిలో అధిష్ఠానముంది. దాని 'కటి'కి మూడు పక్కలా దీర్ఘ చతురస్రాకారంలో బయటికి పొడుచుకొచ్చిన నిర్మాణాలున్నాయి. బహుశా అవి భద్రకోష్ఠాలు కావచ్చు. ఆలయం చతురస్రాకారంలో ఉంది. ఆలయం ఈశాన్యంలో ఆవరణ దేవత పీఠం ఉంది. దాని నిర్మాణంలో వాడిన ఇటుకల పరిమాణం 41x20.5x9 సెం.మీలు. ఈ తూర్పు ఆలయానికి వెనుకనున్న ఆలయానికి అర్ధ మంటపం, అగ్రమంటపం కూడా ఉన్నాయి. గర్భ గృహంలో ఉన్న పీఠంలో పచ్చని సున్నపురాయి లింగం ఉంది. ఇది సిద్ధేశ్వర లింగం అయ్యుంటుంది. ఈ ఆలయానికి కర్నూలు జిల్లాలో కృష్ణానది తీరంలో ఉన్న సిద్ధేశ్వరాలయానికి పోలికలుండటంతో దాని నిర్మాణ కాలమైన క్రీ.శ.100 ప్రాంతంలోనే ఈ ఆలయం కూడా నిర్మించబడి ఉంటుంది.

పైన పేర్కొన్న అన్ని ఆలయాలూ కృష్ణానదీ తీరంలోనే ఉన్నాయి కాబట్టి, ఈ ఆలయాల నుంచి నదికి దారులు కూడా ఉన్నాయి కాబట్టి ఆనాటి భక్తులు నదిలో స్నానం చేసి వచ్చి ఆలయంలో శివలింగానికి నదీ జలంతో అభిషేకం చేసేవారని, నదీ తీరంలోనే ప్రసాద వితరణ చేసేవారని అర్థమవుతుంది.

గూమకొండ సిద్ధేశ్వర లింగం వంటి పచ్చని (ఛాయ) శివలింగం, నంది శ్రీశైల ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వరం దగ్గరి ప్రతాపగిరి కోట 'మూల మలుపు' ప్రాంతంలో కనిపించాయి. ఇక్కడి ఆలయం పేరు కూడా సిద్ధేశ్వరాలయం. కాబట్టి ఈ సిద్ధేశ్వరాలయానికి కూడా క్రీ.శ.100 ప్రాంతపు చారిత్రక నేపథ్యం ఉండి ఉంటుంది. ఇక్కడ కనిపించే ఆ కాలపు ఇటుకలు ఈ వాదనను బలపరుస్తాయి. పైగా నాగార్జున కొండలోని కుబేరేశ్వరాలయం వలెనే ఇక్కడ కూడా కుబేరేశ్వరాలయముంది. ఈ సిద్ధేశ్వర, కుబేరేశ్వర ఆలయాల మధ్య పారుతున్న ఉమామహేశ్వర వాగు తీరాన గుప్త ఉమామహేశ్వర ఆలయముంది. ఇప్పుడున్న గుప్త ఉమామహేశ్వరాలయం

విష్ణుకుండి రాజుల కాలంలో సుమారు క్రీ.శ.5వ శతాబ్దంలో నిర్మించబడింది... రాతితో. ఈ ఆలయ గర్భ గృహానికి ముందు అర్ధ మంటపం, ముఖ మంటపం ఉన్నాయి.

గుప్త ఉమామహేశ్వర ఆలయ పరిసరాల నుంచి పచ్చని అడవుల మధ్య నుంచి సుమారు ఒకటిన్నర కిలోమీటరు దూరం ఈశాన్యం వైపునున్న ప్రతాపరుద్ర కోట వైపు ఒక రాతి కోట గోడ ప్రయాణిస్తుంది. ఆ ప్రతాపరుద్ర కోట అంచున విష్ణుకుండులు నిర్మించిన రెండు ఆలయాలు ఒకదానికొకటి ఫర్లాంగు దూరంలో ఉన్నాయి. ఈ ప్రతాపరుద్ర కోట కింద నిరంజన్ షావలి దర్గా ఉంది. ఈ దర్గాకు దగ్గరగా కోట కొమ్మున ఉన్న దేవాలయం పక్కన అవబృథ స్నాన వాటిక ఉంది. విష్ణుకుండి రాజులు తాము తమ శాసనాల్లో చెప్పుకొన్నట్లుగా ఈ స్నాన వాటికలో స్నానం చేసి యజ్ఞ కర్మలు నిర్వహించేవారు. ఈ గుడి ముందు కొంచెం దూరంలో దిగుడు బావి వంటి పెద్ద కోనేర్లు సహజమైనవి రెండున్నాయి.

కాకతీయుల కాలం (క్రీ.శ.12వ శాతాబ్దం) నుండి ప్రతాపరుద్రకోటగా పిలువబడుతున్న కోట క్రీ.శ.4-6 శాతాబ్దాలలో విష్ణుకుండలకు రాజధాని. ఈ కోటకు నైరుతి మూలలో మూడు కిలోమీటర్ల దూరంలో ఉమామహేశ్వర క్షేత్రముంది. ఇక్కడి ప్రధానాలయానికి తూర్పున పల్లవేశ్వర లింగం చాలా నునుపుగా, అందంగా ఉంది. దానిని క్రీ.శ.5వ శతాబ్దంలో దక్షిణం నుండి విష్ణుకుండులపై దండెత్తిన పల్లవులు ప్రతిష్ఠించారు. శత్రువుల లింగమే అక్కడున్నదంటే ఆ ప్రాంతపు రాజులు విష్ణుకుండులు అక్కడి ఆలయాలను అభివృద్ధి పరచకుండా ఉంటారా? విష్ణుకుండులకు ముందువారైన ఇక్ష్వాకుల కాలంలోనే అక్కడ శివాలయాలు నిర్మించబడినట్లు ఆ ప్రాంతంలో పరిశోధనలు చేసిన పురాతత్వ శాఖ రిటైర్డ్ ఉద్యోగి డి.యల్.యన్.శాస్త్రి రాశారు. ఐతే ఉమామహేశ్వరంలో ప్రస్తుతమున్న ప్రధానాలయాన్ని 14వ శతాబ్దంలో దేవరకొండ రాజు మాదానాయకుడు నిర్మించాడు కాబట్టి అంతకు ముందటి విష్ణుకుండుల నిర్మాణాలను ఇప్పుడు చూడలేము. విష్ణుకుండులు చేయించిన పే..ద్ద నగారాను మాత్రం చూడవచ్చు... ఎగువ మహేశ్వరంలో. దిగువ మహేశ్వరంలో కాకతీయుల స్థానిక సామంతులు క్రీ.శ.1280లో కట్టించిన నవలింగాలయాలు అనే 9 శైవాలయాలను చూడవచ్చు. కొన్ని దశాబ్దాల క్రితం వరకు ఇక్కడ పంచలింగాలయాలు కూడా ఉండేవి. మరో పంచలింగాలయాల సమూహం ఉమామహేశ్వరానికి ఉత్తరాన 3 కి.మీటర్ల దూరంలో ఉన్న 'మమ్మాయి బోడల' మీద ఉంది. ఇలా ఎన్నో శైవాలయాలను కట్టించారు కాబట్టి విష్ణుకుండులు తమనుతాము 'పరమ



చంద్రబండ గుహలు

మహేశ్వరులం' అని చెప్పుకున్నారు. అందుకు నిదర్శనంగా వారు కట్టించిన ఇటుక శివాలయాలు ఉమా మహేశ్వరానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'లొద్ది'లోను, 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'సలేశ్వరం'లోను ఉన్నాయి. ఇంకా ఈ నల్లమల అడవుల్లో మరెన్నో ఆలయాలు ఉన్నాయి. వాటిల్లో చాలావాటిని పేర్కొన్న క్రీ.శ. 1300 ప్రాంతంనాటి పాల్కురుకి సోమనాధుని 'పండితారాధ్య చరిత్ర' గ్రంధం ఆధారంగా పరిశోధించి గుర్తించవచ్చు.



విష్ణుకుండుల తొలి కాలంలో... అంటే క్రీ.శ. 4వ శతాబ్దంలో నల్లమల ప్రాంతాన్ని పాటలీపుత్రం (ఈనాటి బీహార్ రాజధాని) రాజు సముద్రగుప్తుడు జయించినట్లు అలహాబాద్ స్తంభ శాసనంలో ఉంది. అతని కొడుకు రెండవ చంద్రగుప్తుని కూతురు చంద్రావతి ఈ నల్లమలలో కొన్ని దేవాలయాలను కట్టించింది. వాటిలో శైవాలయాలను ఇప్పుడు మనం ఉమామహేశ్వరం దగ్గరలో ఉన్న రంగాపురం శివారు 'చంద్రబండ' గుహల్లో చూడవచ్చు. శ్రీశైలానికి ఉత్తరాన కృష్ణానది ఎడమ గట్టునున్న 'చంద్రగుప్తి' పట్టణంలో కూడా ఒకటి రెండు శివాలయాలున్నాయి. ఇక్కడ ప్రతి పౌర్ణమినాటి అర్ధరాత్రి వెన్నెలలో దేవకన్యలు నాట్యం చేస్తారని వారిని చూసినవారు తనకు చెప్పారని ఈ ప్రాంత తహశీల్దారు సయ్యద్ గౌస్ 'బాలా-ఎ-కోహ్ అమ్రాబాద్' అనే తన ఉర్దూ గ్రంథంలో 1923లో రాశారు. 'ఇప్పటికీ పౌర్ణమి రాత్రి భయంతో అటువైపు చేపల వేటకు వెళ్ళమని' ఇక్కడ శ్రీశైలం ప్రాజెక్టులో చేపలు పట్టేవారు ఈ వ్యాస రచయితకు చెప్పారు.

ఉమామహేశ్వరానికి పశ్చిమ దిశలో సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండనాగుల గ్రామ శివారులో ఉన్న దేవాలయాలను కూడా మొదట విష్ణుకుండులే కట్టించారు. ఈ దేవాలయాలు రెండూ రెండు కొండలపై ఉండటం వల్ల, ఈ దేవాలయ ద్వారాలకు రెండు వైపులా నాగుపాముల శిల్పాలు చెక్కి ఉండటం వల్ల ఇక్కడున్న గ్రామానికి 'కొండనాగుల' అనే పేరు వచ్చింది. స్థానికులు ఇక్కడి చిన్న కొండ పైనున్న దేవాలయాన్ని చిన్నగట్టు గుడి అని, పెద్ద కొండపైనున్న దేవాలయాన్ని పెద్దగట్టు గుడి అని పిలుస్తున్నారు.

ఈ రెండు దేవాలయాల ద్వారబంధాల కింది భాగంలో ప్రత్యేకమైన పూర్ణకుంభ శిల్పాలుండడాన్ని బట్టి ఇవి విష్ణుకుండుల కాలానివని చెప్పవచ్చు. ఈ రెండు ఆలయాలకూ దక్షిణం వైపు ప్రధాన ద్వారాలు ఉన్నాయి. అంటే ఈ ప్రాంతపు ప్రధాన క్షేత్రమైన ఉమామహేశ్వరాన్ని చూస్తున్నట్లుగా ఉన్నాయి. రెండు ఆలయాలూ గర్భగృహం, అర్ధ మండపం ముఖ మండపాలతో శోభిల్లుతున్నాయి. చిన్నగట్టు ఆలయంలో 16 స్తంభాలతో కూడిన నవరంగ (తొమ్మిది గదుల) మంటపం ఉండగా, పెద్దగట్టు ఆలయంలో 36 స్తంభాలతో కూడిన 25 గదుల మంటపం చతురస్రాకారంలో ఉంది. ఈ రెండు దేవాలయాలకూ చుట్టూ ప్రాకారాలున్నాయి. వీటి పరిసరాల్లో సహజసిద్ధమైన సరస్సులు చిన్నచిన్నవి ఉన్నాయి. పెద్దగట్టు శివాలయం ముందున్న కోనేరు తీరాన విష్ణుకుండులనాటి లఘు శాసనమొకటుంది. రెండు దేవాలయాల మంటపాల్లో కూర్చుని ఆనాటి శిల్పుల పనితనాన్ని కొనియాడకుండా





ఉండలేము. చిన్నగట్టు దేవాలయం రాచకొండ పద్మనాయక రాజుల కాలంలో లక్ష్మీచెన్నకేశవాలయంగా మారి గత మూడు శతాబ్దాల కాలంలో స్థానిక కొండనాగుల ప్రభువుల అభివృద్ధి కార్యక్రమాలకు నోచుకుంది. ఇప్పటి ఆలయ ధర్మకర్త కారెంచేడు కోదండ రామాచారికి ఇప్పటికీ 130 ఎకరాల మాన్యం ఉందంటే ఇంకా వెనుకట ఈ ఆలయం ఎన్ని వేలు, లక్షల మంది శివభక్తులను అలరించిందో అర్థం చేసుకోవచ్చు.


## ఇంద్రపాలనగర శివాలయాలు

విష్ణుకుండులు తమ తొలి రాజధాని అమరావతి (నేటి మహబూబ్‌నగర్ జిల్లాలోని అమ్రాబాద్) నుండి కొంత కాలం తరువాత నల్లగొండ జిల్లాలోని తుమ్మలగూడెం దగ్గరి ఇంద్రపాలగుట్టకు వెళ్ళి ఆ ప్రాంతాన్ని మరో రాజధానిగా చేసుకున్నారు. ఆ గుట్ట పైన వారు కట్టించిన కోట గోడలు, దేవాలయాలు, కోనేర్లు, బౌద్ధ స్థూపాలు, జైన మత విగ్రహాలు ఇప్పటికీ ఉన్నాయి. కోటగోడ కొసన వారి రాజ చిహ్నమైన పంజా ఎత్తి గర్జిస్తున్న సింహం శిల్పం రాజదర్బారు వెనుకనే పడి ఉండటంతో ఈ కోటగోడ కట్టడాలు విష్ణుకుండులవే అని నిర్ధారించడానికి వీలైంది.

ఇంద్రపాల గుట్ట కింద ఒక త్రికూట శివాలయం, గుట్ట పాదం గుహలో మరో శివాలయం ఉన్నాయి. ఈ రెండు ఆలయాల మధ్యలో ఉన్న గుట్ట గుహలో మరో అద్భుత శివలింగం చెక్కడం ఉంది.

త్రికూట శివాలయం సర్వ హంగులతో నిర్మించబడింది. తూర్పుకు అభిముఖంగా ఉన్న ఈ ఆలయంలో తూర్పున తప్ప మిగతా మూడు దిశల్లో మూడు శివాలయ గర్భగుడులు అంతరాళాలతో అలరారుతున్నాయి. ఈ మూడు అంతరాళాల ముందర 36 స్థంభాల మంటపముంది. ఇది ఇక్కడి ప్రత్యేకాకర్షణ. ఈ మంటపం మధ్యలో రంగ మంటపముంది. మంటపానికి ఎడమ పక్కన కళ్యాణ మంటపం, ఈశాన్యంలో కోనేరు, తూర్పున ద్వార గోపురం ఉన్నాయి. ఈ త్రికూటాలయ గోపురాలు ఇటుకలతో నిర్మించబడ్డాయి.

ఇంద్రపాలగుట్ట పాదంలో ఉన్న శివాలయం విష్ణుకుండుల తొలి కాలానికి... అంటే క్రీ.శ.5వ శతాబ్దానికి చెందింది. ఈ ఆలయం నిజానికి ఒక పెద్ద గుహను ఆవరించుకొని కట్టినది. నిలువెత్తు గుహలో 5 అడుగుల వెడల్పు, 6 అడుగుల పొడవుతో చెక్కిన ఎర్రరాతి పానవట్టంలో నిల్పిన నల్లరాతి శివలింగం చూడ చక్కనిది. ఈ ఆలయం ముందర ఒకప్పుడు నంది మంటపం, కళ్యాణ మంటపాలు ఉండేవనడానికి ఆనవాళ్ళు కన్పిస్తాయి. ఆలయం ముందు ఆనాటి సహజసిద్ధమైన



ఉమా మహేశ్వరం శాసనం

కోనేర్లు ఇప్పటికీ నీటితో కళకళలాడుతూ కన్పిస్తాయి.

ఈ శివాలయానికి ఉత్తరాన ఫర్లాంగు దూరంలో గుట్ట అంచున మూసీనది ఒడ్డున మరో శివాలయం ఉంది. ప్రాకార పరివేష్టితమైన ఈ శివాలయం కూడా గర్భ గృహం, అంతరాళం, ముఖ మండపాలతో, శిఖర శోభతో తూర్పుకభిముఖంగా ఉండి వంకలు తిరిగి పారుతున్న మూసీనది అందాలను ఆస్వాదిస్తున్నట్లుగా కనిపిస్తుంది. ఈ శివాలయం వెనుక ఫర్లాంగు దూరంలో మూసీనది మధ్యలో ఉన్న ఒక ద్వీపపు రాతిబండపైన 108 శివలింగాలు చెక్కి ఉన్నాయి. ఈ ప్రాంత సౌందర్యం ఆస్వాదించ దగింది. విష్ణుకుండుల కాలంలో శివభక్తులు ఇక్కడ మూసీనదిలో స్నానం చేసి ఇక్కడి కోటపైకి ఉన్న మెట్ల ద్వారా నడిచి అక్కడి శివాలయాలను చేరుకుని శివలింగాలకు అభిషేకాది పూజలు చేసేవారని అర్థమవుతుంది. ఇంకా, ఈ ప్రాంతంలో కనిపించే అనేక రాతి గుండ్లకు వీరభద్ర, కాలభైరవ శిల్పాలు చెక్కి ఉన్నాయి. శివ సంబంధ ఇతర విగ్రహాలు, ఆలయాలు కూడా ఇంద్రపాల నగరంలో చాలా ఉన్నాయి.



## కీసరగుట్ట శివాలయాలు

ఇంద్రపాలగుట్ట దగ్గరి మూసీనది ద్వీపంపై ఒకేచోట 108 చిన్న చిన్న శివ లింగాలు చెక్కి ఉంటే గజమెత్తు శివలింగాలు 108 హైదరాబాద్ దగ్గరి (30 కి.మీ.) కీసర గుట్ట పైనున్నాయి. ఇవి నల్లగా నునుపుగా చాలా అందంగా ఉన్నాయి. ఒక దగ్గర కాకుండా అక్కడొకటి అక్కడొకటి ఉన్నాయి. వీటిని కూడా విష్ణుకుండి రాజే కట్టించాడు. ఆయన పేరు రెండవ మాధవవర్మ. క్రీ.శ.5వ శతాబ్దంలో ఆయన శత్రువులపై సాధించిన ఒక్కొక్క విజయానికి గుర్తుగా ఒక్కొక్క శివలింగాన్ని ప్రతిష్టించి ఆ లింగాల చుట్టూ ఆలయాలను కట్టించాడు. వాటి ఇటుకలను స్థానికులు తీసుకు పోవడంతో ఇప్పుడు కేవలం శివలింగాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. అయితే కాలక్రమంలో భూమిలో

కూరుకు పోయిన ఇటుక ఆలయాలు కొన్ని గుట్ట కింద చెరువు దగ్గర రాష్ట్ర పురావస్తు శాఖ జరిపిన తవ్వకాలలో బయటపడుతున్నాయి. ఇక ప్రధాన రాతి నిర్మిత శివాలయం నేటికీ లక్షల మంది శివ భక్తుల పూజలు అందుకుంటూనే ఉంది.

## మంథని దగ్గర మరో అజంతా

విష్ణుకుండులు తెలంగాణా ప్రాంతాన్నంతటినీ పరిపాలించారు. కాబట్టి వీరి రాజ్యంలో గోదావరి తీరంలోని రామగిరి కోట, మంథని ప్రాంతాలు కూడా ఉండేవి. రామగిరి కోటపైన మాధవవర్మ కట్టించిన మాధవీ మంటపం, గుహా రామలింగేశ్వర ఆలయం చూడదగినవి. ఇక తెలుగు ప్రజలకు కూడా తెలియని విష్ణుకుండులనాటి శివాలయాలు మంథని దగ్గరి గోదావరి నదిలోని లంజమడుగు పైన ఉన్నాయి.

ఇక్కడ తూర్పు వైపు ప్రవహిస్తున్న గోదావరి అకస్మాత్తుగా ఉత్తరం వైపు తిరిగి ఒక ఎత్తైన గుట్టను వేగంగా గుద్దుకొని మళ్ళీ వెంటనే తూర్పు వైపు తిరిగడంతో దాని దాటికి ఆ ప్రాంతంలో ఒక పెద్ద లోతైన మడుగు ఏర్పడింది. ఈ మడుగును ఆనుకొని ఉన్న నిటారైన గుట్ట అంచున 200 అడుగుల ఎత్తున కొన్ని గుహాలయాల సముదాయము ఉంది. ఈ గుహాలయాలు ఐదు కావడంతో, వీటిల్లో శివలింగాలు 



మంథని గౌతమేశ్వరాలయం



గౌతమేశ్వరాలయ పైకప్పు



ఉండడంతో ఇవి నిజానికి పంచ లింగాలయాలని, వీటి వాస్తు శిల్పరీతులు క్రీ.శ.5వ శతాబ్దం ప్రాంతానివి కావడంతో వీటిని విష్ణుకుండి రాజులే కట్టించారని చెప్పవచ్చు. వీటి నీడ ప్రతిబింబాలు కిందుగా ప్రవహిస్తున్న గోదావరి ప్రవాహంలో (లంజమడుగులో) అందంగా కనిపిస్తాయి. ఈ దృశ్యం అజంతా కంటే అందమైనది. లంజమడుగులో చేసే పడవ ప్రయాణం పక్కనున్న గుట్టలు, పచ్చని అడవుల మధ్య సాగుతూ మనకు కేరళ అందాలను గుర్తుకు తెస్తాయి. ఈ గుడులలో తర్వాతి కాలంలో ప్రబలి, ఆ మతంలో స్త్రీలకు ప్రవేశముండి లైంగిక కార్యకలాపాల ద్వారా ముక్తి సాధ్యమనే భావన ప్రచారం కావడంతో ఈ గుళ్ళకు లంజగుళ్ళని పేరు వచ్చింది.

దక్షిణాభిముఖంగా ఉన్న ఈ గుళ్ళకు తూర్పున ఫర్లాంగు దూరంలో మరో రెండు గుహాలయాలున్నాయి. వీటిని కోమటి గుళ్ళు అంటారు. వీటి గర్భగృహాల ముందున్న అర్థమంటప స్తంభాలకు విష్ణుకుండుల కాలపు లఘు శాసనాలు చెక్కి ఉన్నాయి.

ఇలా ప్రకృతి అందాల నడుమ నెలకొన్న పరమ శివాలయాల ప్రాచీనత మన వరకూ కొనసాగి మనకూ కన్పించడం మనం చేసుకున్న అదృష్టం.

*– నమస్తే తెలంగాణ ఆదివారం అనుబంధం*

*26-01-2014*



డా. ద్యావనపల్లి సత్యనారాయణ

# 20 గొందెలి: అంతరించిపోతున్న అరుదైన జానపద కళ

ప్రజలు పట్టణీకరణ, ఆధునీకరణ చెందుతున్న క్రమంలో వందల ఏళ్ళుగా పల్లెల్లో ఆదరించి ఆనందించిన జానపద ప్రదర్శన కళలు అంతరించిపోతున్నాయి. దీనివల్ల సాంస్కృతిక వైవిధ్యం మరుగైపోయి ప్రజల మనుగడ ప్రశ్నార్థకమైపోతుంది. ఇది ప్రమాద సంకేతం. కాబట్టి జానపద కళలను కాపాడుకోవాలి.

కళను కాపాడాలంటే 'ఎందుకు' అనే ప్రశ్న ఎదురవుతుంది. అలాంటప్పుడు కాపాడవలసిన కళ మొక్క విశిష్ఠతను, ప్రాచీన వైభవాన్ని గూర్చి ప్రజలకు చెప్పవలసి ఉంటుంది. ఇప్పుడు ఆ ప్రయత్నమే చేద్దాం.



## గొందెలికి పూర్వ రూపం కుండలి

గొండెలి అని పిలువబడుతున్న జానపద కళ పూర్వ రూపం 'కుండలి' అని పరిశోధన ప్రయత్నంలో తెలుస్తుంది. 'కుండలి' అంటే కుండల ఆకారంలో గుండ్రంగా వేదిక మీద తిరుగుతూ ప్రదర్శించే కళ అని అర్థం. ప్రస్తుత ప్రదర్శనలో కూడా జంట తబలలు వాయిస్తున్న కళాకారుడు. పంబ వీణ వాయిస్తున్న కళాకారుడు ఒకరి వెనుక ఒకరు లయబద్ధంగా నృత్యం చేస్తూ గుండ్రంగా తిరగడం కనిపిస్తుంది.

గుసడదవాదేశ సంధి, సరళాదేశ సంధి ప్రకారం కుండలి... గుండలి అవుతుంది. 'బుందేల్‌ఖండ్' ప్రాంతం నుంచ తెలంగాణకు వలస వచ్చినవారిని 'బొందిలివారు' అన్నట్లుగా గుండలి... గొండలి అవుతుంది. పల్లీయుల ఉచ్చారణలో గొండలి.. గొందలి... గొందలి వంటి రూపాలను సంతరించుకుంది. ఇలా జరిగిందని ఊరికే అలా కట్టుకథలు చెప్పడం లేదు. ఇందుకు నిదర్శనాలు తెలుగు సాహిత్యంలో కోకొల్లలుగా కనిపిస్తాయి. అవేమిటో చూద్దాం.

## సాహిత్యంలో గొందెలి

సాహిత్యం ఉన్నత కులాలకే పరిమితమైంది. ఉన్నత కులస్థులు శిష్టశాస్త్రీయ కళలనే ఇష్టపడతారు. జానపద కళలను కాదు. సాధారణంగా అయినా ఆనాటి శిష్ట సాహిత్యంలో శిష్టకళలతో పాటు జానపద కళలూ వివరించబడ్డాయంటే అవి పక్కకు పెట్టలేనంత ప్రాధాన్యం కలవని అర్థం. కాబట్టి ఇప్పుడు మనమూ ఆదరించకపోవడం చారిత్రక తప్పిదమవుతుంది.

సాహిత్య గ్రంథాల్లో గొందెలి శాస్త్రీయ నృత్య రూపకంగా కాకుండా దేశి నృత్య ప్రదర్శన కళగా, జానపదులు ఆదరించిన కళగా ప్రస్తావించబడింది. అలా దేశి కళలను మొట్టమొదట ప్రస్తావించింది హాలుని 'గాధాసప్తశతి' అనే కవిత్వ గ్రంథం. రెండు వేల సంవత్సరాల కింద కరీంనగర్ జిల్లాలోని కోటిలింగాల నుండి యావత్ దక్కన్ ప్రాంతాన్ని పరిపాలించిన హాలుడు మొట్టమొదటి తెలంగాణ రాజవంశం శాతవాహన వంశానికి చెందినవాడు. ఈయన గ్రంథంలో శబ్ద వాయిద్యాలకు తడిపిన పిండి పూసి వినసొంపైన శబ్దాలను ఎలా సృష్టించి జనపదులు ఆనందించేవారో తెలిపే ప్రస్తావనలున్నాయి.



తెలుగు సాహిత్యంలో ఆదికవిగా పేర్కొనబడుతున్న నన్నయ 'ఆంధ్ర మహాభారతం' మొదలు ప్రధాన తెలుగు సాహిత్య సారస్వత గ్రంథాలన్నీ గొందెలి నృత్య రూనకాన్ని దేశి, జానపద కళగా అభివర్ణించాయి. కాంస్య మృదంగ వాయిద్యానికి అనుగుణంగా ఆడుతూ, పాడుతూ వెళ్ళి ప్రజలు రైవతకాద్రి అనే కొండను ఎలా



పూజించారో నన్నయ వర్ణించాడు. ప్రస్తుత గొందెలి కళాకారులు కూడా కాంస్య వాయిద్యాన్నే వాయిస్తుండడం గమనార్హం. తిక్కన రచించిన మహాభారత విరాట పర్వంలో బృహన్నల వేషంలో ఉన్న అర్జునుడు విరాట రాజుతో గుండలి మొదలైన కళలను అభ్యసించానని కింద విధంగా చెప్పాడు.

**అభ్యసించితి శైశవమాదిగాగ**
**దంగలాసక విధమును గుండలియును**
**ప్రెక్కణంబు తెరుంగును పేరణమును**

నాచప సోమన 'ఉత్తర హరివంశం'లో హంస డిభకులపైకి యుద్ధానికి వెళ్ళిన శ్రీకృష్ణుడు తన పాంచజన్యాన్ని పూరించగా సకల చరాచర స్థావరాలు చలించిపోయిన విధానాన్ని గొండలి తదితర నృత్యాలతో పోల్చి వర్ణించాడు కింది విధంగా.

**తెరలెత్తి సప్త సాగరములు పొరలంగ**
**వరుణుందు గొండలి పరిఢవింపు**

పై పద్య పాదంలో గొండలి ప్రదర్శనలో భాగంగా ఉధృతమైన సముద్రపు అలల శబ్దం, ఉరుముల శబ్దాలు ప్రేక్షకులను భావోద్వేగాలకు గురి చేస్తాయని చెప్పడం కనిపిస్తుంది.



శ్రీనాధుడు కూడా తన 'కాశీఖండం'లో 'ఉరుము చప్పుళ్ళు మర్దళ ధ్వనులుగా గగన రంగస్థలంబునం క్రొమ్మెరుంగు మెరుంగు పోడి గొండ్లి పరిఢవించే' నని మెరుపు వంటి సుందరి ఉరుములను సృష్టించే మద్దెల ధ్వనులకు అనుగుణంగా రంగస్థలంపై ఆడి పాడిందని వర్ణించాడు. అలాంటి కుండలి నృత్యాన్ని బెండపూడి అన్నయ మంత్రి కట్టించిన మొగసాల వాకిట్లో కూర్చుండి వేమారెడ్డి అనే రాజు వీక్షించాడని శ్రీనాధుడు తన 'భీమేశ్వర పురాణం'లో ప్రస్తావించాడు. తన 'పల్నాటి వీర చరిత్ర'లో కూడా నలగామరాజు సభలో ప్రదర్శించిన దేశి నృత్యాల్లో 'కుండలి'ని పేర్కొన్నారు.

వినుకొండ వల్లభరాయుడు తన 'క్రీడాభిరామం' అనే వీధి నాటకంలో ఓరుగల్లులో గొరవయ్యలు అనే వీరశైవ మత గురువులు గొండ్లి ఆడించగా గొరగ పడుచు 'ఆడుచున్నది చూడు మూర్ధానయము' అంటూ ఆమె ఎంతటి నేర్పుతో ఎలాంటి విన్యాసాలు చేసిందో కింద పద్యంలో వర్ణించాడు.

**వెనుకకు మ్రొగ్గవాలి కడు వెన్నును వోప్పగ తొట్టె నీళ్ళలో**
**మునిగి తదంతరస్థమగు ముంగర ముక్కున క్రుచ్చికొంచు లే**
**చెను రసనా ప్రవాళమున శీఘ్రము గ్రుచ్చెను నల్లపూస పే**
**రనుపమ లీలనిప్పడచు పాయములిట్టివి యోట్లు నేర్చెనో!**




మహబూబ్‌నగర్ జిల్లా, అమరాబాద్ మండలంలో ఉన్న అరుదైన గొందెలి కళాకారుల బృందం

పై పద్యములో గొరగ పడుచు గొండ్లి ఆటలో భాగంగా వెనుకకు పిల్లి మొగ్గ వేసి తొట్టి నీళ్ళలో తలను పెట్టి ముక్కుకు ముంగరనె కుచ్చుకొని లేచి దానికి నల్ల పూసలను అత్యంత వేగంగా పురుగా కుచ్చిందట, ఇట్లాంటి ఉపాయములు, విన్యాసాలు ఎలా ఆమె ఎట్లా నేర్చుకుందోనని కవి ఆశ్చర్యపడ్డాడు. ఇక ప్రేక్షకుల ఆనందాశ్చర్యాలకు అవధులుంటాయా?

ఇదే విధంగా కుండలినా పుష్పగంధి అనే సుందరి ప్రదర్శించిందని 'మల్హణ చరిత్ర'లో పేదపాటి ఎర్రనార్యుడుచ, ఊర్వశి ప్రదర్శించిందని 'వాల్మీకి చరిత్ర'లో రఘునాధరాయులు, వార వనిత (వేశ్య) ప్రదర్శించిందని 'హంస వింశతి'లో అయ్యలరాజు రానాయణామాత్యుడు తదితర కవులు వర్ణించారు. అయితే వీరందరూ గొందెలిని స్త్రీలు ప్రదర్శించారని వివరించారు. అచ్చ తెలుగు తెలంగాణ కవి పాల్కురికి సోమనాధుడు మాత్రం కాకతీయుల కాలంలో పురుషులు ప్రదర్శించారని పేర్కొన్నారు. తన 'బసవ పురాణం'లో బసవేశ్వరుని పెండ్లి సందర్భంలో శివభక్తులు గొండ్లి తదితర నృత్యాలను చేశారని కింద పద్యంలో వర్ణించాడు.



**కోలాటమును బ్రాత్ర గొండ్లి పేరణియు**
**కేళిక జోకయు లీల నటింప**

జాగ్రత్తగా పరిశీలిస్తే పై పద్యంలో పద్య పాదంలో గొందెలి ప్రదర్శనలో పాత్రలను అభినయించడం ఉంటుందని గమనించవచ్చు. గొందెలి నర్సింగరావు బృందం కూడా తుల్జాభవాని కథలో పాత్రలను అభినయించడం గమనించవచ్చు. అయితే ఈ తుల్జాభవానీ కథ గత మూడు వందల సంవత్సరాల నుంచి శివాజీ దండయాత్ర కాలం నుంచి మహారాష్ట్ర నుంచి తెలంగాణలో ప్రవేశించింది.

*– దక్కన్ ల్యాండ్ మాసపత్రిక*
*జూన్, 2013*

డా. ద్యావనపల్లి సత్యనారాయణ

# 21

# తెలంగాణ గిరిజన కళలు

మానవ జాతి, చరిత్ర - సంస్కృతుల వైవిధ్యాలకు ప్రతీకలు గిరిజనులు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 15 రకాల గిరిజన తెగలు జీవిస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం వీరి సంఖ్య 35 లక్షలు. రాష్ట్రం మొత్తం జనాభాలో వీరి శాతం 9.34గా ఉంది.

ప్రపంచీకరణ ప్రభావం వల్ల వివిధ గిరిజన తెగల కళల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. కొన్ని కళలు తెరమరుగు కాగా, మరికొన్ని వ్యాప్తి చెందాయి, ఇంకొన్ని కుచించుకుపోయాయి. మొత్తంమీద గిరిజన కళల వైవిధ్యం తగ్గుతుందనే చెప్పవచ్చు. కాబట్టి గిరిజన కళల వైవిధ్యాన్ని కాపాడవలసిన అవసరమేర్పడిందని చెప్పడమే ఈ వ్యాసం నేపథ్యం.



**వివిధ తెగలు:**

తెలంగాణలో ఇప్పటివరకు గుర్తించిన 15 రకాల తెగలు ముఖ్యంగా మూడు ప్రాంతాల్లో జీవిస్తున్నారు. అవి:

1. గోదావరి తీర ప్రాంత కొండ కోనలు, అడవులు.
2. కృష్ణా నది తీర ప్రాంత కొండ కోనలు, అడవులు.
3. మైదాన ప్రాంతాలు.

ఈ ప్రాంతాల్లో నివసిస్తున్న తెగల అభివృద్ధి కోసం ఆ ప్రాంతాలలోనే స్థాపించబడిన నాలుగు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలు పని చేస్తున్నాయి. కొన్ని చోట్ల మాడాలు (Modified Area Development Approach) పని చేస్తున్నాయి.

గోదావరి తీర ప్రాంత ఆదిలాబాద్ జిల్లా అడవులు, నిర్మల్-సత్మల్ కొండల్లో గోండులు, నాయకపు వాళ్లు, వారిని ఆశ్రయించి తోటి, ప్రధాన్, కోలమ్ అనే తెగలు

నివసిస్తున్నారు. ఆంధ్రులకు మూలపురుషులైన అంథ్‌లు కూడా ఈ జిల్లాలోనే ఉన్నారు. గోదావరి దిగువ భాగంలో కరీంనగర్ జిల్లాలోని మహాదేవపూర్ అటవీ ప్రాంతం నుండి గోదావరి ప్రవాహం వెంట ఉన్న అడవుల్లో (ఖమ్మం జిల్లాలో) కోయలు, కొండరెడ్లు జీవిస్తున్నారు. కృష్ణా నదిని ఆనుకొని ఉన్న విశాలమైన నల్లమల అడవుల్లో చెంచులు, యానాదులు జీవిస్తున్నారు. బంజారాలు, ఎరుకలు, యానాదులు మైదాన ప్రాంతాలలోనే జీవిస్తున్నారు. వీరిపైనే అన్ని తెగల కంటే ఎక్కువగా ప్రపంచీకరణ ప్రభావం పడింది.

## వివిధ తెగల కళలు:

సాంప్రదాయకంగా చెప్పుకునే చతుష్షష్టి కళల్లో లలిత కళలు ఐదు కాగా మిగతావన్నీ ఔపయోగిక కళలు అవుతాయి. మత, ఆధ్యాత్మిక సంబంధ కళలను నాగరికులు ప్రస్తావించరు. కాని గిరిజనులకు పైన తెలిపిన కళలన్నీ ఔపయోగిక కళలే. ఔపయోగిక కళ అంటే కళా ప్రదర్శన నిమిత్తం కాకుండా సందర్భానుసారం అవసరాలకు ఉపయోగపడేది. ఈ నేపథ్యంలో తెలంగాణ గిరిజనులు క్రింద పేర్కొన్న కళల్లో నిష్ణాతులు.



### 1 సంగీత నాట్యాలు:

తెలంగాణలోని అన్ని గిరిజన తెగల ప్రజలు నృత్యం చేస్తారు. ఒక్కొక్క తెగకు ఒక్కో ప్రత్యేక నృత్య రీతి ఉంది. ఒక్కొక్క నృత్యరీతిలో మళ్ళీ ఎంతో వైవిధ్యం ఉంది. కొన్ని గిరిజన నృత్యాలు వేల సంవత్సరాల నుండి మనుగడలో ఉన్నాయి. కోయ



*నాయకపోడు గిరిజనుల ముఖ తొడుగులు*

తెగలు చేసే కొమ్ము నృత్యం ఆహార్యంలో, పాటల్లో సింధూ నాగరికత కాలం నాటి (పశుపతి పూజ) ఛాయలు కన్పిస్తాయి. ఖమ్మం జిల్లాలోని అటవీ ప్రాంతంలో చేసే గిరిజన నృత్యం 'థింసా'. ఇటీవల చాలా ప్రాచుర్యంలోకి వచ్చింది. దీన్ని ఆ ప్రాంతంలో నివసించే అన్ని తెగల ప్రజలూ ప్రదర్శిస్తారు. 'దెంసా' అనే నృత్యాన్ని గోండులు చేస్తారు. కోయ జాతి చేసే కొమ్ము నృత్యం కూడా చాలా ఆకర్షణీయమైనది. లంబాడీ స్త్రీలు చేసే నృత్యాలు కూడా నాగరిక సమాజంలోకి చాలా చొచ్చుకుపోయాయి. తోటి తెగలోని కొర్రాజులు నాయకపోడ్ తెగను ఆశ్రయించి పద్మనాయక వృత్తాంతాన్ని నృత్య గానాలతో ప్రదర్శిస్తారు. చెంచు నృత్య నాటకం కూడా ప్రత్యేకంగా చెప్పుకోదగినవి.

**2 సాహిత్యం:**

ప్రపంచంలోని ఎంతటి ప్రసిద్ధమైన సాహిత్యానికైనా మాతృక మౌఖిక సాహిత్యమే. అది తెలంగాణలోని గిరిజనులందరిలోనూ ఉంది. వారికి లిపి లేకపోవడంతో వారి సాహిత్యం ప్రచురణకు నోచుకోలేకపోయింది. గత కొన్ని దశాబ్దాలుగా కొందరు నాగరిక ఔత్సాహికులు గిరిజన సాహిత్యాన్ని ప్రచురించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విధంగా కొంత బంజార సాహిత్యం, కొంత ఆదిలాబాద్ జిల్లా ఆటవిక తెగల సాహిత్యం, చెంచు సాహిత్యం వెలుగులోకి వచ్చింది. అలా గోండు రాజులకు చెందిన గోండి భారతం, అంకంరాజు కథ, బోయ ధర్మయ్య ఆధ్యాత్మిక, నాటక సాహిత్యాలు వెలుగులోనికి వచ్చిన సాహిత్యంలో ప్రత్యేకంగా పేర్కొనదగినవి. పై సాహిత్యాలు సుమారు మూడు శతాబ్దాలకు ముందటివి.



**3 చిత్రలేఖనం:**

మానవ జాతి అనాది కళ చిత్రలేఖనం. కాలక్రమంలో అందరూ ఆ కళను మర్చిపోయారు. కోయ, గోండు తెగల ప్రజలు మాత్రం తమ ఇళ్ళ గోడలను పుట్టమన్నుతో అలికి వాటికి రకరకాల ముగ్గులు, చిత్రాలు వేస్తారు.

**4 కర్ర శిల్పం:**

మానవులు మొట్టమొదట కొయ్య శిల్పాలనే దేవతా విగ్రహాలుగా చెక్కి వాటినే ఆలయాల్లో పెట్టి పూజించేవారు. తదనంతర కాలంలో నాగరికులు రాతి శిల్పాలను విగ్రహాలుగా మలచడం నేర్చుకున్నారు. గిరిజనులు మాత్రం ఇంకా కర్ర శిల్పాలనే

విగ్రహాలుగా చెక్కుకుంటున్నారు. అయితే వారు నాగరికుల కంటే అదనంగా చేస్తున్నది తమ కొయ్య విగ్రహాలను ప్రత్యేక రంగులతో అలంకరించడం. ఇలాంటి దారు శిల్పాలను చేసేవారిలో ప్రప్రథమంగా పేర్కొనవలసినది నాయకపు వాళ్ళను. వీరు పంచ పాండవుల ముఖాలను, కృష్ణుడు, గొర్రెపోతు, గుర్రం (లక్ష్మీదేవర), పోతరాజు, ఎర్రగొండ–నల్లగొండ రాక్షసుల ముఖాలను వారి శిరోభూషణాలతో సహా అందంగా చెక్కి వాటిని సహజ రంగులతో అందంగా తీర్చిదిద్ది తమ దేవాలయమైన 'ఇల్లారి'లో పవిత్రంగా భద్రపరుస్తారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో వాటిని తమ ముఖాలకు ధరించి నృత్యం చేస్తారు. నాయకపు వారిలాగే గోండులు కూడా 'కోడెల్' అనే పులి విగ్రహాన్ని, 'తపల్' అనే మనిషి తలను కర్రతో తయారు చేసుకుంటారు. ఆదిలాబాద్ జిల్లాలో కనిపించే ఆకిపెన్, పెర్సిపెన్ మొదలైన గిరిజన ఆలయాల్లో కూడా వారి కొయ్య శిల్పాలను చూడవచ్చు. చనిపోయినవారి జ్ఞాపకంగా కూడా అక్కడి గిరిజనులు కొన్ని కొయ్య శిల్పాలను చెక్కుతారు.

**5 అల్లికలు:**



ఈత చెట్లు, తాడి చెట్ల ఆకులు, ఈనెలతో చేసే రకరకాల చాపలు, తట్టలు, బుట్టలను తెలంగాణ గిరిజనుల ప్రత్యేక కళగా చెప్పుకోవచ్చు. ఈ కళలో నిష్ణాతులు ఎరుకలు, యానాదులు. వెదురు (కంక) ఈనెలతో రకరకాల కళాత్మక ఔపయోగిక వస్తువులను తయారు చేయడంలో ఆరితేరినవారు కోలములు, కోయలు, కొండరెడ్లు. కోలముల పేరే 'కోల' అనే పదం నుండి పుట్టింది. కోల అంటే వెదురు కర్ర లేదా బొంగు. బంజారా స్త్రీలు బట్టలను నేయడం, ఎంబ్రాయిడరీ చేయడంలో నిపుణులు. బంజార స్త్రీ తన కూతురు పెళ్ళి సమయంలో రెండు జతల బట్టలను కానుకగా ఇవ్వాలి. వాటిని ఆమె నెలల తరబడి చేతితో కుట్టి, వాటికి అద్దాలను పొదిగి తయారు చేస్తుంది.

**6 ఇతర కళలు:**

తెలంగాణ గిరిజనులు పైన పేర్కొన్న కళల్లోనే కాకుండా ఇంకా కొన్ని కళల్లో కూడా వంశపారంపర్య ప్రావీణ్యం కలవారు. అలాంటివాటిల్లో ఒకటి సోది. సోది అంటే మనిషి భవిష్యత్తును ఊహించి చెప్పడం. ఈ కళను ఎరుకల తెగలోని కొందరు స్త్రీలు నియమనిష్టలతో నేర్చుకొని అమ్మవారి దయ వలన భవిష్యత్తును ఊహించగలం అంటారు. వీరిలో కొందరు పచ్చబొట్లు కూడా పొడుస్తారు. వీరిలాగే తోటి తెగ స్త్రీలు

కూడా కొందరు పచ్చబొట్లు పొడుస్తారు. వాటివల్ల కొన్ని వ్యాధులు కూడా నయమవుతాయని గ్రామీణులు చాలా మంది నమ్ముతారు. ఎరుక స్త్రీలలాగే కొంతమంది కోయ తెగ పురుషులు భవిష్యత్తును చెప్పడంలో నైపుణ్యం సంపాదించారు. వారు ఒక ప్రాథమిక వీణను కొనగోళ్ళతో మీటుతూ, రేలా రేలా అంటూ పాటలు పాడుతూ గ్రామీణుల భవిష్యత్తును గూర్చి చెప్తారు. సమస్యలకు సమాధానాలు, ప్రకృతి మూలికలు కూడా ఇస్తారు. బంజారా స్త్రీలు ధరించే 27 రకాల వెండి నగలను కళాత్మకంగా రూపొందించడంలో దిట్టలు వారిలోనే ఒక తెగవారైన సోనార్ బంజారాలు. వీరు నిజామాబాద్ జిల్లాలోని డిచ్‌పల్లి ప్రాంతంలో నివసిస్తున్నారు. కోలాము స్త్రీలు కూడా సాంప్రదాయ బద్ధమైన వెండి నగలు ధరిస్తారు.

## ప్రపంచీకరణ ప్రభావం:

ప్రపంచీకరణ అంటే ప్రపంచంలో ఒక చోట ఉన్న నిష్ణాతులైన మానవ వనరులు, సహజ వనరులు, సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచంలోని అన్ని చోట్లకూ చేరడం. ప్రపంచీకరణకు బీజాలు రెండు ప్రంపంచ యుద్ధాల తరువాత పడ్డాయి. 1970ల నుంచి సాంకేతిక పరిజ్ఞానం, రవాణా, సమాచార అంతర్జాల (కంప్యూటర్, నెట్), దూరదర్శిని తదితర వ్యవస్థల్లో చోటు చేసుకుంటున్న అభివృద్ధికర మార్పులు 1990ల నుంచి ప్రపంచంలోని కుగ్రామాలకు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. తద్వారా తక్కువ ధరకు సులువుగా అందుబాట్లోకి వస్తున్న నాణ్యమైన వస్తు-సేవలను మారుమూల గ్రామీణులు, గిరిజనులు కూడా వినియోగించడానికి మొగ్గు చూపుతున్నారు. ఈ పరిణామం గిరిజన కళల విషయంలో కూడా చోటు చేసుకుంటున్నది. ఫలితంగా కొన్ని గిరిజన కళలు రూపు మారిపోతున్నాయి. మరికొన్నేమో రూపుమాసిపోతున్నాయి.

### అ. రూపు మారిపోతున్న కళలు:

కొన్ని గిరిజన కళలు నాగరికుల కళల కంటే ఉన్నతంగా ఉండి ప్రజలను ఆకర్షించి ఆనందింపజేసేలాగా ఉండటంతో ప్రభుత్వమే కొన్ని కళలను అభివృద్ధి చేస్తున్నది. వాటి ద్వారా ప్రభుత్వ పథకాల ప్రచార కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నారు. ఒకే దెబ్బకు రెండు పెట్టలన్నమాట. గిరిజనేతర ప్రజలు కూడా కొన్ని గిరిజన కళలను ఇష్టంతో నేర్చుకుంటున్నారు. పై నేపథ్యంలో... అంటే, ఆధునికత, ప్రభుత్వం-ప్రజల ప్రోత్సాహాల వల్ల మూల గిరిజన కళలు ఒక రకమైన సంస్కృతీకరణకు లోనై

రూపాంతరం చెందుతున్నాయి.

కోయల కొమ్ము నృత్యాన్ని సమాచార శాఖవారు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల ప్రచారానికి ఉపయోగిస్తున్నారు. లంబాడీల నృత్యాన్నైతే సాంస్కృతిక కళాకారులు స్వచ్ఛందంగా నేర్చుకొని ప్రదర్శిస్తున్నారు. విద్యార్థులు కూడా నేర్చుకొని తమ పాఠశాలల్లో, కళాశాలల్లో ప్రదర్శిస్తున్నారు.

తోటి తెగకు చెందిన గిరిజనులు సాధారణంగా గోండి భాషలో నాయకపు గిరిజనులను ఆశ్రయించి కథలు చెప్తారు. అలాంటివారు ఇప్పుడు ఆదిలాబాద్ జిల్లా నుంచి ఇతర సమీప జల్లాలకు వలసలు పోయి గ్రామాల్లో కూడా కథలు చెప్తున్నారు. పైగా తెలుగు భాషలో కూడా చెప్తున్నారు. కథకులలో ఒకడు నాగరిక కథకుల్లో లాగా బుడ్డర్‌ఖాన్ వేషం వేస్తున్నాడు. అతను నాగరికుల్లాగా ప్యాంట్, అంగీ, టీ-షర్టులు కూడా వేసుకుంటున్నాడు. ఈ కథకులు సినిమా సన్నివేశాలను కూడా అనుకరిస్తున్నారు. వారు సాంప్రదాయికంగా వాయించే కీకిరి, పేపెరె, ఫర మొదలైన వాయిద్యాల స్థానంలో/అదనంగా హార్మోనియం, తోలు డప్పుకు బదులు ప్లాస్టిక్ డప్పులు వచ్చి చేరాయి. ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా ప్రచారాన్ని పొందుతున్న సమ్మక్క-సారక్క జాతరలో కోయ జాతివారు చేసే సాంప్రదాయక కొమ్ము నృత్యం స్థానంలో ఇప్పుడు శివసత్తులు వచ్చి చేరారు.



గిరిజనుల్లో కొందరు చదువుకున్నవాళ్ళు ఈ మధ్య తమ మౌఖిక సాహిత్యాన్ని తెలుగు భాషలో అక్షరబద్ధం చేస్తున్నారు. అలా ఇప్పటికే అంకంరాజు కథ, బోయ ధర్మయ్య సాహిత్యం పుస్తక రూపం దాల్చాయి. క్రీ.శ.1742లో ముని పంతులు అనే కవి రాసిన గోండీ భారతాన్ని పూర్వపు ఆంధ్రప్రదేశ్ ప్రాచ్యలిఖిత భాండాగారం ప్రచురించింది. ఆ సంస్థ పూర్వ సంచాలకులు ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు గారి ఆధ్వర్యంలో ఈ మధ్య శతాబ్దంనర కిందటి గోండు రాత ప్రతులను సేకరించి, వాటి ఆధారంగా గోండీ భాష వర్ణమాల, గుణింతాలు, బాలశిక్షలను రూపొందించే కార్యక్రమం కొనసాగుతున్నది. చిలుకూరి నారాయణ అనే పరిశోధకుడు ఇటీవలనే బంజార భాషకు లిపిని రూపొందించినట్లు ప్రకటించాడు.

భద్రాచలం దగ్గరి యటపాకలో అక్కడి సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ఆ ప్రాంత గిరిజనులకు వెదురు, కొయ్య బొమ్మలను తయారు చేయడంలో శిక్షణనిచ్చి వారి చేత వెదురు ఈనెలతో పూవులు, ఇల్లు, ఓడలు, పెన్నుల స్టాండులు, టీ ట్రేలు, ఉత్తరాలు పెట్టుకునే ప్యాడ్లు, కొయ్య బొమ్మలు (కోయ నృత్య, దంపతుల దారు శిల్పాలు) చేయించి పాపికొండల విహార యాత్రికులకు అమ్మిస్తున్నారు. ఇక్కడే కొంత

కాలం గిరిజనులకు విలువైన రాళ్ళను అలంకరణ యోగ్యంగా చేసే శిక్షణనిచ్చారు. అలాగే చిత్రలేఖనంలో కూడా తర్ఫీదునిచ్చారు.

**ఆ. రూపుమాసిపోతున్న కళలు:**

సమాజంలో చదువు పెరగడంతో హేతువాదం పెరిగి, సంపద పెరగడంతో శుభ్రమైన విలాసాలు పెరిగి, సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో ఆధునిక కళలపై మోజు పెరిగి గిరిజన కళలకు ఆదరణ తగ్గడం వల్ల, గిరిజనులు కూడా పైన పేర్కొన్న పరిణామాలకు లోనవడం వల్ల అనేక గిరిజన కళలు రూపుమాసిపోతున్నాయి.

నాయకపు తెగ పద్మనాయకులకు వర్షాకాలంలో కీకిరి కథలు చెప్పే తోటి తెగ ప్రజలు చాలా వరకు తమ వృత్తిని మానేశారు. వరంగల్ జిల్లాలో తోటిల సంఖ్య వేలల్లో ఉన్నా కీకిరి కథకుల బృందాలు మాత్రం రెండే ఉన్నాయి. ఒకటి కటాక్షపురంలో, రెండవది రేగుంటలో. ఈ కథకుల్లో కూడా ఒకప్పుడు 40 రకాల కథలు చెప్పేవారు ఉండేవారు. ఇప్పుడు మాత్రం శశిరేఖా పరిణయం, కీచకవధ, పాండవ వనవాసం వంటి రెండు మూడు రకాల పాండవ కథలనే చెప్తున్నారు. సింగి, సింగడు తదితర సహజ పాత్రలతో చెంచు లక్ష్మి కథను చెప్పే చెంచులు ఇప్పుడు ఆ సంప్రదాయాన్ని మర్చిపోయి, వారిలో కొద్ది మంది మాత్రం అదే కథను నాగరిక కళాకారులలాగా యక్షగాన ప్రదర్శన ఇస్తున్నారు. ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలతోపాటు ఖమ్మం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో నివసిస్తున్న కోయ తెగ ప్రజలైతే తమ సాంప్రదాయ నృత్యం కొమ్ము నృత్యాన్ని మొత్తంగా మర్చిపోయారు.

ఇప్పుడు చదువుకుంటున్న బంజార కుటుంబాల్లో ఎవరికీ బంజార బట్టలు కుట్టడం, ఎంబ్రాయిడరీ పని రాదు. సాంప్రదాయిక బట్టలనే కాదు, నగలను కూడా ధరించడాన్ని బంజారా స్త్రీలే వెనుకబాటుతనంగా అసహ్యించుకుంటున్నారు. పైన పేర్కొన్నట్లు సమాజంలో హేతుబద్ధత, శాస్త్రీయ దృక్పథం పెరగడం వల్ల ఈనాడు ఎరుకల స్త్రీల చేతగాని, కోయ పురుషుల చేత గాని భవిష్యత్తును చెప్పించుకోవడం లేదు. అలాగే ఎరుకల స్త్రీలచేత గాని, తోటి స్త్రీలచేత గాని ఎవరూ పచ్చబొట్లు పొడిపించుకోవడం లేదు. పర్యవసానంగా ఆ కళలు అదృశ్యమవుతున్నాయి. ఇదే గతి ఇప్పటి వరకు గిరిజనులు చేస్తూండే బుట్టలు, చేటలు, చాపలు, గొడుగులు, కుండలు, కొలత పాత్రలు.. మొదలైనవెన్నింటికో పట్టింది. వాటి స్థానాన్ని ప్రధానంగా ప్లాస్టిక్ ఆక్రమించింది. తమ కళలు రూపుమాసిపోతుండడం వల్ల గిరిజనులు, వారి కళాకారులెందరో వడ్రంగి, కమ్మర వంటి ఎన్నో గిరిజనేతర వృత్తులను

అవలంబిస్తున్నారు.

గిరిజన కళలు నశిస్తే గిరిజన సంస్కృతిలో వైవిధ్యం నశిస్తుంది. గిరిజన సంస్కృతిలో వైవిధ్యం నశిస్తే మానవ జాతిలోనే వైవిధ్యం నశిస్తుంది. వైవిధ్యమే నశిస్తే మానవ జాతి వ్యవస్థే నశిస్తుంది. అది జరగకూడదంటే ప్రజలు, ప్రభుత్వం గిరిజన కళల పట్ల జాగరూకులై వాటిని ఆదరించి పోషించవలసిన అవసరముంది. ప్రభుత్వమైతే గిరిజన సంస్కృతిని రక్షించించేందుకు గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణా సంస్థను స్థాపించి దాని ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మాసాబ్‌ట్యాంక్‌లో నెహ్రూ శత జయంతి గిరిజన సంగ్రహాలయంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల గిరిజనుల వస్తువులు, కళాఖండాలను సేకరించి భద్రపరిచి సందర్శకులకు చూయిస్తున్నది. ఇలాంటివే మరో సంగ్రహాలయం మన్ననూరు (మహబూబ్ నగర్ జిల్లా)లో ఉన్నది. గిరిజన కళలను సంరక్షిస్తున్న ప్రభుత్వేతర సంగ్రహాలయాల్లో ప్రధానంగా పేర్కొనవలసింది ఆదిలాబాద్‌లోని రవీంద్ర కళాశ్రమం. ఇలాంటి కృషిని ఇంకా కొందరు ప్రైవేటు మేధావులు, ధనికులు కొనసాగిస్తేనే గిరిజన కళలను తద్వారా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడగలం.



*– తెలుగు వెలుగు మాసపత్రిక*
*జులై, 2013*

డా. ద్యావనపల్లి సత్యనారాయణ

# 22

# తెలంగాణ పర్యాటకం అభివృద్ధి ప్రణాళిక

## పర్యాటకం

భౌగోళికంగా దక్కను పీఠభూమిలో ప్రధాన భాగం తెలంగాణలోనే ఉంది. అంటే, తెలంగాణ ఎత్తైన ప్రదేశం కనుక, ఇది సమశీతోష్ణస్థితిని కలిగు ఉంటుంది. మరోవైపు ప్రకృతి వనరులకు, సోయగాలకు నెలవై పుష్కలమైన పర్యాటక వనరులనూ మనకందిస్తున్నది. సముద్రాలకు బదులు పెద్ద పెద్ద చారిత్రాత్మకమైన చెరువులు, గోదావరి–కృష్ణ నదీ జలాలు, ఇసుక తిన్నెలు తెలంగాణలో ఉన్నాయి. తెలుగు నేలను ఏలిన 80 శాతం రాజవంశాలు ఈ గడ్డపైనే పుట్టాయి. వారంతా తెలంగాణ పర్యాటకానికి మరింత శోభనిచ్చారు.

అలా తెలంగాణ ప్రాంతం అన్ని రకాల పర్యాటకానికి అనువైంది కనుక, ప్రపంచంలోనే అతి వేగంగా వృద్ధి చెందుతున్న టూరిజం రంగాన్ని కొత్త తెలంగాణ ప్రభుత్వం కీలక అభివృద్ధి రంగంగా గుర్తించాలి. ఫలితంగా వచ్చే ఆదాయాన్ని పేదరిక నిర్మూలనకు వాడుకోవాలి. ఈ నేపథ్యంలోనే ఈ కింది అంశాలు గమనార్హం. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ 2009 సంవత్సరంలో నియమించిన 'ప్రైస్ వాటర్ హౌజ్ కూపర్స్' అనే అధ్యయన సంస్థ ఇదే విషయాన్ని ఇలా చెప్పింది.

2020 దాకా ఆంధ్రప్రదేశ్ పర్యాటకంలో 25 శాతం దేశీయ మార్కెట్‌ను విదేశీ పర్యాటకంలో 15 శాతం మార్కెట్‌ను వినియోగించుకోగలిగితే 2020 నాటికి ఆంధ్రప్రదేశ్‌లోని పర్యాటక స్థలాలను 61.2 కోట్ల మంది దేశీ పర్యాటకులు, 37.3 లక్షల మంది విదేశీ పర్యాటకులు సందర్శిస్తారని అంచనా.

ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ భూభాగం 42 శాతం కనుక పై అంచనాలలో అంత శాతం అంచనాలను సాకారం చేసుకోవడానికి అవకాశం ఉంది. ఈ దిశగా చర్యలు తీసుకుంటే తెలంగాణలో ఒక్కో జిల్లాకు కనీసం లక్ష ఉద్యోగాలను ప్రత్యక్షంగా,

పరోక్షంగా స్థిరీకరించవచ్చు. ఇందుకు తెలంగాణ 2020 నాటికల్లా 1,30,975 కోట్ల రూపాయలను దశల వారీగా మౌలిక వసతుల కల్పనకోసం ఖర్చు చేయాలని పై అధ్యయన సారాంశం.

- 2010 నాటి పర్యాటక విధానం పేర్కొన్నట్లుగా ప్రభుత్వం ముందుగా జిల్లాకొక పర్యాటక అభివృద్ధి సమన్వయ మండలిని ఏర్పాటు చేయాలి. ఈ మండళ్ళ ద్వారా ఆయా జిల్లాల్లో ఉన్న కొత్త పర్యాటక వనరులను గుర్తించి వాటి పూర్తి అధ్యయన వివరాలను ప్రచురించి నిపుణుల సాయంతో స్థానిక పర్యావరణాన్ని ప్రజలకు హాని కలగని రీతిలో మెరుగు పరచాలి.
- వెనుకబడిన ప్రాంతాల ప్రజలు అభివృద్ధి చెందేలా పర్యాటక కూడళ్ళను (టూరిజం సర్క్యూట్స్) నిర్ధారించి వాటిల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేయాలి.
- జిల్లాకొకటి లేదా విశ్వవిద్యాలయానికొకటి చొప్పున పర్యాటక శిక్షణ కళాశాలలు ఏర్పాటు చేసి వాటి ద్వారా పదవ తరగతి, ఆ పైన చదువుకొన్న స్థానిక విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో పర్యాటక రంగ అవకాశాలను వినియోగించుకోవడంలో కావలసిన తర్ఫీదునివ్వాలి.
- తెలంగాణలోని అన్ని పర్యాటక స్థలాలు, వాటికి అందుబాటులో ఉన్న అన్ని రవాణా సౌకర్యాల వివరాలను, వసతి సౌకర్యాలను సమన్వయపరచి ప్రత్యేక పుస్తకాలుగా ప్రచురించాలి. వీటిని ప్రజలకు, పర్యాటకులకు ఉచితంగా అందించాలి. ఇవే వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టాలి.
- అన్ని రాష్ట్రాల రాజధానుల్లో, విదేశీ రాజధానుల్లో ఉన్న పర్యాటక సౌధాల్లో తెలంగాణ పర్యాటక కార్యాలయాలను ప్రారంభించి, వాటిల్లో పై వివరాల బ్రోచర్లను పర్యాటకులకు ఉచితంగా అందించాలి.
- ప్రతి జిల్లాలో వెనుకబడిన ప్రాంతానికి సమీపంలో ఉండి, ఆ జిల్లా పర్యాటక వనరులకు, రహదారులకు దగ్గరలో ఉన్న పట్టణాన్ని 'పర్యాటక కూడలి'గా గుర్తించి మౌలిక వసతులతో అభివృద్ధి చేయాలి. ఈ నేపథ్యంలో జిల్లాకొకటి చొప్పున కింది పట్టణాలను గుర్తించవచ్చు. ఆదిలాబాద్‌లో ఉట్నూర్, నిజామాబాద్‌లో సదాశివనగర్, మెదక్‌లో జహీరాబాద్, రంగారెడ్డిలో అనంతగిరి (వికారాబాద్), కరీంనగర్‌లో మంథని, ఖమ్మంలో భద్రాచలం, వరంగల్‌లో ములుగు, నల్లగొండలో సూర్యాపేట, మహబూబ్‌నగర్‌లో ఆలంపూర్ పట్టణాలు... ఇవి ఆయా జిల్లాల్లో సుమారుగా మధ్యలో నెలకొని పేద ప్రజలకు, పర్యాటక స్థలాలకు, రహదారులకు సమీపంలో ఉన్నాయి.

- రాష్ట్ర రాజధాని నుండి, పైన పేర్కొన్న పట్టణాల నుండి పర్యాటక స్థలాలకు తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిటిడిసి), ఆర్టీసీ, క్రమానుగతంగా నియత పర్యటన (కస్టమైజ్డ్ టూర్స్) వాహనాలకు నడపాలి. నిరుద్యోగులకు పన్నులు లేకుండా వాహనాలను నడుపుకొనే వెసులుబాటు కల్పించాలి.
- తెలంగాణలో ఉత్తరాన దండకారణ్యం, దక్షిణాన నల్లమల అడవులు ఉన్నాయి. కాబట్టి, పర్యావరణ పర్యాటకాన్ని (ఎకో టూరిజం) అభివృద్ధి చేయాలి. గోదావరికి ఉత్తరాన ఉన్న ఆదిలాబాద్, దక్షిణాన ఉన్న కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల అడవుల్లోని జలపాతాలకు 'జలపాత పర్యాటనలు' (వాటర్ ఫాల్స్ టూర్స్) నిర్వహించాలి.
- ఆదిలాబాద్ జిల్లాలోని కెరమెరి, జంగూబాయి, కప్లాయి, శంకర్ లొద్ది, ఖమ్మం జిల్లాలోని బెడం మల్లన్న దేవుని ప్రాంతం, మహబూబ్‌నగర్ జిల్లాలోని అక్క మహాదేవి గుహలు మొదలైన స్థలాల్లో కేవ్ టూరిజం అభివృద్ధి పరచాలి. ఈ ప్రాంతాల్లో స్థానికులను ట్రెక్కింగ్ గైడులుగా నియమించి వారికే ట్రెక్కింగ్ సైకిళ్ళను, 'హోమ్ స్టే'లను కిరాయికిచ్చుకునేందుకు ప్రోత్సహించాలి. తద్వారా వారి ఆదాయవృద్ధికి కృషి చేయాలి.
- ఆదిలాబాద్ జిల్లాలోని తలై, తుమ్మిడిహట్టి, గాడిద గుండం, కనకాయి గుండం, కొమురం భీం ప్రాజెక్టు వంటి ప్రాంతాలను కొత్తగా అభివృద్ధి చేయాలి.
- మేడారం జాతరతో పాటు కేస్లాపూర్, గాంధారి ఖిల్లా, మోతెగడ్డ (భద్రాచలం దగ్గర), సలేశ్వరం (మహబూబ్‌నగర్ జిల్లా) మొదలైన గిరిజన జాతరలను ప్రభుత్వ జాతరలుగా గుర్తించి నిర్వహించాలి.
- ఒక్కొక్క జిల్లాలో నెలకు ఒకటి చొప్పున పర్యాటక ఉత్సవాలు నిర్వహించాలి.
- నిర్మల్, ఖడికి, కేస్లగూడ (ఆదిలాబాద్), కరీంనగర్ (ఫిలిగ్రీ), చేర్యాల (వరంగల్), బొంతుపల్లి (మెదక్), సిద్దిపేట (బాతిక్ చిత్రాలు), గద్వాల, పోచంపల్లి, సిరిసిల్ల చీరెలు మొదలైన హస్తకళలను ప్రోత్సహించడానికై శిక్షణనిచ్చి ఆయా కళాకృతులను రాష్ట్ర పర్యాటక స్థలాలన్నింటిలో పర్యాటకులకు అందుబాటులో ఉంచాలి.

గిరిజన తెగలను, వాటి వారసత్వ సంపదలనూ పరిరక్షించడానికి ప్రభుత్వం తరపున చేయాల్సింది ఎంతో ఉంది.

- గిరిజన ప్రాబల్యమున్న ప్రతి జిల్లాలో ఆదివాసీల సాంస్కృతిక విశేషాలను తెలిపే సంగ్రహాలయాల ఏర్పాటు.
- ఒక్కో గిరిజన తెగకు సంబంధించి ఒక్కొక్క గూడేన్ని (టిపికల్ ట్రైబల్

సెటిల్‌మెంట్) ఎంపిక చేసి పర్యాటక స్థలంగా అభివృద్ధి చేయాలి. దీనివల్ల గూడేల్లో పరిస్థితులు మెరుగుపడతాయి. గిరిజన సంస్కృతిని ప్రత్యక్షంగా చూసేందుకు, అవగాహన చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

- సంగీత, సాహిత్య, లలిత కళా అకాడమీలతో పాటు గిరిజన అకాడమీని కూడా ఏర్పాటు చేయాలి (లేదా) ఆ అకాడమీల్లోనైనా గిరిజన సంగీతం, సాహిత్యం, కళల విభాగాలను ఏర్పాటు చేయాలి. ఈ విభాగాలకు గిరిజన ఉపప్రణాళిక నిధులు తప్పనిసరిగా అందేలా చూడాలి.
- వనవాసీల వారసత్వ కళల్లో నిపుణులైన వారిని గుర్తించి... వారి జాబితాను, గిరిజన కళల ఇన్వెంటరీని రూపొందించాలి. సంవత్సరపు క్యాలెండర్ ప్రకారం ప్రదర్శనలు ఇప్పించాలి. కళాకారులకు పింఛన్లు ఇవ్వాలి.
- గిరిపుత్రుల కోసం ప్రత్యేకంగా హస్తకళల శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలి. వాణిజ్య సౌకర్యం కల్పించాలి.
- గిరిజనులు ప్రకృతి, మూలికా వైద్యాల్లో నిష్ణాతులు. కాబట్టి వైద్య శాస్త్రవేత్తలతో సమన్వయం చేసి, ఆదివాసీల నైపుణ్యం ప్రజలందరికీ ఉపయోగపడేలా చూడాలి.
- ఒక్కో తెగకు సంబంధించిన ఒక్కో పండుగ/జాతరను ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలి. గిరిజనుల ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను కాపాడుకోవడానికే కాకుండా ఇతర వర్గాల వారికీ వనవాసీ సాంస్కృతిక ఔన్నత్యాన్ని తెలియజేయడానికి ఈ నిర్వహణ ఉపయోగపడుతుంది.
- గిరిజన సంస్కృతీ పరిరక్షణ, ప్రచారం, అభివృద్ధి తదితర కార్యకలాపాలన్నింట కోసం ఒక వెబ్‌సైట్‌ను రూపొందించాలి.

ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు కూడా గిరిజన కళలపై పరిశోధనలు చేయాలి. లిపి లేని భాషలకు... ఆ కొరతను తీర్చడానికి భాషా పరిశోధకులు ముందుకు రావాలి. మాతృభాషలో విద్యాభ్యాసం చేసే అవకాశం గిరిజన చిన్నారులకు రావాలి. అప్పుడే ఆరి అస్తిత్వం అజరామరమవుతుంది. గిరిజన కళలను కాపాడుకునే బాధ్యత తెలుగు సమాజంపై ఉంది. ఎందుకంటే, అవి కనుమరుగైతే గిరిజన సంస్కృతిలో, మానవ జాతిలో వైవిధ్యం నశిస్తుంది.

*– నమస్తే తెలంగాణ ఆదివారం అనుబంధం*
*19-01-2014*

| క్ర. సం. | స్థలం / జిల్లా | హైదరాబాద్ నుండి దూరం | వసతి | చూడాల్సిన ప్రదేశాలు | పేజీ నెం. | సంప్రదించాల్సిన పేరు, సెల్ నెం. |
|---|---|---|---|---|---|---|
| **1.** | **ఆదిలాబాద్** | | | | | |
| | 1. గాడిద జలపాతం | 250 కి.మీ. | నిర్మల్ | జలపాతం, వాగు / అడవి లోయలో ట్రెక్కింగ్ | 28 | సత్యనారాయణ, 9490957078 |
| | 2. కనకాయి జలపాతం | 250 కి.మీ. | నిర్మల్ | జలపాతాలు, వాగు / అడవిలో ట్రెక్కింగ్ | 33 | సత్యనారాయణ, 9490957078 |
| **2.** | **కరీంనగర్** | | | | | |
| | 3. రామాయణ కాలపు జలపాతాలు | 200 కి.మీ. | పెద్దపల్లి, రామగుండం | జలపాతాలు, ట్రెక్కింగ్ | 40 | సునీల్, 9912069696 |
| | 4. చంద్రవెల్లి గుళ్ళు | 250 కి.మీ. | మంథని | చారిత్రక దేవాలయాలు, శిల్పాలు | 46 | అశోక్, 7396319310 |
| **3.** | **వరంగల్ జిల్లా** | | | | | |
| | 5. షితాబ్‌ఖాన్ / ఖుష్ మహల్ | 150 కి.మీ. | వరంగల్ | వాస్తు కట్టడం | 49 | సత్యనారాయణ, 9490957078 |
| | 6. రామప్ప | 210 కి.మీ. | రామప్ప | వాస్తు శిల్పాలు, శాసనాలు | 54 | సత్యనారాయణ, 9490957078 |
| | 7. రుద్రమదేవి శిల్పాలు | 150 కి.మీ. | రామప్ప | శిల్పాలు | 71 | సత్యనారాయణ, 9490957078 |
| **4.** | **ఖమ్మం** | | | | | |
| | 8. రామదాసు శాసనం, చిత్రం | 320 కి.మీ. | భద్రాచలం | శాసనం, చిత్రం | 76 | సత్యనారాయణ, 9490957078 |
| **5.** | **నల్గొండ** | | | | | |
| | 9. మత్స్యగిరి | 85 కి.మీ. | యాదగిరి | కొండపై చెరువులో వింత చేపలు | 82 | పూజారి, 9866072576 |
| | 10. ఇంద్రపాలనగరం | 80 కి.మీ. | యాదగిరి | చారిత్రక కట్టడాలు, శిల్పాలు | 79 | పూజారి, 8179191386 |

| క్ర. సం. | స్థలం / జిల్లా | హైదరాబాద్ నుండి దూరం | వసతి | చూడాల్సిన ప్రదేశాలు | పేజీ నెం. | సంప్రదించాల్సిన పేరు, సెల్ నెం. |
|---|---|---|---|---|---|---|
| **6.** | **మహబూబ్‌నగర్** | | | | | |
| | 11. తిరుమలనాథ కొండ | 80 కి.మీ. | షాద్‌నగర్ | చారిత్రక కట్టడాలు, శిల్పాలు | 89 | బుచ్చిరెడ్డి, 9493207198 |
| | 12. ఆవంచ అతిపెద్ద గణపతి | 110 కి.మీ. | జడ్చర్ల | అతిపెద్ద విగ్రహం | 96 | ప్రసాద్, 9440340588 |
| | 13. నల్లమలలో చల్లని పర్యటనలు | 150 కి.మీ. | మన్ననూరు<br>దోమలపెంట<br>ఈగలపెంట | వేసవి విడుదులు, జలపాతాలు, వ్యూ పాయింట్స్ | 100 | ఛత్రునాయక్, 9440229683 |
| | 14. పాల్కురికి పర్యటనలు | 150 కి.మీ. | ,, | పర్యావరణ, చారిత్రక స్థలాలు | 109 | లక్ష్మణ్, 9542352296 |
| **7.** | **మెదక్** | | | | | |
| | 15. తెలంగాణ ఎత్తిపోతల | 110 కి.మీ. | జహీరాబాద్ | జలపాతం, ట్రెక్కింగ్ | 131 | ఉదయ్, 9676310106 |
| **8.** | **రంగారెడ్డి** | | | | | |
| | 16. మరికల్ మర్రి | 110 కి.మీ. | షాద్‌నగర్ | పెద్ద వృక్షం | 126 | సత్యనారాయణ, 9490957078 |
| **9.** | **హైదరాబాద్** | | | | | |
| | 17. గిరిజన మ్యూజియం | 5 కి.మీ. | హైదరాబాద్ | గిరిజన సంస్కృతి | 133 | సత్యనారాయణ, 9490957078 |

***గమనిక :***

*1. ఈ పర్యాటక స్థలాలన్నింటికి బస్సులోగానీ, ప్రైవేటు వాహనాలలోగానీ వెళ్ళవచ్చు.*

*2. టి.టి.డి.సి. ఫోన్ నంబర్ గాక మిగిలిన ఫోన్ నంబర్లు స్థానిక ప్రైవేటు వ్యక్తులవి. సావధానంగా అడిగితే సమాచారం ఇవ్వొచ్చు. వారు స్పందించకపోతే ఈ పుస్తక రచయితను ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు.*



| | | |
|---|---|---|
| పేరు | : | డా. ద్యావనపల్లి సత్యనారాయణ |
| పుట్టిన తేది | : | 20 జులై, 1977 |
| తల్లిదండ్రులు | : | ద్యావనపల్లి మల్లయ్య, లింగమ్మ |
| పుట్టిన ఊరు | : | చెగ్గాం, వెల్గటూరు మండలం, కరీంనగర్ జిల్లా. |
| చదువు | : | పిహెచ్.డి, ఎమ్.ఎ.-హిస్టరీ, ఇంగ్లీషు, తెలుగు |
| వృత్తి | : | మ్యూజియం క్యూరేటర్, గిరిజన మ్యూజియం, గిరిజన సంక్షేమ శాఖ, తెలంగాణ ప్రభుత్వం, డి.ఎస్.ఎస్. భవన్, మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్. |



రచనలు :

1. ఉస్మానియా యూనివర్సిటీ, అంబేద్కర్ యూనివర్సిటీలకు ఎం.ఎ., బి.ఎ. చరిత్ర పాఠాలు 2007, 2010.
2. ఆంధ్రప్రదేశ్ సామాజిక, సాంస్కృతిక చరిత్ర, 2008.
3. తెలంగాణలో కొత్త పర్యాటక స్థలాలు, 2012.
4. రామప్ప (సంపాదకత్వం), 2013.
5. రాచకొండను కాపాడుకొందాం (కమిటీతో కలిసి), 2014.
6. ట్రైబ్స్ ఆఫ్ తెలంగాణ (ఇంగ్లీష్), 2014.

అవార్డు : ఉత్తమ పర్యాటక గ్రంథం అవార్డు (పూర్వపు ఆం.ప్ర. ప్రభుత్వ పురస్కారం, 2012-13.)

*Address :*

*3-4-528/103, SR Indira Residency, Adjacent to Reddy College,*
*Narayanaguda, Hyderabad - 500 027, Telangana, India.*

*Mobile :* ***09490957078****, E-mail :* ***dyavanapalli@gmail.com****,*
*Blog : www.telanganatours.blogspot.in*



Oxford
Grammar School
Street No.12, Himayatnagar
31 YEARS OF
meritorious performance in ssc.
ADMISSIONS ARE IN PROGRESS
for CBSE & SSC
040-2763 5669 / 9959020512
www.oxfordgrammarschool.com
I go to OGS to learn life

# CENTRAL BOOK SHOP

**ABIDS**
5-9-186,Behind SBH(H.O)
Gunfoundry,Hyd-1.
Ph: 66468646,23203108

**AMEERPET**
Lane Opp.Green Park Hotel,
Hyderabad.
Ph: 2340 0789

CBS Global Service
CENTRAL BOOK SHOP
ABIDS / AMEERPET

- SCHOOL BOOKS
- GENERAL BOOKS
- STATIONARY & GIFTS



# JBR
## ARCHITECTURE COLLEGE
HYDERABAD

**(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA & FAU Hyderabad)**

### ABOUT THE SCHOOL

The J.B.R. Architecture College is established by Joginpally B.R. Educational Society (J.B.R.E.S.), Hyderabad with a view to impart quality architectural education, by a group of enthusiastic Architects under the patronage of Shri. J.Bhaskar Rao garu, devoted educationalist and philanthropist.

It aims to cultivate an Intellectual climate embracing the concept of making to achieve design excellence, experimental learning opportunities are supported by our state of the art facilities.

The Aim of J.B.R. Architecture College is to groom to enhance design creativity, understand social responsibility, develop technical and research excellence, to become global Leaders in architecture and planning.



J. Gayatri
B.Arch, M.Arch
**Director - Interiors**




### POSSIBLE IS EVERYTHING...

**B. Arch Program.**

The J.B.R. Architecture college offers a graduate Programme in Architecture. Bachelor of Architecture is a five year degree course with one year Internship. The program includes relevant courses In the concept, process, technical details and design practice, as well as elective in an area of student Interest. The course work is to help the student understand finer aspects of Architecture which are very much Integral to designing, planning and scheduling of buildings. The course work aims to impart quality education, through effective communication skills and making the students and making the students conscious of built from in the contemporary scenario.

### ELIGIBILITY....

Students who qualify in NATA (National Aptitude Test In Architecture) conducted by council of Architecture (COA) with 10+2 (Maths stream) with minimum of 50% marks or 10+3 (Diploma In Architecture) with minimum of 50% marks are eligible for admission into Bachelor of Architecture (B.Arch).




**6-3-248/1/1A, 2nd Floor, Bhaskar Plaza, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. A.P. India**
**Ph : 040-66105270, 9703372442, 9703277053**
**E-mail : jbrarchitecture@gmail.com, www.jbrachitecture.com**



**NEW TOURIST PLACES IN TELANGANA**

*by Dr. Dyaavanapalli Satyanarayana*

తెలంగాణ... దక్కన్ పీఠభూమి పైనుంది. దాని పైన దట్టమైన అడవులు.... ఈ అడవులు, గుట్టల మధ్య నుంచి ఉపనదులు జలపాతాలుగా దుంకుతూ వచ్చి జీవనదులైన గోదావరి, కృష్ణల్లో సంగమించడం. గుట్టల్లో గుహలు... గుహాలయాలు, గుట్టలపైన వివిధ ఆకారాల్లో కనిపించే గుండ్లు.... ఆ గుండ్లనే భారీ విగ్రహాలుగా తీర్చిదిద్దిన వైనం... శిల్పకళా శోభిత చారిత్రక దేవాలయాలు... కోటలు... వెరసి తెలంగాణ తల్లి సౌందర్యం.

ఎక్కడికక్కడి స్థానికులకు తప్ప మరో మండలంలో ఉన్న మన సోదరులకు కూడా ఒక స్థలం యొక్క సందర్శనీయ ప్రాధాన్యం గురించి తెలియదు. ఇందుకు ఇప్పుడు కారణాలు వెతుక్కోవడం కన్నా కార్యాచరణలో ఏం చేయాలని ఆలోచించి తెలంగాణ విశిష్ట స్థలాలను అన్వేషించి, సందర్శించి, పరిశోధించి వాటి పర్యాటక ప్రాధాన్యతలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నది ఈ పుస్తకం.








TELANGANA RESOURCE CENTRE

"**CHANDRAM**" 490, Street No. 11,
Himayatnagar, Hyderabad-500029.
email: trchyd@gmail.com